

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

రాముడొచ్చాడు!

అయోధ్య గర్భాలయంలోకి రాముడి విగ్రహం

పవిత్ర నదీ జలాలతో అభిషేకించిన అర్చకులు

రామమందిరంపై పోస్టల్ స్టాంపులు విడుదల

22న కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు హాఫ్ డే

5 రాష్ట్రాల్లో విద్యాసంస్థలకు సెలవులు 2

కోర్టులకూ సెలవు ఇవ్వాలి: సీజేఐకి బీసీఐ లేఖ

శుక్రవారం | 19-1-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 274 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతఋతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: నవమి రా. 7.53 తదుపరి దశమి; నక్షత్రం: భరణి రా. 2.51 తదుపరి కృత్తిక; వర్జ్యం: మ.12.31-2.07; దుర్ముహూర్తం: ఉ.9.06-9.51, మ.12.48-2.33; అమృతఘడియలు: రా.10.04-11.40; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.53; సూర్యాస్తమయం: 5.59 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఐటీఐల్లో ఉపాధి

గ్యారెంటీ

టీసీఎస్ సాయంతో నైపుణ్య శిక్షణ కేంద్రాలు



50 ఐటీఐల్లో రూ.1500 కోట్లతో ఏర్పాటు

దావోస్‌లో ఖరారైన కీలక ఒప్పందం

ముఖ్యమంత్రి రేవంత్‌తో టాటా చైర్మన్ భేటీ

ఎయిర్‌ఇండియా ట్రాన్సిట్ హబ్‌గా హైదరాబాద్

రూ.231 కోట్లతో హెల్త్ కేర్ డివైజెస్ ప్లాంట్

4వ రోజూ పారిశ్రామికవేత్తలతో భేటీలు

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఐటీఐలు, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాలల్లో చదివే ప్రతీ విద్యార్థికి గ్యారెంటీగా ఉపాధి లభించే విధంగా ప్రత్యేక ప్రణాళికను అమలు చేయనున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో నాలుగో రోజు కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. పెట్టుబడులను ఆహ్వానించడమే లక్ష్యంగా పలువురు పారిశ్రామిక దిగ్గజాలతో సమావేశమయ్యారు. యువతకు ఉపాధి లక్ష్యంగా నైపుణ్య శిక్షణ కేంద్రాలపై ప్రత్యేకంగా దృష్టి సారించిన రేవంత్‌రెడ్డి.. ఆ దిశగా గురువారం టాటా గ్రూప్‌తో కీలకమైన ఒప్పందం కుదుర్చుకున్నారు. రాష్ట్రంలోని 50 ఐటీఐలలో నైపుణ్య శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు టాటా గ్రూప్ ప్రకటించింది. టాటా గ్రూప్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖర్‌తో బుధవారం సీఎం సుదీర్ఘంగా సమావేశమై నైపుణ్య శిక్షణపై చర్చించారు. సానుకూలంగా స్పందించిన టాటా గ్రూప్ రూ.1500 కోట్లతో 50 ఐటీఐల్లో నైపుణ్య శిక్షణా కేంద్రాలు(స్కిల్లింగ్ సెంటర్) ఏర్పాటు చేస్తామని, మాస్టర్ ట్రైనర్లను నియమిస్తామని ప్రకటించింది. ఉపాధి అవకాశాలు

మిగతా 13వ పేజీలో...

రైతు ఆత్మహత్యలే పెద్ద సమస్య

రైతులూ కార్పొరేట్ కంపెనీల్లా లాభాలు గడించాలి

తెలంగాణలో రైతు భరోసా, కనీస మద్దతు ధర

దావోస్ సదస్సులో వివరించిన ముఖ్యమంత్రి రేవంత్ 13



పదేళ్లలో ఏం జరిగింది?

ఆర్‌అండ్‌బీ పనులపై 'తవ్వకాలు'!

గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన నిర్మాణాలపై మంత్రి కోమటిరెడ్డి నజర్

సచివాలయం, అంబేడ్కర్ విగ్రహం, అమరుల స్థూపం ఖర్చుపై ప్రత్యేక దృష్టి

వివరాలివ్వాలని అధికారులకు ఆదేశం

వరంగల్ ఆస్పత్రి నిర్మాణంపైనా ఫోకస్

త్వరలోనే క్షేత్రస్థాయి పరిశీలనకు మంత్రి?

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్లు భవనాల (ఆర్అండ్‌బీ) శాఖ ఆధ్వర్యంలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులపై కొత్త సర్కారు దృష్టి పెట్టింది. గడిచిన పదేళ్లలో శాఖ పరిధిలో జరిగిన నిర్మాణ పనుల వివరాలను సేకరిస్తోంది. గత సర్కారు చేసిన నిర్మాణాల్లో ఏమైనా అవకతవకలు జరిగాయా? అన్న కోణంలో పరిశీలిస్తోంది. ఒకరకంగా ఆర్‌అండ్‌బీలో 'తవ్వకాలు' జరపాలని నిర్ణయించింది! ఇదే అంశంపై రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టి పెట్టారు. పదేళ్లలో శాఖ పరిధిలో జరిగిన మొత్తం పనులు, ఖర్చు చేసిన నిధుల గురించి ఆరా తీస్తున్నారు. ఆర్‌అండ్‌బీ పరిధిలో రాష్ట్రంలో ఇప్పటివరకు నిర్మించిన భవనాలు, కొత్త కలెక్టరేట్లు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలు, మెడికల్ కాలేజీలతో పాటు

మిగతా 3వ పేజీలో...

ప్రభుత్వ ప్రధాన సలహాదారుగా

వేం నరేందర్‌రెడ్డి?



ముఖ్యమంత్రి రేవంత్ నీడలో బాధ్యతలు

16 ఏళ్లుగా ఇద్దరి మధ్య స్నేహబంధం

ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా మండవ

ఇద్దరు నేతలకు క్యాబినెట్ హోదా

మంత్రివర్గ సమావేశాలకూ మండవ?

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్‌రెడ్డికి రాష్ట్ర ప్రభుత్వంలో కీలక పదవి దక్కే అవకాశాలున్నాయి. ఆయనకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు పదవిని ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి నిర్వహించే కార్యక్రమాలు అన్నింటినీ వెనుక నుంచి వేంనరేందరే పర్యవేక్షించే వారు. ఆయన టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడిగా కూడా ఉన్నారు. రేవంత్‌తో నరేందర్‌కు దాదాపు 16 ఏళ్ల నుంచి స్నేహం ఉంది. టీడీపీలోనూ ఇద్దరూ కలిసే ఉన్నారు. 2004-2009 మధ్యలో వేం నరేందర్‌రెడ్డి మహబూబాబాద్ ఎమ్మెల్యేగా పనిచేశారు. 2007లో ఎమ్మెల్సీగా రేవంత్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఉభయ సభల్లో చురుగ్గా ఉండే టీడీపీ యువనేతలిద్దరి మధ్య స్నేహబంధం బలపడింది. 2009లో నియోజకవర్గాల పునర్ విభజనతో వేంనరేందర్ నిర్మించుకున్న రాజకీయదుర్గం మహబూబాబాద్ రిజర్వ్‌డ్ అయిపోయింది. ఈ నేపథ్యంలోనే 2015లో మిత్రుడు వేం నరేందర్‌ను ఎమ్మెల్సీగా గెలిపించే ప్రయత్నంలో భాగంగానే నామినేటెడ్ ఎమ్మెల్యేగా ఉన్న స్టీఫెన్‌సన్ వద్దకు రేవంత్ వెళ్లారు. అనంతర కాలంలో రేవంత్ ఎదుర్కొన్న అనేక ఆటుపోట్లలో నరేందర్ తన వెన్నంటే ఉన్నారు. తర్వాత ఇద్దరూ ఒకేసారి కాంగ్రెస్‌లో చేరారు. అప్పటి నుంచీ పలు కార్యక్రమాల్లో నరేందర్ కీలకంగా ఉంటూ వస్తున్నారు. ఇటీవలి ఎన్నికల సమయంలోనూ పీసీసీ అధ్యక్షుడి ప్రచారంలో ఆయన ముఖ్య పాత్ర పోషించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో నరేందర్‌కు కీలక పదవిని ఇవ్వాలని పార్టీ భావిస్తున్నట్టు తెలిసింది. ప్రభుత్వ ప్రధాన సలహాదారు పదవిని ఇవ్వాలనే దిశగా కసరత్తు నడుస్తున్నట్టు తెలుస్తోంది. క్యాబినెట్ హోదాతో ఈ పదవిని ఇవ్వనున్నట్టు సమాచారం. ప్రధాన సలహాదారు పదవి అయితేనే సీఎంకు దగ్గరగా ఉండడంతో పాటు అవసరమైన కార్యకలాపాలను పర్యవేక్షించే చాన్స్ ఉంటుందని భావిస్తున్నట్టు తెలుస్తోంది.



మండవకు ప్రణాళిక సంఘం

సీనియర్ రాజకీయ నాయకుడు, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావుకు కూడా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కీలక పదవిని ఇవ్వాలని నిర్ణయించినట్టు సమాచారం. ఆయనకు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడి పదవిని ఇవ్వబోతున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడికి క్యాబినెట్ హోదా ఉంటుంది. ఆ హోదాతో ఆయన్ను మంత్రివర్గ సమావేశాలకు ఆహ్వానించే అవకాశం ఉంది.



16 ఏళ్లలోపు విద్యార్థులను

చేర్చుకోవద్దు

తప్పుదోవ పట్టించే ప్రకటనలు వద్దు

డిగ్రీ కంటే తక్కువ విద్యార్హతలున్న ట్యూటర్లను నియమించుకోరాదు 2

విద్యార్థులు కోర్సు మధ్యలో వెళ్లిపోతే ఫీజును 10 రోజుల్లో తిరిగి చెల్లించాలి

కోచింగ్ సెంటర్లకు కేంద్రం స్పష్టీకరణ

విద్యాశాఖ కొత్త మార్గదర్శకాలు

రేవంత్ అదానీ అలయ్‌బలయ్



దొంగ అన్నావు.. దావోస్‌లో ఎలా కలిశావు?

కాంగ్రెస్ పార్టీది దిగజారుడు రాజకీయం

ఈ ప్రభుత్వంపై 6 నెలల్లో ప్రజల్లో తిరుగుబాటు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): "ఎన్నికల ముందు అదానీని దొంగ అన్నవు. ఆయన దోచిన రూ.13 లక్షల కోట్లు ప్రధానికి, బీజేపీకి వెళతాయని విమర్శించావు. ఇప్పుడు అదానీని ఎలా కలిశావు?" అంటూ సీఎం రేవంత్‌రెడ్డిని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు ప్రశ్నించారు. మొన్నటి వరకు అదానీని దొంగ అన్న రేవంత్ ఇప్పుడు దావోస్ సాక్షిగా ఆయనతో అలైబలై చేసుకున్నారని.. ఇది కాంగ్రెస్ పార్టీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని ఆరోపించారు. వచ్చిన కొద్ది రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల సమాజంలోని అనేక వర్గాలు అసంతృప్తిగా ఉన్నాయని, ఎరువుల కోసం లైన్లో నిలబడటం, వాటిని పోలీస్ స్టేషన్ల పెట్టి పంపిణీ చేసే పరిస్థితులు రాష్ట్రంలో మళ్లీ

మిగతా 12వ పేజీలో...

నియోజకవర్గాల బాధ్యతలు ఎమ్మెల్సీలకు

గ్రామస్థాయి నుంచి బీఆర్ఎస్ పునర్వ్యవస్థీకరణ: కేటీఆర్

మళ్లీ టీఆర్ఎస్‌గా మార్చండి!

ఓ మహిళా నేత సూచన 12

ఆలోచిద్దామన్న కేటీఆర్



హుస్సేన్ సాగర్ సమీపంలో సారంగ్ ఏరోబాటిక్ బృందం విన్యాసాలు

విమాన ప్రయాణికులు @ 30 కోట్లు

2030 నాటికి ఈ సంఖ్యను చేరుకుంటాం

ఎయిర్‌పోర్టుల సంఖ్యను 200కు పెంచుతాం

త్వరలోనే రెండు గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాలు

భవిష్యత్తులో ప్రతి జిల్లాకు ఒక విమానాశ్రయం

డ్రోన్లపై 10వేల మంది మహిళలకు శిక్షణ

పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య

హైదరాబాద్ నుంచి అమెరికాకు నేరుగా వెళ్లే విమాన సర్వీసులు నడపాలి: మంత్రి కోమటిరెడ్డి

బేగంపేటలో వింగ్స్ ఇండియా-24 ప్రారంభం

హైదరాబాద్/అల్వాల్/శంషాబాద్‌రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల మధ్య అనుసంధానానికి, దేశ సామాజిక, ఆర్థిక ప్రగతికి పౌరవిమానయాన రంగం దోహదపడుతోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా పేర్కొన్నారు. గత కొన్నేళ్లలో దేశీయ విమానయాన ట్రాఫిక్ 57% పెరిగిందని, ఇది ప్రపంచంలోనే అత్యధికమని చెప్పారు. ఆధునిక మౌలిక

మిగతా 14వ పేజీలో...

ఆకాశంలో అద్భుతం.. బోయింగ్ 777-9

ఒకేసారి 426 మంది ప్రయాణించొచ్చు 14

విమానం ధర రూ.3,325 కోట్ల పైమాటే

గుజరాత్‌లో బోటు బోల్తా 16 మంది మృతి

మృతుల్లో 14 మంది బడి పిల్లలు, ఇద్దరు టీచర్లు

హర్ణీ సరస్సులో విషాదంగా మారిన విహారయాత్ర

సామర్థ్యానికి మించి పిల్లల్ని ఎక్కించడంతోనే ఘటన

లైఫ్ జాకెట్లు లేకే మరణాలు

ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

రాష్ట్రపతి, ప్రధాని సంతాపం 2



ఇరాన్‌పై పాక్ ప్రతీకారం

సిస్తాన్-బలూచిస్థాన్ ప్రావిన్స్‌పై వైమానిక దాడులు

నలుగురు చిన్నారులు సహా తొమ్మిది మంది మృతి!

ఉగ్ర స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నామన్న పాక్

కవ్వింపులను సహించబోమని ఇరాన్‌కు హెచ్చరిక

సరిహద్దుల్లో యుద్ధ విన్యాసాలకు ఇరాన్ నిర్ణయం

ఆత్మ రక్షణ చర్యలను అర్థం చేసుకోగలం: భారత్

ఘర్షణ వద్దు.. సంయమనం పాటించండి: చైనా 2

ఇరాన్‌దే ఉల్లంఘన.. ఆ దేశానిదే తప్పు: అమెరికా

యాంటీబయాటిక్స్ రాస్తే..

కారణం చెప్పాల్సిందే!

ఎందుకు అవసరమో ప్రిస్క్రిప్షన్‌పై రాయాలి

వైద్యులకు కేంద్ర ప్రభుత్వ ఆదేశం.. మెడికల్, ఫార్మా సంఘాలకు డీజీహెచ్ఎస్ లేఖ

యాంటీబయాటిక్‌ల విచ్చలవిడి వాడకంతో ఔషధాలకు లొంగని రోగకారక క్రిములు

లక్షల సంఖ్యలో రోగుల కన్నుమూత

మానవాళికి ముప్పుగా ఏఎంఆర్ సమస్య

ప్రిస్క్రిప్షన్ లేనిదే మెడికల్ షాపులు యాంటీబయాటిక్‌లను అమ్మొద్దని 1న డీజీహెచ్ఎస్ 'అత్యవసర విజ్ఞప్తి'



న్యూఢిల్లీ, జనవరి 18: యాంటీబయాటిక్‌ల విచ్చలవిడి వినియోగంపై కేంద్రం కొరడా ఝుళిపించింది. ఇక మీదట ఏ రోగికైనా యాంటీబయాటిక్ లేదా యాంటీ మైక్రోబియల్ ఔషధాలను సూచిస్తే వాటిని ఎందుకు సిఫార్సు చేయాల్సి వస్తుందన్న కారణాలను, సూచనలను తప్పనిసరిగా ప్రిస్క్రిప్షన్ మీద రాయాలని వైద్యులను ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ పరిధిలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్ఎస్) అతుల్ గోయల్ అన్ని మెడికల్, ఫార్మసిస్ట్ సంఘాలకు, వైద్యకళాశాలలకు 'అత్యవసర విజ్ఞప్తి' పేరిట లేఖ రాశారు. ఈ నెల 1వ తేదీన రాసిన ఈ లేఖలోని వివరాలు గురువారం వెల్లడయ్యాయి. యాంటీబయాటిక్‌ల విచ్చలవిడి వినియోగం కారణంగా 'యాంటీ మైక్రోబియల్ నిరోధకత' (ఏఎంఆర్) అనే రుగ్మత ప్రపంచవ్యాప్తంగా పెరిగిపోతోంది. ప్రస్తుతం మానవాళి ఎదుర్కొంటున్న టాప్ 10 అనారోగ్య సమస్యల్లో ఇది ఒకటని, 2019లో 12.7 లక్షల మంది ఏఎంఆర్

మిగతా 2వ పేజీలో...

బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌తో పొన్నం భేటీ

మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్‌నూ ఇంటికెళ్లి కలిసిన మంత్రి

ఇద్దరూ కాంగ్రెస్‌లో చేరతారని ఊహాగానాలు 12

దూరం.. దూరంగానే!

అన్నతో కలివిడిగా ఉండలేని షర్మిల

మేనల్లుడి నిశ్చితార్థానికి జగన్, భారతి 13

ఫొటో కోసం పదేపదే అన్న పిలుపు

తల్లి కూడా పిలిచాక ముందుకొచ్చిన షర్మిల

వేదికపై ఒక్క నిమిషమే జగన్ దంపతులు

కాబోయే వధూవరులను ఆశీర్వదించిన ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థల ఎండీ వేమూరి రాధాకృష్ణ

ఈడీ విచారణకు ఎమ్మెల్యే వివేక్

మనీలాండరింగ్ కేసులో ప్రశ్నించిన అధికారులు 14

మల్కాజిగిరి బరిలో ఈటల!

సిట్టింగ్ స్థానాల నుంచి కిషన్‌రెడ్డి, బండి సంజయ్, అర్వింద్, సోయం పోటీ 12

'పాలమూరు' ఆశిస్తున్న జితేందర్, అరుణ

భువనగిరి సీటుకు పోటీపడుతున్న నేతలు

రాష్ట్ర బీజేపీలో భారీ ప్రక్షాళన

12 జిల్లాలకు అధ్యక్షుల మార్పు

5 మోర్చాలకు కొత్త అధ్యక్షుల్ని నియమించిన కిషన్‌రెడ్డి



యాంటీబయాటిక్స్ రాస్తే.. కారణం చెప్పాల్సిందే!

(మొదటి పేజీ తరువాయి)

కారణంగా మరణించారని, 49 లక్షల మంది ఔషధ నిరోధకత ఇన్ఫెక్షన్లతో చనిపోయారని గోయల్ ఆందోళన వ్యక్తం చేశారు. 'ఔషధాలకు లొంగని రోగ కారక సూక్ష్మక్రిములు పుట్టటానికి యాంటీబయాటిక్‌ల దుర్వినియోగం, అదుపు లేని వాడకమే ప్రధాన కారణం. ఇవి కలిగించే ఇన్ఫెక్షన్లకు సమర్థవంతమైన చికిత్స లేకుండా పోతోంది. దానివల్ల రోగులు చాలారోజుల పాటు ఇన్ఫెక్షన్లతో సతమతమవుతున్నారు. విపరీతమైన అధిక ధరలుండే ఈ ఔషధాలు (యాంటీబయాటిక్‌లు) రోగులను ఆరోగ్యపరంగా నాశనం చేస్తున్నాయి. దీర్ఘకాలంపాటు రోగాల బారిన పడి వారు ప్రాణాలు కోల్పోతున్నారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి, వివేకవంతంగా యాంటీబయాటిక్‌లను వాడాలని దేశంలోని వైద్యులకు హితవు పలికారు. ఈ మేరకు యాంటీబయాటిక్‌లను సిఫార్సు చేసే ముందు దానికి గల కచ్చితమైన కారణాలను ప్రిస్క్రిప్షన్‌లో పేర్కొనాలని స్పష్టం చేశారు. అర్హతలున్న వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకుండా మెడికల్ షాపుల వాళ్లు ఎవరికీ యాంటీబయాటిక్‌లను విక్రయించకూడదని ఈ లేఖలో పేర్కొన్నారు. భవిష్యత్తులో ఏఎంఆర్ సమస్య మరింత తీవ్రరూపం దాల్చితే దానిని ఎదుర్కోవాల్సింది రాబోయే తరం వైద్యులే కాబట్టి, డాక్టర్లను తయారు చేసే మెడికల్ కాలేజీలకు ఈ లేఖ పంపించామని తెలిపారు. 'యాంటీ మైక్రోబియల్ నిరోధకత ఒక నిశ్శబ్ద మహమ్మారి. దీనివల్ల 2050 నాటికి ప్రపంచవ్యాప్తంగా కోటి మందికిపైగా మరణించే ప్రమాదం ఉంది' అని ప్రపంచ ఆరోగ్య సంస్థ గతంలోనే హెచ్చరించింది.

జనన ధ్రువీకరణకు ఆధార్ చెల్లదు: ఈపీఎఫ్‌వో

న్యూఢిల్లీ, జనవరి 18: ఈపీఎఫ్‌వో ఖాతాదారులకు జనన ధ్రువీకరణకు ఇకపై ఆధార్ చెల్లుబాటు కాదని ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. ఆధార్ సంస్థ సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ పేర్కొంది. ఆధార్ చట్టం 2016 ప్రకారం.. 'ఆధార్ సంఖ్య కేవలం ప్రత్యేక గుర్తింపు మాత్రమే. అది ఎంత మాత్రమూ జనన ధ్రువీకరణ పత్రం కాదు' అనేక కోర్టులు తమ తీర్పుల్లో, తాజాగా ముంబయి హైకోర్టు ఓ తీర్పులోనూ ఈ విషయాన్ని స్పష్టం చేయడంతో ఆధార్ సంస్థ ఆమేరకు విస్పష్టమైన సూచనలు చేసింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ అనుమతితో ఈపీఎఫ్‌వో తన వెబ్‌సైట్‌లో ఆమేరకు మార్పులు చేయాలంటూ అంతర్గత ఆదేశాలు జారీ చేసింది. ఇక నుంచి జనన ధ్రువీకరణకు చెల్లుబాటు అయ్యే పత్రాల జాబితాను ప్రకటించింది. జనన, మరణాల రిజిస్ట్రార్ జారీ చేసే జనన ధ్రువీకరణ పత్రం, విశ్వవిద్యాలయం ఇచ్చే మార్కుల జాబితా, ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్, స్కూల్ టీసీ, సర్వీసు రికార్డుల ఆధారంగా ఇచ్చే ప్రతం, పాన్ కార్డు, కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసే పెన్షన్ ఆర్డర్, ప్రభుత్వం జారీ చేసిన నివాస ధ్రువీకరణ పత్రం, సివిల్ సర్జన్ జారీ చేసిన సర్టిఫికెట్ మాత్రమే ఈపీఎఫ్‌లో జనన ధ్రువీకరణకు అంగీకరిస్తారు.

లొంగిపోయేందుకు గడువు పెంచండి

» సుప్రీంకోర్టులో బిల్కిస్ కేసు ముద్దాయిల పిటిషన్

న్యూఢిల్లీ, జనవరి 18: లొంగిపోయేందుకు గడువును పెంచాలని కోరుతూ బిల్కిస్ బానో కేసులోని అయిదుగురు ముద్దాయిలు గురువారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గుజరాత్ అల్లర్ల సందర్భంగా బిల్కిస్ బానోపై సామూహిక అత్యాచారం చేయడంతో పాటు ఆమె కుటుంబంలోని ఏడుగుర్ని హత్య చేసినందుకు 11 మందికి న్యాయస్థానం యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. అయితే గుజరాత్ ప్రభుత్వం వారి శిక్షను తగ్గించి 2022లో స్వాతంత్ర్య దినోత్సవం రోజున విడుదల చేసింది. దీన్ని సవాలు చేస్తూ బాధితురాలు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. విచారణ జరిపిన జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ సంజయ్ కరోల్‌ల ధర్మాసనం గుజరాత్ ప్రభుత్వ నిర్ణయాన్ని కొట్టివేస్తూ ఈ నెల 8న ఆదేశాలు ఇచ్చింది. ముద్దాయిలంతా రెండు వారాల్లో లొంగిపోయి జైలు శిక్షను అనుభవించాలని తెలిపింది. ఆ మేరకు వారు ఈ నెల 21లోగా లొంగిపోవాల్సి ఉంది. కానీ వివిధ వ్యక్తిగత కారణాలను చూపుతూ తాము లొంగిపోయేందుకు గడువు పెంచాలని కోరుతూ వారిలో అయిదుగురు సుప్రీంకోర్టులో పిటిషన్లు వేశారు. లొంగిపోయేందుకు సమయం దగ్గర పడుతుండడంతో శుక్రవారమే విచారణ జరపాలని పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది వి.చితంబరేశ్ కోరారు.

ఎర్రసముద్రంలో డ్రోన్ దాడి

రంగంలోకి ఐఎన్ఎస్-విశాఖపట్నం

» అమెరికా కంటైనర్ నౌక సిబ్బంది సురక్షితం

న్యూఢిల్లీ, జనవరి 18: గల్ఫ్ ఆఫ్ ఎడెన్‌లో.. డ్రోన్ దాడిలో దెబ్బతిన్న అమెరికా కంటైనర్ నౌక సిబ్బంది ఎమర్జెన్సీ కాల్‌కు భారత నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్-విశాఖపట్నం స్పందించింది. బుధవారం రాత్రి 11.11 గంటల సమయంలో మార్షల్ ఐలాండ్స్ జెండాతో ప్రయాణిస్తున్న అమెరికాకు చెందిన ఎంవీ జెన్‌కో పికార్డీ నౌకపై దాడి జరిగింది. ఈ దాడిలో నౌకలో కొంత భాగం దెబ్బతిన్నది. దీంతో ఆ నౌక సిబ్బంది సాయం కోసం ఎమర్జెన్సీ సందేశాన్ని పంపారు. అరేబియా సముద్రంలో కూడా ఇలాంటి దాడి జరిగిన నేపథ్యంలో.. భారత నౌకాదళం నాలుగు యుద్ధ నౌకలను మోహరించిన విషయం తెలిసిందే.! బుధవారం రాత్రి ఘటన జరిగిన ప్రాంతానికి సమీపంలో– గల్ఫ్ ఆఫ్ ఎడెన్‌లో యాంటీ-పైరసీ పెట్రోలింగ్‌లో ఉన్న ఐఎన్ఎస్-విశాఖపట్నం ఆ ఎమర్జెన్సీ సందేశానికి స్పందించింది. అర్ధరాత్రి 12.30 సమయంలో ఎంవీ జెన్‌కో పికార్డీ నౌక వద్దకు చేరుకుని, సహాయక చర్యలను చేపట్టింది. ఆ సమయంలో జెన్‌కో పికార్డీ నౌకలో 22 మంది సిబ్బంది ఉండగా.. వారిలో 9 మంది భారతీయులని భారత నౌకాదళం ఎక్స్‌లో తెలిపింది.

తరగతి గదిలో ఆగిన విద్యార్థి గుండె

» పాఠాలు వింటూ గుండెపోటుతో 18 ఏళ్ల యువకుడి మృతి

ఇండోర్, జనవరి 18: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో దారుణం జరిగింది. తరగతి గదిలో పాఠాలు వింటున్న ఓ 18 ఏళ్ల యువకుడు గుండెనొప్పితో ఒక్కసారిగా కుప్పకూలిపోయి ప్రాణం వదిలాడు. ఇండోర్‌కు చెందిన మాధవ్(18) మధ్యప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలకు సిద్ధమవుతూ స్థానికంగా ఓ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకుంటున్నాడు. బుధవారం సాయంత్రం ఇతర విద్యార్థులతో కలిసి తరగతి గదిలో పాఠాలు వింటున్న మాధవ్ ఒక్కసారిగా తన డెస్క్‌పై వాలిపోయాడు. వెంటనే స్పందించిన పక్క సీటులోని విద్యార్థి మాధవ్ వీపుపై రుద్దుతూ ఉపాధ్యాయుడిని పిలిచాడు. ఆ తర్వాత కొన్ని సెకండ్లకే మాధవ్ తన సీటులో నుంచి కుప్పకూలిపోయాడు. వెంటనే మాధవ్‌నుసమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. మాధవ్ కార్డియాక్ అరెస్ట్ లేదా గుండెపోటుకు గురై ఉంటాడని భావిస్తున్నారు.

యాసిన్ మాలిక్ స్వయంగా కాల్చాడు

» ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగుల హత్య కేసులో ప్రత్యక్ష సాక్షి

న్యూఢిల్లీ, జనవరి 18: శ్రీనగర్ శివారులో 1990లో నలుగురు భారత వైమానిక దళ సిబ్బందిని కాల్చిచంపిన సంఘటనలో కశ్మీరు వేర్పాటువాద నేత యాసిన్ మాలిక్ స్వయంగా పాల్గొన్నాడని వైమానిక దళ మాజీ ఉద్యోగి ఒకరు సాక్ష్యం చెప్పారు. యాసిన్ మాలిక్ నేతృత్వంలో రావల్‌పోరా ప్రాంతంలో 1990 జనవరి 25న ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో నలుగురు మరణించగా, 22 మంది గాయపడ్డారు. ఈ కేసులో తిహాడ్ జైల్లో ఉన్న యాసిన్ మాలిక్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శ్రీనగర్‌లోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. సంఘటన ప్రత్యక్ష సాక్షి, వైమానిక దళం మాజీ ఉద్యోగి రాజ్వార్ ఉమేశ్వర్‌సింగ్ గురువారం న్యాయస్థానంలో వీడియా కాన్ఫరెన్స్ ద్వారా యాసిన్ మాలిక్‌ను చూసి ఆయన స్వయంగా దాడిలో పాల్గొన్నారని, కాల్పులు జరిపారని ధ్రువీకరించారు. 1990లో జేకేఎల్ఎఫ్ నాయకుడిగా ఉన్న యాసిన్ మాలిక్ ఈ కాల్పుల ఘటన తర్వాత అరెస్టయ్యారు. అభియోగపత్రం నమోదైనా ఇప్పటివరకు విచారణ జరగలేదు. 2018 నుంచి వివిధ కేసుల్లో జైల్లో ఉన్న యాసిన్ మాలిక్‌ను 2019 ఏప్రిల్‌లో ఉగ్రవాదులకు నిధులు సరఫరా చేస్తున్నారన్న అభియోగంపై ఎన్ఐఏ అరెస్టు చేసింది. తిహాడ్ జైలుకు తరలించింది.

ఐఐటీ కాన్పూర్‌లో విద్యార్థిని ఆత్మహత్య

కాన్పూర్, జనవరి 18: ఐఐటీ కాన్పూర్‌లో మరో విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మరణించింది. 29 సంవత్సరాల ప్రియాంక జైస్వాల్ గురువారం తన గదిలోని ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుందని పోలీసులు తెలిపారు. ఝార్ఖండ్‌కు చెందిన ప్రియాంక గత ఏడాది డిసెంబరు 29న ఇండియన్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ కాన్పూర్‌లో కెమికల్ ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీ కోర్సులో చేరింది. ఆమె మృతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. త్వరలో ఓ ఫోరెన్సిక్ బృందాన్ని వర్సిటీ క్యాంపస్‌కు పంపిస్తామని, విద్యార్థుల ఆత్మహత్యలకు గల కారణాలపై పూర్తి దర్యాప్తు చేస్తామని కాన్పూర్ పశ్చిమ డీజీపీ అకాశ్ పటేల్ వెల్లడించారు. నెల రోజుల్లో ఈ క్యాంపస్‌లో జరిగిన మూడో సంఘటన ఇది. డిసెంబర్ 19న రీసెర్చ్ స్కాలర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకోగా, జనవరి 11 వికాస్ కుమార్ అనే మరో విద్యార్థి ఉరి వేసుకోని మరణించాడు.



రాముడొచ్చాడు!

అయోధ్య గర్భాలయంలోకి రాముడి విగ్రహం



» నదీ జలాలతో అభిషేకించిన అర్చకులు
» అనుష్ఠాన నియమాలు పాటిస్తున్న ప్రధాని
» ఐదు రాష్ట్రాల్లో విద్యాసంస్థలకు సెలవులు
» సైబర్ ముప్పుపై అయోధ్యకు నిపుణులు

న్యూఢిల్లీ/అయోధ్య, జనవరి 18: రామమందిరం ప్రతిష్ఠా మహోత్సవానికి అయోధ్య సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. నగర వీధులన్నీ తీర్చిదిద్దిన రంగవల్లులతో భక్తులకు స్వాగతం పలుకుతున్నాయి. రామమందిరం గర్భగుడిలో బాల రాముడి విగ్రహాన్ని బుధవారం అర్ధరాత్రి తర్వాత వేద మంత్రోచ్చారణల నడుమ శుభ ముహూర్తంలో ప్రవేశపెట్టారు. మైసూరుకు చెందిన శిల్పి అరుణ్ యోగిరాజ్ చెక్కిన విగ్రహాన్ని లాంఛనంగా సింహాసనం పైకి చేర్చారు. గురువారం ఉదయం రాముడి విగ్రహాన్ని పవిత్ర నదీజ లాలతో అభిషేకించారు. అనంతరం గణేశాంబికా పూజ, వరుణ పూజ, చతుర్వేదోక్త పుణ్యాహవచనం తదితర క్రతువులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మోదీకి బదులుగా ట్రస్టు సభ్యుడు డాక్టర్ అనిల్ మిశ్రా దంపతులు పూజల్లో పాల్గొంటున్నారు. 22న ప్రాణప్రతిష్ఠలో భాగంగా శ్రీరాముడి విగ్రహం కళ్లకు ఉన్న గంతలను విప్పనున్నారు. ఆ తర్వాత మోదీ స్వామివారిని దర్శించుకొని హారతి ఇస్తారని ఆలయ వర్గాలు తెలిపాయి.

కొబ్బరి నీళ్లు.. భూ శయనం

బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొననున్న ప్రధాని నరేంద్ర మోదీ కఠిన నియమాలు, ఆచారాలను పాటిస్తున్నారు. అనుష్ఠానంలో భాగంగా నేలపై ఒకే దుప్పటి వేసుకొని నిద్రిస్తున్నారని, కొబ్బరి నీళ్లు మాత్రమే తాగుతున్నారని సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. మనసును, శరీరాన్ని శుద్ధి చేసుకోవడంతో పాటు ఉల్లిపాయ, వెల్లుల్లి, మసాలా దినుసులు లేకుండా ప్రత్యేకంగా వండిన సాత్వికాహారం తీసుకుంటారు.

తిరుమల, ఉజ్జయిని లడ్డూలు సిద్ధం

అయోధ్యలో భక్తులకు ప్రసాదంగా ఇచ్చేందుకు 25 గ్రాముల బరువు కలిగిన లక్ష లడ్డూలను టీటీడీ సిద్ధం చేసింది. గురువారం తిరుమలలోని శ్రీవారి సేవాసదన్-1లో 350మంది శ్రీవారి సేవకులు ఒక్కో కవర్‌లో రెండు లడ్డూల చొప్పున ప్యాక్ చేశారు. ఇక మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని మహాకాలేశ్వరుడి ఆలయం నుంచి అయోధ్యకు 5లక్షల లడ్డూలు కానుకగా పంపడానికి ఏర్పాట్లు సాగుతున్నాయి. మరోవైపు.. సైబర్ ముప్పును దృష్టిలో ఉంచుకుని కేంద్ర హోంశాఖ ఓ అత్యున్నత స్థాయి బృందాన్ని అయోధ్యకు పంపింది. బాలరాముని ప్రాణప్రతిష్ఠ ఉత్సవాన్ని దేశ ప్రజలంతా చూసేలా డీడీ న్యూస్, డీడీ నేషనల్ చానెళ్లు ప్రత్యక్ష ప్రసారంచేయనున్నాయి.

ప్రపంచ దేశాల్లో వేడులు

రామమందిర ప్రాణప్రతిష్ఠ జరగనున్న నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో వేడుకలు నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఒక్క అమెరికాలోని ఆలయాల్లోనే డజనుకు పైగా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 20న వాషింగ్టన్ డీసీలోని భక్త అంజనేయ ఆలయం నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహణకు వీహెచ్‌పీ ఏర్పాట్లు చేస్తోంది. అలాగే, న్యూయార్క్‌లోని టైమ్ స్క్వేర్ వద్ద 22న సామూహిక వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో భారీగా శ్రీరాముడి రథయాత్ర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 21న విశ్వకల్యాణ యజ్ఞం, పూజల అనంతరం చారిత్రక డెలకె పెల్లె ప్రాంతం నుంచి ఈఫిల్ టవర్ తదితర అనేక ముఖ్యమైన ప్రాంతాలకు రథయాత్ర జరుపనున్నారు. ఈఫిల్ టవర్ వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తి గీతాలాపన, ప్రసాదం పంపిణీ నిర్వహించనున్నారు. ఆస్ట్రేలియా మెల్‌బోర్న్‌లోని కింగ్‌స్లే పార్కు, సిడ్నీలోని పర్రమట్ట పార్కుల్లో పెద్ద ఎత్తున కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. ఆఫ్రికా ఖండంలోని కెన్యా, టాంజానియా, ఉగాండా, మారిషస్, ఘనా, నైజీరియా, మొజాంబిక్ తదితర దేశాల్లోనూ వేడుకలకు వీహెచ్‌పీ సన్నాహాలు చేస్తోంది. కాగా, దాయాది దేశమైన పాకిస్థాన్ ఎక్స్ వేదికగా రామమందిరానికి వ్యతిరేకంగా పోస్టులు పెడుతూ, బాబ్రీ మసీదుకు మద్దతు తెలుపుతోంది. అసలైన రామమందిరానికి 3కిలోమీటర్ల దూరంలో ఈ రామమందిరాన్ని నిర్మిస్తున్నారంటూ తప్పుడు ప్రచారం చేస్తోంది. మరోవైపు.. ఈనెల 22న తాను గొప్ప పార్టీ ఇవ్వనున్నట్లు పాక్ సీనియర్ జర్నలిస్టు ఆర్జూ కజ్మీ ప్రకటించారు. దీంతో పాటు రెండు హిందూ కుటుంబాలను తాను దత్తత తీసుకోనున్నట్లు ఆమె ప్రకటించారు.

స్టాంపుల పుస్తకం ఆవిష్కరణ

అయోధ్యలోని రామమందిరానికి సంబంధించిన స్మారక పోస్టల్ స్టాంపులను ప్రధాని మోదీ గురువారం విడుదల చేశారు. ఇందులో రామమందిరం, వినాయకుడు, హనుమంతుడు, జటాయువు, గుహుడు, శబరి చిత్రాలతో కూడిన ఆరు స్టాంపులు ఉన్నాయి. ఈ డిజైన్‌లో రామమందిరం నమూనా, 'మంగళ్ భవన్ అమంగళ్ హారీ' పంక్తులు, సూర్యుడు, సరయూ నది, ఆలయం లోపల, చుట్టుపక్కల ఉండే శిల్పాలు ఉన్నాయని అధికార వర్గాలు వెల్లడించాయి. అలాగే ప్రపంచ వ్యాప్తంగా శ్రీరాముడిపై విడుదలైన స్టాంపులతో రూపొందించిన పుస్తకాన్ని ప్రధాని ఆవిష్కరించారు. 48 పేజీల ఈ పుస్తకంలో అమెరికా, న్యూజిలాండ్, సింగపూర్, కెనడా, కంబోడియా వంటి 20కి పైగా దేశాలతో పాటు ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన స్టాంపులను పొందుపర్చారు.

22న కేంద్ర ఉద్యోగులకు సగం రోజు సెలవు

అయోధ్య రామమందిరంలో ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని ఈ నెల 22న కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలన్నిటికీ సగం రోజు సెలవు ఇవ్వనున్నారు. ఈ మేరకు కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఉద్యోగులు వేడుకలను వీక్షించేందుకు వీలుగా దేశవ్యాప్తంగా అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, కేంద్ర సంస్థలు 22న మధ్యాహ్నం 2.30 గంటల వరకూ మూసి ఉంటాయని ప్రకటించింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీలు, ఆర్థిక సంస్థలు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు సైతం 22న సగం రోజు మూసి ఉంటాయి. 22న సుప్రీంకోర్టుతో పాటు దేశంలో అన్ని న్యాయస్థానాలకు సెలవు ప్రకటించాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ మన్నన్ కుమార్ మిశ్రా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్‌కు లేఖ రాశారు. కాగా, 22న యూపీలోని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. గోవా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హరియాణాల్లోనూ పాఠశాలలకు సెలవులు ప్రకటించారు.

లోకం తీరు



అయోధ్యకు సిరిసిల్ల బంగారు చీర!

» హరిప్రసాద్ దంపతుల ప్రతిభ

సిరిసిల్ల/భద్రాచలం/హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లలో రూపుదాల్చిన ప్రత్యేక పట్టు వస్త్రం అయోధ్య రామాలయానికి చేరనుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని చేనేత కళాకారుల దంపతులు యెల్ది హరిప్రసాద్, రేఖ 20 రోజుల పాటు చేనేత మగ్గంపై శ్రమించి బంగారం, వెండితో కలిపి నేసిన పట్టు చీరపై అయోధ్య రామమందిరం, రామాయణ ఘట్టాల ఇతివృత్తాలను ఆవిష్కరించారు. గతంలో హరిప్రసాద్ జీ20 లోగోను వస్త్రంపై రూపొందించి ప్రధాని మోదీకి కానుకగా పంపారు. మన్‌కీబాత్‌లో ఈ విషయాన్ని మోదీ ప్రస్తావిస్తూ హరిప్రసాద్ కృషిని మెచ్చుకున్నారు. ఈనేపథ్యంలోనే ఈనెల 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలకు హరిప్రసాద్ దంపతులను ఆహ్వానించారు. బంగారు చీరను 26న మోదీకి అందించనున్నారు. ప్రధాని చేతుల మీదుగా అయోధ్య రాముడి పాదాల చెంత చీరను ఉంచనున్నారు. ఈనెల 22న భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి తెలిపారు. కాగా, రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో 22న ప్రత్యేక పూజలు నిర్వహించాలని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ప్రభుత్వాన్ని కోరింది. దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌ను కలిసి వీహెచ్‌పీ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు.



పట్టు చీరను పరిశీలిస్తున్న బండి సంజయ్

16 ఏళ్లలోపు విద్యార్థులను చేర్చుకోవద్దు

తప్పుదోవ పట్టించే హామీలు, ప్రకటనలు వద్దు

» కోచింగ్ సెంటర్లకు కేంద్రం స్పష్టీకరణ

న్యూఢిల్లీ, జనవరి 18: 'మీ పిల్లలను మా కోచింగ్ సెంటర్‌లో చేర్పించండి. మంచి మార్కులు వచ్చేలా చేస్తాం. అద్భుతమైన ర్యాంకు సాధించేలా శిక్షణ ఇస్తాం' అంటూ తల్లిదండ్రులను తప్పుదోవ పట్టించేలా ప్రకటనలు ఇచ్చే అవకాశం ఇకపై కోచింగ్ సెంటర్లకు ఉండదు! అంతేకాదు.. కేంద్ర విద్యాశాఖ ప్రకటించిన కొత్త మార్గదర్శకాల ప్రకారం కోచింగ్ సెంటర్లు 16 ఏళ్లలోపు విద్యార్థులను చేర్చుకోవడానికీ వీల్లేదు! విద్యార్థుల ఆత్మహత్యలుపెరిగిపోతుండడం, అగ్నిప్రమాదాల ఘటనలు, కోచింగ్ సెంటర్లలో సౌకర్యాలు లేకపోవడం, బోధనా పద్ధతులూ సరిగా లేకపోవడం వంటి అంశాలపై తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు రావడంతో కేంద్ర ప్రభుత్వం స్పందించింది. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేటు కోచింగ్ సెంటర్లను నియంత్రించడంతో పాటు చట్టపరమైన విధివిధానాల రూపకల్పన కోసం కేంద్ర విద్యాశాఖ నూతన మార్గదర్శకాలను ప్రకటించింది. "డిగ్రీ కంటే తక్కువ విద్యార్హత ఉన్నవారిని కోచింగ్ సెంటర్లు ట్యూటర్లుగా నియమించుకోకూడదు. ర్యాంకు గ్యారెంటీ, మంచి మార్కులు సాధించడం ఖాయం వంటి తప్పుదోవ పట్టించే హామీలు ఇవ్వకూడదు. 16 ఏళ్ల కంటే తక్కువ వయసున్న విద్యార్థులను చేర్చుకోరాదు. సెకండరీ స్కూల్ పరీక్షలు పూర్తయిన విద్యార్థులను మాత్రమే చేర్చుకోవాలి" అని నూతన మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది. కోచింగ్‌లో నాణ్యత లేదా కోచింగ్ సెంటర్‌లోని సౌకర్యాలు లేదా సెంటర్ సాధించిన ఫలితం వంటి తప్పుదోవ పట్టించే ప్రకటనలను ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా కూడా ప్రచురించరాదని తేల్చిచెప్పింది. అలాగే దుష్ప్రవర్తనకు సంబంధించిన నేరాల్లో శిక్ష అనుభవించిన వారిని ట్యూటర్లుగా నియమించుకోరాదని తెలిపింది. ట్యూటర్ల విద్యార్హతలు, కోర్సులు/పాఠ్యాంశాలు, కోర్సు గడువు, హాస్టల్ సౌకర్యాలు, వసూలు చేసే రుసుముల వివరాలను కోచింగ్ సెంటర్లు తమ వెబ్‌సైట్లలో తప్పనిసరిగా ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ ఉండాలని స్పష్టం చేసింది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు మానసికంగా తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నారని.. ఈ క్రమంలో వారి మానసిక ఆరోగ్యం కోసం అవసరమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేసింది. కోర్సులో చేరే ముందే మొత్తం ఫీజు చెల్లించిన విద్యార్థులు మధ్యలో వెళ్లిపోవాల్సి వస్తే.. వారికి కోర్సు గడువుకు అనుగుణంగా ఫీజును లెక్కించి, తిరిగి ఇవ్వాల్సిన మొత్తాన్ని 10 రోజుల్లోపు చెల్లించాలని తెలిపింది. ఇక విపరీతమైన ఫీజుల కారణంగా తీవ్ర ఒత్తిడికి గురై విద్యార్థుల ఆత్మహత్యలు సహా ఇతర అవకతవకలకు కారణమైతే కోచింగ్ సెంటర్లకు రూ.లక్ష జరిమానా విధించాలని కేంద్రం సూచించింది. కొత్త మార్గదర్శకాలు అమల్లోకి వచ్చిన మూణ్నెల్లలోపు కోచింగ్ సెంటర్లన్నింటినీ (ఇప్పటికే ఉన్నవి, కొత్తవి) రిజిస్ట్రేషన్ చేయాలని తెలిపింది. కోచింగ్ సెంటర్ల పర్యవేక్షణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలకూ ఉంటుందని స్పష్టం చేసింది.



ఇరాన్‌పై పాక్ ప్రతీకారం

సిస్తాన్-బలూచిస్థాన్ ప్రావిన్స్‌పై వైమానిక దాడులు.. తొమ్మిది మంది మృతి!

ఇస్లామాబాద్, జనవరి 18: ఓవైపు ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం మరోవైపు ఎర్ర సముద్రంలో హౌతీలపై అమెరికా దాడులతో అట్టుడుకుతున్న పశ్చిమాసియాలో మరింత ఉద్రిక్తత. ఇరాన్-పాకిస్థాన్ వివాదం చినికిచినికి గాలివానలా మారింది. తమ దేశంలోని బలూచిస్థాన్‌పై దాడికి దిగిన ఇరాన్ మీద పాక్ ప్రతీకారం తీర్చుకుంది. గురువారం ఇరాన్‌లోని సిస్థాన్-ఓ-బలూచిస్థాన్ ప్రావిన్స్‌పై దాడులకు పాల్పడింది. ఏడు ప్రదేశాల్లోని ఉగ్ర స్థావరాలే లక్ష్యంగా రాకెట్లు, డ్రోన్లను ప్రయోగించింది. ఈ ఘటనల్లో నలుగురు చిన్నారులు, ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు ప్రాణాలు కోల్పోయారు. సిస్థాన్-ఓ-బలూచిస్థాన్.. ఇరాన్ సరిహద్దుల్లో 80కిలోమీటర్ల లోపలకు ఉంటుంది. టెహ్రాన్‌లోని తమ రాయబారిని వెనక్కుపిలిచి ఉన్నత స్థాయి ద్వైపాక్షిక పర్యటనలను రద్దుచేసి.. ప్రతీకారం తప్పదని హెచ్చరించిన మరుసటి రోజే పాక్ దాడులకు దిగడం గమనార్హం. నిఘా వర్గాల సమాచారం మేరకు బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ, బలూచిస్థాన్ లిబరేషన్ ఫ్రంట్ ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకున్నామని.. ఈ రెండు సంస్థల సభ్యులు గెరిల్లా తరహాలో తమ దేశంలో పలు దాడులకు పాల్పడ్డాయని పాక్ తెలిపింది. కొందరు ఉగ్రవాదులు హతమయ్యారని పేర్కొంది. మరోవైపు తమ దేశానికి చెందిన గెరిల్లా ఉగ్రవాదులు ఇరాన్‌ను సురక్షితస్థావరంగా చేసుకుని అమాయకుల ప్రాణాలను బలిగొంటున్నారని పలుమార్లు హెచ్చరించినా చర్యలు తీసుకోలేదని..తమను తాము రక్షించుకోవాల్సినరీత్యా స్పందించాల్సి వచ్చిందని పాకిస్థాన్ పేర్కొంది. తాజా పరిణామా లతో సరిహద్దుల్లో భారీయుద్ధ విన్యాసాలు చేపట్టాలని ఇరాన్ నిర్ణయించింది. కాగా దాడులను ఇరాన్ తీవ్రంగా పరిగణిస్తూ పాక్ చార్జ్ డి అఫైర్స్‌కు సమ న్లు జారీచేసింది. వివరణ ఇవ్వాలని కోరింది. పాక్ దాడుల్లో తమ పౌరులు 9మంది చనిపోయినట్లు ఇరాన్ అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రి అహ్మద్ వాహిది, సిస్తాన్-ఓ-బలూచిస్తాన్ డిప్యూటీ గవర్నర్ అలీ రెజా మర్హమతి ధ్రువీకరించారు. కాగా, పాక్‌లోని ఇరాన్ రాయబారి ప్రస్తుతం స్వదేశంలో ఉన్నారు. ఆయనను తిరిగిరావొద్దంటూ పాక్ విదేశాంగ శాఖ ఆదేశించింది. ఇరాన్‌తో తమది సోదర బంధం అని, చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకుంటామని.. జాతీయ భద్రత, సార్వభౌమత్వంపై మాత్రం రాజీ పడే ప్రసక్తేలేదని పాక్ అధ్యక్షుడు అరిఫ్ అల్వీ తెలిపారు. ఇదిలా ఉండగా తాజా ఉద్రిక్తతలు ఇరాన్-పాక్ మధ్య సమస్యగా భారత్ అభివర్ణించింది. ఆయా దేశాలు ఆత్మరక్షణ చర్యలను అర్థం చేసుకోగలమని పేర్కొంటూ, ఉగ్రవాదంపై పోరాటంలో తమది రాజీలేని ధోరణి అని స్పష్టం చేసింది. ఇరాన్ ఉల్లంఘనలే ఈ పరిస్థితికి కారణమని.. ఆ దేశానిదే తప్పని అమెరికా వ్యాఖ్యానించింది. ఉద్రిక్తతలు మరింత పెరిగేలా వ్యవహరించవద్దని చైనా సూచించింది.

మణిపూర్‌లో ఆగని హింస

» పలు జిల్లాల్లో సాయుధ మూక కాల్పులు
» ఐదుగురి మృతి, ముగ్గురు బీఎస్ఎఫ్ సిబ్బందికి గాయాలు

ఇంఫాల్, జనవరి18: మణిపూర్‌లో రెండు తెగల మధ్య కొన్ని నెలల క్రితం మొదలైన హింసాత్మక ఘటనలు ఆగడంలేదు. మోరెలో బుధవారం ఇద్దరు పోలీసులను హత్య చేసిన సాయుధ మూక.. అర్ధరాత్రి వరకు పలు చోట్ల కాల్పులకు పాల్పడింది. ఈ కాల్పుల్లో ఓ వాలంటీర్‌తోపాటు ఐదుగురు పౌరులు మృతిచెందగా.. ముగ్గురు బీఎస్ఎఫ్ సిబ్బందికి గాయాలయ్యాయి. మొదటగా థౌబాల్ జిల్లాలోని ఖాంగబాక్‌లో 3వ ఇండియన్ రిజర్వ్ బెటాలియన్ లక్ష్యంగా దుండగులు ఆయుధాలతో కాల్పులు జరిపారు. కనీస సిబ్బందితోనే బలగాలు వారిని తిప్పికొట్టాయి. ఆ తర్వాత సాయుధ మూక థౌబాల్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌పై దాడికి పాల్పడింది. మూకలోని పలువురు ఆయుధాలతో సిబ్బందిపై పలు రౌండ్ల కాల్పులు జరిపారు. ఈ ఘటనలో బీఎస్ఎఫ్‌కు చెందిన ఇద్దరు ఏఎస్ఐలు, ఓ కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో పోలీసులు జిల్లాలో కర్ఫ్యూ విధించారు. అత్యవసరమున్న వారినే బయటకు అనుమతిస్తున్నారు. అలాగే ఇంఫాల్ ఈస్ట్, ఇంఫాల్ వెస్ట్, కాంగ్‌పోక్పి, బిష్ణుపూర్ జిల్లాల్లోనూ కాల్పుల ఘటనలు చోటుచేసుకున్నాయి. బిష్ణుపూర్ జిల్లాలో ఇరువర్గాల మధ్య జరిగిన కాల్పుల్లో తండ్రీకొడుకులతోపాటు మరో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. అలాగే కాంగ్‌పోక్పి జిల్లా కాంగ్‌చుప్ గ్రామంలో జరిగిన కాల్పుల్లో గ్రామ వాలంటీర్ మృతి చెందాడు. పౌరుల మృతిని నిరసిస్తూ మహిళలు ఇంఫాల్‌లో గురువారం సీఎం బంగ్లా మీదుగా, రాజ్‌భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. భద్రతా బలగాల యూనిఫైడ్ కమాండ్ అధికారిని తొలగించాలంటూ డిమాండ్ చేశారు. రాజ్‌భవన్‌కు 300మీటర్ల దూరంలోనే పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు టియర్ గ్యాస్‌ను ప్రయోగించారు.



సహాయక చర్యలు చేపడుతున్న ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది

బోటు బోల్తా.. 16 మంది మృతి

» వారిలో 14 మంది పాఠశాల విద్యార్థులు.. గుజరాత్‌లో ఘోరం

వదోదరా, జనవరి18: గుజరాత్‌లో ఘోర పడవ ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో విహార యాత్ర విషాదంగా మారింది. వదోదరాలోని హర్ణి సరస్సులో గురువారం పడవ బోల్తా పడడంతో కనీసం 16మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 14 మంది పాఠశాల విద్యార్థులు, ఇద్దరు వారిని తీసుకొచ్చిన ఉపాధ్యాయులు ఉన్నారు. పిక్నిక్‌కు వచ్చిన వారంతా మధ్యాహ్నం సరస్సులో బోటు షికారుకు బయలుదేరారు. ఆనందంగా సాగుతున్నామని అనుకుంటున్న సమయంలో అది బోల్తాపడింది. సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించడం వల్లనే ప్రమాదం జరిగినట్లు అనుమానిస్తున్నారు. తొలుత ప్రమాదాన్ని చూసిన స్థానికులు విద్యార్థులను రక్షించే ప్రయత్నాలు చేశారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది, ఎన్‌డీఆర్ఎఫ్ జవాన్లు వచ్చి సహాయ చర్యల్లో పాల్గొన్నారు. ఒడ్డుకు తీసుకువచ్చిన వారందర్నీ హుటాహుటిన సమీపంలోని ఎస్ఎస్‌జీ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి వెళ్లే సరికే 15 ఏళ్ల వయసున్న ఒక బాలుడు, ఇద్దరు బాలికలు, 45 ఏళ్ల వయసున్న ఇద్దరు ఉపాధ్యాయులు ప్రాణాలు విడిచారు. చికిత్స పొందుతూ మిగిలిన వారు కన్నుమూశారు. దీనిపై వదోదరా జిల్లా కలెక్టర్ ఎ.బి.గోర్ మాట్లాడుతూ బోటులో 27 మంది పాఠశాల విద్యార్థులు ప్రయాణించారని చెప్పారు. అయితే వారెవరి దగ్గరా లైఫ్ జాకెట్లు లేవని తెలిపారు. ప్రమాద తీవ్రతకు ఇదే కారణంగా కనిపిస్తోంది. మరణించిన వారి కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రూ.6 లక్షల నష్టపరిహారాన్ని ప్రకటించాయి. గాయపడ్డ వారికి రూ.లక్ష వంతున పరిహారం ఇవ్వనున్నాయి. ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతాపం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రి సహాయ నిధి నుంచి మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల వంతున, గాయపడ్డ వారికి రూ.50వేల వంతున సహాయం ప్రకటించారు. ఈ ప్రమాదం హృదయ విదారకరమని రాష్ట్ర ప్రభుత్వం వ్యాఖ్యానించింది. మరణించిన వారి కుటుంబాలకు రూ.4 లక్షల వంతున, గాయపడ్డవారికి రూ.50 వేలు చొప్పున పరిహారం ప్రకటించింది. ప్రమాదానికి బాధ్యులైన వారిని శిక్షిస్తామని స్థానిక బీజేపీ ఎమ్మెల్యే కేయూర్ రొకాడియా చెప్పారు. బోటు సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించడమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా తెలుస్తోందని తెలిపారు.

బలహీనంగా భావి భారతం!

- ఆరోగ్య సూచీలపరంగా పాఠశాల పిల్లల్లో అత్యధికులు అన్‌ఫిట్ పరిధిలోనే
- బాలుర కంటే బాలికలే నయం
- పీటీ క్లాసులతో మంచి ఫిట్‌నెస్
- స్పోర్ట్స్ విలేజ్ దేశవ్యాప్త సర్వేలో వెల్లడి

హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు వెళ్లే పిల్లల్లో అత్యధికులు శారీరక దృఢత్వం లేకుండా బలహీనంగా ఉంటున్నారని ఓ సర్వే వెల్లడించింది. అయితే, బాలుర పరంగా చూస్తే బాలికల పరిస్థితి కొంత మెరుగని పేర్కొంది. పాఠశాలలో నిర్వహించే వ్యాయామ విద్య (పీటీ) పిల్లల ఫిట్‌నెస్‌లో కీలకపాత్ర పోషిస్తుందని, వారానికి కనీసం రెండు



సార్లు పీటీలో పాల్గొనే పిల్లలు శారీరకంగా ఇతరులకన్నా మెరుగ్గా ఉంటున్నారని తెలిపింది. కర్ణాటకకు చెందిన 'స్పోర్ట్ విలేజ్' క్రీడావిద్యాసంస్థ నిర్వహించిన 12వ వార్షిక ఆరోగ్య సర్వేలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. దేశవ్యాప్తంగా 250 పట్టణాల్లో 7 నుంచి 17 ఏళ్ల వయసున్న దాదాపు 73 వేల మంది పిల్లలపై ఈ సర్వే జరిపారు. బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ), ఏరోబిక్ కెపాసిటీ, అనేరోబిక్ కెపాసిటీ, కోర్ స్ట్రెన్త్, ఫ్లెక్సిబిలిటీ, అప్పర్ బాడీ స్ట్రెన్త్, లోయర్ బాడీ స్ట్రెన్త్ వంటి పలు ఆరోగ్య సూచీల ఆధారంగా పిల్లల్లో శారీరక దృఢత్వాన్ని అధ్యయనం చేశారు. బీఎంఈ, ఫ్లెక్సిబిలిటీ, అప్పర్ బాడీ స్ట్రెన్త్‌లలో బాలుర కన్నా బాలికలు మెరుగైన ఫిట్‌నెస్‌తో ఉన్నారని ఈ సర్వే వెల్లడించటం విశేషం. తరచూ ఏదో ఒక శారీరక శ్రమ చేయటం వల్లనే బాలికలు మెరుగ్గా ఉన్నారని తెలిపింది. బాలురు ఏరోబిక్ కెపాసిటీ, లోయర్ బాడీ స్ట్రెన్త్‌లో మంచి ఫిట్‌నెస్‌తో ఉన్నారని పేర్కొంది. పీటీకి పిల్లల శారీరక ఆరోగ్యానికి మధ్య గణనీయమైన సంబంధం ఉన్నదని, వారానికి రెండు కన్నా ఎక్కువ పీటీ క్లాసుల్లో పాల్గొన్న పిల్లలు ఫిట్‌నెస్‌తో ఉంటున్నారని తెలియజేసింది.

సర్వేలో తేలింది..

- ప్రతీ ఐదుగురిలో ఇద్దరు తగిన బీఎంఐతో లేరు
- ప్రతీ ఐదుగురిలో ఇద్దరికి తగిన అనేరోబిక్ కెపాసిటీ లేదు
- ప్రతీ నలుగురిలో ముగ్గురికి తగిన ఏరోబిక్ సామర్థ్యం లేదు
- ప్రతీ ముగ్గురిలో ఒకరికి ఉదర భాగం బలంగా లేదు
- ప్రతి ఐదుగురిలో ముగ్గురికి సరైన బాడీ స్ట్రెంత్ లేదు

విశాఖ జైలులో కోడికత్తి శ్రీను నిరాహార దీక్ష!

- విజయవాడలో రహస్య ప్రదేశంలో తల్లి, సోదరుడి దీక్ష
- జగన్ కోర్టుకు వచ్చే వరకు ఆపేది లేదని ప్రతిన

విశాఖపట్నం/ఆరిలోవ, విజయవాడ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు ఆయనపై విశాఖ విమానాశ్రయంలో కోడికత్తితో జరిగిన దాడి కేసుకు సంబంధించి ఐదేళ్లుగా రిమాండ్ ఖైదీగా జైలులో మగ్గిపోతున్న దళిత యువకుడు జనుపల్లి శ్రీనివాసురావు (కోడికత్తి శ్రీను).. తనను జైలు నుంచి బెయిల్‌పై విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విశాఖ సెంట్రల్ జైలులో గురువారం నిరాహార దీక్ష చేపట్టాడు. అదే సమయంలో ఆయన తల్లి సావిత్రమ్మ, సోదరుడు సుబ్బరాజు విజయవాడలోని ఓ రహస్య ప్రదేశంలో దీక్షకు పూనుకున్నారు. శుక్రవారం విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జరగనున్న నేపథ్యంలో తల్లీ కొడుకులు దీక్షకు దిగడం గమనార్హం. కాగా, విశాఖపట్నం కేంద్ర కారాగారంలో దీక్ష చేపట్టిన శ్రీనివాసరావును దళిత సంఘాల నాయకులు ములాఖత్ ద్వారా గురువారం కలిశారు. అనంతరం.. విశాఖ దళిత సంఘాల ఐక్యవేదిక(విదసం) రాష్ట్ర సమన్వయకర్త బూసి వెంకటరమణ మాట్లాడుతూ.. కోడి కత్తి కేసులో రిమాండ్ ఖైదీగా శ్రీనివాస్ జైలులో నిరాహార దీక్ష చేస్తున్నట్టు విలేకరుల ఎదుట స్పష్టం చేశారు. జగన్ కోర్టుకు వచ్చి వాంగ్మూలం ఇచ్చేంత వరకూ జైలులో శ్రీను దీక్షను కొనసాగిస్తాడన్నారు.

ప్రాణంపోయే వరకూ దీక్ష!

"ప్రాణం లేని 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం కాదు. ప్రాణం ఉన్న దళిత యువకుడు శ్రీనును బెయిల్‌పై బయటకు రప్పించండి" అని కోడికత్తి కేసులో నిందితుడు శ్రీనివాసరావు తల్లి సావిత్రమ్మ, సోదరుడు సుబ్బరాజు సీఎం జగన్‌ను డిమాండ్ చేశారు. శ్రీనుకు బెయిల్ రాకుండా జగన్ కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపిస్తూ వారు విజయవాడలో గురువారం నుంచి ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్నారు. కుమారుడి కోసం ప్రాణాలకు తెగించి దీక్ష చేస్తున్నామని సావిత్రమ్మ తెలిపారు. కాగా, శ్రీనుకు బెయిల్ రాకపోవడంపై దళితులు, గిరిజనులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలపాలని అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య గురువారం పిలుపునిచ్చారు.

పామేడు దాడి వెనుక భారీ వ్యూహం

మావోయిస్టులకు ఇప్పుడు ఆ అడవులే సేఫ్‌జోన్.. సీఆర్పీఎఫ్ క్యాంపులను అడ్డుకునేలా దాడులు

- ఛత్తీస్‌గఢ్ వ్యాప్తంగా నక్సల్స్ ఏరివేతకు 'ఆపరేషన్ సూర్యశక్తి'
- మహారాష్ట్ర సరిహద్దుల్లో నక్సల్స్ గ్రనేడ్ లాంచర్ కర్మాగారం
- సమూలంగా పేల్చివేసినట్లు ప్రకటించిన పోలీసులు

చర్ల, జనవరి 18: గణతంత్ర దినోత్సవం వేళ.. ఛత్తీస్‌గఢ్‌లో పోలీసులు 'ఆపరేషన్ సూర్యశక్తి' పేరుతో నక్సల్స్‌ను ఏరివేసే దిశలో కూంబింగ్‌ను ఉధృతం చేయగా.. మావోయిస్టులు తమ ఉనికిని చాటుకునేందుకు అడపాదడపా దాడులు చేస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు బీజాపూర్ జిల్లా పామేడులో సీఆర్పీఎఫ్ క్యాంపులను చుట్టుముట్టి.. రాకెట్, గ్రనేడ్ లాంచర్లతో దాడులు జరపగా.. పోలీసులు కూంబింగ్‌ను మరింత ముమ్మరం చేసుకున్నారు. వ్యూహాత్మకంగా మావోయిస్టులకు బీజాపూర్‌లోని పామేడు అడవులే ఇప్పుడు అత్యంత సురక్షితంగా ఉన్నాయి. అందుకే.. అక్కడ పోలీసు శిబిరాలు లేకుండా చేయడమే లక్ష్యంగా దాడులకు పాల్పడుతున్నట్లు స్పష్టమవుతోంది.

అబుజ్‌మడ్‌లోనూ పోలీసులు..

ఒకప్పుడు మావోయిస్టులకు అబుజ్‌మడ్ కంచుకోటగా ఉండేది. 2009-10లో 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' అబుజ్‌మడ్ వెళ్లే వరకు కూడా ఆ ప్రాంతం ఉనికి గూగుల్ మ్యాప్‌కంటికి కూడా అందలేదు. ఇప్పుడు సీఆర్పీఎఫ్ అబుజ్‌మడ్‌లోనూ శిబిరాన్ని ఏర్పాటు చేసింది. ఇక బీజాపూర్‌లోని ఇతర ప్రాంతాలు, కాంకేర్ వంటి ప్రదేశాల్లోనూ కూంబింగ్ ఊపందుకుంది. దీంతో ఇప్పుడు ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్స్‌కు పామేడు పరిసర అడవులే సేఫ్‌జోన్‌గా ఉన్నాయి. ఇప్పటికే ఈ పరిసరాల్లో సీఆర్పీఎఫ్‌కు ఆరు క్యాంపులున్నాయి. వీటిల్లో మూడు క్యాంపులు పామేడులో ఉండగా.. చింతవాగు వద్ద ధర్మారం క్యాంపు నిర్మాణంలో ఉంది. ఇక్కడ క్యాంపులు లేకుండా చేస్తేనే తాము సేఫ్‌గా ఉంటామని మావోయిస్టులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే గిరిజనులతో కొంతకాలంగా ఇక్కడ క్యాంపులు వద్దంటూ ఆందోళనలు చేయిస్తున్నారు. 'పెసా' చట్టం ప్రకారం షెడ్యూల్డ్ భూముల్లో గిరిజనుల అనుమతి లేనిదే ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదు. ఇదే అంశంపై గత వారం పామేడు పరిసర గూడేల గిరిజనులు ఆందోళనకు సిద్ధమవ్వగా.. పోలీసులు అనుమతించలేదు. ఈ నేపథ్యంలోనే పామేడు సీఆర్పీఎఫ్ క్యాంపులపై మావోయిస్టులు దాడికి పాల్పడ్డట్లు తెలుస్తోంది. కాగా, మంగళవారం రాత్రి నాటి దాడిలో మావోయిస్టులు ఉపయోగించిన రాకెట్లు, గ్రనేడ్ లాంచర్లు, తూటాబాంబులను వారే స్వయంగా తయారు చేసినట్లు తెలిసింది. గురువారం 'ఆపరేషన్ సూర్యశక్తి'లో భాగంగా సీఆర్పీఎఫ్ బలగాలు మహారాష్ట్ర-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని మావోయిస్టుల బ్యారెల్ గ్రనేడ్ లాంచర్, రాకెట్ లాంచర్ల తయారీ కర్మాగారాన్ని పేల్చివేశాయి. ఈ మేరకు పోలీసులు మీడియాకు ఓ ప్రకటనను విడుదల చేశారు. కాగా.. మావోయిస్టుల దాడికి సంబంధించి తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ పోలీసులకు ముందే ఇంటెలిజెన్స్ హెచ్చరికలు వచ్చాయని, అయితే.. ఇంత పెద్ద స్థాయిలో దాడి చేస్తారని ఊహించలేదని ఖమ్మం పోలీసులు చెబుతున్నారు.



పోలీసులు సీజ్ చేసిన ఆయుధాలు

పలుచోట్ల ఎదురుకాల్పులు

తాజా ఘటనతో పోలీసులు నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో కూంబింగ్‌ను ముమ్మరం చేశారు. ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర సరిహద్దుల్లోని మాడ్, నార్త్ బస్తర్ ప్రాంతాల్లో మావోయిస్టులు, పోలీసులకు మధ్య ఎదురుకాల్పులు జరిగినట్లు తెలిసింది. తకిల్‌కోట్-చినగుండ గ్రామాల మధ్య అటవీప్రాంతాల్లోనూ ఎదురుకాల్పులు జరగ్గా.. నలుగురు మావోయిస్టులను పోలీసులు అరెస్టు చేశారు. పలుచోట్ల మావోయిస్టులు, సానుభూతిపరులు లొంగిపోయినట్లు అధికారులు తెలిపారు.

పలువురి మృతి?

మంగళవారం నాటి మావోయిస్టుల దాడిలో పలువురు మృతిచెందినట్లు పామేడులో ప్రచారం జరుగుతోంది. ఓ ట్రాక్టర్‌లో కొన్ని మృతదేహాలను తీసుకెళ్లడం చూశామని గిరిజనులు వివరించారు. అయితే.. ఆ మృతదేహాలు మావోయిస్టులవా? గిరిజనులవా? అనేది తెలియదని పేర్కొన్నారు. రూ.లక్షన్నర రివార్డు ఉన్న ఓ మావోయిస్టు మృతిచెందినట్లు సీఆర్పీఎఫ్ వర్గాలు చెబుతున్నా.. అతని పేరు, వివరాలను వెల్లడించలేదు. మావోయిస్టుల దాడిలో తొమ్మిది మంది పోలీసులకు స్వల్పగాయాలు అయినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే.. పోలీసులు మాత్రం వివరాలను అందజేయడానికి నిరాకరిస్తున్నారు. ఢిల్లీ నుంచి సీఆర్పీఎఫ్ ఉన్నతాధికారులు ఛత్తీస్‌గఢ్‌కు చేరుకుని, తాజా ఘటనపై సమీక్షలు జరిపినట్లు తెలిసింది. మావోయిస్టుల దాడి సమయంలో సీఆర్పీఎఫ్ వర్గాలు డ్రోన్ కెమెరాల ద్వారా ఆ దృశ్యాలను చిత్రీకరించాయని, వాటిని ఉన్నతాధికారులు పరిశీలించారని సమాచారం.



బ్రిడ్జి ఫోటో శీర్షిక: కుప్పకూలిన గ్రీన్‌ఫీల్డ్ హైవే అండర్‌పాస్ వంతెన శ్లాబ్

కుప్పకూలిన గ్రీన్‌ఫీల్డ్ హైవే వంతెన

- శ్లాబ్ పోస్తుండగా ఘటన.. ఐదుగురు కూలీలకు గాయాలు

వైరా, జనవరి 18: వేల కోట్ల రూపాయలు వెచ్చించి చేపట్టిన గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణాల్లో డొల్లతనం బయటపడింది. ఖమ్మం జిల్లా వైరా సమీపంలో గురువారం సాయంత్రం నిర్మాణంలో ఉన్న గ్రీన్‌ఫీల్డ్ హైవే అండర్‌పాస్ వంతెన కుప్పకూలింది. 20 అడుగుల ఎత్తులో నిర్మిస్తున్న శ్లాబ్ కూలడంతో ఐదుగురు కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. హెచ్‌జీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఖమ్మం-దేవరపల్లి రహదారి ప్యాకేజీ-1కింద ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు నుంచి వైరా మండలం సోమవరం వరకు 33.60 కిలోమీటర్ల రోడ్డును రూ.772.11 కోట్లతో నిర్మిస్తోంది. 2022నవంబరులో నిర్మాణం ప్రారంభం కాగా.. వైరా నుంచి ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట వెళ్లే రాష్ట్రీయ ప్రధాన రహదారిలో వైరా-సోమవరం గ్రామాల మధ్య 33వ కిలోమీటరు వద్ద రోడ్డు క్రాసింగ్ కోసం అండర్‌పాస్ బ్రిడ్జిలతో పాటు దేవరపల్లి నుంచి ఖమ్మం వైపు వెళ్లేందుకు ఎగ్జిట్‌ఇచ్చి సర్వీస్ రోడ్లు నిర్మిస్తున్నారు. దేవరపల్లి నుంచి ఖమ్మం వైపు వెళ్లే అండర్‌పాస్ వంతెన (పొడవు 132 అడుగులు) శ్లాబ్ నిర్మాణాన్ని గురువారం చేపట్టి.. భారీ హైడ్రాలిక్ మిషన్‌తో పైభాగంలో వైబ్రేషన్ చేస్తున్నారు. ఆ సమయంలో హైవేకు చెందిన ఇంజనీర్లతో పాటు కూలీలు పైనే ఉన్నారు. వారు శ్లాబ్‌తో పాటు కిందపడగా ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. కింద ఎవరూ లేకపోవడంతో భారీ ప్రమాదమే తప్పింది.

సిరిసిల్ల బల్దియాకు కరెంట్ కట్

- ఏడాదిగా రూ.1.58 కోట్ల బిల్లుల బకాయి
- అధికారుల హామీతో సరఫరా పునరుద్ధరణ

సిరిసిల్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల మునిసిపల్ కార్యాలయ భవనంతో పాటు అనుబంధ విభాగాలకు సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్) అధికారులు కరెంటు సరఫరాను నిలిపివేశారు. మునిసిపల్ భవనంతో పాటు స్టేడియం, ఆధునిక దోబీ ఘాట్, వీధి దీపాలకు సంబంధించి 2023 ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు రూ.1.58 కోట్ల విద్యుత్ బిల్లులు పేరుకుపోయాయి. ఇందులో మునిసిపల్ భవనానికి సంబంధించి రూ.14 లక్షల బకాయిలు ఉన్నాయి. మరోవైపు, పట్టణ ప్రగతికి సంబంధించి రూ.7 కోట్ల వరకు సెస్‌కు బకాయిలు ఉన్నాయి. సిరిసిల్ల మునిసిపల్ కౌన్సిల్‌కు ఎక్స్ అఫీషియో సభ్యుడిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉన్నారు. మునిసిపల్ కౌన్సిల్ పాలకవర్గం, సెస్ పాలకవర్గం బీఆర్ఎస్‌కు చెందినవే. ఏడాది కాలంగా లేని బకాయిల సమస్య ఇప్పుడు ప్రభుత్వం మారడంతోనే రావడం చర్చనీయాంశమైంది. మునిసిపల్ కమిషనర్, చైర్‌పర్సన్.. సెస్ ఎండీ, చైర్మన్‌తో సంప్రదింపులు జరిపి.. బకాయిలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఒక్కరోజే ఆర్టీసీకి 22.46 కోట్లకు పైగా ఆదాయం

హైదరాబాద్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్ఆర్టీసీ)కు బుధవారం ఒక్కరోజే రూ.22.46 కోట్లకు పైగా ఆదాయం వచ్చింది. సంక్రాంతి పండగ సందర్భంగా సొంతూళ్లకు వెళ్లి తిరిగి గమ్యస్థానాలకు చేరుతున్న ప్రయాణికులతో ఆర్టీసీ బస్సులన్నీ కిటకిటలాడాయి. సుమారు 48.94 లక్షల మంది ప్రయాణికులను ఆర్టీసీ గమ్యస్థానాలకు చేర్చడం ద్వారా 101 శాతానికి పైగా ఆక్యుపెన్సీ నమోదైనట్టు అధికారులు పేర్కొన్నారు. జనవరి 1వ తేదీ నుంచి 17వ తేదీ వరకు టీఎస్ఆర్టీసీకి రూ.317 కోట్లకు పైగా ఆదాయం వచ్చినట్లు అధికారులు నమోదు చేశారు.

కండక్టర్ కుటుంబానికి రూ.40 లక్షల సాయం

- నష్టపరిహారం ప్రకటించిన ఆర్టీసీ

రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందిన కండక్టర్ లక్ష్మణ్ కుటుంబానికి ఆర్టీసీ సంస్థ అండగా నిలిచింది. లక్ష్మణ్ కుటుంబానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో రూ.40 లక్షల విలువైన చెక్కును యూబీఐ అధికారులతో కలిసి బస్ భవన్‌లో గురువారం ఆర్టీసీ ఎండీ వీసీ. సజ్జనార్ అందజేశారు. గత ఏడాది జూన్ 22న హకీంపేట జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీకి శిక్షణ కోసం వెళ్తుండగా ద్విచక్రవాహనం ఢీకొని రోడ్డు ప్రమాదంలో లక్ష్మణ్ మృతి చెందారు. ఈ ఆపద సమయంలో యూబీఐ సూపర్ శాలరీ సేవింగ్ అకౌంట్ బాధిత కుటుంబాన్ని ఆదుకుంది. ఈ ఖాతా ద్వారా ఉచిత ప్రమాద బీమా సౌకర్యం కింద యూబీఐ విడుదల చేసిన రూ.40 లక్షల ఆర్థిక సాయాన్ని కండక్టర్ లక్ష్మణ్ భార్య జ్యోతి, కుమారుడు అనిల్ కుమార్‌లకు అందజేశారు.

త్వరలో సచివాలయ ఉద్యోగుల సంఘం ఎన్నికలు

- తీర్మానం చేసిన తెలంగాణ సెక్రటేరియట్ అసోసియేషన్

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగుల సంఘం ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ సెక్రటేరియట్ అసోసియేషన్ తీర్మానం చేసింది. ఉద్యోగుల సంఘం ఎగ్జిక్యూటివ్ కమిటీ గురువారం సచివాలయం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మాధవరం నరేందర్ రావు అధ్యక్షతన సమావేశం అయింది. ఈ సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై చర్చించి, ఏపీ సెక్రటేరియట్ అసోసియేషన్ బైలాస్‌తో సమానంగా తెలంగాణ సచివాలయ సంఘం బైలాస్‌కు తగిన సవరణలు చేశారు. ఈ సవరణల ద్వారా సచివాలయ ఉద్యోగుల సంఘానికి ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు టీఎస్ఏ ప్రధాన కార్యదర్శి షేక్ యూసుఫ్ మియా తెలిపారు. అవసరమైన సవరణలను వీలైనంత త్వరగా అందించేలా ఆఫీస్ బేరర్లతో ముసాయిదా కమిటీని ఏర్పాటు చేశారు.

ఫోన్ ట్యాంపరింగ్‌పై విచారణ జరిపించండి

- డీజీపీకి నందకుమార్ విజ్ఞప్తి

ఎమ్మెల్యేల కొనుగోలు కేసు సమయంలో తన వ్యక్తిగత ఫోన్ ట్యాంపరింగ్ జరిగిందని, ఈ వ్యవహారంలో సమగ్ర విచారణ జరిపించాలని డీజీపీ రవిగుప్తాకు ఆ కేసులో నిందితుడు నందకుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు డీజీపీని కలిసి గురువారం నందకుమార్ వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో అరెస్ట్ అయిన తర్వాత జరిగిన పరిణామాలను డీజీపీ దృష్టికి తీసుకెళ్లానన్నారు.

గంజాయి మత్తులో రాళ్లతో దాడి.. యువకుడి మృతి

- కామారెడ్డిలో ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి

కామారెడ్డి టౌన్, జనవరి 18: గంజాయి మత్తులో ఉన్న ఐదుగురు వ్యక్తులు చేసిన దాడిలో గాయపడి ఆస్పత్రిపాలైన కామారెడ్డికి చెందిన ఓ యువకుడు దాదాపు 20 రోజుల చికిత్స అనంతరం గురువారం కన్నుమూశాడు. ఆ యువకుడి మరణం పోలీసుల దృష్టికి వెళ్లడంతో జరిగిన దారుణం బయటకొచ్చింది. పోలీసు కథనం ప్రకారం.. కామారెడ్డికి చెందిన సూర్యకాంత్(25) పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఫర్నిచర్ దుకాణం నిర్వహిస్తుంటాడు. కామారెడ్డికే చెందిన నరేందర్, రాకేష్, మనోజ్, ప్రణీత్, మరో మైనర్ బాలుడు గత డిసెంబరు 29వ తేదీ రాత్రి ఆ దుకాణం వద్ద మూత్రవిసర్జన చేశారు. ఆ సమయంలో దుకాణంలో ఉన్న సూర్యకాంత్ సోదరుడు శివ ఆ యువకులను ప్రశ్నించాడు. గంజాయి, మద్యం మత్తులో ఉన్న ఆ యువకులు శివతో వాగ్వాదానికి దిగారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన సూర్యకాంత్ వారిని నిలువరించే యత్నం చేశాడు. కానీ, రెచ్చిపోయిన ఆ యువకులు సూర్యకాంత్ తలపై రాళ్లు, ఇనుప రాడ్‌తో కొట్టారు. శివను కూడా గాయపరిచారు. అటుగా వెళుతున్న అంబులెన్స్ సిబ్బంది వాహనాన్ని ఆపి దాడిని అడ్డుకోగా నిందితులు పరారయ్యారు. తీవ్ర గాయాలపాలైన సూర్యకాంత్‌ను కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అయితే, సూర్యకాంత్ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మరణించాడు. దీంతో బాధిత కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా దాడి జరిగిన తీరును పరిశీలించారు. నిందితులను త్వరలోనే అదుపులోకి తీసుకోనున్నారు.



సూర్యకాంత్(ఫైల్)

పదేళ్లలో ఏం జరిగింది..?

(మొదటి పేజీ తరువాయి)

రోడ్ల మరమ్మతులు, కల్వర్టులు, బ్రిడ్జిలు, కేబుల్ బ్రిడ్జిలు, రోడ్ల నిర్మాణాలు సహా అన్ని వివరాలూ తెలుసుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రధానంగా సచివాలయం, అంబేడ్కర్ విగ్రహం, అమరుల స్థూపం నిర్మాణాలు జరిగాయి. సచివాలయ నిర్మాణం కోసం ఎన్ని నిధులు ఖర్చు చేశారన్న విషయంలో ఇప్పటికీ స్పష్టత లేదు. జిల్లాల్లో మెడికల్ కాలేజీలు, ఆస్పత్రులను నిర్మిస్తున్నారు. వీటిలో కొన్ని పనులను నామినేషన్ విధానంలో కొందరికి కట్టబెట్టారనే ఆరోపణలున్నాయి. మరోవైపు గత పదేళ్లలో ఆర్‌అండ్‌బీకి కేంద్రం నుంచి వచ్చిన నిధుల వివరాలను కూడా ఇప్పటికే మంత్రి అధికారులను అడిగినట్లు సమాచారం. మొత్తంగా గత ప్రభుత్వ హయాంలో జరిగిన అన్ని పనుల వివరాలను తనకు అందజేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిసింది.

తేలని సచివాలయం ఖర్చు..

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన సచివాలయం, అంబేడ్కర్ విగ్రహం, అమరుల స్థూపానికి ఎంత ఖర్చు చేశారన్నదానిపై ఇప్పటికీ స్పష్టత లేదు. సచివాలయ పనుల ప్రారంభ సమయంలో నిర్మాణ ఖర్చు రూ.617 కోట్లని గత సర్కారు తెలిపింది. కానీ, ఆ తర్వాత కొవిడ్ కారణంగా నిర్మాణరంగ సామగ్రి ఖర్చు పెరిగిందంటూ సచివాలయ నిర్మాణ వ్యయం కూడా రూ.800 కోట్ల వరకు అవుతుందని అంతర్గతంగా నిర్ణయించినట్లు తెలిసింది. దీంతో కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ సర్కారు.. సచివాలయ నిర్మాణానికి ఎంత ఖర్చు చేశారు? ఏ శాఖ నుంచి ఎన్ని నిధులు వినియోగించారనే అంశాలపై దృష్టి సారించింది. గత ప్రభుత్వం మంజూరు చేసిన వైద్య కళాశాలలు, ఆస్పత్రుల నిర్మాణాల సమాచారమూ అస్పష్టంగా ఉన్నట్లు తెలుస్తోంది.



వరంగల్‌కు మంత్రి కోమటిరెడ్డి..?

బీఆర్ఎస్ సర్కారు హైదరాబాద్ చుట్టుపక్కలతో పాటు వరంగల్‌లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని మంజూరు చేసింది. ప్రస్తుతం ఇవి నిర్మాణ దశలో ఉన్నాయి. వరంగల్ ఆస్పత్రి నిర్మాణం కోసం స్థలాన్ని ప్రైవేటు బ్యాంకులో కుదవపెట్టి రుణం తీసుకున్నారు. రుణాన్ని ఎప్పుడు తీర్చుతారనే విషయంలో స్పష్టత లేకపోవడంతో ఆ బ్యాంకు పూర్తి స్థాయిలో రుణమిచ్చేందుకు వెనకంజ వేస్తున్నట్లు తెలిసింది. నిర్మాణ నాణ్యతపైనా కొన్ని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆస్పత్రి విషయాలు తెలుసుకునేందుకు త్వరలోనే వరంగల్ వెళ్లాలని మంత్రి కోమటిరెడ్డి నిర్ణయించినట్లు తెలిసింది. ఆర్‌అండ్‌బీ పరిధిలో నిర్వహించిన పనుల్లో కొన్నింటిని టెండర్లు లేకుండానే కాంట్రాక్టర్లకు అప్పగించినట్లు తెలిసింది. అలా ఎందుకు ఇచ్చారని మంత్రి అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది. అంతేగాక గత ప్రభుత్వానికి సన్నిహితంగా ఉన్నవారికే పనులు ఎక్కువగా దక్కాయని, శాఖ పరిధిలో నిర్వహించిన పనులకూ బిల్లుల చెల్లింపులో వివక్ష చూపారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఠంచనుగా పనులు చేయించుకున్నా బిల్లులు మాత్రం కొందరికే ఇచ్చారన్న ఆరోపణలపైనా మంత్రి దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

పారతో కొట్టి.. సుత్తితో మోది..

- వ్యాపారి హత్య.. రూ.2,100 చోరీ
- మద్యం మత్తులో ఓ లారీ డ్రైవర్ కిరాతకం
- భువనగిరి జిల్లా మోత్కూరులో ఘటన

మోత్కూరు, జనవరి 18: మద్యం మత్తులో ఓ లారీ డ్రైవర్ అత్యంత కిరాతకంగా ప్రవర్తించాడు. ఓ వ్యాపారి వద్ద డబ్బును దొంగలించేందుకు వెళ్లి అతని తలపై పారతో కొట్టాడు. ఆపై, సుత్తితో మరో రెండు సార్లు మోది ప్రాణం తీశాడు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరులో ఈ నెల 15న జరిగిన ఈ హత్యకు సంబంధించిన వివరాలను డీసీపీ రాజేష్ చంద్ర గురువారం వెల్లడించారు. మోత్కూరుకు చెందిన ఎండీ.ఖలీమొద్దీన్(70) పాతికేళ్లుగా పాత ఇనుము, ప్లాస్టిక్ సామాను కొనుగోలు వ్యాపారం చేస్తున్నాడు. ఖలీమొద్దీనికు భార్యాపిల్లలు లేరు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం అమ్మాపురానికి సిరిపాటి కిరణ్ భార్యాపిల్లలతో కలిసి మోత్కూరులో నివాసముంటూ లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కిరణ్ తన వద్ద ఉన్న పాత ఇనుప సామానును జనవరి 15న ఖలీమొద్దీన్‌కు విక్రయించి రూ.800 తీసుకున్నాడు. అనంతరం మద్యం తాగిన కిరణ్ దొంగతనం చేసేందుకు అదే రోజు సాయంత్రం ఖలీమొద్దీన్ దుకాణానికి వెళ్లాడు. ఆ సమయంలో ఖలీమొద్దీన్ దుకాణంలో నిద్రిస్తుండగా.. అక్కడే ఉన్న పారతో అతని ఎడమ చెవి కింద కిరణ్ బలంగా కొట్టాడు. చనిపోయాడో లేదోనన్న అనుమానంతో అక్కడే ఉన్న సుత్తితో చెవి వద్ద మరో రెండు సార్లు మోదాడు. అనంతరం ఖలీమొద్దీన్ వద్ద ఉన్న రూ.2,100 ఎత్తుకెళ్లాడు. ఖలీమొద్దీన్ సోదరుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు కిరణ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమ వద్దు

- ప్రజాభిప్రాయ సేకరణపై ప్రజల ఆగ్రహం
- ఎంపీఎల్ స్టీల్ ఇండస్ట్రీస్ వద్ద ఆందోళన

చిట్యాల రూరల్, జనవరి 18: కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమ తమ గ్రామాల సమీపంలో ఉండవద్దని వెలిమినేడు తదితర గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడులో ఎంపీఎల్ స్టీల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్.. స్పాంజ్, ఐరన్ పరిశ్రమ విస్తరణ కోసం చేపట్టనున్న ప్రజాభిప్రాయ సేకరణ పనులను అడ్డుకున్నారు. వెలిమినేడు శివారు పిట్టంపల్లి రోడ్డులోని ఎంపీఎల్ స్టీల్ ఇండస్ట్రీస్.. స్పాంజ్, ఐరన్ పరిశ్రమలో నాలుగేళ్లుగా ఉత్పత్తులు తయారవుతున్నాయి. తొమ్మిదేళ్ల క్రితం ఇదే పరిశ్రమను ఆశీర్వాద్ పేరిట యాజమాన్యం నిర్వహించగా.. కాలుష్యం వెదజల్లుతోందని స్థానికులు కోర్టును ఆశ్రయించడంతో కంపెనీలో ఉత్పత్తుల తయారీ నిలిపివేయాలని తీర్పువచ్చింది. నాలుగేళ్ల క్రితం ఎంపీఎల్ గ్రూప్ సంస్థలు ఆశీర్వాద్ కంపెనీని కొని ఉత్పత్తి ప్రారంభించింది. పరిశ్రమ ఉత్పత్తి సామర్థ్యాన్ని 60వేల టీపీఏ (టన్స్ పర్ యానమ్) నుంచి 1.26 లక్షల టీపీఏకు పెంచేందుకు, ఉత్పత్తి ఆధారిత విద్యుత్ ప్లాంటును 5నుంచి 10 మెగావాట్లకు పెంచేందుకు యాజమాన్యం చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు పరిశ్రమ విస్తరణ కోసం వెలిమినేడులో శుక్రవారం (19న) ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను వెలివినేడు, బొంగోనిచెర్వు, పిట్టంపల్లి, పేరేపల్లి చెందిన ప్రజలు అడ్డుకున్నారు. టెంట్‌ను కూల్చివేశారు. టెంట్ మధ్యలోని కొంత భాగానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో అప్రమత్తమైన పోలీసులు వెంటనే మంటలను ఆర్పివేశారు. నిరసన వ్యక్తం చేస్తున్న వారిని చెదరగొట్టారు. నల్లగొండ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి ఎంపీఎల్ పరిశ్రమ వద్దకు రాగా.. ప్రజాభిప్రాయ సేకరణను నిలిపివేయాలని పలు గ్రామాల డిమాండ్ చేశారు. కాగా, శుక్రవారం తలపెట్టిన ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం వాయిదా పడింది. ఇందుకు సంబంధించి కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ పి.సురేష్ బాబు ఓ ప్రకటన చేశారని నార్కట్‌పల్లి సీఐ టి.మహేష్ గురువారం రాత్రి తెలిపారు.



పరిశ్రమ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజలు

మెడపై, కళ్లలో పొడచి..

- భార్యను చంపిన భర్తకు మరణ శిక్ష
- నాలుగేళ్ల నాటి కేసులో నాంపల్లి కోర్టు తీర్పు

హైదరాబాద్ సిటీ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కత్తెరతో భార్య ముఖం, మెడపై దాడి చేసి.. కళ్లను పొడిచి హత్యచేసిన భర్తకు నాంపల్లి అదనపు మెట్రో సెషన్స్ కోర్టు మరణశిక్ష విధించింది. 2019 జనవరి 6న తలాబ్‌కట్టలో జరిగిన ఈ హత్య రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. తలాబ్‌కట్టా, అమాన్‌నగర్ ప్రాంతానికి చెందిన ఇమ్రాన్ ఉల్ హక్ (38) చంచల్‌గూడకు చెందిన యువతిని పెళ్లి చేసుకున్నాడు. తర్వాత ఆమెను అదనపు కట్నం కోసం ఆమెను చిత్రహింసలకు గురిచేశాడు. 2019 జనవరి 6న ఇంట్లో భార్యతో ఇమ్రాన్ గొడవ పెట్టుకొని ఆమెపై దాడి చేశాడు. ప్రమాదాన్ని గ్రహించిన బాధితురాలు తన సోదరుడికి ఫోన్ చేయగా ఇమ్రాన్ ఆమె నుంచి ఫోన్ లాక్కున్నాడు. ఫోన్ రిసీవ్ చేసిన సోదరుడు అవలి వైపు నుంచి అరుపులు, కేకలు విని వెంటనే సోదరి ఇంటికి చేరుకున్నాడు. అప్పటికే ఆమెపై ఇమ్రాన్ దాడి చేస్తున్నాడు. చేతిలో కత్తెర పట్టుకుని ఆమె మెడ, ముఖం, కళ్లల్లో విచక్షణారహితంగా పొడిచాడు. ఆమె సోదరుడు పట్టుకోడానికి ప్రయత్నించగా పారిపోయాడు. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి చార్జిషీటు దాఖలు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు ఇమ్రాన్‌ను దోషిగా నిర్ధారించింది. అతడికి మరణ శిక్ష, రూ. 10వేల జరిమానా విధించింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పాక్ ప్రతీకారం!

ఇరాన్ చేసిన దాడులకు ప్రతీకారం తప్పదన్న హెచ్చరికకు తగినట్టుగానే, పాకిస్థాన్ 24గంటల్లోనే ఆ పనిచేసింది. గురువారం తెల్లవారుజామున పాకిస్థాన్ విమానాలు ఇరాన్ భూభాగాల్లోని 'ఉగ్రవాద' స్థావరాలపై బాంబులు కురిపించాయి. ఇరాన్‌లోని సియోస్థాన్–ఒ–బలూచిస్థాన్ ప్రావిన్సులోని కొన్ని ప్రాంతాల్లో ఈ దాడులు జరిగాయని పాకిస్థాన్ విదేశాంగశాఖ ప్రకటించింది. మార్గ్ బర్ సర్మచార్ పేరిట నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో పలువురు ఉగ్రవాదులు మరణించారని, ఇరాన్ ప్రజలకు ఏ ముప్పూ లేకుండా ఎంతో కచ్చితత్వంతో ఈ పనిచేశామని పాకిస్థాన్ చెప్పుకుంది. ఇరాన్ సోదరదేశమని, మా దేశభద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ పనిచేశామని అంటూనే, పాక్ సార్వభౌమత్వాన్ని సవాల్ చేసే ఏ చర్యనూ ఉపేక్షించేది లేదని పరోక్షంగా ఇరాన్‌ను హెచ్చరించింది. పాకిస్థాన్‌లోని జైష్ అల్ అదిల్ స్థావరాలపై ఇరాన్ క్షిపణిదాడులు చేసినందుకు ఇలా ప్రతీకారం తీర్చుకోవడంతో పాటు, ఇరాన్‌లోని తన రాయబారిని వెనక్కుపిలవడం, ప్రస్తుతం స్వదేశంలో ఉన్న ఆ దేశరాయబారిని అక్కడే ఉండమనడం, భవిష్యత్ ద్వైపాక్షిక పర్యటనలన్నీ రద్దుచేసుకోవడం వంటి నిర్ణయాలు కూడా పాకిస్థాన్ తీసుకుంది.

ఇరాన్–పాకిస్థాన్ మధ్య మంచి స్నేహమూ లేదు, అలాగని బలమైన శత్రుత్వమూ లేదు. రెండుదేశాల మధ్యా చీలిన బలూచిస్థాన్ ఆయా దేశాల్లో చిచ్చుకు కారణమవుతూ, అడపాదడపా ఆరోపణలకు, ఆగ్రహానికి కారణమవుతున్నాయి. బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ వంటి సంస్థలు పాక్, చైనా ప్రయోజనాలను దెబ్బతీస్తుంటే, జైష్ అల్ అదిల్ వంటివి ఇరాన్‌ను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. ఒక విధంగా ఇది రెండుదేశాలూ ఒకేవిధంగా ఎదుర్కొంటున్న సమస్య. మీ భూభాగం నుంచి మాకు వ్యతిరేకంగా పనిచేస్తున్న గ్రూపులను ప్రోత్సహిస్తున్నారని, నియంత్రించడం లేదని రెండుదేశాలు ఆరోపణలు చేసుకోవడం తప్ప, నిన్నమొన్నటివరకూ నేరుగా దాడులకు దిగిన సందర్భం లేదు. దశాబ్దాలుగా ఆరోపణలకు, ప్రత్యారోపణలకు పరిమితమైన ఓ వివాదం ఇప్పుడు సరిగ్గా గాజా యుద్ధకాలంలో పరస్పర దాడుల రూపాన్ని తీసుకోవడం విశేషం.

ఇరాక్‌లో అమెరికా దౌత్యకార్యాలయానికి సమీపంలో ఉన్న ఇజ్రాయెల్ గూఢచర్య సంస్థ ప్రధాన కార్యాలయాన్ని కూల్చి, సిరియాలోనూ తీవ్రంగా విరుచుకుపడిన మర్నాడు పాకిస్థాన్ భూభాగాల్లో ఇరాన్ దాడులు చేసింది. ఈ గొలుసుకట్టు చర్యలకు అది ఏ కారణాలైనా చెప్పవచ్చును కానీ, పొరుగుదేశాల సరిహద్దులను ఉల్లంఘించి చేసిన ఈ దాడులు పశ్చిమాసియాను మరింత ఉద్రిక్తం చేస్తున్నాయి. పాకిస్థాన్ భూభాగాల్లో ఇరాన్ దాడిమీద భారతదేశం వ్యూహాత్మకంగా స్పందించినప్పటికీ, ఆ రెండు దేశాల మధ్య ఘర్షణ ఒక పొరుగుదేశంగా మనకు ఆందోళన కలిగించే అంశమే.

మరో వాణిజ్యనౌకమీద బుధవారం దాడి జరగడంతో ఎర్రసముద్రంలో పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయని భారతవిదేశాంగశాఖ వ్యాఖ్యానించింది. అమెరికా, బ్రిటన్, మరికొన్ని పాశ్చాత్యదేశాలు కలసికట్టుగా యుద్ధవిమానాలతో యెమెన్‌లోకి చొరబడి మూడురోజులు వరుసగా హౌతీలమీద దాడులు చేసినా పరిస్థితుల్లో పెద్ద మార్పేమీ రాలేదు. పైగా, హౌతీలు మరింతగా నౌకలమీద ప్రతీకారదాడులకు తెగబడుతున్నారు. వందరోజులకుపైగా ఇజ్రాయెల్–హమాస్ మధ్య సాగుతున్న యుద్ధం అనేక శక్తులను ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రభావితం చేస్తూ క్రమంగా విస్తరిస్తున్నది. లెబనాన్‌లోకి నేరుగా చొరబడి హమాస్ ఉన్నతస్థాయి నాయకుడిని ఇజ్రాయెల్ హతమార్చడం, ఇరాక్, సిరియా, యెమెన్‌లో అమెరికా ప్రతీకారదాడులు, ఇప్పుడు ఇరాన్ తన పొరుగుదేశాలమీద విరుచుకుపడటం వంటివి ప్రమాదకరమైన వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. ఆత్మరక్షణ, ఉగ్రవాదాన్ని అణచివేయడం ఇత్యాది ఏ పేర్లు పెట్టుకున్నా గాజాయుద్ధం పునాదిగా రేగిన చిచ్చు ఇది. ఓ ప్రాంతీయస్థాయి ఘర్షణగా దానిని అభివర్ణించగలిగే దశ దాటిపోతున్నది. అంతర్జాతీయ నిబంధనలు చట్టుబండలై, దేశాల సార్వభౌమత్వం అర్థంలేనిదిగా మిగిలి, మరింత భయానకమైన యుద్ధానికి వీలుకల్పించే పరిస్థితులు ఇప్పుడునెలకొన్నాయి. ఇప్పటికే పాతికవేలమంది అమాయకుల ప్రాణాలు తీసిన ఇజ్రాయెల్‌ను నిలువరించి, కాల్పుల విరమణ అమలుచేయనిదే ఈ గొలుసు తెగడం కష్టం. ఇరాన్ దాడులకు అర్థం, పరమార్థం దానంతటదే ఆ తరువాత తెలి-

భిన్న తరహాలో ప్రపంచీకరణ

అవును, ఆర్థిక వ్యవస్థల ప్రపంచీకరణ కొనసాగాలి. అయితే ఆ విశ్వీకరణ విభిన్న తరహాలో ఉండి తీరాలి. ఇందుకు మనం ఈ (2024) సంవత్సరంలో అంతర్జాతీయ వాణిజ్య నియమాలను నిశితంగా పునః పరిశీలించి కొత్తగా, మరో రీతిలో రూపొందించి తీరాలి. మౌలిక మార్పులు, సమూల సంస్కరణలు గ్లోబల్ సౌత్ (పారిశ్రామికీకరణలో బాగా వెనుకబడిన దేశాలు) ఆర్థిక వ్యవస్థల సత్వర పురోగతికి, వాతావరణ మార్పును సమర్థంగా ఎదుర్కొనేందుకు స్వేచ్ఛా వాణిజ్య నిబంధనలలో మౌలిక మార్పులు అత్యంత ముఖ్యం.


■ సునీతా నారాయణ్

మట్టివాసన

చాలా చాలా సంవత్సరాల క్రితం వాతావరణ మార్పు సంభవనీయత గురించి చర్చిస్తున్నప్పుడే కొత్త వాణిజ్య వ్యవస్థ విషయమై కూడా ప్రపంచం మంతనాలు జరిపింది. 1990 దశకంలో రియో ధరిత్రి సదస్సులో వాతావరణ మార్పుపై ఐక్యరాజ్యసమితి ఒప్పందం ఆమోదం పొందినప్పుడే ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ)ను కూడా ఏర్పాటు చేశారు. దేశ దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్యాన్ని సుసాధ్యం చేసే నియమాలనూ రూపొందించారు. ఆ ప్రపంచ వాణిజ్య ఒప్పందం చాలా సరళమైనది. శ్రమశక్తి వ్యయాలు, పర్యావరణ ప్రమాణాలు తక్కువగా ఉన్న దేశాలలో సరుకులను ఉత్పత్తి చేస్తే ఉత్పత్తి వ్యయాలు గణనీయంగా తగ్గుతాయనేది ఆ ఒప్పంద సారాంశం. ఎగుమతుల ఆధారిత ఆర్థిక వ్యవస్థలు అభివృద్ధిచెందుతున్న దేశాలలో సిరిసంపదలను ఇతోధికంగా సృష్టిస్తాయని ఆ ఒప్పందం నొక్కి చెప్పింది. మరీ ముఖ్యంగా చౌక సరుకులు, సమృద్ధిగా అందుబాటులో ఉండే సేవల నుంచి సంపన్న దేశాలలోని వినియోగదారులు విశేషంగా లబ్ధి పొందుతారని ఆ ఒప్పంద రూపకర్తలు విశ్వసించారు. నిజానికి అభివృద్ధి చెందిన దేశాలకు విశేష లబ్ధి సమకూర్చడమే వారి లక్ష్యం. సరే, ఈ ఒప్పందం అమలులో 2001లో పెను మార్పు చోటుచేసుకున్నది. చైనాకు సభ్యత్వమివ్వడానికి డబ్ల్యుటిఒ అంగీకరించడమే ఈ పెనుమార్పుకు ప్రధాన కారణం. చైనాలో చౌక కార్మిక శక్తి అపారంగా ఉన్నది. కార్మిక సంఘాలు అనేవి లేనే లేవు. ఏర్పాటుచేసేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే కమ్యూనిస్టు పాలకుల నుంచి తీవ్ర వేధింపులకు గురికావలసి ఉంటుంది. పర్యావరణ రక్షణలు అనేవి లేవు. నియంతృత్వ పాలన. పాలకులదే తొలి, మలి, తుది మాట. డబ్ల్యుటిఒలో చేరిన తరువాత ప్రపంచ కర్బన ఉద్గారాలలో చైనా వాటా 1990లో 5 శాతం నుంచి 2019లో 21 శాతానికి పెరిగింది. స్వేచ్ఛా వాణిజ్యంలో చైనా విజృంభించింది. అయితే ప్రపంచ సిరిసంపదలు పెరగలేదు. వాణిజ్యం మాత్రమే పెరిగింది. మరింత స్పష్టంగా చెప్పాలంటే వాణిజ్యం పెరుగుదలతో కర్బన ఉద్గారాలు మరింతగా పెరిగాయి! రెండు దశాబ్దాల కాలంలోనే ప్రపంచీకరణ తీరుతెన్నులు వక్రగతి పట్టాయి. పేద దేశాలకు వ్యతిరేకంగా పరిణమించాయి. తొలుత ఆ ఒప్పందాన్ని ప్రతిపాదించినవారే ఇప్పుడు దానిపట్ల విముఖత చూపుతున్నారు. అడ్డు అదుపులేని ప్రపంచ వాణిజ్యంతో ఉపకారం కంటే అపకారమే ఎక్కువగా జరుగుతుందన్న వాస్తవాన్ని వారు గుర్తించారు.

జాతీయ ప్రభుత్వాల ఆర్థిక తోడ్పాటు, సబ్సిడీలతో నిమిత్తం లేని రీతిలో ఆ ప్రపంచ వాణిజ్యాన్ని రూపొందించడం జరిగింది. ఒక పక్క వాతావరణ విపత్తు, మరో పక్క అంతులేని యుద్ధంతో సతమతమవుతున్న ప్రపంచంలో కొత్త వాణిజ్య నియమాలు ఏ విధంగా రూపొందనున్నాయి? నేడు ప్రపంచ వ్యాప్తంగా మీడియాలో, విద్యావంతుల మాటా మంతీలో, సామాన్యుల పిచ్చాపాటీలో విశేషంగా ప్రస్తావితమవుతున్న అంశం చైనా పట్ల అమెరికా వ్యతిరేకత. ఇది నియంతృత్వ, అప్రజాస్వామిక వ్యవస్థల మధ్య పోరు (ఇది వాస్తవమే)గా కూడా చర్చించుకోవడం జరుగుతోంది. అయితే ఆ రెండు దేశాల మధ్య ఎనలేని స్పర్థకు అసలు కారణం భావి అవసరాలకు అవసరమైన సహజ వనరులు, అధునాతన సాంకేతికతలపై సంపూర్ణ నియంత్రణ సాధించడమే. ప్రపంచానికి అత్యవసరమైన గ్రీన్ ఎకానమీ (సామాజిక సుస్థిరత, పర్యావరణ భద్రతకు దోహదం చేసే మౌలిక సదుపాయాలను ప్రభుత్వ ప్రైవేట్ పెట్టుబడుల సహాయంతో నిరంతరాయ అభివృద్ధిని సాధించడమే హరిత ఆర్థిక వ్యవస్థ)ని సంపూర్ణంగా నెలకొల్పుకోవడంలో అమెరికా, చైనాలు తీవ్రంగా పోటీపడుతున్నాయి. బ్యాటరీలకు అవసరమైన ముడి పదార్థాల సరఫరా గొలుసులలో చైనా చాలా ప్రాబల్య స్థానంలో ఉన్నది. లిథియం, కోబాల్ట్, గ్రాఫైట్ నిక్షేపాలలో సగానికి పైగా చైనాలోనే ఉన్నాయి. దీనికి తోడు సౌర ఇంధన ఉత్పత్తిలో చైనాయే ప్రపంచ అగ్రగామిగా ఉన్నది. మరి ఈ 'ప్రత్యర్థి'పై పోరాడేందుకు సబ్సిడీల విషయమై తన సైద్ధాంతిక సంకోచాలను పూర్తిగా వదిలివేయాలని అమెరికా నిర్ణయించుకుంది. తక్కువ కర్బన ఉద్గారాలకు కారణమయ్యే సరుకులను ఉత్పత్తి చేసే కంపెనీలకు ఆర్థిక సహాయాన్ని సమకూర్చేందుకు 'ద్రవ్యోల్బణ తగ్గింపు చట్టం' (ఐఆర్ఎ)ను అమెరికా తీసుకువచ్చింది.

అధునాతన పారిశ్రామిక రంగంలో చైనా ప్రాబల్యాన్ని తగ్గించడంలో అమెరికా, ఇతర పాశ్చాత్య సంపన్న దేశాల లక్ష్యం నెరవేరడం హరిత పరివర్తన (గ్రీన్ ట్రాన్సిషన్ – శిలాజ ఇంధనాలు, సహజ వనరుల మితిమీరిన వినియోగంపై ఆధారపడకుండా సుస్థిర ఆర్థిక వ్యవస్థలను అభివృద్ధిపరచుకోవడం) వ్యయాలు మరింత అధికమయ్యేందుకు, అసలు ఆ పరివర్తనను జాప్యం చేసేందుకు దారి తీస్తుందా? లేక అసాధ్యమైన దాన్ని–అరుదైన ఖనిజాలు, లోహాలను పాశ్చాత్య దేశాలకు అందుబాటులోకి తెచ్చి వస్తూత్పత్తి రంగాన్ని పునర్నిర్మించుకునేందుకు దోహదం చేయడం – సుసాధ్యం చేస్తుందా? అరుదైన సహజ వనరులను కలిగివున్న దేశాలు వాటి నుంచి గరిష్ఠ ప్రయోజనాలను పొందేందుకు ప్రయత్నించడం డీ–గ్లోబలైజేషన్ లేదా స్థానికీకరణకు దారితీసే అవకాశం ఎంతైనా ఉన్నది. కొత్త పథ నిర్దేశక సాంకేతికతల అవిర్భావం అరుదైన ఖనిజాల సరఫరా గొలుసులలో చైనా ప్రాబల్యాన్ని పూర్తిగా తగ్గించివేసే అవకాశమూ ఉన్నది. ఉదాహరణకు సోడియం అయాన్ బ్యాటరీల గురించి ఇప్పుడు విశేష చర్చ జరుగుతోంది. ఇవి రంగంలోకి వస్తే లిథియమ్ బ్యాటరీల అవసరం గణనీయంగా తగ్గిపోతుంది. డీ–గ్లోబలైజేషన్ ప్రక్రియ హరిత పరివర్తనకు కూడా అంతరాయాన్ని కలిగిస్తుంది. అమెరికా తన ఐఆర్ఎ చట్టం ద్వారా స్థానికంగా విద్యుత్ వాహనాలను ఉత్పత్తి చేసే కంపెనీలకు ఆర్థిక సహాయాన్ని సమకూరుస్తుంది. అయితే చైనాలో ఉత్పత్తిఅయిన బ్యాటరీలను ఉపయోగించే విద్యుత్ వాహనాల ఉత్పత్తికి ఆర్థిక సహాయం అందించబోమని అమెరికా ప్రభుత్వం స్పష్టం చేసింది. చైనా ప్రభుత్వంతో సంబంధాలు ఉన్న కంపెనీలు సైతం ఐఆర్ఎ నుంచి లబ్ధి పొందలేవు. అయితే ముడి పదార్థాల



2001లో చైనా డబ్ల్యుటిఓలో చేరిన తరువాత స్వేచ్ఛా వాణిజ్యంలో విజృంభించింది. ప్రపంచ సిరిసంపదలు పెరగలేదు. వాణిజ్యం మాత్రమే పెరిగింది. మరింత స్పష్టంగా చెప్పాలంటే వాణిజ్యం పెరుగుదలతో కర్బన ఉద్గారాలు మాత్రమే మరింతగా పెరిగాయి! తొలుత ఆ ఒప్పందాన్ని ప్రతిపాదించినవారే ఇప్పుడు దానిపట్ల విముఖత చూసుతున్నారు. అడ్డు అదుపులేని ప్రపంచ వాణిజ్యంతో ఉపకారం కంటే అపకారమే ఎక్కువగా జరుగుతుందన్న వాస్తవాన్ని వారు గుర్తించారు.

సరఫరాపై చైనాకు సంపూర్ణ నియంత్రణ ఉన్నందున రవాణా రంగం విద్యుత్ వాహనాలకు మారడమనేది మరింత జాప్యమై వాటిని మరింత వ్యయభరితంచేసే అవకాశమున్నది. చైనీస్ విద్యుత్ వాహనాల తయారీదారు బివైడి ఇప్పటికే ఎలన్ మస్క్ కంపెనీ టెస్లాను అధిగమించింది. 'ఫైనాన్షియల్ టైమ్స్' ప్రకారం 2023 చివరి త్రైమాసికంలో బివైడి విక్రయించిన బ్యాటరీ–ఓన్లీ విద్యుత్ వాహనాలు 526,000 కాగా టెస్లా విక్రయించిన విద్యుత్ వాహనాలు 4,84,000 మాత్రమే. చైనా ప్రాబల్యం కొనసాగుతున్న నేటి ప్రపంచంలో స్థానికీకరణ, త్వరితగతిన హరిత పరివర్తన లక్ష్యాలను సాధించడం అంత సులువేమీ కాదు.

భారత్‌లోనూ ఇదే పరిస్థితి ఉన్నది. సౌరశక్తి ఉత్పత్తిని స్థానికంగా అభివృద్ధిపరచుకోవడానికి ప్రాధాన్యమిస్తున్నాం. సోలార్ సెల్ తయారీ కంపెనీలకు ఆర్థిక ప్రోత్సాహకాలను భారత ప్రభుత్వం ప్రకటించింది. చైనీస్ దిగుమలపై అధిక సుంకాలు విధించారు. అయితే ఈ చర్యలు పునరుద్ధరణీయ ఇంధనాలను దేశీయ సామర్థ్యంతో అభివృద్ధిపరచుకోవాలనే భారత్ ఆశయానికి ఇది ప్రతిబంధకమవుతుందా అనే విషయమై ఇప్పుడే ఏమీ చెప్పలేము... ఏమైనా మన పరిశ్రమను మనమే అభివృద్ధిపరచుకోవడంలో ఒక ప్రయోజనమున్నది స్వేచ్ఛా వాణిజ్యం నిలిచిపోయినపక్షంలో దానిపర్యవసానాలు మన ఎగుమతులపై కూడా ఉంటాయి. ఏమైనా అంతర్జాతీయ వాణిజ్యరంగంలో ఒక ప్రయత్నం ప్రారంభమయింది. సరికొత్త వాణిజ్య వ్యవస్థ నియమాలు ప్రజల శ్రేయస్సుకు ధాత్రీ పరిరక్షణకు తోడ్పడుతాయా లేదా అన్నది కాలమే చెప్పగలదు.

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్'

కాళేశ్వరం: ఇప్పుడు ఏం చేయాలి?

కొత్త ప్రభుత్వం, కొత్త ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందు అనేక సవాళ్లు ఉన్నాయి. అందులో ముఖ్యమైనది కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్. ఈ ప్రాజెక్ట్ అప్పటి సీఎం కేసీఆర్‌కూ, ఆయన కుటుంబానికి ఏటీఎం మెషీన్ లాంటిదని ఎన్నికలకు ముందు రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఆ ఏటీఎం మెషీన్ ప్రస్తుత ముఖ్యమంత్రికి పాస్‌వర్డ్‌తో పాటు వారసత్వంగా వచ్చింది. కాని అందులో నగదు లేదు. అయితే వడ్డీతో పాటు మెషీన్‌కు మరమ్మతులు చేసి అంతకుముందు చేసిన విత్‌డ్రాలకు బిల్లులు అందుతున్నాయి. ఈ కొత్త ముఖ్యమంత్రి భారతదేశ చరిత్రలో అత్యంత సమస్యాత్మకమైన ప్రాజెక్ట్‌లలో ఒకదాన్ని వారసత్వంగా పొందారు.

వాస్తవానికి ప్రాణహిత–చేవెళ్ల పేరుతో 2007లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించింది. అనూహ్యంగా టీఆర్ఎస్ ప్రభుత్వం 2016లో ఈ ప్రాజెక్టుకు మూడు ప్రధాన మార్పులు చేసి దాని పరిమాణం, పరిధిని పెంచి చాలా ఖరీదైనదిగా మార్చింది. ఈ మార్పులతో ప్రాజెక్ట్ పరిధి పూర్తిగా మారిపోయింది. ఇప్పుడు ఈ రీ–బ్రాండెడ్ ప్రాజెక్ట్ ప్రధానంగా మూడు లక్ష్యాలను కలిగి ఉంది. అవి: కొత్తగా 19.63 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడం, 18.82 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించడం, హైదరాబాద్ నగరానికి 30టీఎంసీలు, గ్రామాలకు 10టీఎంసీల తాగునీరు అందించడం, పరిశ్రమలకు 16టీఎంసీల నీటిని కేటాయించడం.

ఈ లక్ష్యాలకు కావలసిన మూడు బ్యారేజీలు, 15 నీటి నిలువ సదుపాయాలు, 1531 కిమీ మేర గ్రావిటీ కాలువలు, 203 కిమీ మేర సొరంగాలు, 21 పంప్ హౌస్‌లతో కాళేశ్వరం ప్రాజెక్ట్ బృహత్తరంగా, సంక్లిష్టంగా మారింది. 4959 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ అంచనా వేసి ఇందుకోసం 19 సబ్ స్టేషన్లను నిర్మించారు. నిర్మాణంలో ఈ స్థాయి సంక్లిష్టత, పనులు చేపట్టిన వేగం కారణంగా దాదాపు జాతీయంగా అద్భుత దృశ్యం అయింది. ఈ ప్రాజెక్ట్ పరిమాణం, పంపుల సామర్థ్యం, ఎక్కడా లేని కృత్రిమ జలాశయాల పరిమాణం ఇవన్నీ చర్చనీయాంశంగా, పర్యాటక ఆకర్షణగా మారాయి.

ప్రాజెక్ట్ ప్రారంభించకముందే పౌర సమాజం ద్వారా ఈ ప్రాజెక్ట్ గుణాత్మక విశ్లేషణ జరిగింది. ఈ విశ్లేషణ వివరాలను అప్పటి తెలంగాణ ప్రభుత్వానికి అందజేశాం. కానీ ఆ సలహాలు, నివేదికలు అన్నింటినీ ఆ ప్రభుత్వం విస్మరించింది. నీటి సరఫరా ఖర్చును ప్రశ్నించినా వెక్కిరించారు. దీనికి తోడు ఈ విమర్శకులను తెలంగాణ ద్రోహులుగానూ, జాతి వ్యతిరేకులుగానూ చిత్రించారు. ప్రాజెక్టు కీలక అంశాలపై వచ్చిన సూచనలను, విమర్శలను రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు రెండూ పట్టించుకోలేదు.

2016 నుంచి ఇప్పటివరకు ప్రాజెక్ట్‌పై రూ.93,782 కోట్లు ఖర్చు చేయబడింది. దీనికి మునుపటి ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్ట్ మొత్తాలు అదనం. కాళేశ్వరానికి ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.32,203 కోట్లు, వాణిజ్య బ్యాంకుల నుంచి రూ.61,665కోట్లు రుణంగా తీసుకొని వెచ్చించింది. ఇప్పటికే తెలంగాణ



ప్రాజెక్ట్ క్రమంగా సమస్యల విషవలయంలోకి జారుకుంటున్నది. రుణ చెల్లింపులు, నిర్వహణ ఖర్చుల కోసం ప్రాజెక్టుపై కొత్త ప్రభుత్వం సంవత్సరానికి రూ.25,000 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. మరమ్మత్తులను పరిగణనలోకి తీసుకుంటే మరో పదివేల కోట్లు ఖర్చు అవుతుంది. ప్రాజెక్టు అనుకున్న విధంగా పనిచేసినా సమీప భవిష్యత్తులో 18.2 లక్షల ఎకరాల అదనపు సాగునీటిని అందించడం అసాధ్యం. ఈ ప్రాజెక్ట్‌ను శాస్త్ర బద్ధంగా సమీక్షించేందుకు ఒక కమిషన్‌ను ఏర్పాటు చేయాలి. కాళేశ్వరం భవిష్యత్తుపై ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయమైనా సమగ్ర సమీక్షా ప్రక్రియ ఆధారంగా జరగాలి.

ప్రభుత్వం రుణాలు, వడ్డీలను చెల్లించడం ప్రారంభించిందని కూడా డేటా సూచిస్తుంది. మొత్తం రూ.22,700కోట్లు చెల్లించగా అందులో వడ్డీయే రూ.17,700 కోట్లు అనేది ఆసక్తికరం. అయితే, ఖర్చు చేసిన మొత్తంలో పారదర్శకత, వాస్తవ వ్యయం, రుణ నిబంధనలు మొదలైనవి ఇంకా పబ్లిక్ డొమైన్‌లో లేవు. అయితే ఇది ఖచ్చితంగా దేశంలోనే అత్యంత ఖరీదైన లిఫ్ట్ ఇరిగేషన్.

కానీ లక్ష కోట్లు పైగా ఖర్చు చేసిన తరువాత కూడా దీని నిర్మాణాలు నాసిరకంగా ఉన్నాయి. దాని లక్ష్యాలు 5శాతానికి మించి నెరవేరేట్టుగా కనపడటం లేదు. పులి మీద పుట్రలా దీనికితోడు ఇప్పుడు పూర్తయిన బ్యారేజీల, రిజర్వాయర్ల మరమ్మతులకు అదనపు మూలధనం అవసరం కావచ్చు. ప్రాజెక్ట్ క్రమంగా సమస్యల విషవలయంలోకి జారుకుంటున్నది. రుణ చెల్లింపులు, నిర్వహణ ఖర్చులతో కూడిన ఈ ప్రాజెక్టుపై కొత్త ప్రభుత్వం సంవత్సరానికి రూ.25,000 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. మరమ్మత్తుల ఖర్చును పరిగణనలోకి తీసుకుంటే మరో పదివేల కోట్లు ఖర్చు అవుతుంది.

ప్రాజెక్టు అనుకున్న విధంగా పనిచేసినా సమీప భవిష్యత్తులో ఈ ప్రాజెక్టు ద్వారా 18.2 లక్షల ఎకరాల అదనపు సాగునీటిని అందించడం అసాధ్యం. ఇంత పెద్ద ప్రాంతానికి ప్రాజెక్ట్ సాగునీరు అందించగలిగినప్పటికీ, ఒక్కో ఎకరానికి నీటి పంపిణీ ఖర్చు సులభంగా ఒక్కో పంటకు ఎకరాకు లక్షని మించిపోతుంది. కొత్త ప్రభుత్వానికి ఈ ప్రాజెక్టు పెనుభారం కానుంది. ఈ ప్రభుత్వం దీనిని వారసత్వంగా పొందింది. దీన్ని సరిగా అర్థం చేసుకోకపోతే ఇది ప్రభుత్వానికి గుదిబండ అవుతుంది. దీనిని ఎదుర్కోవడానికి ఒక వ్యవస్థ/ పథకాన్ని రూపొందించాలి.

కొత్త ప్రభుత్వం అస్తవ్యస్తంగా ఉన్న కాళేశ్వరం మౌలిక సదుపాయాలను సరిచేయడానికి ఏదైనా ప్రయత్నం చేసే ముందు ఈ క్రింది మూడు ప్రశ్నలపై స్పష్టమైన సమాధానాలకు, అవగాహనకు రావాలి. 1) మౌలిక సదుపాయాలు సాంకేతికంగా భద్రంగా, సురక్షితంగా ఉన్నాయా? 2) ప్రతి ఎకరానికి సాగునీటిని అందించడానికి సంవత్సరానికి ఎంత ఖర్చు అవుతుంది? 3) ప్రాజెక్ట్‌ను నిర్వహించడానికి ఎటువంటి సంస్థాగత యంత్రాంగం అవసరం?

ఈ ప్రశ్నలపై స్పష్టత పొందడానికి అత్యంత ప్రభావవంతమైన, హేతుబద్ధమైన మార్గం ప్రాజెక్ట్‌ను శాస్త్రబద్ధంగా సమీక్షించడానికి కమిషన్ ఏర్పాటు చేయడం. ప్రాజెక్ట్ సమగ్ర రూప అధ్యయనానికి మేము ఈ క్రింది ప్రక్రియను సూచిస్తున్నాం. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు, కొత్త ప్రభుత్వం కొత్త నిర్మాణాలను, భారీ వ్యయంతో కూడిన మరమ్మత్తులను చేపట్టకూడదు.

1) ఇప్పటికే ఉన్న మౌలిక సదుపాయాల సమీక్ష చేపట్టాలి. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మించిన నిర్మాణాల భద్రతను, సురక్షతను, విశ్వసనీయతను సమీక్షించడానికి రాష్ట్ర ప్రభుత్వం డ్యామ్ భద్రతా మండలిని, సెంట్రల్ వాటర్ కమిషన్‌ను సంప్రదించవచ్చు. లేదా అంతర్జాతీయ నిపుణలతో కూడిన సంస్థలను ఉపయోగించవచ్చు.

2) కాస్ట్ బెనిఫిట్ అనాలిసిస్ చేయించాలి. ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు (ADB) వంటి స్వతంత్ర అంతర్జాతీయ ఏజెన్సీ ప్రాజెక్ట్ నిర్వహణ, విద్యుత్ ఖర్చు, ఇతర నిర్వహణల ఖర్చు, అలాగే ప్రతి జిల్లాలో, మండలంలో, లేదా ప్రతి గ్రామంలో రైతులకు నీటి పంపిణీ ఖర్చులను సమీక్షిస్తుంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని ఏ భాగాలు అత్యంత ఉపయోగకరమైనవి, ఏ భాగానికి పునరావలోకన, పునఃవీక్షణ అవసరం అనే విధానపరమైన నిర్ణయాలను తీసుకోవడంలో ఇటువంటి సమీక్ష గణనీయంగా సహాయపడుతుంది.

3) రుణాన్ని పునర్వ్యవస్థీకరించాలి. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ కార్పొరేషన్, రుణాలు తీసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక స్పెషల్ పర్పస్ వెహికిల్ (SPV)ని ఏర్పరిచింది. ఈ రుణాలకు హామీగా రాష్ట్ర ప్రభుత్వం రుణాలను చెల్లించాల్సి ఉంటుంది. 2024 నుంచి వార్షిక చెల్లింపు వాయిదా సంవత్సరానికి రూ.13,000 కోట్లు. అనేక ప్రభుత్వ రంగ బ్యాంకులు, REC, NABARD ఎటువంటి సాంకేతిక, ఆర్థిక సమీక్ష లేకుండానే రుణాలు ఇచ్చాయి. ఈ SPV ప్రస్తుతం దాదాపుగా దివాలా తీసింది. దాని పైన ఎటువంటి ఆదాయం లేకుండా అస్తవ్యస్తంగా ఉంది. అందువల్ల రుణాన్ని, వడ్డీని తిరిగి రాయడానికి చర్చలు జరపమని తెలంగాణ ప్రభుత్వం ఈ సంస్థలను అడగాలి. ఈ ప్రక్రియను సులభతరం చేయడానికి రాష్ట్రం కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించవచ్చు.

4) ఈ ప్రాజెక్ట్ సమీక్ష, రుణ చర్చల ప్రక్రియతో వ్యవహరించడానికి ప్రత్యేక సంస్థాగత యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి.

5) దీనికి అదనంగా తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహితతో సహా ఎల్లంపల్లికి నీటిని తీసుకురావడానికి అవసరమైన సరికొత్త ఇన్‌టేక్ పాయింట్లను ఏర్పాటు చేయడానికి గల సాధ్యాసాధ్యాలను అంచనా వేసేందుకు అవసరమయిన సర్వేలను చేపట్టాలి.

కొత్త నివేదికల ఆధారంగా, ప్రస్తుత ప్రభుత్వం కొన్ని మార్గాలను ఎంపిక చేస్తున్నట్లు కనిపిస్తోంది. వీటిలో– ఎ) మొత్తం ప్రాజెక్ట్‌ను మూసివేయడం, బి) దెబ్బతిన్న భాగాలకు మరమ్మతులకు పెద్ద మొత్తంలో ఖర్చు చేయడం, సి) ఇతర ప్రాంతాల నుంచి నీటిని తీసుకురావడానికి కొత్త నిర్మాణాలను ప్రారంభించడం వంటివి ప్రధానంగా ప్రజా బాహుళ్యంలో చర్చకు వస్తున్నాయి. అటువంటి నిర్ణయాలు సమగ్ర సమీక్షా ప్రక్రియ నుంచి పురుడుపోసుకోవాలి. దీనికి ఆవల తీసుకున్న ఎటువంటి నిర్ణయాలైనా మరింత ఆర్థిక, కార్యాచరణ సమస్యలకు దారితీయవచ్చు.

కొత్త ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి నిధుల దుర్వినియోగాన్ని, ఇతర పరిపాలనా లోపాలను కనుక్కోవాలంటే, అది సాంకేతిక సమీక్షకు అదనంగా ఉండే ప్రత్యేక ప్రక్రియగా చేపట్టాలి. ఈ దిశగా తెలంగాణ రైతులు, ప్రజలు చాలా కాలంగా ఎదురుచూస్తున్నారు.

• డా. బిక్షం గుజ్జ
• డా. శివకుమార్ కనికే
(రచయితలు నీటి నిర్వహణ, హైడ్రాలజీ

పతనావస్థలో యూనివర్సిటీలు!

కుంచించుకుపోతున్న సమాజాలు వికసించాలంటే ప్రశ్నే ఆలంబనగా ఉండాలి. పరిమాణాత్మక మార్పు గుణాత్మకతను సంతరించుకోవాలంటే ఆయా సమాజాల పెనుగులాటలోని వైరుధ్యమే ఆయువుగా ఉంటుంది. మునుపటి సమాజంలోని ఉత్పత్తి సంబంధాలు భరించరానివిగా మారినప్పుడు జనసందోహంలో నుంచి కొత్త సమాజం పురుడు పోసుకుంటుంది. ఈ సామాజిక చలనాలన్నింటికీ ప్రశ్న చోదకశక్తిగా పనిచేస్తుంది. బానిస, ఫ్యూడల్ సమాజాలలో కూడా ఏలిక మీద ప్రజా సమూహం తమ అసమ్మతిని ప్రకటించింది. యూరప్ దేశాలలో పారిశ్రామిక విప్లవం తనకు కావలసిన శక్తిని పూర్వపు సమాజాల నుంచి పొందింది. అయితే కొత్తగా ఉనికిలోకి వచ్చిన ఉత్పత్తి సంబంధాలను వ్యాఖ్యానించి, నియంత్రించాలంటే అప్పటికి పెట్టుబడిదారి వర్గం ప్రోది చేసుకున్న జ్ఞానం సరిపోలేదు. కనుక సమాజం మూలాల్లో ఉన్న ఆలోచనలకు పదునుపెట్టింది. ఉత్పత్తి శక్తుల జీవితాలలో, ఆచరణలో కొనసాగుతుండిన ఆలోచనల ప్రవంతికి హేతుబద్ధ చర్చను తోడుచేసింది. ప్రాకృతిక జ్ఞానాన్ని సమ్మతించి విస్తృత పరిశోధనలకు పెట్టుబడిదారివర్గం బాటలు వేసింది. ఫలితంగా ప్రకృతి, సామాజిక శాస్త్రాల పురోగతిని ఈ కాలంలో మనం గమనించగలుగుతున్నాం. సమాజం నలుమూలల్లో చెల్లాచెదురుగా ఉన్న జ్ఞానానికి ఉమ్మడి ఆవరణం అవసరమొచ్చింది. ఈ ప్రశ్న నుంచే యూరప్ దేశాలలో ఆధునిక విశ్వవిద్యాలయాలు జీవం పోసుకున్నాయి.

ప్రశ్న వేసుకోవడం, సమస్యను గుర్తించడం, పరికరాలను రూపొందించుకొని పరిశోధించడమనే సంవిధానం నుంచి అభిలషణీయమైన ఫలితాలు వచ్చాయి. ఇట్లా విశ్వవిద్యాలయాలు అధ్యయనం, అధ్యాపనం, పరిశోధన అనే అంశాల మీద ప్రయాణించి పురోగమించాయి. జ్ఞానాన్ని సమాజం ఎల్లెడల వ్యాపించే కృషిలో విశ్వవిద్యాలయాలు భాగస్వామ్యం తీసుకున్నాయి. సమాజంలో ఉన్న ప్రశ్నలకు, ఆలోచనలకు విశ్వవిద్యాలయాలు కేంద్రంగా ఉన్నాయి. మన దేశంలోని నలంద, తక్షశిల విశ్వవిద్యాలయాలు కూడా ఆనాటి కులీన వర్గం ఆలోచనలకు ప్రతిబింబాలుగా ఉండేవి. ఇండియాలోకి బ్రిటిష్‌వాళ్లు పెట్టుబడితో పాటు ప్రవేశించారు. అప్పటికే ఇక్కడ ఘనీభవించిన భూస్వామ్యం అనేక అనుమానాలతో ఈస్టిండియా కంపెనీని ఆహ్వానించింది. తర్వాతి కాలంలో నిదానంగా బ్రిటిష్ పెట్టుబడితో ఇక్కడి భూస్వామ్యం స్నేహం చేసింది. అయితే బ్రిటిష్ పెట్టుబడి వర్గానికి ఇండియాలో నైపుణ్యం కలిగిన కార్మికవర్గం కొరత ఏర్పడింది. ఆ నైపుణ్యాలను అందించే పాఠ్యాంశాలు మన సంప్రదాయ విద్యలో లేకపోవడం వల్ల, పాఠ్యప్రణాళికలో, బోధనలో రావలసిన మార్పుల గురించి నాటి బ్రిటిష్ ప్రభుత్వం ఆలోచించింది. ఫలితంగా ఆంగ్ల విద్యకు ఇండియాలో పునాదులు పడ్డాయి. ఆంగ్ల విద్యను అభ్యసించిన మొదటితరం ఆలోచనా ప్రవంతిలో పెనుమార్పులు సంభవించాయి. తర్వాతి తరానికి మేధోపరమైన విద్యను గరపాలనే భావన పుట్టింది. ఇది గమనించిన బ్రిటిష్ ప్రభుత్వం 1857లో కలకత్తా, బొంబాయి, మద్రాస్ నగరాలలో మొదటిసారి విశ్వవిద్యాలయాలను ఏర్పాటుచేసింది. ఆధునిక విశ్వవిద్యాలయాల చరిత్ర ఇండియాలో ఇలా మొదలయింది.

దేశం నలుమూలల నుంచి వచ్చిన భూస్వాముల పిల్లలు తమ ఆలోచనలను, ప్రశ్నలను కలబోసుకోవడానికి విశ్వవిద్యాలయాలు వేదికలయ్యాయి. ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి మాత్రమే కాకుండా కొందరిలో స్పష్టమైన ప్రాపంచిక దృక్పథం కూడా ఇక్కడే రూపొందింది. అధ్యయన సంస్కారం వలన ముసిరిన అనేక ప్రశ్నలకు సమాధానాలు వెతికే క్రమంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదంలోని విస్తరణవాదాన్ని అర్థం చేసుకోగలిగారు. ఈ క్రమంలో ప్రశ్న నుంచి జనించిన అసమ్మతి మంద్రస్థాయిలోనైనా పోరాటరూపంగా మారింది. జాతీయోద్యమ భావాలు విస్తరించడానికి విశ్వవిద్యాలయాలు మూలమయ్యాయి. ఆధునిక విశ్వవిద్యాలయాలు సామాజిక చలనంలో ప్రధాన భూమికను పోషించాయి. సైద్ధాంతిక చర్చలకు, రాజకీయ ఆచరణకు, బరువైన సామాజిక కట్టుబాట్ల వ్యతిరేకతకు విశ్వవిద్యాలయాలు రంగాన్ని తయారుచేసాయి. ప్రజాస్వామిక భావాలు విస్తృతం కావడానికి దోహదం చేసాయి.

బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం (1916), ఉస్మానియా విశ్వవిద్యాలయం (1917) అనేక ప్రశ్నలను విద్యార్థులలో ప్రోదిచేసాయి. వందేమాతర ఉద్యమం, సహాయ నిరాకరణోద్యమం, నిజాం వ్యతిరేక పోరాటాలకు విశ్వవిద్యాలయాలు వేదికలయ్యాయి. నేరుగా పాలకవర్గాల మీద అనేక ప్రశ్నలను ఉంచడం, రాజకీయ ఆచరణను కలిగి ఉండటం నాటి అధ్యయనంలో భాగంగా ఉండేవి. సోషలిస్టు విప్లవాల ప్రభావంతో కొత్త కలల ప్రపంచాన్ని ఆవాహనం చేసుకోవడానికి కావలసిన దృష్టిని విశ్వవిద్యాలయాలు ఇచ్చాయి. మొన్నటి ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం పోషించిన పాత్రను ప్రపంచమంతా శ్లాఘించింది.

ప్రపంచీకరణ ఆర్థిక నమూనాలో తన ప్రాభవాన్ని కోల్పోయిన మొదటి సంస్థ ఉస్మానియా విశ్వవిద్యాలయమే. తొంభయ్యో దశకం తర్వాత ప్రభుత్వాల ప్రాధాన్యతలు మారిపోయాయి. విద్యారంగం మీద చేసే ఖర్చును భారంగా భావించే నాయకులు పాలకులుగా ఎదిగారు. ప్రభుత్వ విద్యారంగానికి సమాంతరంగా ప్రైవేట్ విద్యా మాఫియాను పాలకులే ప్రోత్సహిస్తూ వచ్చారు. చదువుల తల్లిని సంతలో పెట్టిన ప్రభుత్వ విధానాల మీద ప్రత్యేక తెలంగాణ ఉద్యమకాలంలో నాటి నాయకత్వం గంభీరమైన విమర్శను ఎక్కుపెట్టింది. కానీ రాష్ట్రం సిద్ధించాక విధాన నిర్ణయాలలో జరిగిన మార్పేమీ లేదు.



తొమ్మిదిన్నర ఏళ్ల కింద ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం సామాజిక, రాజకీయార్థిక స్థాయిని ఇక్కడి ఉన్నత విద్యారంగం ప్రతిబింబిస్తుంది. మునుపటి పాలకులను అనేక శాపనార్థాలు పెట్టిన ఏలిక, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత విశ్వవిద్యాలయాలను విస్మరించింది. తెలంగాణ సమాజపు రాజకీయార్థిక సమస్యలకు పరిష్కారం వెతకవలసిన ఉన్నత విద్యాసంస్థలు పతనావస్థకు చేరుకున్నాయి. ఉజ్వల గతాన్ని కీర్తిస్తూ అంపశయ్య మీద కొనప్రాణంతో మినుకు మినుకుమంటున్నాయి. కొత్త రాష్ట్రంలో సరికొత్త సంవిధానంతో సంవాదంలో ఉండవలసిన మేధోరంగాలు కురుచగా మారిపోతున్నాయి. ఒక సమాజపు సంస్కారాన్ని అంచనా వేయాలంటే అక్కడి విద్యారంగ స్థాయిని ప్రధాన ఆకరంగా తీసుకుంటారు. తెలంగాణ సమాజపు విలువకు క్షీణిస్తున్న విద్యావ్యవస్థే ప్రతిబింబం.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడేనాటికి ఉస్మానియా, కాకతీయ, తెలుగు, తెలంగాణ, శాతవాహన, మహాత్మాగాంధి, పాలమూరు విశ్వవిద్యాలయాలు ఏర్పడి ఉన్నాయి. ఇవి కాకుండా వ్యవసాయ, జేఎన్‌టీయు, ఫైన్‌ఆర్ట్స్, ఆర్‌జీకేటీయూ వృత్తి విద్యను నేర్పించే విశ్వవిద్యాలయాలు కూడా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పాత వాటికి పేర్లు మార్చటం మినహాయించి కొత్తగా చేసింది చెప్పుకోవడానికి ఏమీ లేదు. అదనంగా హెల్త్, అటవీ యూనివర్సిటీలను, ఉస్మానియా పరిధిలో ఉన్న కోఠి మహిళ కళాశాలను పేరు మార్చి ఏడాది కిందట తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంగా ఏర్పాటు చేసారు. తెలంగాణ సమాజం ఎదుర్కొనే సవాళ్లకు తగిన పరిష్కారాలను పరిశోధించి చెప్పవలసిన విశ్వవిద్యాలయాలు కేవలం డిగ్రీలను ప్రదానం చేసే పాత్రకే పరిమితమయ్యాయి. నాణ్యమైన బోధన, పరిశోధన గాలిలో దీపంలా ఉంది. పరిశోధనలో అంతర్జాతీయ ప్రమాణాలను నెలకొల్పిన ఉస్మానియా విశ్వవిద్యాలయం వరల్డ్ ర్యాంకింగ్‌లో పతనావస్థకు చేరుకున్నది. భౌతిక శాస్త్రంలో సూరిభగవంతం, అర్థశాస్త్రంలో సిహెచ్.హనుమంతరావు, సాహిత్యంలో సి.నారాయణరెడ్డిని అందించిన ఓయూ సంక్షోభంలోకి నెట్టబడింది. ప్రపంచీకరణ ఆర్థిక నమూనాలో తన ప్రాభవాన్ని కోల్పోయిన మొదటి సంస్థ ఉస్మానియా విశ్వవిద్యాలయమే. తొంభయ్యో దశకం తర్వాత ప్రభుత్వాల ప్రాధాన్యతలు మారిపోయాయి. విద్యారంగం మీద చేసే ఖర్చును భారంగా భావించే నాయకులు పాలకులుగా ఎదిగారు. ప్రభుత్వ విద్యారంగానికి సమాంతరంగా ప్రైవేట్ విద్యా మాఫియాను పాలకులే ప్రోత్సహిస్తూ వచ్చారు. ఇదంతా తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటి పూర్వపుస్థితి. చదువుల తల్లిని సంతలో పెట్టిన ప్రభుత్వ విధానాల మీద ప్రత్యేక తెలంగాణ ఉద్యమకాలంలో నాటి నాయకత్వం గంభీరమైన విమర్శను ఎక్కుపెట్టింది. కానీ రాష్ట్రం సిద్ధించాక విధాన నిర్ణయాలలో జరిగిన మార్పేమి లేదు.

తెలంగాణ సమాజంలో వేల సంవత్సరాలుగా గుడి, బడి విస్మరించిన సామాజిక సమూహాల నుంచి ఇప్పుడిప్పుడే విశ్వవిద్యాలయాల మెట్లు ఎక్కుతున్నారు. ముఖ్యంగా అమ్మాయిలు. కానీ ఈ వర్గాలను ఓటు బ్యాంకుగా భావించే పాలకులు వారికి నాణ్యమైన విద్యను అందించాలని భావించడం లేదు. తెలంగాణ రాష్ట్రంలోని భూమిపుత్రులకు సరైన జ్ఞానాన్ని అందిస్తే వాళ్లు సృష్టించే అద్భుతాల ముందు ఈ ప్రపంచం కురుచగా మారిపోతుంది. కానీ వారికి జ్ఞానబోధ చేయడానికి విశ్వవిద్యాలయాలలో గురువులే లేరు. తెలంగాణ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలలో ఇప్పటికే 2,152 ఆచార్యుల పోస్టుల ఖాళీలు ఉన్నాయి. ఓయులో 1268 ఆచార్యుల పోస్టులు ఉండవలసిన చోట కేవలం 350 మంది మాత్రమే పనిచేస్తున్నారు. రాష్ట్రంలోని చాలా విశ్వవిద్యాలయాల్లోనూ రెండంకెలకు మించి ఆచార్యులు లేరంటే సమస్య తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. 2018లోనే తెలంగాణ ప్రభుత్వం 1,061 ఆచార్యుల పోస్టులను మంజూరు చేసింది. కానీ ఐదేళ్లు గడిచినా అవి భర్తీకి నోచుకోలేదు. రాజకీయ ఉద్దేశ్యాలతో గవర్నర్ కార్యాలయంలో ఖాళీల ఫైలు ఏకాంత తపస్సు చేస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం కోరుకున్నది, గవర్నర్ కార్యాలయం చేసింది ఒకటే కావడం ఈ కాలపు మేధో విషాదం. ప్రభుత్వం విశ్వవిద్యాలయాలకు విదిలించే నిధులు జీతభత్యాలకు కూడా సరిపోని దుస్థితి ఉంది.

నిధుల, నియామకాల కొరత కొత్త ప్రభుత్వం ముందు సవాలుగా ఉంది. విద్యారంగం మీద చేసే ఖర్చు ప్రభుత్వానికి తక్షణంగా ఏ రకంగానూ లాభించదని గత ప్రభుత్వాలు భావించాయి. కనుక వారికది ప్రాధాన్యత లేని అంశంగా మారిపోయింది. నాణ్యమైన విద్య అనే డిమాండ్ ప్రజాక్షేత్రంలో లేకపోవడం వల్ల ఓట్లను ప్రభావితం చేసే అంశంగా కూడా కాలేకపోయింది. ఫలితంగా గత పాలకులు విద్యను విస్మరించారు. తెలంగాణ రాష్ట్రంలో అధికార మార్పిడి జరగడానికి యూనివర్సిటీ విద్యార్థులు పోషించిన పాత్ర తక్కువేమీ కాదని నేటి ముఖ్యమంత్రికి తెలుసు. తెలంగాణ సమాజంలో సర్వతోముఖాభివృద్ధి జరిగి ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే విశ్వవిద్యాలయాల పునాదులను ప్రభుత్వం పటిష్ఠం చేయాలి. తక్షణంగా ఓయూకు వెయ్యి కోట్లు, ఇతర విశ్వవిద్యాలయాలకు మరో 500 కోట్ల నిధులను కేటాయించాలి. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉపకారవేతనం మూడు వేలకు పెంచాలి. అధ్యాపకుల ఖాళీల భర్తీ ప్రక్రియను ప్రారంభించి మేధో సంపన్నులైన ఆచార్యులను ఎంపిక చేయాలి. ఎంపిక ప్రక్రియలో ఎలాంటి పక్షపాతం లేకుండా ప్రతిభకే ప్రాధాన్యత ఇవ్వాలి. విశ్వవిద్యాలయాలలో విలువల రాహిత్యానికి, అరాచకత్వానికి తావులేకుండా పరిపాలనా యంత్రాంగాన్ని సన్నద్ధం చేయాలి.

■ ప్రొఫెసర్ చింతకింది కాశీం

రెక్కలు విచ్చుకుని..

- నగరంలో అలరిస్తున్న ప్రత్యేక విమానాలు
- ఆకట్టుకున్న ఏవియేషన్ షో





రెక్కలు విచ్చుకుని నగరంలో వాలిన ప్రత్యేక విమానాలు ఏవియేషన్ షోలో సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. మొదటి రోజు మార్క్ జెఫ్రీస్, సారంగ్ బృందాల ఎక్రోబాటిక్స్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బుల్లి విమానాలతో జెఫ్రీస్ బృందం, హెచ్ఏఎల్ హెలికాప్టర్లతో సారంగ్ బృందం చేసిన విన్యాసాలు షోకు వచ్చిన వారినే కాదు.. చుట్టుపక్కల వారిని కూడా ఆనందపరిచాయి. దాదాపు 130 స్టాల్స్ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ప్రాంగణంలో విమాన విడిభాగాలు, ఇంజన్లు, డ్రోన్లు సహా ఈ రంగంలో అందించే సేవలు, రాబోతున్న ఆవిష్కరణలను సైతం పలు కంపెనీల ప్రతినిధులు ప్రదర్శిస్తున్నారు. - హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి)

విమానాలను సెల్‌ఫోన్‌లో బంధిస్తున్న సందర్శకురాలు





విమానాల వద్ద సెల్ఫీ తీసుకుంటూ..



భారీ విమానాన్ని పరిశీలిస్తున్న సందర్శకులు





విమానాల వద్ద యువతుల సందడి

టిప్పింగ్ కిరికిరిపై ఆరా..!

పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనం క్లిప్పింగ్

హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి విద్యుదుత్పత్తికి సంబంధించి టీఎస్ఎస్‌పీడీసీఎల్, ప్రైవేట్ ఏజెన్సీ మధ్య వివాదంపై జీహెచ్ఎంసీ స్పందించింది. 'టిప్పింగ్ కిరికిరి' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై కమిషనర్ రోనాల్డ్‌రోస్ స్పందించారు. వివరాలపై ఆరా తీసి సంబంధిత అధికారులతో వివాదంపైన చర్చించినట్టు తెలిసింది. దుండిగల్‌లోని చెత్త నుంచి విద్యుదుత్పత్తి ప్లాంట్ ప్రారంభానికి అవాంతరాల నేపథ్యంలో టిప్పింగ్ ఫీజు విషయమై నిబంధనల ప్రకారం నడుచుకోవాలని, డిస్కమ్‌తో వివాదాన్ని ఏజెన్సీ పరిష్కరించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించినట్టు తెలిసింది.

ప్లాట్లు డబుల్ రిజిస్ట్రేషన్ చేసిన వ్యక్తికి జైలు 6

రిపోర్ట్.. సీక్రెట్

- పూర్తిస్థాయిలో జీహెచ్ఎంసీ పంపలేదని అనుమానాలు
- కొందరికి మినహాయింపునిచ్చేలా మంత్రాంగం
- ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు
- రెగ్యులర్ అధికారులకు పని ఉండదు.. ఓఎస్‌డీలకు బాధ్యతలు

పదవీ విరమణ చేసి ప్రత్యేక విధుల్లో కొనసాగుతోన్న అధికారుల వివరాల్లో జీహెచ్ఎంసీ గోప్యం పాటిస్తుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. విశ్రాంత అధికారుల వివరాలు పంపాలని తాజాగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్ని విభాగాలను ఆదేశించారు. ఈ నేపథ్యంలో బల్దియా సర్కార్‌కు పంపిన నివేదికపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రిటైర్డ్ అధికారుల వివరాలు వెల్లడిలో గోప్యత



హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, జోనల్, సర్కిల్ కార్యాలయాల్లో పదవీ విరమణ చేసిన అనంతరం కొనసాగుతోన్న వారి వివరాలు సేకరించి పంపాల్సి ఉండగా జీహెచ్ఎంసీలోని పాలనా విభాగం అందుకు భిన్నంగా వ్యవహరించినట్టు తెలుస్తోంది. పూర్తిస్థాయి వివరాలు పంపకుండా.. కొందరి పేర్లు లేకుండా మంత్రాంగం నడిపారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గత సర్కార్ హయాంలో రిటైర్ అయిన అనంతరం జీహెచ్ఎంసీలో పలువురు అధికారులను ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ(ఓఎస్‌డీ)లుగా కొనసాగించారు. పలు దఫాలుగా వారి సేవలు గడువు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో రెండు నుంచి ఎనిమిదేళ్లుగా కొందరు అధికారులు ఓఎస్‌డీలుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఫిర్యాదుల నేపథ్యంలో కొత్తగా

మిగతా 6వ పేజీలో..



ఇందిరాపార్కు వద్ద ధర్నా చేస్తున్న కాంట్రాక్టర్లు

రోడ్డెక్కిన కాంట్రాక్టర్లు

- బకాయిలు చెల్లించాలని ధర్నా
- బల్దియా తీరుపై ఆగ్రహం

హైదరాబాద్ సిటీ/కవాడిగూడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): బకాయిల చెల్లింపులో బల్దియా తీరును నిరసిస్తూ కాంట్రాక్టర్లు రోడ్డెక్కారు. వందల కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెడితే ఎలా బతికేది..? పనులు చేసేదెలా..? అంటూ ఇందిరాపార్కు వద్ద గురువారం ధర్నాకు దిగారు. అధికారులు స్పందించని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యేడాదిగా బిల్లులు చెల్లించకపోవడంతో అప్పు చేసి పనులు చేసిన కాంట్రాక్టర్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక ఇబ్బందులతో కొందరు అనారోగ్యం పాలైతే.. ఒత్తిడి తట్టుకోలేక ఒకరిద్దరు ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు.

రోడ్లు, ఫుట్‌పాత్‌ల నిర్మాణం, మరమ్మతు, నాలాల పూడికతీత, పార్కుల్లో పాత్ వేల

మిగతా 6వ పేజీలో..

'స్పెషల్' మిలాఖత్

లా అండ్ ఆర్డర్‌తో ఎస్‌బీ సిబ్బంది దోస్తీ

- అక్రమాలు, అవినీతిలో వాటాలు
- ఉన్నతాధికారులకు తప్పుడు రిపోర్టులు
- కోట్లు పోగేసుకుంటున్న వైనం
- ఏళ్ల తరబడి ఒకేచోట పోస్టింగ్
- త్వరలో ప్రక్షాళనకు రంగం సిద్ధం ?



అక్రమాలను, అన్యాయాలను తెలుసుకోవాలి.. అధికారుల పనితీరుపై నిఘా పెట్టాలి.. తప్పుడు మార్గాలను అనుసరిస్తున్న వారి వివరాలను నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు అందజేయాలి.. ఇదీ మూడో నేత్రంగా పనిచేసే స్పెషల్ బ్రాంచ్(ఎస్‌బీ) సిబ్బంది విధి. కానీ.. వారి పనితీరు క్రమంగా మారుతోంది. అన్యాయంగా వ్యవహరించే కొందరు లా అండ్ ఆర్డర్ పోలీసులతో మిలాఖత్ అవుతూ వాటాలు పంచుకుంటున్నారు. ఉన్నతాధికారులకు తప్పుడు నివేదికలు అందజేస్తున్నారు. ట్రై కమిషనరేట్ పరిధుల్లో ఇటీవల కొత్తగా వచ్చిన పోలీస్ బాసులు ఈ విషయాలను గుర్తించి పలువురిని సస్పెండ్ చేశారు. అలాగే ఎస్‌బీ సిబ్బంది పనితీరుపై నిఘా పెట్టినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మూడు కమిషనరేట్ల పరిధిలోని స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ) సిబ్బంది పనితీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొంత మంది ఎస్‌బీ సిబ్బంది అక్రమార్కులకు కొమ్ము కాస్తున్నారు. అందుకే పోలీస్ అధికారుల అక్రమాలు, అరాచకాల గురించి ఆరోపణలు బయటకొచ్చినా, ఏదైనా మీడియాలో కథనాలు వచ్చినా ఎస్‌బీ సిబ్బంది నానా హైరానా పడతారు. హడావిడిగా తెలిసిన వ్యక్తులందరికీ ఫోన్లు చేసి, ఏ ఇన్‌స్పెక్టర్..? ఎక్కడ అక్రమాలు జరిగాయి..? సమాచారం ఎలా వచ్చింది? మాకు కూడా చెప్పండి అంటూ ఆరా తీస్తారు. ఆ తర్వాత అక్రమ అధికారులతో మిలాఖత్ అవుతారు. ఆరోపణలన్నీ ఫేక్ అని, కావాలనే మీడియాలో రాశారని, ఎలాంటి ఆధారాలు లేవంటూ ఉన్నతాధికారులకు తప్పుడు రిపోర్టు ఇచ్చి అక్రమార్కులకు కొమ్ము కాస్తున్నట్లు తెలిసింది. ఇటీవల ఎల్‌బీనగర్ జోన్, మహేశ్వరం జోన్ పరిధిలోని కొందరు పోలీస్ అధికారులపై ఆరోపణలు వచ్చినా.. క్షేత్రస్థాయి ఎస్‌బీ అధికారులు మాత్రం తప్పుడు నివేదికలు

మిగతా 8వ పేజీలో..

పలువురు ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం

- ఆదేశాలు జారీ చేసిన రాచకొండ సీపీ 6



నిందితురాలితో జీఆర్‌పీ పోలీసులు

90 కిలోల గంజాయి పట్టివేత

- సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో 46 కిలోలు
- ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డులో 44 కిలోలు..
- రెండు ఘటనల్లో నలుగురు నిందితుల అరెస్ట్

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్/శంకర్‌పల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పోలీసులు 90 కిలోల గంజాయిని పట్టుకున్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లోని ఓ యువతి వద్ద 46 కిలోలు, ఇంద్రారెడ్డినగర్ ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డులో ముగ్గురు వ్యక్తుల వద్ద 44 కేజీల గంజాయిని పట్టుకుని సీజ్ చేశారు. సికింద్రాబాద్ రైల్వే ఎస్సై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 16న ఓ యువతి నాలుగు బ్యాగులలో 46 కిలోల గంజాయి సరుకుతో పలాస రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరి బుధవారం(17వ తేదీ) ఉదయం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో దిగింది. అయితే, అప్పటికే ఆమె ఎక్కాల్సిన సికింద్రాబాద్-ముంబై దేవగిరి రైలు వెళ్లిపోవడంతో

మిగతా 6వ పేజీలో..

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం 8

లేని తహసీల్దార్ పేరుతో కులధ్రువపత్రం 7

డాక్టర్ ఇంట్లో ప్రమాదకర మత్తు ఇంజక్షన్లు 7



విద్యుత్ కార్మిక డిమాండ్ల పరిష్కారానికి కృషి

రాంనగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగ సంస్థలో పనిచేస్తున్న కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు కృషి చేస్తానని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యుత్ రంగం అప్పుల పాలు చేశారని ఆరోపించారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవన్‌లో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ 327 (ఐఎన్‌టీయూసీ అనుబంధం) రూపొందించిన నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్యఅతిథులుగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి, ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, యూనియన్ సెక్రటరీ జనరల్ ఇ.శ్రీధర్‌లు హాజరై ఆవిష్కరించారు. అనంతరం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కేసీఆర్‌తో టచ్‌లో ఉన్నారని మాట్లాడుతున్న బీఆర్ఎస్, బీజేపీ నేతలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖను 80 వేల కోట్ల అప్పుల పాలు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని విమర్శించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం.వి.రాఘవరెడ్డి, సురేష్‌కుమార్, మహేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, మాజీద్, మాధవరావు, భూపాల్‌రెడ్డి, గోవిందరాజు, వెంకటేశం పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తదితరులు

22 నుంచి ఉచిత ప్లాస్టిక్ సర్జరీ

● గ్రహణ మొర్రి, కాలిన గాయాలకు శస్త్ర చికిత్స

హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాంకీ ఫౌండేషన్, లయన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ గ్రీన్‌ల్యాండ్స్, పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ సంయుక్త సహకారంతో ఈనెల 22 నుంచి ఫిబ్రవరి 5 వరకు ఉచిత మెగా ప్లాస్టిక్ సర్జరీ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రహణం మొర్రి, కాలిన గాయాలు, ప్రమాదాల కారణంగా ఏర్పడ్డ మచ్చలు, ఇతర మచ్చలకు ఉచితంగా శస్త్ర చికిత్స నిర్వహించనున్నట్టు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లోని ప్రజల కోసం 22 సంవత్సరాలుగా ఉచిత ప్లాస్టిక్ సర్జరీ క్యాంప్‌లు నిర్వహిస్తున్నామని పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ నిర్వాహకులు గద్దె భాస్కర్ తెలిపారు. 20 ఏళ్లలో 3 వేల మందికి ప్లాస్టిక్ సర్జరీలు నిర్వహించామని డాక్టర్ భవానీప్రసాద్, డాక్టర్ సుదర్శన్‌రెడ్డి, రామ్‌కీ ఫౌండేషన్ ప్రెసిడెంట్ ముప్పా రాంరెడ్డి, డాక్టర్ గులాబ్‌రాణి తెలిపారు. క్యాంపులో ఉచిత శస్త్ర చికిత్సతో పాటు వసతి, భోజనం, మందులు అందిస్తామని తెలిపారు. అవసరమున్న వారు 7816079234, 9848241640 నెంబర్లలో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

90 కిలోల గంజాయి పట్టివేత

(5వ పేజీ తరువాయి)

రైల్వేస్టేషన్‌లోని 6వ నంబర్ ప్లాట్‌ఫాంపై బ్యాగులతో నిలబడింది. అదే సమయంలో సికింద్రాబాద్ జీఆర్‌పీ, ఆర్పీఎఫ్ పోలీసులు సంయుక్తంగా చేపట్టిన తనిఖీల్లో ఆ యువతి వద్దనున్న బ్యాగుల్లో 46 కిలోల పొడి గంజాయి ఉన్నట్లు గుర్తించారు. గంజాయిని స్వాధీనం చేసుకున్న రైల్వే పోలీసులు నిందితురాలిని రిమాండ్‌కు తరలించారు. అయితే, సరుకును తీసుకెళ్లి రిసీవర్లకు ఇవ్వడం మాత్రమే ఆ యువతి పని అని, అందుకు ఆమెతో బ్రోకర్లు ఒప్పందం కుదుర్చుకున్నారని దర్యాప్తులో తేలినట్లు తెలిసింది. ఆమె సరుకు తీసుకొని రైలు ఎక్కగానే ఏ బోగీలో ప్రయాణించేది రిసీవర్లకు వాట్సాప్ ద్వారా సందేశం వెళ్తుంది. ఆ సమాచారం ప్రకారం సదరు వ్యక్తులు వచ్చి సరుకు తీసుకుంటారు. ఈ వ్యవహారంలో సూత్రధారులెవరో యువతికి తెలియదని తెలుస్తోంది. ఆ వివరాల కోసం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మరో ఘటనలో రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మోకిల సీఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రారెడ్డినగర్ ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో ముగ్గురు వ్యక్తుల వద్ద గంజాయి ఉన్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దాంతో అక్కడి వెళ్లి తనిఖీ చేయగా, ముగ్గురి వద్ద సంచులు లభించాయి. వాటిలోని బ్రౌన్ కలర్ పార్సిల్ ప్యాకెట్లలో గంజాయి ఉన్నట్లు గుర్తించి సీజ్ చేశారు. నిందితులు గజానంద్ సుభాష్, గోవింద్ ధారాసింగ్, శిల్పా గజానంద్‌లను రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రాచకొండలో పలువురు ఇన్‌స్పెక్టర్ల బదిలీ

హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాచకొండ కమిషనరేట్ పరిధిలో పలువురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ సీపీ సుధీర్‌బాబు ఆదేశాలు జారీ చేశారు. సైబర్ క్రైం స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న నందీశ్వర్ రెడ్డిని నాచారం పోలీస్‌స్టేషన్‌కు, కుషాయిగూడ ట్రాఫిక్ 2లో విధులు నిర్వహిస్తున్న వై.రవీందర్‌ను చర్లపల్లికి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.ఎలక్షన్ రెడ్డిని ఉప్పల్‌కు, సైబర్ క్రైంలో పనిచేస్తున్న బి.రాజును పోచారం ఐటీ కారిడార్ స్టేషన్‌కు, భువనగిరి రూరల్ ఇన్‌స్పెక్టర్ బి.సత్యనారాయణను మల్కాజిగిరికి, ఇబ్రహీంపట్నం ఇన్‌స్పెక్టర్ ఆర్.గోవిందరెడ్డిని మేడిపల్లికి, పోచారం ఐటీ కారిడార్ ఇన్‌స్పెక్టర్ వి.అశోక్ రెడ్డిని ఎస్‌ఓటీ 2కు, మంచాల స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఎం.కాశీవిశ్వనాథ్‌ను మీర్‌పేటకు, మీర్‌పేట ఇన్‌స్పెక్టర్ కె.కిరణ్‌కుమార్‌ను సైబర్‌క్రైం ఠాణాకు బదిలీ చేశారు. వెయిటింగ్‌లో ఉన్న పి.ఆంజనేయులును ఇబ్రహీంపట్నం ఇన్‌స్పెక్టర్‌గా, నాచారం ఇన్‌స్పెక్టర్ ఎం.ప్రభాకర్ రెడ్డిని సైబర్ క్రైం స్టేషన్‌కు, మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ పి.సైదులును స్పెషల్ బ్రాంచ్‌కు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ బి.రవికుమార్‌ను వనస్థలిపురానికి, చర్లపల్లి ఇన్‌స్పెక్టర్ వై.మల్లికార్జున్ రెడ్డిని సైబర్ క్రైం ఠాణాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎమ్మెల్యే రాజాసింగ్‌కు బెదిరింపు కాల్స్‌పై దర్యాప్తు ప్రారంభం

మంగళ్‌హాట్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు రాజాసింగ్‌కు వచ్చిన బెదిరింపు కాల్స్ వ్యవహారంలో మంగళ్‌హాట్ పోలీసులు స్పందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కొన్ని రోజులుగా గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు కొంతమంది ఫోన్ చేస్తూ శ్రీరామనవమి శోభాయాత్ర నిర్వహిస్తే చంపుతామంటూ బెదిరించారు. ఇదే విషయమై రాజాసింగ్ నగర కమిషనర్‌తోపాటు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. తాజాగా గత రెండు రోజుల క్రితం సైతం ఓ వ్యక్తి ఫోన్ చేసి హైదరాబాద్‌లోనే చంపుతానంటూ చాలెంజ్ చేయడంతో అదే విషయాన్ని రాజాసింగ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ అంశంపై స్పందించిన మంగళ్‌హాట్ పోలీసులు కేసు నమోదు చేసి వాటిపై ఆరా తీస్తున్నారు.

ప్లాట్లు డబుల్ రిజిస్ట్రేషన్ చేసిన వ్యక్తికి జైలు

రంగారెడ్డి కోర్టులు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): డబుల్ రిజిస్ట్రేషన్ చేసి ప్లాట్లు ఆక్రమించిన వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ మేడ్చల్ మల్కాజిగిరి కోర్టు నాలుగో అదనపు న్యాయాధికారి తీర్పు ఇచ్చారు. ఘట్‌కేసర్ చెంగిచెర్ల ప్రాంతానికి చెందిన కొత్త రమేష్ ప్లాట్లను డబుల్ రిజిస్ట్రేషన్ చేసి ఆక్రమించేందుకు యత్నించాడు. దీంతో అతడిపై 2015లో మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు చార్జిషీట్ దాఖలు చేయగా, సాక్షులను విచారించిన న్యాయాధికారి.. నిందితుడు రమేష్‌కు మూడేళ్ల జైలుశిక్షతోపాటు రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

రిపోర్ట్.. సీక్రెట్

(5వ పేజీ తరువాయి)

కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం పదవీ విరమణ చేసి విధుల్లో కొనసాగుతోన్న అధికారుల విషయంలో కీలక నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించినట్టు సమాచారం. ఈ క్రమంలోనే సీఎస్ విభాగాల వారీగా వివరాలు తీసుకున్నట్టు తెలిసింది.

అత్యంత గోప్యంగా వివరాలు..

జీహెచ్ఎంసీలో ఎంతమంది విశ్రాంత అధికారులు ఉన్నారనే విషయాన్ని సంస్థ అత్యంత గోప్యంగా ఉంచుతోంది. వివరాలు బయటకు రాకుండా ఉన్నతాధికారులు వ్యవహరిస్తోన్న తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అదనపు కమిషనర్లుగా పదవీ విరమణ చేసిన ఇద్దరు, చీఫ్ ఇంజనీర్ ఒకరు, ఎన్నికల విభాగంలో ఇద్దరు, కమిషనర్, మేయర్ కార్యాలయాల్లో ఓఎస్‌డీలుగా ఇద్దరు, పట్టణ ప్రణాళికా విభాగంలోని ఏసీపీ కేడర్‌లోనూ ఒకరు, కార్యదర్శి కార్యాలయంలో ఒకరు, ఆస్తుల సేకరణ విభాగంలో డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్లుగా కొందరు పదవీ విరమణ చేసిన వారు విధుల్లో కొనసాగుతున్నారు. వీరితోపాటు జోనల్, సర్కిల్ కార్యాలయాల్లోనూ పలువురు అధికారులు పదవీ విరమణ చేసిన అనంతరం విధుల్లో కొనసాగుతున్నారు. గతంలో కమిషనర్లు, అదనపు, జోనల్ కమిషనర్లుగా పనిచేసి వెళ్లిన, ప్రస్తుతం సంస్థలో కొనసాగుతోన్న కొందరు అధికారులు ఇతర విభాగాల నుంచి డిప్యూటేషన్‌పైన, అవుట్ సోర్సింగ్ విధానంలో పలువురిని జీహెచ్ఎంసీకి తీసుకొచ్చారు. వీరిలో పలువురు ఓఎస్‌డీలు ఉండడం గమనార్హం. అధికారులు బదిలీపై వెళ్లినా.. వారు వెంట తీసుకువచ్చిన ఉద్యోగులు ఇప్పటికీ బల్దియాలోనే కొనసాగుతున్నారు. వీరికి పూర్తిస్థాయిలో విధులు లేనప్పటికీ.. వేతనాలు చెల్లిస్తున్నారు. ఓఎస్‌డీలుగా ఉన్న అధికారుల కేడర్‌ను బట్టి వాహనం, అటెండర్లు, ఇతరత్రా సదుపాయాలు కల్పిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సంస్థకు ఇది అదనపు భారంగా మారుతోంది. రెగ్యులర్ అధికారులు, ఉద్యోగులకు ఎలాంటి విధులు కేటాయించకుండా.. పదవీ విరమణ చేసిన వారికి బాధ్యతలు అప్పగించి కొనసాగిస్తుండడం గమనార్హం.

రోడ్డెక్కిన కాంట్రాక్టర్లు

(5వ పేజీ తరువాయి)

నిర్మాణం వంటి పనులను జీహెచ్ఎంసీ వద్ద నమోదు చేసుకున్న కాంట్రాక్టర్లు చేస్తుంటారు. గతంలో వీరికి పనులు చేసిన అనంతరం ఒకటి, రెండు నెలల్లో బిల్లులు చెల్లించే వారు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో బకాయిలు పేరుకుపోయాయి. వేతనాల చెల్లింపునకే ఇబ్బందులు పడుతోన్న సంస్థ.. ఆయా పనులకు సంబంధించిన బిల్లులను పెండింగ్‌లో పెట్టింది. గతేడాది ఫిబ్రవరి నుంచి ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. సంవత్సర కాలంగా దాదాపు రూ.వెయ్యి కోట్ల బకాయిలున్నాయి. గతంలో పలుమార్లు సమ్మె చేపట్టినప్పుడు పాక్షికంగా బిల్లులు చెల్లించారు. సంస్థకు వస్తోన్న ఆదాయంతో పోలిస్తే వేతనాలు, అప్పులకు వడ్డీ, నిర్వహణ పనులకు వెచ్చిస్తోన్న నిధులు ఎక్కువగా ఉండడంతో బిల్లులు పెండింగ్‌లో పెట్టారు. దీంతో ఇప్పటికే మెజార్టీ పనులు నిలిచిపోయాయి. బకాయిలు చెల్లిస్తే కానీ పనులు చేసేది లేదని గతంలోనే కాంట్రాక్టర్ల సంఘం అధికారులకు అల్టిమేటం జారీ చేసింది. అయి నా, మేమేం చేయలేమంటూ యంత్రాంగం చేతులెత్తేసింది. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తేగానీ బిల్లులు చెల్లించే పరిస్థితి ప్రస్తుతానికి లేదని ఆర్థిక విభాగం వర్గాలు పేర్కొన్నాయి. ఆర్థిక సంవత్సరాంతం నేపథ్యంలో ఆశించిన స్థాయిలో ఆస్తిపన్ను వసూలైతే కొంతమేర బకాయిలు చెల్లిస్తామని చెప్పారు.

ఆందోళన ఉధృతం

ధర్నా వద్ద కాంట్రాక్టర్లు గుంటి సాయికిరణ్, ఎస్.భాస్కర్‌రావు, ఆర్.హనుమంత్‌సాగర్, పి.శ్రీశైలం, జి.శ్రీనివాస్‌రెడ్డి, ముజీబ్ తదితరులు మాట్లాడారు. గతేడాది ఫిబ్రవరి నుంచి బిల్లులు చెల్లించడం లేదని ఆరోపించారు. దాదాపు 700 కుటుంబాలు బిల్లులపై ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. ఎలక్ట్రిసిటీ, బయో డైవర్సిటీ కాంట్రాక్టర్లు బిల్లులు చెల్లించకుండా అడ్వర్టైజ్‌మెంట్, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లిస్తున్నారని వారు తెలిపారు. సివిల్ పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులోనూ తీవ్ర జాప్యం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలు చెల్లించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నాలాల సమస్యను పరిష్కరించేందుకు కృషి


కార్వాన్‌లో పర్యటిస్తున్న జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రోస్, ఎమ్మెల్యే కౌసర్

కార్వాన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నాలాల సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ చెప్పారు. గురువారం కార్వాన్ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్‌తో కలిసి ఆయన పర్యటించారు. నాలాలను, పైప్‌లైన్, బీటీ రోడ్డు, మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. నాలాల సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో కార్వాన్, నానాల్ నగర్ కార్పొరేటర్లు స్వామియాదవ్, నసీరుద్దీన్, జోనల్ కమిషనర్, అధికారులు, మజ్లిస్ నాయకులు పాల్గొన్నారు.

జల్సాల కోసం ద్విచక్ర వాహనాల చోరీ

● ఐదుగురి అరెస్ట్, వారిలో ఇద్దరు మైనర్లు ● 6 బైకులు స్వాధీనం

మదీన, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జల్సాల కోసం బైక్‌లు చోరీ చేస్తున్న ఐదుగురిని చాంద్రాయణగుట్ట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల్లో ఇద్దరు మైనర్లు ఉన్నారు. గురువారం చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ కె.మనోజ్ కుమార్ ఇన్‌స్పెక్టర్ కె.గురునాథ్‌తో కలిసి వివరాలను వెల్లడించారు. గోల్కొండ ప్రాంతానికి చెందిన మహ్మద్ అజీజ్(19)చికెన్ సెంటర్‌లో పనిచేస్తుంటాడు. ఛత్రినాకకు చెందిన మహ్మద్ మేరాజ్ షరీఫ్(20), జీఎం చావునికి చెందిన మహ్మద్ జానీపాషా(21) సేల్స్‌మన్. వీరితోపాటు మరో ఇద్దరు మైనర్లు ముఠాగా ఏర్పడ్డారు. వారి సంపాదన జల్సాలకు సరిపోకపోవడంతో చోరీలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఇళ్లు, దుకాణాల ముందు పార్కు చేసిన బైక్‌లను చోరీలుచేసి, వాటిని అమ్మి వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తుంటారు. సమాచారం అందుకున్న చాంద్రాయణగుట్ట పోలీసులు ఐదుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 6 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని జైలుకు తరలించగా, ఇద్దరు మైనర్లను జువైనల్ హోంకు తరిలించారు. సమావేశంలో చాంద్రాయణగుట్ట డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్, డీఎస్ఐ హుస్సేన్ పాల్గొన్నారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

చాంద్రాయణగుట్ట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గుట్టు చప్పుడుకాకుండా పేకాడుతున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.26,170, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వట్టేపల్లికి చెందిన సయ్యద్ అన్వర్ అలియాస్ అన్ను ఫలక్‌నుమ పాతిమానగర్‌లో గదిని అద్దెకు తీసుకొనిగుట్టు చప్పుడుకాకుండా పేకాట నిర్వహిస్తున్నాడు. సమాచారమందుకున్న ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర తన సిబ్బందితోవెళ్లి ఇంటిపై దాడి చేసి నిర్వహకుడు సయ్యద్ అన్వర్‌తోపాటు మహ్మద్ రియాజ్, షేక్ అహ్మద్, హాజీ ఉద్దీన్‌లను అరెస్ట్ చేశారు. కాగా పేకాట నిర్వాహకుడు సయ్యద్ అన్వర్ పాత నేరస్థుడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం


హసీనా

పహాడిషరీఫ్ జనవరి 18(ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకోవడం ఇష్టంలేని యువతి అదృశ్యమైంది. పహాడి షరీఫ్ పోలీసులు వివరాల ప్రకారం.. తుక్కుగూడకు చెందిన షేక్ మీరాబీ, అనీష్ భార్యాభర్తలు. ఇద్దరు పళ్ల వ్యాపారం చేస్తుంటారు. రెండో కుమార్తె హసీనా(21)కు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. తనకు ఇప్పుడు పెళ్లి వద్దని హసీనా తల్లిదండ్రులతో చెప్పింది. ఈ నెల 17న హసీనా పళ్ల బండి వద్దకు వెళ్లగా, తల్లిదండ్రులు ఫోన్‌చేసి ఇంటికి రమ్మన్నారు. హసీనా ఇంటికి రాకపోవడంతో బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం తల్లి పహాడిషరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకున్న దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ సెంటర్లపై పోలీసుల దాడులు

నార్సింగ్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): హైదర్షాకోట్ సన్‌సిటీ ప్రాంతంలోని పలు రీఫిల్లింగ్ దుకాణాలపై గురువారం ఎస్‌వోటీ పోలీసులు దాడులు చేశారు. రీఫిల్లింగ్ చేస్తున్న సిలిండర్‌లను సీజ్ చేశారు. అనంతరం కేసును నార్సింగ్ పోలీసులకు అప్పగించారు. కేసు విచారిస్తున్నామని, వివరాలు త్వరలో వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

సమయపాలన పాటించని హోటళ్లు, రెస్టారెంట్లపై కేసులు

మంగళ్‌హాట్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): సమయపాలన పాటించని హోటళ్లు, రెస్టారెంట్లపై ఆబిడ్స్ పోలీసులు కేసులు నమోదు చేశారు. హోటళ్లకు సంబంధించిన అనుమతి పత్రాలను సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. ఆబిడ్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అర్ధరాత్రి 12 గంటల దాటిన తరువాత కూడా కొన్ని రెస్టారెంట్లు, హోటళ్లు తెరిచి ఉంటున్నాయని సమాచారం అందడంతో గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఆబిడ్స్‌లోని కృపా, ఆర్కే, సంతోష్ బాలాజీ దాబా, రాయల్ టిఫిన్ సెంటర్లపై కేసులు నమోదు చేశామని వారు తెలిపారు. ఆబిడ్స్ ఇన్‌స్పెక్టర్ టి. నరసింహ రాజు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే నిర్వాహకులపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. సమయపాల పాటించని హోటళ్లు, రెస్టారెంట్ యజమానులపై పోలీసులు నిఘా ఉంటుందని చెప్పారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో చోరీ

● హుండీ పగులగొట్టి నగదు అపహరణ


పగులగొట్టిన హుండీ

నార్సింగ్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మంచిరేవులలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో హుండీని పగులగొట్టి నగదును అపహరించుకు పోయారు. బుధవారం రాత్రి 9, 10 మధ్యలో ఓ ఆగంతుకుడు ఆలయం గోడ దూకి లోపలికి ప్రవేశించారు. ఉదయం ఆలయం తెరిచేందుకు వచ్చిన పూజారులు విషయాన్ని నార్సింగ్ పోలీసులకు సమాచారం అందించారు. చోరీ చేసిన సమం, హుండీ పగలగొట్టిన దృశ్యాలు ఆలయంలోని సీసీ కెమెరాలో నమోదు రికార్డు అయ్యాయి. క్లూస్ టీమ్‌ను రప్పించిన పోలీసులు ఆధారాలు సేకరించారు. అయితే రాత్రి 10 గంటలు లోపే చోరీ జరిగినప్పటికీ తమకు ఎలాంటి శబ్ధం రాలేదని, ఆ సమయంలో పక్కన మల్లన్న ఆలయంలో ఉత్సవాలు జరుగుతున్నాయని, డప్పుల చప్పుడుకు హుండీ పగలగొట్టిన శబ్ధం రాలేదని విలేకర్ల అడిగిన ప్రశ్నకు ఆలయ పూజారి శ్రీనివాస్ చారి సమాధానం ఇచ్చాడు.

ఊరెళొచ్చే సరికి ఇళ్లు గుల్ల

● బెడ్రూంలోని రూ. 11 లక్షలు కాజేత


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ లక్ష్మీనారాయణ, చిత్రంలో నిందితులు, స్వాధీనం చేసుకున్న నగదు

నార్సింగ్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఊరెళ్లి వచ్చేసరికి ఇంట్లో నగదను కాజేశారు. వేసిన తాళం వేసినట్టే ఉంది. ఫీల్‌గుడ్ హోంలో నివాసముంటున్న బామిని రాధకృష్ణకు సంగారెడ్డి జిల్లా పసలాద్విలో పెట్రోల్ బంకు ఉంది. రోజు వారి కలెక్షన్ డబ్బు రూ.11 లక్షలు తీసుకొచ్చి ఇంట్లో బెడ్రూంలో పెట్టాడు. ఈ నెల 14న కుటుంబ సభ్యులతో కలసి సొంతూరు తొగరపల్లికి వెళ్లాడు. 17న తిరిగి ఇంటికి వచ్చిన అతడికి బెడ్రూంలోని కప్‌బోర్డులు పెట్టిన డబ్బులు కనిపించలేదు. బాధితుడు గురువారం నార్సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన వద్ద పనిచేస్తున్న అలవర్తి రవి, కల్లపల్లి సుధాకర్‌పైన అనుమానం ఉన్నదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు రవి, సుధాకర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం చేసినట్టు అంగీకరించారు. వారి నుంచి రూ. 10.35 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.


చాంద్రాయణగుట్ట చౌరస్తాలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాగు నగేష్ తదితరులు



కుమ్మరివాడి కాలనీలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సమీఉద్దీన్ రఫీ, శ్రావణ్‌కుమార్, వెంకటరమణ, వెంకట్ సాయి, వరుణ్, యదిలాల్, అజయ్, సత్యకృష్ణ, శంకర్ ముదిరాజ్, కిషన్‌నాయక్, మణి, సాయి తదితరులు

మహనీయుడుకి ఘన నివాళి

బలహీన వర్గాల ఆశాజ్యోతి ఎన్టీఆర్: మ్యాడం రామేశ్వర రావు


హైదర్‌గూడ చౌరస్తాలో ఎన్‌టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మ్యాడం రామేశ్వర్‌రావు, తదితరులు

రాజేంద్రనగర్/చార్మినార్/చాంద్రాయణగుట్ట, జనవరి18(ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) వర్ధంతిని టీడీపీ నాయకులు, ఎన్టీ రామారావు అభిమానులు ఘనంగా జరుపుకొన్నారు. టీటీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మ్యాడం రామేశ్వర్‌రావు ఆధ్వర్యంలో గురువారం రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్‌గూడలో టీడీపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మ్యాడం రామేశ్వర్‌రావు మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా, పేదల పెన్నిదిగా ఎన్టీఆర్ పనిచేశారన్నారు. ఆయన హయాంలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని, తెలుగుజాతీ కీర్తి ప్రతిష్టలను ప్రపంచానికి చాటిని గొప్ప నేత ఎన్‌టీఆర్ అని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సోమారం రాజ్‌కుమార్, ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, టి.మధుకర్, మహ్మద్ ఆజం హష్మీ, కె.తామోదన్‌రావు, జి.రాఘవులు, రఘురాజ్ గౌడ్, ఎం.జయవంత్‌రావు, సోమేశ్ గౌడ్, ఇ.మురళీ, రాజు తదితరులు పాల్గొన్నారు.

చాంద్రాయణగుట్టలో...

చాంద్రయణగుట్ట నియోజకవర్గ ఇన్‌చార్జి నాగు నగేష్ ఆధ్వర్యంలో చాంద్రాయణగుట్ట చౌరస్తా, రక్షపురం కాలనీ, కుమార్‌వాడి కాలనీ, ఈది బజార్‌లో టీడీపీ జెండా ఆవిష్కరించి, ఎన్టీఆర్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీనీ నాయకులు సమీఉద్దీన్ రఫీ, ఎన్టీఆర్ అభిమాన సంఘం నగర కార్యదర్శి శ్రావణ్ కుమార్, గాజుల వెంకట్ రమణ,వెంకట్ సాయి వరుణ్ యదిలాల్, అజయ్,సత్య కృష్ణ,శంకర్ ముదిరాజ్ కిషన్ నాయక్, మని సాయి పాల్గొన్నారు.లాల్‌దర్వాజ మోడ్ వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెద్దోజు రవీంద్రచారి, జోగేంద్ర సింగ్, కె.శ్రీకాంత్, చంద్రకుమార్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి


టౌన్‌ప్లానింగ్ సిబ్బందితో సమావేశమైన డిప్యూటీ కమిషనర్ కె.రవి కుమార్

రాజేంద్రనగర్, జనవరి18(ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణాలను గుర్తించి, అందుకు బాధ్యులైన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్ కె. రవికుమార్ అన్నారు. గురువారం టౌన్‌ప్లానింగ్ అధికారులు క్రిష్ణమోహన్, కబీర్, సిబ్బందితో ఆయన సమావేశమైయారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో ఉన్న కోర్టు కేసులు, వాటి గురించి తీసుకుంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. పార్కులు ఎక్కడ కబ్జాలు కాకుండా చూడాలన్నారు. అక్రమణలను గుర్తించి గతంలో నోటీసులు ఇచ్చిన వారి పట్ల తీసుకుంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు.


శంకర్ గౌడ్‌ను సత్కరిస్తున్న ఆర్మీ అధికారులు

శంకర్‌గౌడ్‌కు ఆర్మీ అధికారుల ప్రశంస

● సైనికుడ్ని కాపాడేందుకు యత్నించినందుకు అభినందన

ఎల్‌బీనగర్ జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల లంగర్‌హౌస్ వంతెనపై చైనా మాంజాతో తీవ్రగాయాలై రక్తస్రావంతో రహదారిపై పడి ఉన్న సైనికుడు కోటేశ్వర్‌రెడ్డిని కాపాడేందుకు యత్నించిన గడ్డం శంకర్‌గౌడ్‌ను సైనికాధికారులు సరూర్‌నగర్‌లోని కామేశ్వర్‌నగర్‌లో అభినందించి జ్ఞాపిక అందజేశారు. నిర్మల్ జిల్లా కుంటాల మండలం విట్టాపూర్‌కు చెందిన శంకర్ గౌడ్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ సరూర్‌నగర్‌లో కుటుంబతో నివాసముంటున్నాడు. ఇటీవల సైనికుడు కోటేశ్వర్‌రెడ్డి విధులకు వెళ్తుండగా చైనా మాంజా మెడకు చుట్టుకుని తీవ్ర రక్తస్రావంతో కనిపించాడు. అదే మార్గంలో వెళ్తున్న శంకర్‌గౌడ్ గమనించాడు. ఓ మహిళ చున్నీ ఇవ్వగా రక్తస్రావాన్ని ఆపేందుకు కట్టుకట్టాడు. అనంతరం వాహనంలో సైనిక ఆస్పత్రికి తీసుకువెళ్లగా అక్కడి వైద్యులు ఎంతగా ప్రయత్నించినా కోటేశ్వర్ రెడ్డి ప్రాణాలు దక్కలేదు. సైనికుడి ప్రాణాలు కాపాడేందుకు చేసిన సేవలను గుర్తించిన శంకర్‌గౌడ్‌ను సైనికాధికారులు కల్నల్ బాలకృష్ణన్, ఎంకే.నాయక్, జయరాంలు అభినందించారు.

లేని తహసీల్దార్ పేరుతో కులధ్రువ పత్రం

● డబుల్ బెడ్రూం కోసం ఫోర్జరీ చేసిన మహిళ

● పోలీసులకు తహసీల్దార్ ఫిర్యాదు

మదీన, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందించే డబుల్ బెడ్ రూమ్ కోసం ఓ మహిళ నకిలీ కుల ధ్రువీకరణ పత్రం పొందినట్లు బహదూర్‌పురా మండల కార్యాలయం అధికారులు గుర్తించారు. అసలు లేని తహసీల్దార్ పేరుతో ధ్రువీకరణ పత్రం జారీ కావడంపై ఆశ్చర్యానికి గురయ్యారు. దివాన్‌దేవిడి ప్రాంతానికి చెందిన శేఖర్ భార్య మంజుల(36)కు అబ్దుల్లాపూర్‌మెట్‌లో ప్రభుత్వ డబుల్ బెడ్‌రూమ్ మంజూరైంది. 2023 అక్టోబర్ 13న బహదూర్‌పురా మండల అధికారులు ఎస్సీ మాదిగ కులానికి చెందినట్లుగా జారీ చేసినట్లు కుల ధ్రువీకరణ పత్రం పొందింది. ఇల్లు అప్పగించేందుకు బల్దియా అధికారులు పత్రంలోని తప్పులను సరిదిద్ది కొత్తగా కావాలని సూచించారు. సదరు మహిళ అప్పటికే పొందిన కుల ధ్రువీకరణ పత్రాన్ని జత చేస్తూ మీ-సేవలో దరఖాస్తు చేసుకుంది. గురువారం దరఖాస్తును పరిశీలించిన తహసీల్దార్ చంద్రశేఖర్ షాక్‌కు గురయ్యారు. జారీ చేసిన సర్టిఫికెట్‌పై తహసీల్దార్ పేరు జానకిగా ఉంది. అసలు జానకి పేరుతో ఏ తహసీల్దార్ లేకపోవడంతో ధ్రువీకరణ పత్రాన్ని ఎలా పొందావని మహిళను అధికారులు ప్రశ్నించారు. తన భర్త తెచ్చాడని, నూర్‌ఖాన్ బజార్‌లోని ఓ మీ-సేవ సెంటర్ నిర్వాహకులు ఇప్పించారని చెప్పింది. విస్మయానికి గురైన తహసీల్దార్ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. ఇంకా ఎన్ని ఫోర్జరీ సర్టిఫికెట్లు జారీ అయ్యాయి. మీ-సేవ సెంటర్ నిర్వాహకుడి పాత్ర ఏంటి అనే వివరాలు పోలీసు దర్యాప్తులో తేలుతాయని బహదూర్‌పురా తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు.

అవయవ దానం


శంకర్ (ఫైల్)

రాంగోపాల్‌పేట్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కుటుంబ పెద్ద మరణించి పుట్టెడు దుఖంలో ఉన్నప్పటికీ కుటుంబ సభ్యులు తీసుకున్న నిర్ణయం ఎందరికో ఆదర్శప్రాయమైంది. హైదరాబాద్ బికెగూడకు చెందిన అన్నారపు శంకర్(61) అనారోగ్యంతో స్పృహ తప్పి పడిపోవడంతో స్థానిక ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మెదడులో రక్తం గడ్డకట్టిందని వైద్య పరీక్షల్లో గుర్తించిన వైద్యులు రెండు రోజులు శ్రమించి వైద్యం చేసినప్పటికీ గురువారం శంకర్ బ్రెయిన్ డెడ్ అయ్యి మృతిచెందాడు. అవయవ దానం గురించి మృతుడి కుటుంబ సభ్యులకు, బంధువులకు ఆస్పత్రిలోని అవయవదాన సమన్వయ కర్తలు అవగాహన కల్పించారు. దీంతో శంకర్ భార్య లలిత, నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారుల అంగీకారంతో లివర్, రెండు కిడ్నీలను దానం చేశారు. అనంతరం జీవన్‌దాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రీన్ చానల్ ద్వారా అవసరం ఉన్న ఆస్పత్రులకు అవయవాలను తరలించారు.

వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయం భూముల్లో...

హైకోర్టు భవనాలు వద్దు


నిరసన తెలుపుతున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

రాజేంద్రనగర్, జనవరి18(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాల భూముల్లో హైకోర్టు భవనాలు వద్దు అంటూ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థుల నిరసనలు కొనసాగుతున్నాయి. గురువారం విద్యార్థులు తరగతులు బహిష్కరించి వర్సిటీ పరిపాలనా భవనానికి ఎదురుగా ఉన్న ప్రొ. జయశంకర్ విగ్రహం ముందు బైఠాయించారు. అనంతరం వర్సిటీ పరిసరాలలో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ, జీవ వైవిధ్యం కలిగిన అగ్రో బయోడైవర్సిటీ భూములు, లక్షలాది చెట్లు, పక్షులు, జంతువులు, మొక్కలకు సంబంధించిన జాతుల సమూహాలు ఉన్న వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాల భూముల్లో హైకోర్టు భవనాలు నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెంబర్ 55 విడుదల చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

వ్యవసాయ వర్సిటీ భూములలో హైకోర్టు వద్దు... మరొక చోట హైకోర్టు భవనం నిర్మించుకోవాలని వారు కోరారు. నిరసనలో విద్యార్థి సంఘాల నాయకులు సత్యమూర్తి, శ్రీజ, అర్వింద్, మధుకర్, సురేందర్, దీక్షిత్, హరిప్రియ, వంశీచందర్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

కబ్జా నివేదికను కలెక్టర్‌కు అందజేస్తాం

పహాడిషరీఫ్ జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జల్‌పల్లి చెరువు కింద కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి గురించిన నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని అధికారులు పేర్కొన్నారు. అధికారులు ఎన్నికల విధుల్లో ఉండగా, రెండు నెలల క్రితం కొంత మంది జల్‌పల్లి పెద్ద చెరువు కింద గల ప్రభుత్వ భూమిలో రాత్రికి రాత్రి అక్రమంగా నిర్మాణాలు చేశారు. అంతటితో ఆగకుండా వాటికి విద్యుత్ మీటర్‌లు నకిలీ ఇంటి నెంబర్‌లు ఏర్పాటు చేసుకున్నారు. విషయం తెలిసిన అధికారులు అక్రమ నిర్మాణాలను తొలగించారు. అయినా మళ్లీ నిర్మించుకోవడంతో పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చాయి. జల్‌పల్లి మున్సిపాలిటి పరిధిలోని జల్‌పల్లి పెద్ద చెరువు కింద కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని, ఫిరంగి నాలాను గురువారం కందుకూరు ఆర్‌డీవో సూరజ్ కుమార్, మహేశ్వరం డీసీపీ సునీతరెడ్డి, ఏసీపీ శ్రీనివాస్, ఇరిగేషన్ డీఈ దుద్యనాయక్, బాలాపూర్ తహసీల్దార్ మాధవిరెడ్డి, మున్సిపాలిటీ కమిషనర్ వసంత పరిశీలించారు. కబ్జా నివేదికను కలెక్టర్‌కు అందజేసి, తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రేమను నిరాకరించిందని.. బాలికపై బాలుడి దాడి

● అడ్డుకోబోయిన బాలిక సోదరికి గాయాలు

అంబర్‌పేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తన ప్రేమను తిరస్కరించిందన్న కోపంతో బాలికపై బాలుడు దాడి చేశాడు. బాగ్‌అంబర్‌పేటకు చెందిన బాలిక ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది. అదే ప్రాంతంలో ఉంటున్న బాలుడు కూడా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. వీరిద్దరూ 10వ తరగతి వరకు కలిసి చదువుకున్నారు. కొంతకాలంగా బాలుడు ప్రేమ పేరుతో బాలికను వేధిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం 7 గంటల సమయంలో బాలిక ఇంటికి వెళ్లిన బాలుడు ఆమెతో మాట్లాడడానికి యత్నించగా నిరాకరించింది. ఆగ్రహం చెందిన బాలుడు ఇంట్లో కూరగాయలు కోసే కత్తితో బాలికపై దాడికి పాల్పడగా కాలికి గాయాలయ్యాయి. అక్కడే ఉన్న బాలిక సోదరి అడ్డుకోబోగా బాలుడు ఆమె పొట్టలో పొడిచాడు. గాయపడ్డ ఇద్దరు బాలికలను స్థానికులు ఆంధ్ర మహిళా సభ ఆస్పత్రికి తరలించారు. వారికి ప్రాణాపాయం లేదని వైద్యులు చెప్పారు. ఘటనా స్థలాన్ని కాచిగూడ ఏసీపీ కస్తూరి శ్రీనివాస్ సందర్శించారు. బాలుడిపై హత్యాయత్నం, పోక్సో కేసు నమోదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అంబర్‌పేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదకర మత్తు ఇంజక్షన్లు

● పోలీసుల దాడుల్లో స్వాధీనం

● కువైట్ పారిపోయిన డాక్టర్

రాజేంద్రనగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నార్కోటిక్ బ్యూరో, రాజేంద్రనగర్ ఎస్ఓటీ, రాజేంద్రనగర్ పోలీసులు గురువారం సంయుక్తంగా ఆసిఫ్‌నగర్‌లోని ఓ ఇంటిపై దాడులు నిర్వహించి అధిక మత్తునిచ్చే 57 ఇంజక్షన్లు స్వాధీనం చేసుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫ్‌నగర్‌లో నివాసం ఉంటున్న డాక్టర్ అశన్ ముస్తాఫా ఖాన్ ఓ ఆస్పత్రిలో అనస్తీషియన్. సర్జరీల సందర్భంగా మత్తు కోసం ఇచ్చే ఫెంటానిల్ మత్తు ఇంజక్షన్‌లను బయట మార్కెట్‌లో రూ. 17,500కు విక్రయిస్తున్నాడు. ఇవి హెరాయిన్ కంటే 50 శాతం ఎక్కువ, మార్ఫిన్ కంటే మరింత ఎక్కువ ప్రమాదకరమని పోలీసులు తెలిపారు. యాప్ ద్వారా బయట వ్యక్తులకు డాక్టర్ అశన్ ముస్తాఫా ఖాన్ విక్రయిస్తున్నట్లు తెలుసుకున్న పోలీసులు నిఘా పెట్టారు. ప్రతీ రోజు ఓ డెలివరీ యాప్ పార్సిల్ ద్వారా విక్రయిస్తున్నట్లు గుర్తించారు. గురువారం అతడి ఇంటిపై దాడి చేయగా డాక్టర్ కువైట్ పారిపోయినట్లు గుర్తించారు. అతడి భార్య లుబ్నా నజీబ్ ఖాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమె నుంచి 57 మత్తు ఇంజక్షన్లు, రెండు సెల్‌ఫోన్‌లు, రూ. 6లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. డాక్టర్ వస్తే అతడు ఎవరెవరికి మత్తు ఇంజక్షన్‌లు విక్రయిస్తున్నాడనే వివరాలు తెలిసే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/QgcvKGHలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

20, 21 తేదీల్లో ఓటరు నమోదు

రాజేంద్రనగర్, జనవరి18(ఆంధ్రజ్యోతి): ఈ నెల 20, 21 తేదీల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నామని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు లిస్టులో పేరు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీవో మల్లయ్య ఓ ప్రకటనలో తెలిపారు. రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నియోజకవర్గ పరిధిలోని 535 పోలింగ్ స్టేషన్లలోని సిబ్బందికి దరఖాస్తులు అందజేయాలని అన్నారు. భారత పాస్‌పోర్టు కలిగి విదేశాల్లో నివాసం ఉంటున్న భారతీయులు ఫారం- 6ఏ, అడ్రస్ మార్పు, ఓటరు కార్డు కోసం ఫారం- 8, ఓటరు జాబితాలో పేరు తొలగించడానికి, చేర్చడానికి, అభ్యంతరం వ్యక్తం చేయడానికి ఫారం-7ను పూర్తి చేసి సిబ్బందికి ఇవ్వాలని సూచించారు

అయోధ్య రామ మందిర దర్శన్ అభియాన్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కో ఆర్డినేటర్‌గా శ్రీధర్



రాజేంద్రనగర్, జనవరి18(ఆంధ్రజ్యోతి): అయోధ్య శ్రీరామ మందిరదర్శన్ అభియాన్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల కో ఆర్డినేటర్‌గా రాజేంద్రనగర్‌కు చెందిన బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ నియమితులైయ్యారు. ఈ మేరకు దర్శన్ అభియాన్ రాష్ట్ర కన్వీనర్, కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకట రమణారెడ్డి గుఱ/వారం శ్రీధర్‌కు నియామక పత్రాలను అందజేశారు. శ్రీధర్ మాట్లాడుతూ జనవరి 22న రంగారెడ్డి జిల్లా నుంచి అయోధ్య రామ మందిర దర్శనానికి రామ భక్తులను తీసుకువెళ్తానని అన్నారు.

22న రచయిత్రి ఇంద్రగంటి జానకీబాలకు సుశీల నారాయణరెడ్డి సాహిత్య పురస్కారం

రవీంద్రభారతి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత కవి డాక్టర్ సి.నారాయణరెడ్డి సతీమణి సుశీల పేరిట నలభై సంవత్సరాలుగా మహిళా రచయిత్రులకు ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసమయి ప్రదానం చేస్తోంది. ఇందులో భాగంగా ఈ ఏడాదికి గాను ప్రముఖ నవలా రచయిత్రి ఇంద్రగంటి జానకీఆలకు ప్రదానం చేయనున్నట్లు రసమయి సంస్థ అధ్యక్షుడు డా.ఎం.కె.రాము తెలిపారు. ఇంద్రగంటి జానకీబాల ప్రముఖ సాహితీవేత్త సంపాదకుడు ఇంద్రగంటి శ్రీకాంతశర్మ సతీమణి. ఆమె పలు నవలు, కథలు, వ్యాసాలు రచించారు. సంగీతంలోనూ ఆమెకు ప్రావీణ్యం ఉంది. ఈ నెల 22న రవీంద్రభారతిలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో జానకీబాలకు లక్ష రూపాయల నగదు, జ్ఞాపిక ప్రశంసా పత్రంతో సత్కరిస్తామని రాము తెలిపారు.

27న అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ వార్షికోత్సవం

రవీంద్రభారతి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ వార్షికోత్సవాన్ని ఈనెల 27న రవీంద్రభారతిలో నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షురాలు డా.ఎస్.సరోనమ్మ తెలిపారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో నిష్ణాతులైన పలువురికి నంది అవార్డులతో సత్కరించనున్నట్లు తెలిపారు. కవులు, కళాకారులు, సినీ నటుడు, దర్శక, నిర్మాతలు, స్టేజ్ ఆర్టిస్టులు, గాయనీ గాయకులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల నుంచి తమ సంస్థ దరఖాస్తులను ఆహ్వానిస్తోందని ఆమె తెలిపారు. ఇతర వివరాలకు తమ సంస్థ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

నేడు గిరిజన సంస్కృతి పరిరక్షణపై సదస్సు

హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆద్యకళ మ్యూజియం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు నాంపల్లి, తెలుగు వర్సిటీలోని సమావేశ మందిరంలో 'జానపద, గిరిజన కళలు, సంస్కృతి-అధ్యయనం-పరిరక్షణ' అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు ఆచార్య జయధీర్ తిరుమలరావు తెలిపారు. సదస్సులో మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, ప్రొ. కోదండరాం, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ పాల్గొననున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

రేపు హెచ్‌సీయూలో కులగణన....

సామాజిక న్యాయంపై సదస్సు

హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రేపటి నుంచి రెండు రోజులపాటు కులగణన-సామాజిక న్యాయం అంశంపై ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నారు. సదస్సులో విద్యావేత్తలు, మేధావులు, రాజకీయ ప్రముఖులు సామాజిక కార్యకర్తలను ఒక తాటి పైకి తీసుకువచ్చి కులగణనపై ఉన్న అనేక అంశాలు, సందేశాలను చర్చించనున్నట్లు కార్యనిర్వాహకులు, ఏఐఓబీఎస్ఏ జాతీయ అధ్యక్షులు జీ.కిరణ్ కుమార్ తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో జరగబోతున్న సెమినార్‌లో ప్రముఖ విధాన రూపకర్త శ్యాం పిట్రోడా, ద్రవిడ కళగం కార్యదర్శి కే.వీరమణి, డీఎంకె రాజ్యసభ సభ్యుడు పీ.విల్సన్, స్వరాజ అభియాన్ అధ్యక్షుడు యోగేంద్ర యాదవ్, ప్రొ. ఈవెంకటేశు, ఆళ్ల రామకృష్ణ తదితరులు పాల్గొంటున్నారని నిర్వాహకులు తెలిపారు.

రామదాసు బందిఖానాలో ప్రత్యేక పూజలు

కార్వాన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో రామాలయం విశేషాన్ని పురస్కరించుకొని గోల్కొండ కోటపై గల రామదాసు బందిఖానాలో సీతారామ, లక్ష్మణ్, హనుమాన్ విగ్రహాలు, రామదాసు చిత్రపటానికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామ లక్ష్మణులు వారి జీవిత సమయంలో గోల్కొండ కోటను సందర్శించారని, రామదాసును విడిపించారని, ఆయన ఆలయం ప్రారంభోత్సవం సందర్భంగా ఈ ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు.



కదిలే.. రామ మందిరం!

మదీన, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): బహదూర్‌పురాలోని సుధా కార్స్ మ్యూజియంలో రూపుదిద్దుకున్న అయోధ్య రామ మందిరం ఆకారంలోని వినూత్న కారు గురువారం సాయంత్రం బహదూర్‌పురా ప్రధాన రహదారిపై ప్రజలను ఆకర్షించింది. మెటాడోర్ వాహనం బాడీని ఉపయోగించి 26 అడుగుల ఎత్తులో అయోధ్య రామ మందిరం ఆకారంలో రూపొందించారు. విద్యుత్‌దీపాలతో రామ మందిరం నమూనా కారు రోడ్డుపై వెళ్తుంటే ప్రజలు పరవశించిపోయారు. జై శ్రీరామ్ నినాదాలు చేస్తూ దాని వెంట నడిచారు. దేవీబాగ్ దేవాలయంలో వినూత్న కారును ప్రదర్శనకు ఉంచారు.


నిలోఫర్ ఆసుపత్రిలో కమాండ్ కంట్రోల్ సెంటర్

నిలోఫర్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్

● 288 సీసీ కెమెరాలు, 20 ఏసీలు ఏర్పాటు

మంగళ్‌హాట్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): నిలోఫర్ ఆస్పత్రిలో గురువారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఎన్ఆర్ఐ ప్రతిదీప్ భాష్యం డొనేట్ చేసిన 20 ఏసీలు, 288 సీసీ కెమెరాలను అన్ని వార్డుల్లో ఏర్పాటు చేశారు. దాతలు ప్రదీప్ భాష్యం, జగదీష్, సురేష్, విజయలక్ష్మిలతోపాటు సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి, ఏసీపీ సంజీవ్ కుమార్, నాంపల్లి ఇన్‌స్పెక్టర్ అభిలాష్‌లతో కలిసి సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు, సౌకర్యాలు కల్పించడంతో దాతలు తమవంతు సహకారం అందించడం స్వాగతించదగ్గ విషయమని అన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటుకు ముందుకు వచ్చిన దాతలను అభినందించారు.

ప్రభుత్వ గురుకులాల్లో ప్రవేశానికి గడువు పొడిగింపు



హైదరాబాద్ సిటీ, జనవరి18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గురుకులాలలో 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు తేదీని జనవరి 20వ తేదీ వరకు పొడిగించినట్లు షేక్‌పేట తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎన్. బాలస్వామి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సాంఘిక సంక్షేమ, గిరిజన, బీసీ సంక్షేమ, జనరల్ గురుకుల విద్యాలయాలో 5వ తరగతి ప్రవేశానికి ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహించి, మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్షను ఫిబ్రవరి 11న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఆరు పబ్‌లపై కేసు నమోదు

బంజారాహిల్స్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): అమ్యూజ్‌మెంట్ లైసెన్స్ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా సంగీతం పెడుతూ నిర్వహిస్తున్న ఆరు పబ్‌లపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పబ్‌లో సంగీత శబ్దాలపై ఫిర్యాదుల నేపథ్యంలో ఈనెల 17న ఎస్ఐ సత్తయ్య తనిఖీలు నిర్వహించారు. ఆరు పబ్‌ల్లో అమ్యూజ్‌మెంట్ లైసెన్స్‌లు లేకుండా సంగీతాన్ని పెడుతున్నారని తేలింది. జూబ్లీహిల్స్‌రోడ్డు రోడ్డు నెం.36 క్లబ్ రోగ్ పబ్ యజమాని నర్సింగరావు, మేనేజర్ రవీందర్, జెనా పబ్ యజమాని కౌశిక్, మేనేజర్ ఎన్.కౌశిక్, రోడ్డు నెం. 45 ఫోర్టి పబ్ యజమాని అభినయ రెడ్డి, మేనేజర్ అలెక్స్, హలో కాక్‌టేల్ పబ్ యజమాని స్వేతన్, మేనేజర్ సాయికుమార్, ఫాట్ పీజియన్ పబ్ యజమాని కేతన్ అగర్వాల్, మేనేజర్ మన్ బహదూర్, రోడ్డు నెం.10 జీరో ఫార్టీ పబ్ యజమాని ఆలూరి పరిపటి, మేనేజర్ అంజనీసింగ్‌లపై కేసులు నమోదు చేశారు.

పబ్‌లో దాడిచేసిన 11 మంది అరెస్ట్

బంజారాహిల్స్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పబ్‌లో యువకులపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన 11మందిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ నెల 14న అజర్, నవీద్‌తోపాటు నలుగురు స్నేహితులు బంజారాహిల్స్ రోడ్డు నెం.14లోని ఆఫ్టర్ 9 పబ్‌కు వచ్చారు. ఇక్కడ చిన్నవిషయంలో తగాదా జరిగింది. అక్కడే ఉన్న కొంతమంది దాడి చేయడంతో అజర్, నవీద్‌లు కత్తిపోట్లకు గురయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని సీసీ ఫుటేజీని పరిశీలించారు. దాడిలో మొత్తం 17మంది పాల్గొనగా ఇందులో 11 మందిని గుర్తించారు. మహ్మద్ షోయబ్, మహ్మద్ ఇంతియాజ్, కురువుర రాఘవేంద్రన్, బానోత్ రాజ్‌కుమార్, సాయికుమార్, పీవీ రవితేజ, మహ్మద్ సల్మాన్‌ఖాన్, జె.సాయిప్రకాశ్, మున్నూరు సాయి, సబావత్ సాయికిరణ్‌లపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో చోరీ

● ప్రయాణికురాలి మెడలో 8 తులాల మంగళసూత్రం అపహరణ

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో దొంగలు చొరబడి ఓ ప్రయాణికురాలి మెడలో మంగళసూత్రాన్ని తెంపుకొని పారిపోయారు. ఈ ఘటన విజయవాడ రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. హైద్రాబాద్ మణికొండ ప్రాంతానికి చెందిన సునీత అనిల్‌కుమార్ దంపతులు సికింద్రాబాద్‌కు వచ్చేందుకు బుధవారం అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. అయితే, మధ్యరాత్రి సునీత పడుకుని ఉండగా రైలులోకి చొరబడిన దొంగలు ఆమె మెడలోని 8 తులాల బంగారు మంగళసూత్రాన్ని తెంపుకుని పారిపోయారు. మెడకు గాయమైందని ఆమె గమనించేలోపు మంగళసూత్రం కనిపించక పోవడంతో భర్తను నిద్రలేపింది. రైలు బోగిలోకి దుండగులు ప్రవేశించారని ప్రత్యక్ష సాక్షులు బాధితురాలికి చెప్పడంతో ఆ దంపతులు రైల్వే టీటీకి సమాచారం ఇచ్చారు. అనంతరం గురువారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో రైలు దిగగానే జీఆర్‌పీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీ విజయవాడ పరిధిలో జరగడంతో కేసును అక్కడి జీఆర్‌పీ పోలీసులకు బదిలీ చేస్తున్నట్లు సికింద్రాబాద్ జీఆర్‌పీ పోలీసులు తెలిపారు.

అధ్యయనం



జపాన్ నుంచి వచ్చిన ఎనిమిది మంది ప్రతినిధుల బృందం జీహెచ్ఎంసీ కమిషనర్, సీడీఎంఏ ఇన్‌చార్జ్ కమిషనర్ రోనాల్డ్ రోస్‌ను గురువారం కలిసింది. ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల(ఎఫ్ఎస్‌టీపీ) ఏర్పాటు, పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం, నిర్వహణ ఎలా చేస్తున్నామన్నది రోనాల్డ్‌రోస్ వారికి వివరించారు. అనంతరం ఆ బృందం మునిసిపల్ నాలెడ్జ్ సెంటర్ (ఎంకేసీ)ను సందర్శించారు. జపాన్‌లోని పలు నగరాల్లో మురుగు నీటి నిర్వహణ విధానాలను ప్రతినిధుల బృందం కమిషనర్‌కు తెలిపింది. - హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి


ఎన్టీఆర్ ఘాట్



ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న సినీహీరోలు జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్

దేశంలో ఎవరికీ దక్కని గౌరవం ఎన్టీఆర్ సొంతం

హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మహానటుడు నందమూరి తారకరామారావు 28వ వర్ధంతి సందర్భంగా ఫిల్మ్‌నగర్‌లోని ఆయన విగ్రహానికి కుటుంబసభ్యులు, సినీ ప్రముఖులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మాట్లాడుతూ మరణం లేని మహానాయకుడు ఎన్టీఆర్ అని అన్నారు. చిత్ర పరిశ్రమలోనే కాదు, రాజకీయరంగంలోనూ ఆయన ఎదురులేని మనిషిగా నిలిచారన్నారు. భారతదేశంలో ఎవరికీ దక్కని గౌరవం ఆయనకు దక్కిందని, ఫిల్మ్‌నగర్‌కు ఆయన పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని అన్నారు. ఎన్టీఆర్ తనయుడు మోహనకృష్ణ మాట్లాడుతూ 'తెలుగు జాతి గౌరవం మా నాన్న. సినిమాల్లో ఆయన చేయని పాత్ర అంటూ ఏదీ లేదు. అలాగే రాజకీయాల్లో కూడా పెను మార్పులు తీసుకొచ్చారు. ఇప్పుడున్న పలు సంక్షేమ పథకాలకు ఆయన ఆద్యుడు' అని అన్నారు. నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ మరణంలేని మహానుభావుడు ఎన్టీఆర్ అని అన్నారు. దేశంలో ఎన్టీఆర్ విగ్రహాలు ఎక్కడున్నా వాటిని పూజించుకుని ఆయన్ని స్మరించుకోవడం మన అదృష్టమని మాజీ కార్పొరేటర్ కాజ సూర్యనారాయణ చెప్పారు. కార్యక్రమంలో ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్ కార్యదర్శి ముళ్లపూడి మోహన్, భాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెన్నుతో గీసిన ఎన్టీఆర్ చిత్రం



మన్సూరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం నందమూరి తారక రామారావు వర్ధంతిని పురస్కరించుకొని ఎల్‌బీనగర్‌కు చెందిన చిత్రకారుడు నాగార్జునపు రాము.. ఎన్టీఆర్ చిత్రాన్ని పెన్నుతో గీసి తన అభిమానాన్ని చాటుకున్నారు.

ఎన్టీఆర్ ఘాట్ వరకు అమరజ్యోతి ర్యాలీ..

బేగంపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షులు, టీటీడీపీ బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపతి సతీష్ ఆధ్వర్యంలో బేగంపేట రసూల్‌పురలో గురువారం అమరజ్యోతి ర్యాలీని నిర్వహించారు. నందమూరి రామకృష్ణ, సుహాసిని ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ నెక్లెస్‌రోడ్డులోని ఎన్టీఆర్ ఘాట్‌కు వరకు సాగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన, టీడీపీ నేతలు కానూరి జయశ్రీ, రాజు, సోమలింగం, మల్లేష్, శ్రీనివాస్‌గౌడ్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్ని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు.


అమరజ్యోతి ర్యాలీని ప్రారంభిస్తున్న రామకృష్ణ, సుహాసిని

శ్రమకు గుర్తింపు దక్కింది

● రాజేంద్రనగర్ పీఎస్ సిబ్బందికి సీపీ ప్రశంసలు


అవార్డుతో రాజేంద్రనగర్ సిబ్బంది, సీపీ మహంతి

హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ పోలీస్‌స్టేషన్‌గా ఎంపికైన రాజేంద్రనగర్ పీఎస్ ఇన్‌స్పెక్టర్, ఇతర సిబ్బందిని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి అభినందించారు. ఇటీవల కేంద్ర హోంమంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన ఉత్తమ పోలీస్‌స్టేషన్లలో రాజేంద్రనగర్ పీఎస్ ఎంపికైన విషయం తెలిసిందే. ఈనెల 5న జైపూర్‌లో జరిగిన డీజీపీల సమావేశంలో హోంమంత్రి చేతుల మీదుగా రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ అవార్డు అందుకున్నారు. గురువారం కమిషనరేట్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎస్‌హెచ్‌ఓ బి.నాగేంద్రబాబు, అదనపు డీసీపీ సాధనా రశ్మి పెరుమాళ్, ఏసీపీ గంగాధర్, అడ్మిన్ ఎస్సై రమేశ్‌ను సీపీ అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాజేంద్రనగర్ పీఎస్ సిబ్బంది, అధికారులు అంకితభావంతో చేసిన సేవలు, వారి శ్రమకు గుర్తింపుగా అవార్డు దక్కిందని కొనియాడారు. ఈ అవార్డు పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఎంతో ప్రోత్సాహాన్నిస్తుందన్నారు.

చిన్నారిపై కుక్క దాడి

రామంతాపూర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రామంతాపూర్ రాంరెడ్డి నగర్‌లో ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారిపై కుక్క దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. రాంరెడ్డినగర్‌లో నివసించే సంతోష్, సంధ్యల కుమార్తె కృతిక (4) గురువారం సాయంత్రం ఇంటిముందు ఆడుకుంటుండగా ఓ శునకం దాడి చేసింది. దీంతో చిన్నారికి మొహం, చెవి దగ్గర తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.


కుక్కకాటుకు గురైన చిన్నారి కృతిక

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

నగరంలో గురువారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందారు. దుండిగల్ ఓఆర్ఆర్‌పై వాహనాన్ని ఓవర్ టేక్ చేయబోయి క్వాలిస్ బోల్తాపడి ఒకరు మృతిచెందగా.. ఎర్రగడ్డ బ్రిడ్జిపై జరిగిన ప్రమాదంలో ఓ యువతి దుర్మరణం చెందారు. వివరాలిలా ఉన్నాయి.

● ఓఆర్ఆర్‌పై క్వాలిస్ బోల్తాపడి ఒకరు..

● వాటర్ ట్యాంకర్ ఢీకొని ఓ యువతి

దుండిగల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా ముత్తంగి మండలం వెలిమల గ్రామానికి చెందిన తలారి నర్సింహులు(36) వృత్తిరీత్యా డ్రైవర్. అతను భార్య, ఇద్దరు పిల్లలు, స్నేహితుడితో కలిసి సిద్దిపేట జిల్లా కొమరవెల్లికి క్వాలిస్ వాహనంలో వెళ్లాడు. గురువారం స్వస్థలానికి బయలుదేరాడు. సాయంత్రం 5.30 గంటల సమయంలో దుండిగల్ ఓఆర్ఆర్ మీదుగా వెళ్తుండగా ముందున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయాడు. ఈ ప్రయత్నంలో క్వాలిస్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో నర్సింహులు అక్కడికక్కడే మృతిచెందాడు. మిగతా వారికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు దుండిగల్ ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


సునీత (ఫైల్)

ఉద్యోగానికి వెళ్తూ..

సనత్‌నగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్నేహితురాలి బైక్‌పై ఉద్యోగానికి బయలుదేరిన యువతి రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఈ సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కర్నూలు జిల్లా శ్రీశైలానికి చెందిన పిట్టల సునీత (25) కేపీహెచ్‌బీ కాలనీలోని ఓ హాస్టల్‌లో ఉంటూ శ్రీనగర్ కాలనీలోని ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తోంది. అదే సంస్థలో ఉద్యోగం చేస్తున్న సహోద్యోగి హన్సిలి (25)స్కూటీపై సునీత గురువారం ఆఫీసుకు బయలుదేరింది. ఎర్రగడ్డ బ్రిడ్జిపై వెళ్తున్న స్కూటీని వెనుకనుంచి వేగంగా వచ్చిన వాటర్ ట్యాంకర్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఇద్దరూ స్కూటీపైనుంచి ఎగిరి రోడ్డుపై పడ్డారు. ఆ వెనకే వస్తున్న ఆర్టీసీ బస్సు సునీతపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే చనిపోయింది. సమాచారమందుకున్న సనత్‌నగర్ పోలీసులు సునీత మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం

రాంనగర్/అంబర్‌పేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడాకారుల ప్రోత్సాహానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మాజీ ఎంపీ, క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ వి.హనుమంతరావు ఆధ్వర్యంలో అంబర్‌పేట వాటర్ వర్క్స్ ప్లే గ్రౌండ్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో రాజీవ్‌గాంధీ అండర్-19 ట్వంటీ20.. 43వ క్రికెట్ టోర్నమెంట్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఈ పోటీల్లో దేశంలోని వివిధ ప్రాంతాల జట్లతో పాటు మలేషియా, శ్రీలంక దేశాలకు చెందిన జట్లు కూడా పాల్గొంటున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సభ్యులు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఇంటిపై గంజాయి పండిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన పోలీసులు

గంజాయి పండిస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

బౌద్ధనగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : గుట్టుచప్పుడు గాకుండా ఇంటిపై గంజాయి మొక్కల్ని పెంచుతున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ రాహుల్ రాజ్ (29)ను వారాసిగూడ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సికింద్రాబాద్, వెస్ట్ పార్శిగుట్టకు చెందిన రాహుల్ రాజ్ (29)కు గంజాయి తీసుకునే అలవాటు ఉంది. ఈ క్రమంలో ఇంటిపై మూడు మొక్కల్ని సాగు చేస్తున్నాడు. విశ్వసనీయ సమాచారంతో వారాసిగూడ ఎస్సై సుధాకర్, కానిస్టేబుళ్లు రవికుమార్, గలీబ్, దేవేందర్,నాయక్ తనిఖీ చేసి గంజాయి మొక్కల్ని గమనించారు. రాహుల్ రాజ్ నాలుగు నెలలుగా మొక్కల్ని పెంచుతున్నట్లు విచారణలో వెల్లడైంది. మూడు కన్నాబీస్ ప్లాంట్, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'స్పెషల్' మిలాఖత్

(5వ పేజీ తరువాయి)

తెలిసిన వ్యక్తులందరికీ ఫోన్లు చేసి, ఏ ఇన్‌స్పెక్టర్..? ఎక్కడ అక్రమాలు జరిగాయి..? మీకు సమాచారం ఎలా వచ్చింది ? మాకు కూడా చెప్పండి అంటూ ఆరా తీస్తారు. ఆ తర్వాత అక్రమ అధికారులతో మిలాఖత్ అవుతారు. ఆరోపణలన్నీ ఫేక్ అని, కావాలనే మీడియాలో రాశారని, ఎలాంటి ఆధారాలు లేవంటూ ఉన్నతాధికారులకు తప్పుడు రిపోర్టు ఇచ్చి అక్రమార్కులకు కొమ్ము కాస్తున్నట్లు తెలిసింది. ఇటీవల ఎల్‌బీనగర్ జోన్, మహేశ్వరం జోన్ పరిధిలోని కొందరు పోలీస్ అధికారులపై ఆరోపణలు వచ్చినా.. క్షేత్రస్థాయి ఎస్‌బీ అధికారులు మాత్రం తప్పుడు నివేదికలు ఇచ్చినట్లు సమాచారం. దీంతో ఇటీవల బదిలీ అయిన సీపీ ఎలాంటి చర్యలు తీసుకోకుండా అక్రమార్కులను వదిలేసినట్లు తెలిసింది. ఇదే అదునుగా తీసుకున్న క్షేత్రస్థాయి ఎస్‌బీ సిబ్బంది మరింత రెచ్చిపోయినట్లు తెలిసింది. ఎన్ని ఆరోపణలు వచ్చినా 'మీకేం కాదు సార్.. మేము ఇక్కడ ఎస్‌బీలో ఉన్నంతవరకు మీపై ఎలాంటి రిపోర్టు వెళ్లకుండా చూసుకుంటాం. మీరు మమ్మల్ని చూసుకోండి' అంటూ స్థానిక పోలీసులకు భరోసా ఇచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఫలితంగా కొందరు ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు అక్రమాలకు పూర్తిగా తెరతీసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో వెలుగులోకి వచ్చిన ఓ కానిస్టేబుల్ బాగోతం అందరికీ తెలిసిందే. దొంగల ముఠాకు నాయకత్వం వహిస్తూ.. పలు రాష్ట్రాల్లో దొంగతనాలు దోపిడీలు చేయిస్తున్న కానిస్టేబుల్‌కు ఒక టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్, ఓ ఎస్సై పూర్తి సహకారం అందించారు. ఇంత జరుగుతున్నా ఎస్‌బీ అధికారులు పసిగట్టలేక పోయారు. హైదరాబాద్ సీపీకి విషయం తెలిసేంత వరకూ ఎస్‌బీ అధికారులకు కనీసం సమాచారం లేదు. ఆ తర్వాత సీపీ ఆదేశాలతో ఎస్‌బీ ఉన్నతాధికారులు రంగంలోకి దిగి కానిస్టేబుల్ అరాచకాలు, అతనికి సహకరిస్తున్న పోలీస్ సిబ్బంది గుట్టును రట్టు చేశారు.



వచ్చిదాంట్లో వాటాలు

లా అండ్ ఆర్డర్ పోలీసులతో కుమ్మక్కై, వారి అరాచకాలు, అక్రమాలు, అడ్డగోలు దందాలకు కొందరు ఎస్‌బీ సిబ్బంది అండగా నిలుస్తున్నారు. ఏళ్ల తరబడి ఒకే చోట పోస్టింగ్‌లో కొనసాగుతూ అక్రమ సంపాదనకు రుచిమరిగి అందినకాడికి దండుకుంటున్నారు. వారు పనిచేస్తున్న స్టేషన్ పరిధుల్లో దందాలు, అక్రమాలు, అరాచకాలు, పోలీసుల సెటిల్‌మెంట్లు జరుగుతున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తూ పోలీస్ ఉన్నతాధికారులకు ఎలాంటి రిపోర్టులు ఇవ్వడం లేదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా రాచకొండ, సైబరాబాద్, హైదరాబాద్ కమిషనరేట్ల పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఏళ్ల తరబడి పాతుకపోయిన ఎస్‌బీ క్షేత్రస్థాయి అధికారులపై ఇలాంటి ఆరోపణలు బలంగా ఉన్నాయి.

త్వరలో ఎస్‌బీ సిబ్బంది ప్రక్షాళన

చాలా పోలీస్‌స్టేషన్ల పరిధుల్లో ఎస్‌బీ అధికారులు, సిబ్బంది ఏళ్ల తరబడి ఒకే దగ్గర పని చేస్తూ అక్రమ సంపాదనకు అలవాటుపడ్డారు. ఏళ్ల తరబడి పాతుకుపోయిన క్షేత్రస్థాయి సిబ్బందిని ప్రక్షాళన చేసి విధినిర్వహణలో నమ్మకంగా ఉండే వారిని నియమించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైల మాదిరి మూడేళ్లకోసారి సిబ్బందిని మార్చేందుకు పోలీస్ బాస్‌లు చర్యలు తీసుకోనున్నట్లు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది.

జీవ వైవిధ్యాన్ని కాపాడాలి

రాష్ట్ర జీవ వైవిధ్య బోర్డు కార్యదర్శి కాళీచరణ్ కర్తాడే

హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు దోహదపడే జీవ వైవిధ్యాన్ని ప్రతి ఒక్కరూ కాపాడి భావితరాలకు మంచి వాతావరణాన్ని అందించేందుకు కృషి చేయాలని రాష్ట్ర జీవ వైవిధ్య బోర్డు కార్యదర్శి కాళీచరణ్ కర్తాడే అన్నారు. జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జెడ్ఎస్ఐ), నేషనల్ బ్యూరో ఆఫ్ ఫిష్ జెనటిక్ రిసోర్సెస్ (ఎన్‌బీఎఫ్‌జీఆర్) ఆధ్వర్యంలో అడ్వాన్స్ ఇన్ ఫిష్ సిస్టమేటిక్స్, మోర్ఫాలాజికల్ అండ్ మోలిక్యూలర్ అప్రోచెస్ అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు గురువారం మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో ప్రారంభమైంది. సదస్సుకు కాళీచరణ్ కర్తాడే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మారిన జీవన పరిస్థితుల కారణంగా దేశంలో జీవ వైవిధ్యం రోజురోజుకు అంతరించిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ అటవీశాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ త్రినాథ్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో చేపల ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. జెడ్ఎస్ఐ డైరెక్టర్ ధృతి బెనర్జీ మాట్లాడుతూ చేపల్లో సమగ్ర వర్గీకరణ విధానాన్ని అనుసరించేందుకు సదస్సు దోహదపడుతుందన్నారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లోని ప్రచురణ పత్రం 1106 జాతులతో కూడుకున్నదని, వీటిలో 672 జాతుల సకశేరుకాలు, 3866 జాతుల అకశేరుకాలు, గోదావరి నీటిలోని మంచినీటి చేపల్లో 84 ప్రజాతులకు చెందిన 152 జాతులను గుర్తించామన్నారు. అనంతరం జూలాజిక్ సర్వే ఆఫ్ ఇండియా రూపొందించిన ఫౌనా ఆఫ్ కవ్వాల్ టైగర్ రిజర్వ్, ఫౌనా ఆఫ్ అమ్రాబాద్ టైగర్ రిజర్వ్, ఫ్రెష్ వాటర్ ఫిషెస్ ఆఫ్ రివర్ గోదావరి, స్టేట్ ఫిషెస్ ఆఫ్ ఇండియా పుస్తకాలను ఆవిష్కరించారు. తమిళ భాషలో కాదల్ వన్నా మీన్ వాలర్పు, వనిగం మాత్యం పయనలిగలిన్ పంగును విడుదల చేశారు. కార్యక్రమంలో జెడ్ఎస్ఐ అదనపు డైరెక్టర్ రఘునాథన్, నేషనల్ బ్యూరో ఆఫ్ ఫిష్ జెనిటిక్ రిసోర్సెస్ డైరెక్టర్ ఉత్తమ్ సర్కార్, జెడ్ఎస్ఐ ఆఫీసర్ ఇన్‌చార్జి దీపా జైస్వాల్ పాల్గొన్నారు.

నివేదన





అయోధ్యలో భవ్య రామమందిరంలో ప్రాణ ప్రతిష్ఠకు దేశమంతా సంసిద్ధమవుతోంది. రామమందిర ఉద్యమంలో ఒక దశలో కంచిమఠం ప్రధానపాత్ర పోషించింది. అయోధ్యతో కంచికి ఉన్న సంబంధం గురించి, భవిష్యత్తులో ధర్మప్రచారం ఎలా సాగాలనే విషయం గురించి కంచిపీఠాధిపతి **శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి స్వామి** 'నవ్య'తో సంభాషించారు.

అయోధ్య కథ కంచికి...
ఇది మన మంచికే!

"అయోధ్యతో మాకు రెండు రకాలుగా సంబంధం ఉంది. ఒకటి క్షేత్ర సంబంధం. రెండోది ఉద్యమ సంబంధం. 1980లలో రామమందిర ఉద్యమ సమయంలో జయేంద్ర సరస్వతి స్వామి వారు ఉత్తరదేశ యాత్రలో ఉన్నారు. ఆ సమయంలో నేను పరమాచార్యులవారి వద్ద ఉన్నా. అప్పుడు ఇరు పక్షాలకు సంబంధించిన అనేక మంది పరమాచార్యను వచ్చి కలుస్తూ ఉండేవారు. శిలన్యాస్ సమయంలో పరమాచార్య కొన్ని ఇటుకలను పూజించి అయోధ్యకు పంపారు. ఆ తరువాతి కాలంలో జయేంద్ర సరస్వతి స్వామి ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. సుబ్రహ్మణ్య స్వామి, జార్జి ఫెర్నాండెజ్‌తో సహా అనేక మంది రాజకీయనాయకులు, అప్పటి ప్రధాని పి.వి.నరసింహారావు కార్యదర్శి పి.వి.ఎస్.కె. ప్రసాద్, వీహెచ్‌పీ అధ్యక్షుడు అశోక్‌సింఘాల్ తదితరులు వచ్చి... మహాస్వామితో పరిష్కారం కోసం చర్చలు జరుపుతూ ఉండేవారు. ఇక 1997లో అనుకుంటా... మేము కాశ్మీర్ యాత్రకు వెళ్లాం. ఆ సమయంలో అయోధ్యలో కొన్ని రోజులు ఉన్నాం. అప్పుడు రామ్‌లాలా (శ్రీరాముని విగ్రహం) తాత్కాలికంగా వేసిన టెంట్‌లో ఉండేవారు. "ఆయన భక్తులు అందరూ ఇళ్లు కట్టుకుంటున్నారు. ఆయనకు మాత్రం తాత్కాలిక నివాసమా? ఆయనకు కూడా ఒక గొప్ప ఇల్లు ఉంటే ఎంత బావుంటుంది?' అనే ఆలోచన కలిగింది. ఇప్పుడు ఆ ఆలోచన సాకారమై... ఒక గొప్ప దేవాలయం నిర్మాణమైనందుకు ఆనందంగా ఉంది.

రెండింటి సంబంధం..

ఇటీవల నేను కాశీ వెళ్లాను. అక్కడి నుంచి అయోధ్య, దాని నుంచి నైమిశారణ్యం వెళ్లా. దీని వెనకున్న అంతరార్థమేమిటో చెబుతా. 'శ్రుతి.. స్మృతి పురాణానం ఆలయం కరుణాలయం... నమామి భగవద్పాద శంకరం.. లోకశంకరం' అనే పద్యాన్ని మనం చదువుకుంటూ ఉంటాం. మనకు శృతులు ముఖ్యమే. స్మృతులు ముఖ్యమే. శృతులైన వేదాలకు కేంద్రం కాశీ. ఆ వేదాలు చెప్పిన విషయాలను ఆచరించి చూపించిన వారు రాములవారు. వారి కేంద్రం అయోధ్య. ఈ విధంగా ఈ రెండు మనకు ముఖ్యమైన కేంద్రాలు. ఇక ధర్మం గురించి పురాణాల ద్వారా తెలుసుకుంటూ ఉంటాం. నైమిశారణ్యంలో చక్రతీర్థం అనే ప్రదేశముంది. అది కూడా చాలా ముఖ్యమైనది. దీని గురించి పురాణాలలో ప్రస్తావన ఉంది. శృతి, స్మృతి, పురాణాలు- ఈ మూడింటికీ ప్రతీకగా రాముడిని, సీత అమ్మవారిని చెప్పుకోవచ్చు. ఈ మూడింటిలోను పేర్కొన్న- వీరం, విక్రమం, వినయం, విద్య, విశ్వాసం, వైరాగ్యం, వేదాంతం- ఈ గుణాలన్నింటికీ రాముల వారు ఉదాహరణ. ఆయన ధనుర్విద్యే కాకుండా అన్ని శాస్త్రాలను నేర్చుకున్నారు. ఎంత పరాక్రమశాలి అయినా అందరితోను వినయంగానే ఉండేవారు. భారతీయ ఆర్ష ధర్మంపై ఆయనకు అచంచలమైన విశ్వాసం ఉండేది. రాముల వారు ఒక సందర్భంలో- "ఆత్మానాం మానుషం మన్యే రామాంత శ్రద్ధాత్మజం" అంటారు. "నన్ను నేను ఒక మనిషిగానే చూస్తున్నాను.. నేను ఋషులకు సమానమైనవాడినని తెలుసుకోండి" అంటారు. పరాక్రమానికి ప్రతీకగా నిలిచి, అపరిమితమైన అధికారం ఉండి, దాన్ని ప్రదర్శించే అవకాశం ఉండి కూడా ఆయన తన గురించి తాను చెప్పుకున్న మాటలు అందరికీ ఆచరణీయాలు. అందుకే ఆయన రాజర్షి అయ్యారు. ఆయనలో లౌకికం ఉంది. ధార్మికం ఉంది. జ్ఞానం ఉంది. త్యాగం ఉంది. వీటి అవసరం ఈనాడు మనకు ఎంతయినా ఉంది.

> **మన ప్రార్థన, రాముల వారి కృప వల్ల, న్యాయాలయం చేసిన నిర్ణయం వల్ల భవ్య మందిరం నిర్మాణం జరుగుతోంది. ప్రాణ ప్రతిష్ఠకు ముహూర్తం పెట్టిన జ్ఞానేశ్వర శాస్త్రి ద్రావిడ మన దక్షిణ భారత దేశ మూలాలు ఉన్నవారే! ఆయన ముత్తాత లక్షణ శాస్త్రి పెద్ద స్వామివారిని కాశీకి తీసుకువెళ్లారు. తాత రాజేశ్వరిశాస్త్రి పెద్ద పండితుడు. అనేక విషయాలు పరిశీలించి.. ఉత్తర, దక్షిణ భారత దేశ శాస్త్రాల సమన్వయం చేసి మంచి ముహూర్తం పెట్టారు.**

కంచితో సంబంధం...

కంచితో అయోధ్యకు రకరకాలుగా సంబంధం ఉంది. దీనిలో మొదటిది మోక్ష సంబంధం. దక్షిణ దేశంలో ఉన్న ఏకైక మోక్షపురి కంచి. మిగిలిన మోక్ష క్షేత్రాలైన- అయోధ్య, మధుర, కాశీ, అవంతిక మొదలైనవన్నీ ఉత్తరదేశంలోనే ఉన్నాయి. ఆ విధంగా ఈ రెండింటికి క్షేత్ర సంబంధం ఉంది. ఇక రెండోది శక్తి సంబంధం. కంచి ఒక శక్తి పీఠం. శివ క్షేత్రాలలో శివకంచిలోని ఏకాంబరేశ్వరుడిది పృథ్వీ క్షేత్రం. మూడోది కులదేవతా సంబంధం. సూర్యవంశ కులదేవత- దేవకాళి. దశరథ మహారాజుకు కలలో కనిపించి- కంచిలోని కామాక్షి అమ్మవారిని దర్శిస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందని ఆదేశిస్తుంది. దానితో దశరథ మహారాజు సకుటుంబంగా కంచికి వచ్చి వారం రోజులు ఉండి, క్షేత్ర నియమాలు అన్నీ పాటించి.. "కామాక్షి తీర్థమోవర్ణః సర్వమంగళ హేతువాః" అని ప్రస్తుతిస్తాడు. దీనికి సంబంధించిన విషయాలు 'లలితోపాఖ్యానం'లో మనకు కనిపిస్తాయి. ఆ తర్వాతే దశరథుడు పుత్రకామేష్టి యాగం చేస్తాడు. ఇన్ని సంబంధాలు ఉన్నాయి కాబట్టే- గత ఏడాది ఆగస్టులో జరిగిన భూమి పూజకు కంచి నుంచి మృత్తికలు పంపించాం. వాటితో పాటుగా- 'జయ, నంద, భద్ర, రిక్త, పూర్ణ' దేవతల కోసం ఐదు బంగారు కాసులు పంపాం. వీటన్నింటినీ భూమి పూజలో వినియోగించారు. ఏది ఏమైనా... ఎట్టకేలకు అయోధ్య రామమందిరం కథ కంచికి చేరింది. ఇది అందరి మంచి కోసమే!

సమన్వయం..

మన దేశ సంస్కృతి ఒకటైనా కాలచక్రంలో శీతోష్ణం, ఆర్థిక వికాసం చాలా ముఖ్యమైన పాత్ర వహిస్తాయి. ఉత్తర దేశం వారి వద్ద నిష్ఠ ఉంది. మన దగ్గర నియమాలు ఉన్నాయి. వారి వద్ద నిధి ఉంది. మన వద్ద నిర్వహణ ఉంది. వీటిని సమన్వయపరిచి ముందుకు వెళ్లటమే మానవ ధర్మం. కొన్ని నెలల క్రితం అయోధ్య వెళ్లినప్పుడు... అక్కడ భక్తుల కోసం వివిధ రాష్ట్రాల వారు నిర్మించిన భవనాలు, ఆశ్రమాలను చూశాం. మన దక్షిణ దేశంలో కూడా రాములవారితో సంబంధమున్న అనేక ప్రాంతాలు ఉన్నాయి. కర్ణాటకలో కిష్కింధ ఉంది. గోదావరీ తీరంలో ఆయన సంచరించాలనేది లోకప్రసిద్ధం. తమిళనాడులోని రామేశ్వరంలో ఆయన శివలింగాన్ని ప్రతిష్ఠించారని పురాణాలు చెబుతున్నాయి. కంచిపీఠం 59వ పీఠాధిపతి- భగవన్నామబోధేంద్ర సరస్వతి స్వామి 'రామనామ' జపాన్ని ఒక స్ఫూర్తిగా నెలకొల్పారు. ఆయన జన్మించిన గోవిందపురమనే ప్రాంతంలో ఇప్పటికీ రామనామ దీక్ష తీసుకుంటూ ఉంటారు. ఇలా మనకు రామ భావనతో ఎప్పటి నుంచో సంబంధం ఉంది. ఇప్పుడు క్షేత్రంతో మరింత బలోపేతమవుతోంది. యజ్ఞయాగాదులు, వేద స్వస్తిలకు మన వారు పెట్టింది పేరు. అయోధ్య దివ్య క్షేత్రాన్ని లౌకికంగా చాలా బాగా తీర్చిదిద్దుతున్నారు. అన్ని వసతులు కల్పిస్తున్నారు. దీనితో పాటుగా- అయోధ్య ధర్మప్రచారానికి, శాస్త్ర ప్రచారానికి ఒక వేదిక కావాలి. చుట్టు పక్కల ఉన్న ప్రాంతాలన్నీ ప్రభావితం కావాలి. కనీసం 500 గుళ్లకైనా మేలు జరగాలి. ప్రజలు ప్రభావితం కావాలి. కొత్త సౌకర్యాలు ప్రాచీన శాస్త్ర సంపదతో సంతులనం కావాలి. దక్షిణ బుద్ధి, ఉత్తర శక్తి కలిసి పనిచేయాలి. అలా చేస్తేనే- దేశానికి, ధర్మానికి మంచి జరుగుతుందని అందరూ గ్రహించాలి. అలా జరిగిన నాడు భారత దేశం, ఆర్ష ధర్మం ప్రపంచానికి గురువు అవుతుంది. చక్రవర్తిగా నిలుస్తుంది.

సంభాషణ: **సీవీఎల్ఎన్ ప్రసాద్**

పురుషోత్తముడైన శ్రీరామచంద్ర ప్రభువు అంటే పరమ దైవం, పరమ సత్యం. ఆయన ఓటమి ఎరుగని ధీరోదాత్తుడు. తన వీరోచిత లీలలను విని, శ్లాఘించే అవకాశాన్ని మనందరికీ కల్పించేందుకే భగవంతుడు యుగయుగానా ఈ లోకంలో అవతరిస్తాడు. అలా అవతరించినప్పుడు... తన నిత్య సహచరులను, తన శాశ్వత ధామమైన అయోధ్యను ఈ లోకానికి తీసుకువస్తారు. మనం మన కంటితో చూసే ఈ భూలోకంలోని అయోధ్య.. ఆధ్యాత్మిక జగత్తులోని ఆ అయోధ్యకు భిన్నమైనది కాదు. అది అనేక శాస్త్రాల్లో వర్ణించిన శాశ్వతమైన భగవత్సన్నిధానం. వాస్తవానికి వివిధ శాస్త్రాల్లో అయోధ్య గురించి ఉన్న ఆధారాలు సర్వోన్నత న్యాయస్థానాన్ని సైతం కదిలించి, అయోధ్య వివాదానికి ఒక ముగింపు తేవడంలో ప్రముఖ పాత్ర పోషించాయి. శ్రీరాముడు ఈ భూలోకంలో తన అవతారాన్ని ముగించుకొని, తిరిగి తన స్వధామానికి వెళ్ళిన తరువాత... అయోధ్యవాసులందరూ కూడా ఆధ్యాత్మిక లోకానికి తిరిగి వెళ్లారని శాస్త్రాలు వివరించాయి. అలా శ్రీరాముని దివ్య లీలల్లో భాగస్వాములైనవారందరూ ఆయన అనుగ్రహానికి పాత్రులయ్యారు.

రామలీలలో మనమూ భాగమే!



భగవంతుడు తన ధామానికి తిరిగి వెళ్ళిన తరువాత... ఈ భూలోకంలో ఆయన లీలలు ముగిసిపోయాయని కాదు. భగవంతుడు శాశ్వతుడైనట్టు ఆయన లీలలు సైతం శాశ్వతమైనవి. నేటికీ ఎవరు అయోధ్యకు వెళ్ళినా, శ్రీరాముడి మూర్తిని దర్శించినా, ఆయన దివ్య నామాన్ని జపించినా... భగవంతుడి ప్రత్యక్షానుభూతిని పొందగలరు.

సకృదేవ ప్రపన్నో యస్తవాస్మీతి చ యాచతే
అభయం సర్వదా తస్మై దదామి ఏతద్ వ్రతం మమ...


"ఎవరైనా నన్ను ఒక్కసారైనా నిజంగా శరణువేడి "స్వామీ! ఈ రోజు నుంచి నేను నీ వాడిని" అంటూ తనకు అభయాన్ని ప్రసాదించాలని ప్రార్థిస్తే... ఆ వ్యక్తికి ఆ క్షణం నుంచీ అభయాన్నిచ్చి, సర్వదా రక్షిస్తాను" అని 'శ్రీమద్రామాయణం'లో శ్రీరాముడు ప్రకటించాడు. అయోధ్యలో గొప్ప ఆలయాన్ని నిర్మించే ఈ అద్భుత ఘట్టంలో ఎంతోమంది భక్తులు చురుగ్గా పాల్గొన్నారు. ఇది భగవంతుడి అనుగ్రహం. తన లీలలో భాగమయ్యే గొప్ప అవకాశాన్ని మనకు ఇప్పటికీ ఆయన ప్రసాదిస్తూనే ఉన్నాడు. ఆలయ నిర్మాణం కోసం పోరాడినవారు, సమయాన్ని వెచ్చించినవారు, ధనసహాయం చేసినవారు, న్యాయస్థానాల్లో కేసు వాదించినవారు, ఆలయం కోసం సమాజంలో గళమెత్తి నినదించినవారు, పోరాటంలో ప్రాణాలు కోల్పోయినవారు, ఆలయానికి అనుకూలంగా మద్దతు కూడగట్టినవారు, రాముని సేవల్లో ఎంతో కొంత పాలు పంచుకున్నవారు... వీరందరూ ఆయన లీలలో భాగమే. శ్రీరాముడు తనకు హనుమంతుడు చేసిన సేవనూ గుర్తించాడు, చిన్న ఉడత చేసిన సేవనూ గుర్తించాడు. నిజానికి పరమేశ్వరుడైన శ్రీరాముడికి ఎవరి సాయం అవసరం లేదు. కానీ ఎవరైనా భక్తుడు తనకు కొంత సేవ చేయాలనుకుంటే మాత్రం తప్పకుండా అనుగ్రహిస్తాడు. ప్రస్తుత రామలీలలో భాగమైన వారందరూ ఎంతో భాగ్యవంతులు.

తన భక్తులను సకల కష్టాల నుంచి విముక్తం చేసి... శాశ్వతమైన స్థానాన్ని అందించడమే భగవంతుడి సంకల్పం. ఆది, అంతం అంటూ లేని సుదీర్ఘ కాలమానంతో పోలిస్తే... ఈ కొన్ని దశాబ్దాల సమయం ఏపాటిది! అటువంటి శాశ్వతమైన స్థానాన్ని చేరుకోవడమే అతి పెద్ద విజయం. మనకు సాధ్యమైనా, కాకపోయినా... శ్రీరామచంద్రుడు ఎల్లప్పుడూ అయోధ్యలోనే ఉంటాడు. ఆయనను దర్శించి, అర్చించే అవకాశం లభించడం మన అదృష్టం.

ఎందరో భక్తుల విశేష కృషి ఫలితంగా ఈ రోజు యావత్ ప్రపంచం అయోధ్యలో భవ్య రామమందిర నిర్మాణాన్ని చూడగలుగుతోంది. అది ఈ లోకంపై భగవంతుడు చూపిన విశేషమైన అనుగ్రహం. ఇది ప్రపంచమంతటా ఒక నూతన స్వర్ణయుగానికి నాంది పలుకుతుంది. హరేకృష్ణ ఉద్యమ సంస్థాపకాచార్యులైన శ్రీలీల ప్రభుపాదులు భగవంతుడి నామాలను జపించడం ద్వారా... శ్రీరాముడి లేదా శ్రీకృష్ణుడి ప్రత్యక్షానుభూతిని మనమంతా పొందగలమని చెప్పారు.

హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే
హరే రామ హరే రామ రామ రామ హరే హరే

ఎవరైనా ఈ మహా మంత్రాన్ని బిగ్గరగా జపించి... ఈ ధ్వని ప్రకంపనలను శ్రద్ధగా వింటే... మనస్సులోని ప్రతికూలతలన్నీ తొలగిపోయి, జీవితంలో దివ్యమైన ఆనందాన్ని పొందుతారు. ఇది ఈ యుగానికి ఉన్న గొప్ప వరం. అయోధ్యలో శ్రీరామచంద్ర మూర్తి ప్రాణప్రతిష్ఠ జరిగిన రోజు నుంచీ ఈ మహా మంత్రాన్ని జపించాలనే సంకల్పాన్ని భక్తులందరూ చేసుకోవాలి. జీవితంలో ఆనందదాయకమైన పరివర్తనకు అది ఒక గొప్ప ఆరంభం అవుతుంది.



శ్రీసత్యగౌర చంద్ర దాస ప్రభూజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్, హైదరాబాద్,
9396956984

మర్యాద పురుషోత్తముడు

అది 2000 సంవత్సరం మార్చి ఇరవై ఒకటి. తన జన్మదినోత్సవ ధన్యవాద కార్యక్రమంలో... నాటి ఉప ప్రధాని ఎల్.కె.అద్వానీ సమక్షంలో శ్రీమాతాజీ నిర్మలా దేవి మాట్లాడుతూ అయోధ్యే శ్రీరాముని జన్మస్థలమనీ, అప్పటి మసీదు ఉన్న స్థలమే అలనాడు శ్రీరాముడు నివసించిన పుణ్యస్థలి అనీ, ఎప్పటికైనా అర్హత కలిగిన ఆధ్యాత్మికవేత్తల ద్వారా అక్కడ శ్రీరామ మందిర పునరుద్ధరణ జరుగుతుందనీ చెప్పారు. అది సాకారమైంది. ఈ నెల 22న అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠాపన సుదినం. ఇది ఒక అపురూపమైన, చారిత్రకమైన ఘట్టం. ఇది శ్రీరాముడు, రామరాజ్యాల విశిష్టతలను మననం చేసుకోవాల్సిన సమయం.

శ్రీరాముడి గుణగణాలను, లక్షణాలను, ఆయన వ్యక్తిత్వం నుంచి మనం నేర్చుకొని, అంతర్గతంగా స్థిరపరచుకొని, వ్యక్తీకరించుకోవలసిన ఆవశ్యకతను శ్రీమాతాజీ నిర్మలాదేవి పలు సందర్భాల్లో విశదీకరించారు. శ్రీరాముడు పుడమిపై అవతరించినప్పుడు... విశ్వవిరాట్‌లో హృదయచక్రం అభివృద్ధి చెందడానికి ఆ ఆవిర్భావం దోహదపడింది. త్రేతాయుగంలో రాక్షసుల నుంచి, దుష్ట శక్తుల నుంచి తన భక్తులను, ప్రజలను రక్షించుకోవడానికి శ్రీమహావిష్ణువు ఎత్తిన అవతారమే శ్రీరాముడు. అయితే తానొక అవతార పురుషుణ్ణని ఆయన ఎక్కడా చెప్పలేదు. తన తల్లితండ్రులకైనా తెలియనివ్వలేదు. శ్రీరామ జననం తరువాతనే రాజుల రాజ్యాధిపత్యం మొదలై... అన్నిటికన్నా మిన్నగా ప్రజాభీష్టానికి ప్రాధాన్యం ఇవ్వడం ఆరంభమయింది. ప్రజల కోసం, మానవాళి అభ్యున్నతి కోసం రాజు మంచితనాన్ని, ప్రేమతత్వాన్నీ కలిగి ఉండాలి. నాయకుడైన రాజు ఎంత త్యాగాన్నయినా చెయ్యడానికి సిద్ధపడాలి. అది శ్రీరాముడితోనే ప్రారంభమయింది. నాటి సమస్త ప్రజానీకం కోరుకున్న సత్ప్రవర్తన, మంచితనం శ్రీరామునిగా అవతరించాయి. వాటి గురించి కేవలం చెప్పడమే కాకుండా... ఆచరించి చూపించిన రాజు శ్రీరాముడు. ఎప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ తండ్రిగా, భర్తగా, కుమారుడిగా, రాజుగా ఆయన ఆదర్శప్రాయుడు. చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవడం రాముడి సుగుణాలలో ఒకటి. ఈ లక్షణాలను మనలో స్థిరపరుచుకోవాలి. ఇచ్చిన మాటను ఏవేవో కుంటిసాకులు చెప్పి తప్పించుకోకూడదు. ఆయనలోని మరో సుగుణం... అవతలివారి హృదయాన్ని నొప్పించకపోవడం. ఎవరినైనా ప్రేమించి, వారిని అర్థం చేసుకున్నట్టయితే... సంకోచం అంటే ఏమిటో మనకు బోధపడుతుంది. ఆ సంకోచతత్వాన్ని శ్రీరాముని జీవితం నుంచి మనం అలవరచుకోవాలి. ఎవరితో ఎప్పుడు, ఎలా సంభాషించాలో ఆయన నుంచి నేర్చుకోవాలి. తన పరిమితులు, హద్దులు శ్రీరాముడికి బాగా తెలుసు. ఆయన వాటిని ఎప్పుడూ అతిక్రమించలేదు.



మానవుల అంతర్గత సూక్ష్మ శరీరంలో ప్రతి అవయవంలో, చక్రాలలో, నాడులలో సకల దేవీ దేవతలు కొలువై ఉన్నారు. కుండలినీ జాగృతి ద్వారా ఆత్మసాక్షాత్కారం పొందినప్పుడు... వారి లక్షణాలను మనం సంతరించుకోవచ్చు. సీతాసమేతుడైన శ్రీరాముడు మన హృదయంలోని కుడిపార్శ్వం వైపు ఆసీనుడై ఉంటాడు. ఆత్మసాక్షాత్కారం పొంది... సహజ యోగ సాధన చేస్తున్న వారిలో మర్యాద పురుషోత్తముడిగా, ఆదర్శవంతమైన తండ్రిగా శ్రీరాముని లక్షణాలు జాగృతి చెంది ప్రతిబింబిస్తూ ఉంటాయి. శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం సందర్భంగా.. మన ఇళ్ళలో, హృదయాల్లో శ్రీరామజ్యోతిని వెలిగించుకుందాం. ఆయన ఆదర్శాలను పాటించి... శ్రీరామ రాజ్యానికి దోహదం చేద్దాం.



డాక్టర్ పి. రాకేష్
8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్',
తెలంగాణ

రామమందిరం
దైవసంకల్పం

అయోధ్యలో శ్రీరామ జన్మందిర ప్రతిష్ఠాపనకు దేశం సిద్ధమవుతున్న వేళ.. ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న కల సాకారం కాబోతోంది. ఒక చారిత్రక ఘట్టం ఆవిష్కృతమవుతున్న వేళ.. దానికి దారితీసిన సంఘటనల సమాహారం నా మదిలో మెదులుతోంది.

రామజన్మభూమి-బాబ్రీమసీద్ వివాదానికి సంబంధించి కంచి శంకరాచార్య శ్రీ జయేంద్రసరస్వతికి, ప్రముఖ ముస్లిం నాయకులకు మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాక... 2002 వేసవిలో, అప్పటి విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు అశోక్ సింఘాల్ మా బెంగళూరు ఆశ్రమానికి వచ్చారు. నాటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి నిర్ణయాత్మకంగా వ్యవహరించి... రామమందిర నిర్మాణానికి మార్గం సుగమం చేయాలనేదే ఆ సమయంలో అశోక్‌జీ ఏకైక లక్ష్యం. అయితే ఆయన డిమాండ్లు కొన్ని అప్పటి సంకీర్ణ ప్రభుత్వానికి సారథ్యం వహిస్తున్న వాజ్‌పేయికి ఆచరణసాధ్యంకానివిగా ఉన్నాయి. దీర్ఘకాలికమైన ఈ వివాదాన్ని శాంతియుతంగా, సామరస్యంగా పరిష్కరించే పని ఆయన నాకు అప్పగించారు. దానికోసం ముస్లిం నాయకులతో, ప్రముఖులతో వరుస చర్చలు ప్రారంభించాను. అదంతా వేరే కథ. ఆసక్తికరమైన విషయమేంటంటే.. ఆ సమయంలో... ముఖ్యంగా అయోధ్య విషయంలో అశోక్‌జీ చేపట్టిన ఆమరణ నిరాహారదీక్షను వాజ్‌పేయి బలవంతంగా విరమింపజేసినప్పటినుంచీ... అశోక్‌జీకీ, ప్రధానికీ మధ్య మాటలు లేవు. కాబట్టి రామజన్మభూమి సమస్యను వెంటనే పరిష్కరించేలా చట్టాన్ని ప్రవేశపెట్టడానికి వాజ్‌పేయిని ఒప్పించాలని నన్ను అడిగేందుకు ఆయన మా ఆశ్రమానికి వచ్చారు. "ఈ ప్రయత్నంలో ప్రభుత్వం పడిపోయినా నేను పట్టించుకోను" అని ఆయన అన్నారు. అప్పటికి అశోక్ సింఘాల్ వయస్సు డెబ్బయ్యారేళ్ళు. "ఏనాటికైనా మందిర నిర్మాణం జరుగుతుందా? దాన్ని నా జీవితకాలంలో చూడగలనా?" అని నన్ను ప్రశ్నించారు. "ప్రార్థన చెయ్యండి. మీ నిబద్ధతతో.. అన్నీ సాధ్యమే" అని ఆయనతో నేను చెప్పిన మాట ఇంకా నాకు గుర్తుంది. అర్ధమనస్కంగానే అశోక్‌జీ అక్కడినుంచి నిష్క్రమించారు.

మరునాటి ఉదయం నేను ధ్యానం చేస్తుండగా... శిథిలావస్థలో ఉన్న దేవీ ఆలయం, కోనేరు నాకు కనిపించాయి. వాటిని పునరుద్ధరించవలసిన అవసరం ఉందనిపించినా... ఆ సమయంలో పెద్దగా పట్టించుకోలేదు. కొన్ని రోజుల అనంతరం తమిళనాడు నుంచి వృద్ధుడైన నాడీ సిద్ధాంతి మా ఆశ్రమానికి వచ్చి నన్ను కలిశారు. ఆయన పురాతన తాళపత్రాలను తీసి చదువుతూ "గురుదేవ్! రామజన్మభూమి సమస్య పరిష్కారం కోసం ఇరువర్గాలనూ ఒప్పించడంలో మీరు పాత్ర పోషించవలసి ఉంటుందని (తాళపత్రాలలో) రాసి ఉంది" అని అన్నారు. అంతేకాదు, "శ్రీరాముని కులదైవమైన దేవకాళి ఆలయం అక్కడ నిర్లక్ష్యానికి గురైందని కూడా ఈ పత్రాలు చెబుతున్నాయి. దాన్ని పునరుద్ధరించనంతవరకూ... అయోధ్య రామమందిరం చుట్టూ అల్లుకున్న హింస, కలహాలు ఆగవు" అని కూడా అన్నారు.

అలాంటి దేవాలయం ఒకటి అక్కడ ఉన్నదనే విషయం అప్పటివరకూ నాకు కానీ, ఆ నాడీ సిద్ధునికి గానీ తెలీదు. అప్పుడిక అయోధ్యలో కాళీ మందిరాలు ఎక్కడెక్కడ ఉన్నాయో విచారించాం. రెండు ఉన్నాయని తెలిసింది. ఒకటి 'ఛోటీ దేవకాళీ మందిర్'. అది అయోధ్య నడిబొడ్డున ఉంది. రెండవది 'దేవకాళీ మందిర్'. అక్కడకు కొంచెం దూరంలో... శిథిలావస్థలో ఉంది. కోనేరు చెత్తతో నిండిపోయి ఉంది. ఢిల్లీ, లక్నోల్లోని మా కార్యకర్తలను సంప్రతించాను. ఆ దేవాలయాన్నీ, కోనేటినీ పునరుద్ధరించాలని సూచించాను. సెప్టెంబర్ రెండోవారానికల్లా వారు ఆ పనిని విజయవంతంగా పూర్తి చేశారు. సెప్టెంబర్ 18న మరికొందరితో కలిసి అయోధ్య చేరుకున్నాను. ఆ మర్నాడు దేవకాళీ ఆలయ పునఃప్రతిష్ఠ జరిగింది. మరో చిత్రమేమిటంటే... దేవకాళీ ప్రాణప్రతిష్ఠ జరిగినప్పటి నుంచి అయోధ్యలో ఏ విధమైన రక్తపాతం, మతకలహాలు, కొట్లాటలు జరగలేదు. అశోక్ సింఘాల్ కూడా ఆ రోజు కార్యక్రమంలో పాల్గొన్నారు. అప్పటికి కూడా అయోధ్య వివాదం పరిష్కారానికి మరో పద్నాలుగు సంవత్సరాలు పడుతుందనే అనిపించింది.

ఆనాటి సాయంత్రం... దేవకాళీ ఆలయ ప్రాంగణంలో జరిగిన సంత్ సమాగమానికి హిందూ, సూఫీ సాధువులను ఆహ్వానించాం. నేను ముస్లిం నాయకులను సత్కరించినప్పుడు... వారు నాకు తులసీ రామాయణాన్ని, ఖురాన్ ప్రతినీ అందించారు. శ్రీరామునిపట్ల తమకున్న ప్రగాఢ భక్తి గురించి మాట్లాడారు. అపూర్వమైన సోదర భావం వారిలో వ్యక్తమయింది. ఎంతోకాలంగా సాగుతున్న ఆ సంఘర్షణలో అప్పటికే చాలా రక్తపాతం జరిగింది. ఇప్పుడు కాలపరీక్షను తట్టుకొని నిలబడగలిగే సరైన నిర్ణయం తీసుకోవడం అవసరం. దాన్ని దృష్టిలో ఉంచుకొని... కోర్టు వెలుపల పరిష్కారం జరిగేలా... రామజన్మభూమిని ముస్లిం సమాజమే హిందువులకు బహుమతిగా ఇవ్వాలనీ, దానికి ప్రతిగా హిందువులు వారికి అయిదెకరాల భూమి బహుమతిగా ఇవ్వాలనీ నేను 2003లో ప్రతిపాదించాను.



సంవత్సరాలు గడిచాయి. 2017లో... ఇరువర్గాల నాయకుల భావాలు, వాటికి తోడు సర్వోన్నత న్యాయస్థానం సూచనలతో... రామజన్మభూమి విషయంలో మధ్యవర్తిత్వం వహించడానికి నా ప్రయత్నాలు మళ్ళీ ప్రారంభించాను. అంతిమంగా... రామమందిర నిర్మాణానికి ఆ భూమిని కేటాయిస్తూ, మసీదు నిర్మాణానికి అయిదు ఎకరాలను కేటాయిస్తూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. అయిదువందల ఏళ్ళ వివాదం శాంతియుతంగా పరిష్కారమైన ముఖ్యమైన సందర్భం అది. అశోక్ సింఘాల్ సంకల్పదీక్ష, మోడీ దార్శనికత, కోట్లాది భారతీయుల చిత్తశుద్ధితో కూడిన ప్రార్థనలు, దైవాశీస్సులు... ఇవన్నీ కలిసి ఈనాటి చారిత్రక క్షణానికి దారితీశాయి.

చాలాసార్లు స్థూలంగా మనకు కనిపించే విషయాలకు సూక్ష్మమైన అంశాలు ఆధారభూతంగా ఉంటాయి. భౌతికంగా వ్యక్తమవడానికి ముందుగానే ఈ సంఘటనలు సూక్ష్మ స్థాయిలో జరుగుతాయి. మనమేమో ఈ పని ఇలా జరగడానికి ఫలానాది కారణమని (కార్యకారణ సిద్ధాంతాన్ని) చర్చిస్తూ... స్థూల ప్రపంచంలోనే తిరుగుతూ ఉంటాం. ఎప్పుడో తప్ప అంతకుమించి ఆలోచించం. అలా ఆలోచించినట్టయితే.. సూక్ష్మ స్థాయిలో పనిచేసే శక్తులు... స్థూలంగా జరిగే కార్యాల మీద గణనీయమైన ప్రభావాన్ని చూపిస్తాయని గ్రహించి ఉండేవాళ్ళం. మన జీవితంలోని అనేక విచిత్రాల్లో ఇది మరొక చిత్రమైన రహస్యం.

• గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్

ధనుష్, నాగార్జున కలయికలో...



విలక్షణ నటుడు ధనుష్, టాలీవుడ్ మన్మథుడు అక్కినేని నాగార్జున కలయికలో ఓ భారీ మల్టీస్టారర్ రూపొందుతోంది. ఈ చిత్రానికి శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ, అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ బేనర్స్‌పై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్‌రావు నిర్మిస్తున్నారు. సోనాలీ నారంగ్ సమర్పకులు. గురువారం పూజా కార్యక్రమాలతో లాంఛనంగా చిత్రీకరణ ప్రారంభించారు. ధనుష్‌పై కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: నికేత్ బొమ్మి. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడించనున్నారు.

అన్ని హంగులతో భైరవకోన

సందీప్ కిషన్




ఫిబ్రవరి 9న దెయ్యాలూ, భూతాలూ, మ్యాజిక్కు, మంచి హ్యూమర్, పాటలు, బోలెడంత యాక్షన్ ఉన్న చిత్రాన్ని ప్రేక్షకులు చూడబోతున్నారు. 'ఊరు పేరు భైరవకోన' చిత్రం ఇలా వాణిజ్య హంగులు, చక్కని వినోదంతో ముస్తాబైంది' అని సందీప్ కిషన్ అన్నారు. ఆయన కథానాయకుడిగా వీఐ ఆనంద్ దర్శకత్వం వహించిన చిత్రమిది. అనిల్ సుంకర సమర్పణలో రాజేశ్ దండా నిర్మించారు. గురువారం చిత్రబృందం ట్రైలర్ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా సందీప్ కిషన్ మాట్లాడుతూ 'రెండున్నరేళ్ల పాటు బాధ్యతగా ఈ చిత్రం కోసం పని చేశాం. ప్రేక్షకులకు ఒక అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తాం. 'నిజమేనే చెబుతున్నా' పాటను ప్రేక్షకులు గొప్పగా ఆదరించారు' అని చెప్పారు. వీఐ ఆనంద్ మాట్లాడుతూ "ఊరు పేరు భైరవకోన' నా కెరీర్‌లో ఛాలెంజింగ్ ప్రాజెక్ట్. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని, ఎక్సయిట్‌మెంట్‌ను ఇస్తుంది' అని తెలిపారు. రాజేశ్ దండా మాట్లాడుతూ 'మంచి ప్రేమకథ, ఫాంటసీ, కామెడీ, యాక్షన్ ఇలా అన్ని ఎలిమెంట్స్ ఈ సినిమాలో ఉన్నాయి' అని తెలిపారు.

వారిద్దరికీ మా కుటుంబం ఎంతో రుణపడి ఉంటుంది

- నందమూరి మోహనకృష్ణ



ఎన్టీఆర్ మన మధ్య లేకపోయినా ఆయన ఆశీస్సులు ఎప్పుడూ మనతోనే ఉంటాయి. వజ్రాన్ని కూడా సాన పట్టాలి .అలా 'మనదేశం' సినిమాలో నాన్నగారికి అవకాశం ఇచ్చి నటుడిగా మెరుగులు దిద్దిన దర్శకుడు ఎల్వీ ప్రసాద్‌గారికీ, నిర్మాత కృష్ణవేణిగారికి మా కుటుంబం ఎంతో రుణపడి ఉంటుంది' అన్నారు నందమూరి మోహనకృష్ణ. ఎన్టీఆర్ వర్థంతి సందర్భంగా ఆయన నటించిన తొలి చిత్రం 'మనదేశం' చిత్రం 75 వసంతాల వేడుకలు గురువారం హైదరాబాద్ ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్‌లో జరిగాయి. ఎన్టీఆర్ సెంటినరీ సెలబ్రేషన్స్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 'మనదేశం' చిత్ర నిర్మాత కృష్ణవేణి, దర్శకుడు ఎల్వీ ప్రసాద్ తనయుడు రమేశ్‌ప్రసాద్, ఆ చిత్రాన్ని పంపిణీ చేసిన పూర్ణా పిక్చర్స్ అధినేత విశ్వనాథ్‌లను సత్కరించారు. సెలబ్రేషన్స్ కమిటీ చైర్మన్ జనార్థన్ మాట్లాడుతూ 'నలభై ఏళ్ల తర్వాత దేశానికి ఎలాంటి అవసరాలు ఉంటాయో ఊహించి ముందే చెప్పిన గొప్ప దూరదృష్టి కలిగిన నాయకుడు ఎన్టీఆర్. నటుడిగా ఆయన గొప్పతనం గురించి ప్రపంచ ప్రజలందరికీ తెలుసు' అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత ఆదిశేషగిరిరావు, నిర్మాతలమండలి కార్యదర్శి ప్రసన్నకుమార్, హైదరాబాద్ మింట్ తరపున శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





దిక్సూచి DIKSUCHI

మానవ విసర్జక వ్యవస్థ

టీఎస్‌పీఎస్సీ ప్రత్యేకం: బయాలజీ

మూత్రం ఏర్పడే విధానం

మూత్రపిండంలో మూత్రం ఏర్పడే విధానాన్ని మూడు దశలుగా విభజించవచ్చు. అవి... సూక్ష్మగాలనం, నాళికాయుత పునఃశోషణ, నాళికా స్రావం.

సూక్ష్మగాలనం: మొదటి దశలో రక్త నాళికాగుచ్ఛంలో ఉండే రక్తం వడపోతకు గురై భౌమన్స్ గుళికలోకి చేరుతుంది. ఈ విధానాన్నే సూక్ష్మగాలనం లేదా రక్తనాళికా గుచ్ఛగాలనం అంటారు. అభివాహి ధమనిక కలిగించే పీడనం వలన రక్త కేశ నాళికాగుచ్ఛంలోకి వడపోతకు గురైన రక్తం చేరుతుంది. గుచ్ఛగాలనం ద్వారా ఏర్పడిన ద్రవాన్ని గాలిత ద్రవం లేదా ప్రాథమిక మూత్రం అంటారు. ప్రాథమిక మూత్రంలో వ్యర్థ పదార్థాలు, పోషకపదార్థాలు, నీరు ఉంటాయి. ప్రాథమిక మూత్రం రసాయనికంగా రక్తంతో సమానం. దీనిలో కణాలు ఉండవు. ఆరోగ్యవంతమైన మానవుడిలో నిమిషానికి దాదాపు 125 మి.లీ. ప్రాథమిక మూత్రం ఏర్పడుతుంది.

నాళికాయుత పునఃశోషణ: దీనినే వరణాత్మక పునఃశోషణ అంటారు. ఈ దశ సమీపస్థ సంవళిత నాళికకు, వ్యాసారెక్టాకు మధ్య జరుగుతుంది. సమీపస్థ సంవళిత నాళికకు మరోపేరు పూర్వ సంవళిత నాళిక. వ్యాసారెక్టా అంటే నెఫ్రాన్ నాళిక చుట్టూ విస్తరించి ఉండే వల లాంటి రక్త కేశ నాళికల సమూహం. దీనిని పరినాళికా రక్త కేశ నాళికలు అంటారు. ప్రాథమిక మూత్రం సమీపస్థ సంవళిత నాళాన్ని చేరినప్పుడు 75 శాతం నీరు పునఃశోషణం చెందుతుంది. ప్రాథమిక మూత్రంలో ఉపయోగ పదార్థాలైన గ్లూకోజ్, అమైనో ఆమ్లాలు, పొటాషియం, కాల్షియం, సోడియం క్లోరైడ్ మొదలైనవి సమీపస్థ సంవళిత నుంచి వ్యాసారెక్టాలోకి శోషింపబడతాయి.

నాళికా స్రావం: ఈ దశ వ్యాసారెక్టాకు, దూరాగ్ర సంవళిత నాళానికి మధ్య జరుగుతుంది. సమీప సంవళిత నాళంలో పునఃశోషణ తరవాత మూత్రం హెన్లీశిక్యం ద్వారా దూరాగ్ర సంవళితనాళంలోకి చేరుతుంది. వ్యాసారెక్టా నుంచి దూరాగ్ర సంవళితనాళంలోకి ప్రవేశించిన పదార్థాలు యూరియా, యూరికామ్లం, క్రియాటిన్, క్రియాటినైన్, సోడియం, పొటాషియం, క్లోరైడ్, హైడ్రోజన్ అయాన్లు మూత్ర గాఢతను, pHను నియంత్రిస్తాయి. ఈ విధంగా అధిక గాఢత గల మూత్రం ఏర్పాటులో హెన్లీ శిక్యం, సంగ్రహణ నాళాలు ప్రధాన భూమికను పోషిస్తాయి. హెన్లీశిక్యం ఆరోహ/ప్రాం తంలో ఉన్న మూత్రం నుంచి 10 శాతం నీరు ద్రవాభిసరణ ద్వారా దానిని ఆవరించి ఉన్న కణజాలంలోకి శోషింపబడుతుంది. సంగ్రహణ నాళంలో వాసోప్రెస్సిన్ హార్మోన్ సహాయంతో నీటి పునఃశోషణ జరిగి మూత్రం అతి గాఢతను పొందుతుంది. గాఢతలో గరిష్ఠ స్థాయికి చేరిన ఈ ద్రవమే మూత్రం. రక్తం కంటే మూత్రం అధిక గాఢతలో ఉంటుంది.



మూత్ర పిండం మార్పిడి

దీర్ఘకాలికంగా కిడ్నీలు పనిచేయని వారికి మూత్రపిండ మార్పిడి ప్రక్రియను చేపడతారు. 1954లో చార్లెస్ హాఫ్‌నగెల్(అమెరికా) అనే వైద్యుడు మొట్ట మొదట మూత్ర పిండ మార్పిడికి రూపకల్పన చేశాడు. మనదేశంలో 1971 డిసెంబరు 1 వేలూరు(తమిళనాడు)లోని క్రిస్టియన్ మెడికల్ కళాశాలలో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేశారు.

మూత్ర సంఘటన

ఆరోగ్యవంతమైన మానవుడు ప్రతి రోజూ 1 నుంచి 1.8 లీటర్ల మూత్రాన్ని విసర్జిస్తాడు. దీని తోపాటు 25 నుంచి 30 గ్రాముల యూరియా కూడా విసర్జితమవుతుంది. రక్తంలోని హిమోగ్లోబిన్ విచ్ఛిన్నమైనప్పుడు ఏర్పడే యూరోక్రోమ్ అనే పదార్థం కారణంగా మూత్రం పసుపు రంగులోకి మారుతుంది. యూరియా విచ్ఛిన్నం చెంది అమ్మోనియా ఏర్పడటం వలన మూత్రం మొదట ఆమ్లయుతంగా(pH=6.0) ఉన్నప్పటికీ క్రమంగా క్షారయుతంగా మారుతుంది. మూత్రంలో 96 శాతం నీరు, 2.5 శాతం కర్బన పదార్థాలు(ఆక్సలేట్స్, హార్మోన్స్, యూరియా, యూరికామ్లం, క్రియాటిన్, క్రియాటినైన్ నీటిలో కలిగే విటమిన్స్), 1.5% అకర్బన పదార్థాలు(అయోడిన్, మెగ్నీషియం, క్లోరైడ్, కాల్షియం, సోడియం, ఫాస్ఫేట్, సల్ఫేట్) మొదలైన పదార్థాలు ఉంటాయి. 24 గంటల మూత్ర పరీక్ష అంటే...ఒక వ్యక్తి నుంచి 24 గంటలలో సేకరించిన మొత్తం మూత్రంలో నుంచి 100-15 మి.లీ. మూత్రాన్ని నమూనాగా తీసుకొని పరీక్షిస్తారు. ప్రోటీన్లు అధికంగా తీసుకుంటే మూత్రంలో యూరియా అధికంగా, కార్బోహైడ్రేట్స్ అధికంగా తీసుకుంటే చక్కెరలు ఎక్కువగా ఉంటాయి.

కృత్రిమ మూత్రపిండం

డాక్టర్ విలియం కాఫ్‌ను డయాలసిస్ పితామహుడిగా పిలుస్తారు. మానవుడి మూత్ర పిండాలు పనిచేయని స్థితిలో రక్తాన్ని వడపోయడానికి తోడ్పడే యంత్రమే కృత్రిమ మూత్రపిండం లేదా డయలైజర్. ఈ పద్ధతిని హీమోడయాలసిస్ అంటారు. ఈ ప్రక్రియలో రక్తాన్ని ధమని నుంచి తీసి సిర ద్వారా ఎక్కిస్తారు. దీనికి దాదాపు మూడు నుంచి ఆరు గంటల సమయం పడుతుంది. ఈ ప్రక్రియలోని డయలైజర్ పరికరంలో వడపోతకు అనుకూలంగా ఉండే సెల్లోఫేన్‌తో తయారైన గొట్టాలను వాడుతారు. హెపారిన్, ఆంటిహెపారిన్‌ను ఉపయోగిస్తారు. హెపారిన్ అనేది రక్తంలో యాంటికొయాగ్యులెంట్‌గా పనిచేస్తుంది. ఈ ప్రక్రియ యురేమియా వ్యాధిగ్రస్తులకు ఒక వరం లాంటిది. యూరేమియా అంటే మూత్ర పిండాలు సరిగా పనిచేయని వారి శరీరంలో నీరు, వ్యర్థ పదార్థాలు నిండిపోయే దశ. ఈఎస్ఆర్‌డీ(ఎండ్ స్టేజ్ రెనాల్ డిసీజ్) అంటే మూత్ర పిండాలు పనిచేయక పోవడమని అర్థం.



కె. నాగశేషులు
బయాలజీ ఫ్యాకల్టీ

నిట్ సూరత్‌కల్‌లో ఎంబీఏ

సూరత్‌కల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కర్ణాటక (నిట్ కే) ఆధ్వర్యంలోని స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది రెండేళ్ల వ్యవధి గల ఫుల్ టైమ్ ప్రోగ్రామ్. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. క్యాట్/మ్యాట్/గేట్ వ్యాలిడ్ స్కోర్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 80 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 3
- **వెబ్‌సైట్:** www.nitk.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..

సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/il7BRRfలో చదవండి.





భారత్ షూటౌట్

సెమీస్‌లో జర్మనీ గెలుపు
ఓడినా..మనోళ్లకు చాన్స్
ఒలింపిక్ హాకీ మహిళల క్వాలిఫయర్స్

రాంచీ: పారిస్ విశ్వక్రీడల స్థానమే లక్ష్యంగా క్వాలిఫయింగ్ టోర్నీ బరిలోకి దిగిన భారత మహిళలకు చుక్కెదురైంది. పటిష్ట జర్మనీతో గురువారం ఉత్కంఠభరితంగా జరిగిన సెమీస్ షూటౌట్‌లో మన అమ్మాయిలు 3-4తో పరాజయం పాలయ్యారు. హోరాహోరీగా సాగిన ఈ పోరులో నిర్ణీత సమయం ముగిసే సరికి ఇరు జట్లు 2-2తో సమంగా నిలిచాయి. భారత్ తరపున దీపిక (15), ఇషికా చౌధరి (59) గోల్స్ చేయగా, చార్లోటి (27, 57) జర్మనీకి రెండు గోల్స్ అందించింది. ఇక పెనాల్టీ షూటౌట్‌లోని ఐదు అవకాశాల్లో ఇరుజట్లు 3-3 గోల్స్ చేయడంతో సడన్‌డెత్ అనివార్యమైంది. సడన్‌డెత్ తొలి ప్రయత్నంలో ఇరుజట్లూ గోల్ చేయలేక పోయాయి. రెండో ప్రయత్నంలో సోనిక విఫలం కాగా, జర్మనీ క్రీడాకారిణి లీసా గోల్ సాధించి తమ దేశానికి ఒలింపిక్ బెర్త్‌ను ఖరారు చేసింది. అయితే పారిస్ ఒలింపిక్స్‌కు క్వాలిఫై అయ్యే చాన్సు భారత జట్టుకు ఇంకా ఉంది. శుక్రవారం జరిగే కాంస్య పతక మ్యాచ్‌లో జపాన్‌పై గెలుపొందితే మనోళ్లకు పారిస్ టిక్కెట్ లభిస్తుంది. ఈ టోర్నమెంట్‌లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన జట్లు ఒలింపిక్స్‌కు క్వాలిఫై అవుతాయి. శుక్రవారం జరిగే ఫైనల్లో అమెరికాతో జర్మనీ అమీతుమీ తేల్చుకుంటుంది.

క్వార్టర్స్‌లో ప్రణయ్

- సాకేత్-చిరాగ్ జోడీ కూడా..
- ఇండియా ఓపెన్

న్యూఢిల్లీ: భారత స్టార్ షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్ ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించాడు. అలాగే పురుషుల డబుల్స్‌లో వరల్డ్ నెంబర్ టూ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి అంచనాలకు తగ్గట్టుగానే రాణిస్తున్నారు. గురువారం జరిగిన పోరులో ప్రణయ్ 20-22, 21-14, 21-14 తేడాతో భారత్‌కే చెందిన ప్రియాన్షు రజావత్‌పై నెగ్గాడు. రెండో గేమ్‌లో కాలి మడమ గాయానికి గురైన రజావత్ లయ తప్పాడు. దీంతో ప్రణయ్ సునాయాసంగా రెండు గేమ్‌లను గెలిచి మ్యాచ్‌ను ముగించాడు. క్వార్టర్స్‌లో ప్రణయ్ చైనీస్ తైపీకి చెందిన వాంగ్ జు వీతో తలపడతాడు. ఇక సాత్విక్-చిరాగ్ జోడీ 21-14, 21-15 తేడాతో చింగ్-యంగ్ (చైనీస్ తైపీ)పై నెగ్గింది.

కుర్రాళ్ల విశ్వపోరు

నేటి నుంచి అండర్-19 వన్డే ప్రపంచకప్



డిఫెండింగ్ చాంప్‌గా బరిలోకి భారత్
మధ్యాహ్నం 1.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

బ్లూమ్‌ఫోంటీన్ (దక్షిణాఫ్రికా): ఈ ఏడాది జరిగే భారీ ఈవెంట్లలో మొదటగా కుర్రాళ్ల సందడి చేయనున్నారు. భవిష్యత్ సూపర్ స్టార్లను నిర్దేశించే అండర్-19 వన్డే ప్రపంచకప్‌నకు శుక్రవారం తెర లేవనుంది. ఆరంభ మ్యాచ్‌లో ఐర్లాండ్-అమెరికా, దక్షిణాఫ్రికా-విండీస్ జట్లు తలపడనున్నాయి. ఫిబ్రవరి 11 వరకు అభిమానులను అలరించే ఈ టోర్నీలో మొత్తంగా 16 జట్లు నాలుగు గ్రూప్‌ల వారీగా తలపడనున్నాయి. గత షెడ్యూల్ ప్రకారం శ్రీలంకలో జరగాల్సిన ఈ టోర్నీ ఆ దేశ క్రికెట్ బోర్డుపై ఐసీసీ నిషేధం కారణంగా సౌతాఫ్రికాకు మారింది. మరోవైపు రికార్డు స్థాయిలో ఐదుసార్లు (2000, 2008, 2012, 2018, 2022) విజేతగా నిలిచిన భారత జట్టు తమ టైటిల్‌ను కాపాడుకునేందుకు బరిలోకి దిగబోతోంది. రెండేళ్లకోసారి జరిగే అండర్-19 ప్రపంచకప్ టోర్నీపై గతంలో అభిమానులు పెద్దగా దృష్టి సారించకపోయినా.. కొంతకాలంగా ఆ పరిస్థితి మారింది. యువరాజ్ (2000), రోహిత్ శర్మ (2006), విరాట్, జడేజా (2008), పంత్, ఇషాన్ (2016), గిల్ (2018) ఈ టోర్నీ ద్వారా వెలుగులోకి వచ్చి అంతర్జాతీయ ఖ్యాతి దక్కించుకున్న వాళ్లే. ఇంకా మరెంతో మంది కొద్దికాలమైనా జాతీయ జట్టుకు ఆడగలిగారు. అయితే ఉన్ముక్త్ చంద్, మనీశ్ పాండే, రవికాంత్ శుక్లా, యష్ ధుల్, మన్‌జోత్ కల్రా, నాగర్‌కోటిలాంటి వారు అండర్-19లో విశేషంగా రాణించినా ఆ తర్వాత ఆ స్థాయి ఆటతీరును ప్రదర్శించలేక వెనుకబడ్డారు.

ఇదీ ఫార్మాట్..

మొత్తం 16 జట్లు నాలుగు గ్రూపులుగా విడివడి తలపడనున్నాయి. ఇందులో ప్రతి గ్రూపునుంచి తొలి మూడు స్థానాల్లో నిలిచిన మొత్తం 12 టీమ్స్ సూపర్ సిక్స్‌కు అర్హత సాధిస్తాయి. ఇక్కడ ఆరు జట్ల చొప్పున రెండు గ్రూప్‌లుగా విడదీస్తారు. ఒక్కో గ్రూప్‌లో టాప్-2లో నిలిచిన మొత్తం నాలుగు జట్లు సెమీస్ బరిలో నిలుస్తాయి. ఫిబ్రవరి 6, 8న బినోయ్‌లో ఈ సెమీస్ జరుగుతాయి.

భారత గ్రూప్ షెడ్యూల్

తేదీ	ప్రత్యర్థి
జనవరి 20	బంగ్లాదేశ్‌తో
జనవరి 25	ఐర్లాండ్‌తో
జనవరి 28	అమెరికాతో

నేటి మ్యాచ్‌లు : ఐర్లాండ్-అమెరికా
దక్షిణాఫ్రికా-వెస్టిండీస్

టైటిల్ నిలబెట్టుకునేనా?

గ్రూప్ 'ఎ'లో ఉన్న యువ భారత్ శనివారం బంగ్లాదేశ్‌తో జరిగే తొలి మ్యాచ్‌తో టైటిల్ వేటను ఆరంభించనుంది. అమెరికా, ఐర్లాండ్ ఇతర జట్లు. అయితే **ఉదయ్ సహరన్ కెప్టెన్‌గా** వ్యవహరిస్తున్న ప్రస్తుత జట్టు ఇటీవల ఆడిన ఆసియాకప్ సెమీస్‌లో ఓడినా.. ముక్కోణపు సిరీస్‌లో మాత్రం ఓటమి లేకుండా దూసుకెళ్లింది. ఇక జట్టులో తెలంగాణకు చెందిన అవనీశ్ అరవెల్లి ఏకైక తెలుగు క్రికెటర్ కావడం విశేషం. అతడితో పాటు అర్శిన్ కులకర్ణి, ముషీర్ ఖాన్, కెప్టెన్ ఉదయ్‌లపై బ్యాటింగ్ ఆధారపడి ఉంది. బౌలింగ్‌లో రాజ్ లింబాని, సౌమీ పాండే ఇటీవలి ట్రై సిరీస్‌లో మెరుగ్గా రాణించారు. వీరి అండతో టైటిల్‌ను నిలబెట్టుకోవాలనే ఆలోచనలో జట్టు ఉంది.

రిబకినా, పెగులా ఇంటిబాట

- అల్కారజ్, స్వియటెక్ ముందంజ
- ఆస్ట్రేలియన్ ఓపెన్



ఎలెనా రిబకినా
అనా బ్లింకోవా

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సంచలనాల జోరు కొనసాగుతోంది. గత ఏడాది మెల్‌బోర్న్ పార్క్ రన్నరప్ ఎలెనా రిబకినా, ఐదో సీడ్ జెస్సికా పెగులా, యూఎస్ ఓపెన్ మాజీ చాంపియన్ ఎమ్మా రదుకాను తిరుగుముఖంపట్టారు. ఇక..టాప్‌సీడ్ ఇగా స్వియటెక్, రెండో సీడ్ కార్లోస్ అల్కారజ్ ముందంజ వేశారు.

సుదీర్ఘ టైబ్రేకర్‌తో చరిత్ర..: మూడో సీడ్ ఎలెనా రిబకినా (కజకిస్థాన్)-అనా బ్లింకోవా (రష్యా) మధ్య రెండో రౌండ్ మ్యాచ్ మూడో సెట్ టైబ్రేకర్ మహిళల గ్రాండ్‌స్లామ్‌ల్లో సుదీర్ఘంగా సాగినదిగా రికార్డులకెక్కింది. ఈ టైబ్రేకర్‌లో ఇద్దరూ కలిసి 42 పాయింట్లు స్కోరు చేశారు. ఈ మ్యాచ్‌లో బ్లింకోవా 6-4, 4-6, 7-6 (22-20)తో రిబకినాను ఓడించింది. ఐదో సీడ్ పెగులా (అమెరికా) 4-6, 2-6తో బొరెల్ (ఫ్రాన్స్) చేతిలో, ఎమ్మా రదుకాను (బ్రిటన్) 4-6, 6-4, 4-6తో వాంగ్ (చైనా) చేతిలో ఓడిపోయారు. టాప్ సీడ్ స్వియటెక్ (పోలెండ్) 6-4, 3-6, 6-4తో కొలిన్స్ (అమెరికా)పై, ఒస్టాపెంకో (లాత్వియా) 6-0, 3-6, 6-4తో టోమ్లజనోవిక్ (ఆస్ట్రేలియా)పై నెగ్గారు. ఇతర మ్యాచ్‌ల్లో రెండో సీడ్ అల్కారజ్ (స్పెయిన్) 6-4, 6-7 (7), 6-3, 7-6 (3)తో లోరెంజో (ఇటలీ)పై, ఆరో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ) 7-5, 3-6, 4-6, 7-6 (5), 7-6 (7) క్లీన్ (స్లొవేకియా)పై విజయం సాధించారు. అలాగే హోల్గర్ రూన్ (డెన్మార్క్) ఫ్రాన్స్ ప్లేయర్ ఆర్థర్ చేతిలో ఓటమి పాలవగా, మూడో సీడ్ మెద్వెదేవ్ ముందంజవేశాడు.

రెండో రౌండ్‌లో బోపన్న ద్వయం

పోరాడి ఓడిన నగాల్

ఆస్ట్రేలియాకు చెందిన మాథ్యూ ఎబ్డెన్ జతగా బరిలో దిగిన వెటరన్ స్టార్ రోహన్ బోపన్న డబుల్స్‌లో రెండో రౌండ్‌కు దూసుకుపోగా..సింగిల్స్‌లో సుమిత్ నగాల్ జోరుకు బ్రేక్ పడింది. బోపన్న తొలి రౌండ్‌లో 7-6 (5), 4-6, 7-6 (2)తో స్థానిక జోడీ డక్‌వర్త్/పోల్‌మన్స్‌పై నెగ్గాడు. ఇదే విభాగంలో మరో భారత ద్వయం విజయ్ సుందర్ ప్రశాంత్/అనిరుధ్ చంద్రశేఖర్ 3-6, 4-6తో మార్టన్ /ఫాబియన్ (హంగేరీ) చేతిలో ఆరంభ రౌండ్‌లో ఓడింది. ఇక ప్రపంచ 27వ ర్యాంకర్ అలెగ్జాండర్ బబ్లిక్ (కజకిస్థాన్)కు షాకిచ్చిన సుమిత్ నగాల్ చైనాకు చెందిన జున్‌చెంగ్ చేతిలో 6-2, 3-6, 5-7, 4-6తో ఓటమిపాలయ్యాడు.

హైదరాబాద్‌లో నేటినుంచి కబడ్డీ.. కబడ్డీ

హైదరాబాద్: గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో శుక్రవారం నుంచి ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) సీజన్-10 హైదరాబాద్ అంచె పోటీలు ప్రారంభమవనున్నాయి. ఈ సందర్భంగా పీకేఎల్ ప్రచారకర్త, ప్రముఖ నటుడు నందమూరి బాలకృష్ణను జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో తెలుగు టైటాన్స్ జట్టు సీఈఓ త్రినాథ్, కెప్టెన్ పవన్ సెహ్రావత్, కోచ్ శ్రీనివాసరెడ్డి తదితరులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి టైటాన్స్ జెర్సీని అందించారు..



బాలకృష్ణతో కెప్టెన్ పవన్

ఓటమి అంచున విండీస్

ఆసీస్‌తో తొలి టెస్ట్

అడిలైడ్: ఆస్ట్రేలియాతో జరుగుతున్న తొలి టెస్ట్‌లో వెస్టిండీస్ పరాజయం దిశగా సాగుతోంది. మ్యాచ్‌కు రెండో రోజైన గురువారం ఆట ముగిసే సమయానికి విండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 73 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయింది. హాజెల్‌వుడ్ మళ్లీ నాలుగు వికెట్లు తీశాడు. ఓవర్‌నైట్ స్కోరు 59/2తో ఆట కొనసాగించిన ఆస్ట్రేలియా 283 రన్స్‌కు ఆలౌటై 95 పరుగుల ఆధిక్యం అందుకుంది. ట్రావిస్ హెడ్ శతకం (119) సాధించాడు. షామర్ జోసెఫ్‌కు ఐదు వికెట్లు లభించాయి. విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 188 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. రెండో ఇన్నింగ్స్‌లో మరో 4 వికెట్లే మిగిలివున్న విండీస్ కేవలం 22 పరుగుల ఆధిక్యంలో ఉంది.

వరల్డ్ మోటార్ సైకిల్ రేసులో భారత జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): అంతర్జాతీయ మోటార్ సైకిల్ సమాఖ్య (ఎఫ్ఐఎం) నిర్వహించే పోటీల్లో ఈ ఏడాది నుంచి భారత్ తరఫున కంకణాల స్పోర్ట్స్ గ్రూప్‌నకు చెందిన ఇండీ జట్టు పాల్గొననుంది. గురువారం హైదరాబాద్‌లో ఇండీ జట్టు జెర్సీని కంకణాల గ్రూప్ వ్యవస్థాపకుడు అభిషేక్ రెడ్డి, ఎఫ్ఐఎం సహ వ్యవస్థాపకురాలు కేరిన్ ముంటె ఆవిష్కరించారు. ఈ ఏడాది రేసింగ్ సీజన్ ఫిబ్రవరి నుంచి ఆరంభమవనుంది. ఈ సీజన్‌లోని తొలి నాలుగు రేసులు జపాన్, నార్వే, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్‌లో జరగనున్నాయి. సీజన్ ఫైనల్ రేసుకు భారత్ ఆతిథ్యమివ్వనుంది.

సౌత్‌జోన్ వైస్ కెప్టెన్ స్నేహ దీప్తి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): సీనియర్ మహిళల ఇంటర్ జోనల్ వన్డే ట్రోఫీ సౌత్‌జోన్ జట్టు వైస్ కెప్టెన్‌గా ఆంధ్ర అమ్మాయి వి.స్నేహ దీప్తిని బీసీసీఐ నియమించింది. సౌత్‌జోన్ జట్టులో ఏకంగా ఏడుగురు తెలుగు క్రీడాకారులకు చోటు లభించడం విశేషం. తెలంగాణ క్రికెటర్లు త్రిషా రెడ్డి, ఎం.మమత, అరుంధతి రెడ్డి, ఆంధ్ర నుంచి స్నేహ, ఎం.దుర్గ, ఎండీ షబ్నమ్‌కు జట్టులో స్థానం దక్కగా, హైదరాబాద్ అమ్మాయి ప్రణవి చంద్ర స్టాండ్‌బైగా ఎంపికైంది. వీరితో పాటు శ్రేయాంక పాటిల్ (కెప్టెన్), యువశ్రీ, సంజన, సహాన, వినయ, కీర్తన, తర్నుమ్, అక్షర, సొనాల్ ఉన్నారు.

2,840 విమానాలు.. 41,000 పైలెట్లు అవసరం

భారత విమానయాన మార్కెట్‌పై ఎయిర్‌బస్ అంచనా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత విమానయాన రంగం వేగంగా వృద్ధి చెందుతోంది. వచ్చే ఇరవై ఏళ్లలో భారత విమానయాన రంగానికి 2,840 కొత్త విమానాలు అవసరం అవుతాయి. 41,000 మంది పైలెట్లు కావాలి. 47,000 మంది టెక్నికల్ స్టాఫ్ అవసరం ఉందని ఎయిర్‌బస్ ఇండియా అండ్ సౌత్ ఆసియా మేనేజింగ్ డైరెక్టర్, ప్రెసిడెంట్ రెమి మైలార్డ్ అన్నారు. హైదరాబాద్‌లో ప్రారంభమైన వింగ్స్ ఇండియా 2024లో ఆయన మాట్లాడుతూ.. ఎయిర్‌బస్‌కు 2023 ఏడాది రికార్డు సంవత్సరం. గత ఏడాది భారత్‌లోని విమానయాన సంస్థలకు 75 విమానాలను అందించాం. 750 విమానాలకు ఆర్డర్లు పొందాం. అంతర్జాతీయ గమ్యస్థానాలకు భారత విమానయాన సంస్థలు అందిస్తున్న సేవల్లో ఏ350 విమానం కీలకం కానుందని.. ఇప్పటికే ఎయిరిండియాకు 6 విమానాలను అందించామని చెప్పారు. కాగా దేశంలోనే తొలి, ఎయిరిండియా మొదటి ఎయిర్‌బస్ ఏ350 విమానాన్ని వింగ్స్ ఇండియాలో పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ప్రారంభించారు.

ఎయిరిండియాతో కలిసి పైలెట్ శిక్షణా కేంద్రం ఏర్పాటు

పైలెట్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ఎయిరిండియాతో ఎయిర్‌బస్ చేతులు కలిసింది. 50:50 సంయుక్త సంస్థ ఏర్పాటు చేసి హరియాణాలోని గురుగ్రామ్ ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తోంది. రానున్న 20 ఏళ్లలో పైలెట్ల అవసరం బాగా ఉన్నందున ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు రెమి తెలిపారు. 2025 ప్రారంభంలో అందుబాటులోకి వచ్చే ఈ శిక్షణ కేంద్రం ఏ320, ఏ350 విమానాలను నడిపేందుకు శిక్షణ ఇస్తుంది. 10 ఏళ్లలో 5,000 మంది పైలెట్లను తయారు చేస్తుంది. ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్‌లో శిక్షణ ఇచ్చేందుకు జీఎంఆర్ ఏరో టెక్నిక్‌తో కూడా ఎయిర్‌బస్ చేతులు కలిపింది.



ఎయిర్‌బస్ ఇండియా ఎండీ రెమి మైలార్డ్

150 బోయింగ్ విమానాలకు ఆకాశ ఎయిర్ ఆర్డర్

దేశీయ, అంతర్జాతీయ సేవలను విస్తరించడానికి ఆకాశ ఎయిర్ 150 బోయింగ్ 737 మ్యాక్స్ విమానాలకు ఆర్డరు ఇచ్చింది. ఈ విమానాలను 2032 వరకూ డెలివరీ చేస్తారు. కొత్త డీల్‌తో మొత్తం 226 విమానాల కోసం ఆర్డర్ ఇచ్చినట్లవుతుందని ఆకాశ ఎయిర్ వ్యవస్థాపకుడు, సీఈఓ వినయ్ దుబే తెలిపారు. ప్రస్తుతం ఆకాశ ఎయిర్ 22 విమానాలతో సేవలందిస్తోంది. ఎనిమిదేళ్లలో 204 విమానాలను పొందనుంది. ఈ స్థాయి విమానాలతో దశాబ్ద కాలం నాటికి ప్రపంచంలోని 30 ప్రముఖ విమానయాన కంపెనీల్లో ఆకాశ ఎయిర్ ఒకటి అవుతుందని తెలిపారు. సమీప భవిష్యత్తులో అంతర్జాతీయ మార్గాల్లో ఆకాశ ఎయిర్ సేవలను అందించనుంది.

జీఎంఆర్ గ్రూప్, ఇండిగో ఒప్పందం

భారత విమానాయాన రంగంలో డిజిటల్ టెక్నాలజీ వినియోగాన్ని పెంచడానికి జీఎంఆర్ గ్రూప్, ఇండిగో ఎయిర్‌లైన్స్ సహకార ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఇందుకు అనుగుణంగా డిజిటల్ కన్సార్షియంను ఏర్పాటు చేస్తాయి. కన్సార్షియంలో విమానయాన రంగ భాగస్వాములు ఉంటారు. ప్రయాణికుల సౌకర్యాలను మెరుగుపరచడం, నిర్వహణ సామర్థ్యాలను పెంచడానికి కన్సార్షియం డిజిటల్ టెక్నాలజీలను వినియోగిస్తుందని జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ ఎస్‌జీకే కిషోర్ తెలిపారు.

మహీంద్రా, టాటా అడ్వాన్స్‌డ్‌తో తయారీ కాంట్రాక్టులు

భారత్ నుంచి మరింతగా విమాన విడిభాగాలను పొందే కార్యక్రమంలో భాగంగా టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ (టీఏఎస్ఎల్), మహీంద్రా ఏరోస్పేస్ స్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఎయిర్‌బస్ అదనపు తయారీ కాంట్రాక్టులను కుదుర్చుకుంది. ఈ ఒప్పందానికి అనుగుణంగా ఏ320 నియో, ఏ330 నియో, ఏ350 విమానాలకు అవసరమైన మెటాలిక్ డీటైల్డ్ విడిభాగాలు మొదలైన వాటిని టీఏఎస్ఎల్, మహీంద్రా ఏరోస్పేస్‌లు అందిస్తాయి. దేశంలోని దాదాపు 100 కంపెనీలు ఎయిర్‌బస్‌కు విడి భాగాలను అందిస్తున్నాయి. ప్రస్తుతం 75 కోట్ల డాలర్ల విలువైన విడిభాగాలను ప్రతి ఏడాది పొందుతుండగా.. దీన్ని 150 కోట్ల డాలర్ల (దాదాపు రూ.12,150 కోట్లు)కు పెంచుకోవడానికి భారత్‌లో మరింత మంది వెండార్లతో ఒప్పందాలు కుదుర్చుకోనున్నట్లు రెమి తెలిపారు.

బిజినెస్

హైదరాబాద్‌లో ఎల్ఎస్ఈజీ ఎక్సలెన్స్ కేంద్రం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎల్ఎస్ఈజీ (లండన్ స్టాక్ ఎక్స్ఛేంజీ గ్రూప్) హైదరాబాద్‌లో టెక్నాలజీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించింది. అంతర్జాతీయ విస్తరణలో భాగంగా నిపుణుల లభ్యతను పరిగణనలోకి తీసుకుని హైదరాబాద్‌లో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎల్ఎస్ఈజీ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ ఇర్ఫాన్ హుస్సేన్ తెలిపారు. ఖాతాదారులకు మెరుగైన ఇంజనీరింగ్ సొల్యూషన్లను అందించడానికి ఈ కేంద్రం దోహదం చేస్తుంది. ప్రస్తుతం 300 మంది నిపుణులతో దీన్ని ఏర్పాటు చేశారు. 2025 చివరి నాటికి మరో 1000 మంది ఇంజనీర్లు, నిపుణులను నియమించుకోనున్నట్లు హుస్సేన్ చెప్పారు.

నోయిడాలో లేబొరేటరీల ఏర్పాటు

నాట్కో ఫార్మా ఆసక్తి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఉత్తరప్రదేశ్‌లోని నోయిడా ప్రాంతంలో లేబొరేటరీలను ఏర్పాటు చేయడంపై నాట్కో ఫార్మా ఆసక్తి చూపుతోంది. పెట్టుబడులను ఆకర్షించడానికి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం హైదరాబాద్ ఫార్మా పరిశ్రమ వర్గాలతో ఇక్కడ ఫార్మా కాంక్లేవ్‌ను నిర్వహించింది. ఈ కాంక్లేవ్‌లో నాట్కో ఫార్మా సీఈఓ రాజీవ్ నన్నపనేని మాట్లాడుతూ.. నోయిడా ప్రాంతంలో లేబొరేటరీలను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. ఫార్మా పరిశ్రమకు ఉత్తరప్రదేశ్ కీలక కేంద్రంగా మారిందని.. క్లినికల్ పరీక్షలు, ఇంటర్మీడియేట్స్, స్పెషాలిటీ కెమికల్స్ ఉత్పత్తి ద్వారా యూపీ ఫార్మా కేంద్రంగా మారిందని భారత్ బయోటెక్ సీఎండీ కృష్ణ ఎల్లా అన్నారు. ఉమ్మడి వ్యర్థాల శుద్ధి ప్లాంట్ ఏర్పాటు వంటి వాటిపై దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉందని సువెన్ లైఫ్ సైన్సెస్ చైర్మన్, సీఈఓ వెంకట్ జాస్తి తెలిపారు. దాదాపు 100 మంది ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

రామ్‌ఇన్ఫో ప్రిఫరెన్షియల్ ఇష్యూ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): టెక్నాలజీ సొల్యూషన్లను అందిస్తున్న రామ్‌ఇన్ఫో ప్రిఫరెన్షియల్ ఇష్యూ జారీ చేయనుంది. ప్రిఫరెన్షియల్ ఇష్యూ ద్వారా రూ.62 కోట్ల వరకూ సమీకరించడానికి బోర్డు ఆమోదం తెలిపింది. ప్రిఫరెన్షియల్ ఇష్యూ ద్వారా సమీకరించిన నిధులను కంపెనీ అభివృద్ధి, విస్తరణకు వినియోగించనున్నట్లు రామ్‌ఇన్ఫో ఎండీ శ్రీనాథ్ రెడ్డి తెలిపారు. దేశ, విదేశాల్లో విస్తరణ ద్వారా మరిన్ని ఆర్డర్లను పొందడానికి మార్గం సుగమం అవుతుందన్నారు.

మూడో రోజూ నష్టాలే..

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు వరుసగా మూడో రోజూ నష్టపోయాయి. మార్కెట్ దిగ్గజ షేర్లలో ఒకటైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మరింత పతనం కావడంతో పాటు కన్స్యూమర్ డ్యూరబుల్స్, యుటిలిటీ రంగ షేర్లలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడటం ఇందుకు కారణం. గురువారం ప్రారంభ ట్రేడింగ్‌లో 835 పాయింట్లకు పైగా పతనమై 70,665 స్థాయికి జారుకున్న సూచీ మళ్లీ కోలుకుని 71,000 స్థాయిని తిరిగి నిలబెట్టుకోగలిగింది. చివర్లో 313.90 పాయింట్ల నష్టంతో 71,186.86 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 286 పాయింట్ల మేర క్షీణించి 21,300 దిగువకు పడిపోయినప్పటికీ, చివరికి 109.70 పాయింట్ల నష్టంతో 21,462.25 వద్ద స్థిరపడింది.

ప్రపంచంలో అతిపెద్ద డెరివేటివ్ ఎక్స్ఛేంజీగా ఎన్ఎస్ఈ: ఫ్యూచర్స్ ఇండస్ట్రీ అసోసియేషన్ తాజా డేటా ప్రకారం.. గత ఏడాదిలో జరిగిన ఎఫ్ అండ్ ఓ కాంట్రాక్ట్ లావాదేవీలపరంగా ఎన్ఎస్ఈ ప్రపంచంలోనే అతిపెద్ద డెరివేటివ్ ఎక్స్ఛేంజీగా నిలిచింది. ఈ విషయంలో ఎన్ఎస్ఈకి అగ్రస్థానం దక్కడం వరుసగా ఐదో సంవత్సరమిది. కాగా, వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ఎక్స్ఛేంజెస్ (డబ్ల్యూఎఫ్ఈ) ప్రకారం.. 2023లో ఎన్ఎస్ఈ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఈక్విటీ ట్రేడింగ్ ఎక్స్ఛేంజీగా నిలిచింది. గత ఏడాది ఎన్ఎస్ఈ చాలా కొత్త రికార్డులను నమోదు చేసింది. ఎక్స్ఛేంజీలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ 4 లక్షల కోట్ల డాలర్ల మైలురాయిని దాటింది. అలాగే, ఎస్ఎంఈ లిస్టెడ్ కంపెనీల నిధుల సమీకరణ విలువ రూ.లక్ష కోట్లను మించిపోయింది. అంతేకాదు, నిఫ్టీ-50 తొలిసారిగా 20,000 మైలురాయికి చేరింది. 2023 డిసెంబరు చివరినాటికి ఎక్స్ఛేంజీలో రిజిస్టర్ చేసుకున్న ఇన్వెస్టర్ల సంఖ్య 8.5 కోట్లకు చేరుకుంది.

మార్కెట్లో కొత్త జావా 350 బైక్

ధర రూ.2,14,950



న్యూఢిల్లీ: జావా యెజ్డీ మోటార్ సైకిల్స్ కొత్త జావా 350 బైక్‌ను మార్కెట్లోకి తెచ్చింది. ఈ బైక్ ధర రూ.2,14,950. దేశవ్యాప్తంగా జావా బ్రాండ్‌ను అందుబాటులోకి తేవడం లక్ష్యంగా పని చేస్తున్నట్టు కంపెనీ సీఈఓ ఆశిష్ సింగ్ జోషి చెప్పారు. వచ్చే మూడు, నాలుగు నెలల కాలంలో ఆసియాన్ దేశాలకు జావా బైక్‌ల ఎగుమతిని ప్రారంభించనున్నట్టు ఆయన తెలిపారు. రాబోయే 24 నుంచి 30 నెలల కాలంలో చిన్న పట్టణాలపై ప్రత్యేక ఫోకస్ పెడుతూ దేశవ్యాప్తంగా 750 ఔట్‌లెట్లు ప్రారంభించనున్నట్టు చెప్పారు. 2018 సంవత్సరంలో భారత్‌లో తమ బ్రాండ్ తిరిగి ప్రవేశపెట్టిన తర్వాత ఇప్పటికి 2 లక్షల బైక్‌లు విక్రయించినట్టు తెలిపారు.

ఇప్పట్లో వడ్డీ రేట్లు తగ్గించం..

సంకేతాలిచ్చిన ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్



న్యూఢిల్లీ: ఈ ఏడాది ద్వితీయార్ధంలో కీలక వడ్డీ (రెపో) రేట్లు మళ్లీ దిగిరావచ్చన్న విశ్లేషకుల అంచనాల నేపథ్యంలో ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పట్లో రెపో రేటును తగ్గించే ప్రతిపాదనే కాదు, ఆ అంశం మా చర్చల్లో కూడా లేదని బ్లూంబర్గ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో దాస్ స్పష్టం చేశారు. రిటైల్ ధరల ఆధారిత ద్రవ్యోల్బణాన్ని 4 శాతానికి తగ్గించడంపైనే ఆర్‌బీఐ ప్రధానంగా దృష్టిసారించిందన్నారు. "రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదలైన తర్వాత అంతర్జాతీయంగా కమోడిటీల ధరలు అనూహ్యంగా పెరగడంతో 7.8 శాతానికి ఎగబాకిన ద్రవ్యోల్బణం.. ప్రస్తుతం ఆర్‌బీఐకి ప్రభుత్వం నిర్దేశించిన నియంత్రణ శ్రేణి 2-6 శాతంలోకి దిగివచ్చింది. కానీ మా లక్ష్యం 4 శాత"మని ఆయన పేర్కొన్నారు. ద్రవ్యోల్బణం క్రమంగా 4 శాతం దిశగా తగ్గుముఖం పడుతున్నదని.. దీర్ఘకాలం పాటు ద్రవ్యోల్బణం 4 శాతం స్థాయికి పరిమితం కానంతవరకు రెపో రేటు తగ్గించే అవకాశాల్లేవని ఆర్‌బీఐ గవర్నర్ దాస్ సంకేతాలిచ్చారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,620 ▼	57,400 ▼	77,000 ▼
ముంబై	61,970 ▼	56,765 ▼	70,898 ▼

సామ్‌సంగ్ నుంచి ఏఐ ఆధారిత గెలాక్సీ ఎస్ 24



ప్రారంభ ధర రూ.79,999

న్యూఢిల్లీ: కొరియా ఎలక్ట్రానిక్స్ దిగ్గజం సామ్‌సంగ్ కృత్రిమ మేధ (ఏఐ) ఆధారంగా పని చేసే గెలాక్సీ ఎస్24 సిరీస్ స్మార్ట్‌ఫోన్లను మార్కెట్లోకి తెచ్చింది. ఈ ఫోన్ల అమ్మకాలు ఈ నెల 31 నుంచి ప్రారంభమవుతాయి. ఆసక్తి గల వారు ఈ ఫోన్ల కోసం బుక్ చేసుకోవచ్చు. ఈ స్మార్ట్‌ఫోన్ ధరలు రూ.79,999 నుంచి రూ.1,59,999 మధ్యలో అందుబాటులో ఉంటాయి. దేశీయ, ఎగుమతి మార్కెట్ల కోసం ఈ ఫోన్లను భారత్‌లోనే ఉత్పత్తి చేయనున్నట్టు సామ్‌సంగ్ ఇండియా ప్రెసిడెంట్ జేబీ పార్క్ తెలిపారు. ఏఐ అప్లికేషన్లతో పని చేసే ఈ ఫోన్లు రియల్ టైమ్ వాయిస్ కాల్, హిందీ సహా ఎంపిక చేసిన భాషల్లో మెసేజ్ అనువాదం, కంటెంట్ సృష్టికర్తలను ఆకర్షించేందుకు మెరుగైన ఇమేజ్ ఎడిటింగ్, కెమెరా ఎఫెక్ట్స్ కలిగి ఉంటాయి. అలాగే డిస్‌ప్లేలో స్పష్టతను పెంచేందుకు కార్నింగ్ గొరిల్లా ఆర్మర్ గ్లాస్ దోహదపడుతుంది. 8జీబీ రామ్, 256 జీబీ మెమెరీ, 12 జీబీ రామ్, ఒక టెరాబైట్ మెమరీతో ఈ ఫోన్లను తీసుకువచ్చింది. భారత కస్టమర్ల కోసం ప్రత్యేక ఆఫర్‌గా గెలాక్సీ ఎస్24 అల్ట్రా 512 జీబీ స్మార్ట్‌ఫోన్‌ను గెలాక్సీ ఎస్23 అల్ట్రా 256 జీబీ వెర్షన్ ధరకే అందిస్తున్నామని సామ్‌సంగ్ మొబైల్ బిజినెస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాజు పుల్లన్ తెలిపారు. ఇతర గెలాక్సీ ఎస్24 ఫోన్లపై కూడా ఇదే తరహా ఆఫర్లు అందించనున్నట్టు రాజు చెప్పారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

18వ తేదీ హైదరాబాద్	520	విజయవాడ	530
19 జనవరి చిత్తూరు	548	విశాఖపట్నం	550
గోదావరి	530	వరంగల్	522
		డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	97	గోదావరి	106
వరంగల్	97	విజయవాడ	106
కరీంనగర్	97	గుంటూరు	107
మహబూబ్‌నగర్	97	ఒంగోలు	107
కర్నూలు	97	చిత్తూరు	103
విశాఖపట్నం	101		



నామినేషన్ల అనంతరం ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీతో కాంగ్రెస్ అభ్యర్థులు మహేశ్ కుమార్ గౌడ్, బల్మూరి వెంకట్

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా మహేశ్, బల్మూరి నామినేషన్లు

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా మహేశ్ కుమార్ గౌడ్, బల్మూరి వెంకట్ నర్సింగ్‌రావు గురువారం నామినేషన్లు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ తదితరులు పాల్గొన్నారు. శాసనమండలికి రాజీనామా చేసిన కడియం శ్రీహరి, పాడి కౌశిక్ రెడ్డి రాజీనామాలతో ఏర్పడిన ఖాళీలకు జరుగుతున్న ఉప ఎన్నికలకు గురువారం సాయంత్రంతో నామినేషన్‌ల ప్రక్రియ ముగిసింది. శుక్రవారం నామినేషన్‌ల పరిశీలన జరుగుతుందని రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న అసెంబ్లీ జాయింట్ సెక్రెటరీ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. ఈ ఎన్నికల్లో తమకు గెలిచే అవకాశం లేనందున ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులను పోటీకి దించలేదు. దీంతో కాంగ్రెస్ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం లాంఛనమే.

రవాణా శాఖలో సంస్కరణలు తీసుకొస్తాం

» ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం: పొన్నం

హయత్‌నగర్/హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో రవాణా శాఖలో అనేక కొత్త సంస్కరణలను తీసుకొస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. వాహనాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని, అంతే స్థాయిలో అవసరాలను కూడా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం తుర్కయంజాల్ మునిసిపాలిటీ మన్నెగూడలో రూ.2.15 కోట్లతో రామోజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన ఇబ్రహీంపట్నం ప్రాంతీయ రవాణా కార్యాలయాన్ని స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్షల మేరకు రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతామని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించడం పట్ల ప్రతిపక్ష పార్టీలు జీర్ణించుకోవడం లేదన్నారు. ఆటో యూనియన్‌లను రెచ్చగొట్టే కుట్రలను చేస్తున్నాయని ఆరోపించారు. ఎన్ని కుట్రలు చేసిన పథకాలను అమలు చేసి తీరుతామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌తో పొన్నం భేటీ

రాజేంద్రనగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌ను హైదరాబాద్ శివారు మైలార్‌దేవుపల్లిలోని ఆయన నివాసంలో గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. వీరిరువురు గౌడ సంక్షేమం కోసం చేయాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. వేములవాడలో రూ.6.5 కోట్లతో నిర్మిస్తున్న గౌడ వసతి భవనానికి చైర్మన్‌గా ఉన్న మంత్రి పొన్నం, కార్యదర్శి పి.హరిచరణ్‌గౌడ్, గౌడ సంఘం రాష్ట్ర నాయకులు టి.ప్రేందాస్‌గౌడ్‌తో కలిసి ముందుగా శాసనమండలి మాజీ చైర్మన్ కె.స్వామిగౌడ్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఫిబ్రవరి 5న వేములవాడలో గౌడ వసతి భవనం ప్రారంభోత్సవానికి రావాలని వారిద్దరినీ మంత్రి పొన్నం ఆహ్వానించారు. కాగా, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, స్వామిగౌడ్ ఇళ్లకు మంత్రి పొన్నం రావడంతో.. వారిద్దరూ కాంగ్రెస్‌లో చేరుతారేమోనని స్థానికంగా చర్చించుకోవడం గమనార్హం. కాగా, గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గురువారం పరామర్శించారు. తమ్మినేని త్వరగా కోలుకొని ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆకాంక్షించారు.

ఉన్నత విద్యా మండలికి పాతవారే

» సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యా మండలి చైర్మన్‌గా ప్రొఫెసర్ లింబాద్రి, వైస్ చైర్మన్లుగా వెంకటరమణ, మహమ్మూద్‌లను మరికొంత కాలం కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం ఉత్తర్వులను జారీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలోని పలు నామినేటెడ్ పదవులను రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ రద్దయిన పదవుల్లో ఉన్నత విద్యా మండలి చైర్మన్, వైస్ చైర్మన్ పదువులు కూడా ఉన్నాయి. అయితే రద్దు ఉత్తర్వులు తమకు వర్తించవని ఉన్నత విద్యా మండలి చైర్మన్, వైస్ చైర్మన్లు ప్రభుత్వానికి స్పష్టం చేశారు. మరోపక్క ఎంసెట్‌తో పాటు, రాష్ట్రంలో అనేక ప్రవేశ పరీక్షలను నిర్వహించాల్సి ఉన్న నేపథ్యంలో పాత వారినే కొనసాగించాలనే ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా గురువారం ఉత్తర్వులను జారీ చేశారు.

పవర్‌లూమ్ కార్మికులను ఆదుకోవాలి

» మంత్రి తుమ్మలకు చాడ వెంకట్‌రెడ్డి లేఖ

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పవర్‌లూమ్ కార్మికులు ప్రభుత్వం ఇచ్చే ఆర్డర్లపైనే జీవనం సాగిస్తున్నారని, ఈ నేపథ్యంలో పాలిస్టర్ అసోసియేషన్ పవర్‌లూమ్ పనుల బంద్ నిర్ణయాన్ని ఉపసంహరింపజేసి పనులు తిరిగి ప్రారంభించాలని కోరుతూ సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి.. చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు గురువారం లేఖ రాశారు. బతుకమ్మ, ఇతర ప్రభుత్వ పథకాలకు అవసరమైన వస్త్రాల తయారీకిచ్చే ప్రభుత్వ ఆర్డర్లపైనే కార్మికులు ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. సిరిసిల్ల పవర్‌లూమ్ కార్మికులను ఆదుకునేందుకు గత ప్రభుత్వాలు కొన్ని పథకాలను అమలు చేశాయని తెలిపారు. 2022-23 సంవత్సరానికి సంబంధించి యార్న్ రాయితీ 10శాతం కార్మికులకు అందలేదని, బతుకమ్మ చీరలు తయారుచేసి రెండు నెలలు గడుస్తోందని గుర్తు చేశారు. బతుకమ్మ వస్త్రాల తర్వాత పాలిస్టర్ వస్త్రాలు తయారు చేస్తుండగా.. వీటికి ఆదరణ లేకపోవడంతో గిట్టుబాటు ధరలు రావడంలేదన్న కారణంతో పాలిస్టర్ అసోసియేషన్ పనులు నిలిపివేసినట్లు తెలిపారు. దీంతో కార్మికులు పనుల్లేక ఇబ్బంది పడుతున్నారని, అసోసియేషన్‌తో చర్చించి పవర్‌లూమ్ కార్మికులకు ఉపాధి కల్పించేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు.

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ బంద్ విరమణ

సిరిసిల్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లలోని పాలిస్టర్ క్లాత్ మ్యానుఫాక్చరర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ గురువారం సమావేశమైంది. సిరిసిల్ల మరమగ్గాల బంద్‌ను విరమిస్తున్నట్లు ప్రకటించింది. ప్రభుత్వం నుంచి ఆర్వీఎం బట్ట ఉత్పత్తి ఆర్డర్లు రావడంతోపాటు ప్రభుత్వం ఆర్డర్లు ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేయడంతో బంద్‌ను విరమిస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం నుంచి సిరిసిల్లలోని మరమగ్గాలపై బట్ట ఉత్పత్తి ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. బంద్ సందర్భంగా ఆసాములు, కార్మికులు, అనుబంధ పరిశ్రమలకు కలిగే నష్టాలు, వారి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని, ప్రభుత్వ పెద్దలు సమస్యల పరిష్కారానికి ఇచ్చిన హామీ మేరకు బంద్ ఉపసంహరించుకున్నట్లు పాలిస్టర్ అసోషియేషన్ అధ్యక్షుడు మండల సత్యం ఓ ప్రకటనలో వెల్లడించారు.

టోరంటోలో సంక్రాంతి వేడుకలు

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కెనడా అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రేటర్ టోరంటోలోని బ్రాంప్టన్ నగరంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. చింగ్యూజీ సెకండరీ స్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో 800 మందికిపైగా తెలంగాణ వాసులు పాల్గొన్నారు. అసోసియేషన్ కార్యదర్శి శంతన్ నేరళ్లపల్లి వేడుకలను ప్రారంభించగా, మేఘన గుర్రాల, శైలజ ఎర్ర, స్ఫూర్తి కొప్పు, కుమారి ప్రహళిక మ్యాకల, శ్రీరంజని కందూరి జ్యోతి ప్రజ్వలన చేశారు. శ్రీరామదాసు అర్గుల గణేశ వందనం సమర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ మన్నెం మాట్లాడుతూ.. పండుగలు, సంప్రదాయాలను భావితరాలకు తెలియజేయటానికి ఇలాంటి వేడుకలు దోహదంచేస్తాయన్నారు.

వారంట్‌లను బూచిగా చూపి వసూళ్ల దందా!

» ఏసీబీకి చిక్కిన ఇద్దరు కానిస్టేబుళ్లు, ఓ హెడ్ కానిస్టేబుల్
» వారితోపాటు మరో నలుగురు ప్రైవేటు వ్యక్తుల అరెస్ట్
» చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన

హైదరాబాద్ సిటీ, దిల్‌సుఖ్‌నగర్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కోర్టు వారెంట్‌లను అడ్డంపెట్టుకుని బెదిరింపులకు దిగుతూ వసూళ్లకు పాల్పడుతున్న ముగ్గురు పోలీసు సిబ్బందిని, వారికి సహకరిస్తున్న నలుగురు ప్రైవేటు వ్యక్తులను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసిన ఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. చైతన్యపురి పోలీస్ స్టేషన్‌కు చెందిన నరేందర్ కోర్టు కానిస్టేబుల్‌గా, హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్‌బాబు, కానిస్టేబుల్ మల్లేశం కోర్టు వారెంట్ రీకాల్ విధులు నిర్వహిస్తున్నారు. కొన్నాళ్లుగా వీరు కోర్టు వారెంట్‌లను అడ్డం పెట్టుకుని పలు కేసుల్లో నిందితులను బెదిరిస్తూ వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఫిర్యాదుల మేరకు ఏసీబీ అధికారులు చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌లో సోదాలు జరిపి, ఆధారాలు సేకరించారు. ముగ్గురు పోలీసు సిబ్బందితోపాటు వారికి సహకరించిన మరో నలుగుర్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దీనికి సంబంధించి చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ డీఎస్పీ శ్రీకాంత్ వివరాలు వెల్లడించారు. నూజివీడుకు చెందిన ఎ.వెంకటరమణ కొత్తపేటలో ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నాడు. మెడికల్ కళాశాలల్లో సీట్లు ఇప్పిస్తానని పలువురు విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేశాడు. తర్వాత సీట్లు ఇప్పించకపోవడంతో డబ్బులు ఇచ్చిన విద్యార్థులు 2022 సంవత్సరంలో చైతన్యపురి, ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదులు చేశారు. ఈ క్రమంలో వెంకటరమణపై ఆయా పోలీస్ స్టేషన్‌లలో చీటింగ్ కేసులు నమోదయ్యాయి. తర్వాత బెయిల్ తీసుకున్న వెంకటరమణకు చైతన్యపురి కేసుకు సంబంధించి గతేడాది అక్టోబరులో కోర్టు వారెంట్ జారీ అయింది. దీంతో నరేందర్, ప్రసాద్ బాబు, మల్లేశంలు వెంకటరమణను సంప్రదించారు. రీకాల్ చేసుకుంటానని చెప్పినా సెటిల్ చేసుకోవాలని బెదిరింపులకు దిగారు. ఈ క్రమంలో గత అక్టోబరు 25న వెంకటరమణతో బేరసారాలు సాగించారు. వెంకటరమణ తండ్రి, సోదరునికి ఫోన్ చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తామని బెదిరించారు. రూ.25లక్షలు ఇవ్వాలని, లేని పక్షంలో జైలుపాలు కాకతప్పదని హెచ్చరించారు. నరేందర్, ప్రసాద్‌బాబు, మల్లేశం డబ్బుల వసూలుకు రాఘవేంద్ర గుప్తా, చైతన్య, రామకృష్ణ, సోమశేఖర్‌ను వాడుకునేవారు. ఈ క్రమంలో చైతన్య, రామకృష్ణలు వెంకటరమణనుడబ్బులు వెంటనే ఇవ్వాలంటూ భౌతికదాడులకు దిగారు. దీంతో రూ.5లక్షలు ఇచ్చేందుకు వెంకటరమణ అంగీకరించాడు. తర్వాత సోమశేఖర్ భార్య ఖాతాకు రూ.2లక్షలు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. మిగతా 3లక్షల కోసం వేధించి మరో రూ.1.50లక్షలు వసూలు చేశారు. వీరి వేధింపులు భరించలేక వెంకటరమణ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. దీంతో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు. ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్స్, వాట్సాప్ చాటింగ్‌ల ఆధారంగా ఏసీబీ డీఎస్పీ శ్రీకాంత్ నేతృత్వంలో అధికారుల బృందం బుధవారం రాత్రి నుంచి చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో సోదాలు ప్రారంభించారు. విచారణ అనంతరం ముగ్గురు పోలీసులు, వారికి సహకరిస్తున్న నలుగురిని గురువారం రాత్రి అరెస్ట్ చేశారు. ఇతర కేసుల్లో కూడా వారెంట్‌లను చూపి డబ్బు వసూళ్లు చేసినట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు.

రేవంత్ అదానీ అలయ్‌బలయ్

(మొదటి పేజీ తరువాయి)

కనిపిస్తున్నాయని చెప్పారు. రాష్ట్రంలో ఇదే పరిస్థితి కొనసాగితే కేవలం ఆరునెలల్లోనే ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే పరిస్థితి వస్తుందని కేటీఆర్ జోస్యం చెప్పారు. మహబూబ్‌నగర్ పార్లమెంటు నియోజకవర్గ బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలనుద్దేశించి కేటీఆర్ మాట్లాడారు. మోదీ, అదానీ ఒకటేనని రాహుల్ గాంధీ, రేవంత్ చాలాసార్లు చెప్పారని ఆయన గుర్తుచేశారు. దేశానికి అదానీ శత్రువు అంటూ ఢిల్లీలో కొట్లాడుతున్న కాంగ్రెస్.. ఇక్కడ మాత్రం ఆయనతో ఎందుకు కలిసి పనిచేస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఆదేశాల మేరకే అదానితో ఇక్కడి ప్రభుత్వం కలిసి పనిచేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి బీఆర్‌ఎస్‌ను ఓడించాలని స్వయంగా బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి బండి సంజయ్ పిలుపునిచ్చారని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్- బీజేపీలవి కుమ్మక్కు రాజకీయాలని ఆయన దుయ్యబట్టారు.పాలమూరు రంగారెడ్డికి జాతీయ హోదా తమవల్ల కాదంటూ కాంగ్రెస్ పార్టీ చేతులెత్తేసిన విషయాన్ని మహబూబ్‌నగర్ ప్రజలు గుర్తుంచుకోవాలని కేటీఆర్ సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల సంఖ్య సరిగ్గా 420 అని కేటీఆర్ విమర్శించారు. 'డిసెంబరు 9న సీఎం అవుతున్నా... అదేరోజు రైతు రుణమాఫీ చేస్తా' అని పదే పదే చెప్పిన రేవంత్.. అధికారంలోకి వచ్చాక రుణ మాఫీ మరచిపోయారని ఎద్దేవా చేశారు. రైతుబంధు రూ.15 వేలిస్తామని, పింఛను రూ.4 వేలిస్తామని చెప్పి.. వాటి పెంపుపై ఇప్పటికీ దృష్టి పెట్టలేదని ఆరోపించారు. రూ.4వేల నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రియాంక గాంధీ ప్రకటిస్తే.. తాము హామీ ఇవ్వలేదని అసెంబ్లీ సాక్షిగా ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారన్నారు.



మహబూబ్‌నగర్ నేతలతో సమీక్షలో మాట్లాడుతున్న కేటీఆర్

గెలుపు బాట కష్టమేమీ కాదు..పార్టీపై గతంలో జరిగిన దుష్ప్రచారాన్ని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలపైనే ఉందని కేటీఆర్ అన్నారు. గ్రామపంచాయతీ నుంచి పార్లమెంటు దాకా బలంగా ఉన్న తమ పార్టీ తిరిగి గెలుపు బాట పట్టడం కష్టమేమీ కాదని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలను నేరుగా ప్రజలకు అందించాలనే లక్ష్యంతో నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి వెళ్లేటట్లు చేశామన్నారు. దీంతో ప్రభుత్వం, పార్టీ మధ్య తేడాను ప్రజలు తెలుసుకోలేకపోయారని అభిప్రాయపడ్డారు. ప్రజల కోసం చేసిన కార్యక్రమాలను కూడా బీఆర్‌ఎస్‌పార్టీ ద్వారా జరిగిందనే విషయం చెప్పుకోవడంలో విఫలమయ్యామని ఆయన అంగీకరించారు. పార్లమెంటు సన్నాహక సమావేశాల్లో పార్టీ కార్యకర్తల నుంచి వస్తున్న అభిప్రాయాలను నేరుగా పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌కు చేరవేస్తున్నామన్నారు. పదేళ్లపాటు ప్రజల కోసం పనిచేసిన బీఆర్‌ఎస్ సర్కారుపై చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకే తెలంగాణ కోసం చేసిన అభివృద్ధిని, ఆస్తుల రూపకల్పనను స్వేద పత్రం పేరుతో వెల్లడించామన్నారు. అప్పులు కాదు... ఆస్తుల సృష్టించామని, బంగారు పళ్లెంలో పెట్టి తెలంగాణను కాంగ్రెస్‌కు అప్పజెప్పామన్నారు. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు, గ్రామం నుంచి రాజధాని హైదరాబాద్ దాకా ప్రతి చోట అనేక వేలకోట్ల ఆస్తులను సృష్టించామని కేటీఆర్ ఈ సందర్భంగా వెల్లడించారు.

ఎమ్మెల్సీలకు నియోజకవర్గాల బాధ్యతలు

పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎమ్మెల్సీలు పర్యవేక్షణ బాధ్యత తీసుకోవాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు సూచించారు. పార్టీ అభ్యర్థులు ఓటమి చెందిన చోట ప్రొటోకాల్ రీత్యా.. వివిధ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీలు పాల్గొనేందుకు వీలుంటుందని చెప్పారు. తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్‌కు చెందిన ఎమ్మెల్సీలతో గురువారం కేటీఆర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనమండలి సభ్యులు పార్టీకి కండ్లు, చెవుల మాదిరిగా పనిచేయాలని, ఇప్పటికే ఎంపిక చేసుకున్న నియోజకవర్గాల్లోని పార్టీ శ్రేణులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. త్వరలో అధినేత కేసీఆర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీలతో సమావేశం ఉంటుందని, అందులో శాసనమండలి పార్టీ నేతను ఎన్నుకుంటారని కేటీఆర్ వెల్లడించారు. గ్రామ స్థాయి నుంచి పొలిట్‌బ్యూరో వరకు పార్టీని పునర్వ్యవస్థీకరించాలని పార్టీ అధ్యక్షుడు భావిస్తున్నారని తెలిపారు. చురుకైన నాయకులు, కార్యకర్తల సేవలను పార్టీ ఉపయోగించుకుంటుందని, జిల్లా కేంద్రంగా పార్టీ కార్యక్రమాలను మరింత క్రియాశీలం చేస్తామని ఆయన చెప్పారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో నెలకొనే త్రిముఖ పోటీలో బీఆర్‌ఎస్‌కే గెలుపు అవకాశాలు బలంగా ఉన్నాయన్నారు. ఈ ఏడాదంతా వరుసగా వివిధ ఎన్నికలు ఉన్నాయని, వాటిని ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీల అమలు కోసం శాసనసభ, శాసనమండలిలో పార్టీ తరపున ఒత్తిడి కొనసాగించాలని, ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేస్తే బలమైన ప్రతిపక్షంగా నిలబడి ప్రశ్నిద్దామని కేటీఆర్ పిలుపునిచ్చారు.

పార్టీ పేరు మార్పుపై ఆలోచిద్దాం

» మహిళా నేత సూచనకు కేటీఆర్ స్పందన

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): 'ఉద్యమ పార్టీగా ప్రారంభమైన టీఆర్‌ఎస్‌ను.. బీఆర్‌ఎస్‌గా ఎందుకు మార్చారు. పార్టీ పేరును మళ్లీ టీఆర్‌ఎస్‌గా మారిస్తేనే.. బతికి బట్టకడతాం.. మార్చండి' అంటూ మక్తల్ నియోజక వర్గానికి చెందిన ఓ మహిళా నేత.. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సూచించినట్లు సమాచారం. స్పందించిన కేటీఆర్.. పార్టీ పేరు మార్పుపై ఆలోచిద్దామని చెప్పినట్లు తెలిసింది. మహబూబ్‌నగర్ పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని గురువారం తెలంగాణ భవన్‌లో నిర్వహించారు. ఇందులో కేటీఆర్, పార్టీ ముఖ్య నేతలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదనాచారి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్.. కొడంగల్, నారాయణపేట, మక్తల్, దేవరకద్ర, మహబూబ్‌నగర్, జడ్చర్ల, షాద్‌నగర్ నియోజకవర్గాలకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల ఓటమికి కారణాలు, క్షేత్రస్థాయి పరిస్థితులు, ఇతర అంశాలను పార్టీ శ్రేణులు ఈ సందర్భంగా వెల్లడించినట్లు తెలుస్తోంది. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల పోకడలే ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పలు స్థానాల్లో పార్టీ ఓటమికి కారణమయ్యాయని ఆ ప్రాంత కార్యకర్తలు ఆవేదన చెందారు. ఎమ్మెల్యేల వేధింపుల వల్ల నిజమైన కార్యకర్తలు తీవ్రంగా ఇబ్బంది పడ్డారని తెలిపారు. కొందరు ఎమ్మెల్యేలు క్యాడర్‌ను ఏమాత్రం పట్టించుకోలేదని, ఎన్నికల సమయంలో తప్ప.. అధికారంలో ఉన్న పదేళ్లు దిగువస్థాయి నాయకులను చిన్నచూపు చూశారని ఆరోపించినట్లు సమాచారం. కాగా, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన తప్పుడు హామీలతో ప్రజలు మోసపోయారని, ఇప్పుడు వచ్చే ఎన్నికలు ఏవైనా.. ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీనే ఆశీర్వదిస్తారని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. లోక్‌సభ స్థానాల్లో ఎవరు పోటీ చేయాలన్నది పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయిస్తారని తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థుల గెలుపునకు కష్టపడి పనిచేస్తామని శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు.

మల్కాజిగిరి బరిలో ఈటల!

» సిటింగ్ స్థానాలనుంచి కిషన్‌రెడ్డి, సంజయ్, అర్వింద్, సోయం పోటీ

న్యూఢిల్లీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణనుంచి లోక్‌సభ ఎన్నికలబరిలో నిలిచే పార్టీ అభ్యర్థుల జాబితాను సాధ్యమైనంత త్వరలో ప్రకటించాలని బీజేపీ నాయకత్వం యోచిస్తోంది. ఇప్పటికే పలువురు రాష్ట్రనేతలు లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి తమ సుముఖత వ్యక్తం చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, సికింద్రాబాద్ సిటింగ్ ఎంపీ కిషన్ రెడ్డి మరోసారి అదే స్థానంనుంచి బరిలో దిగేందుకు ఆసక్తిగా ఉన్నట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల్లో రెండు స్థానానుంచి పోటీ చేసి ఓటమి పాలైన ఈటల రాజేందర్.. తనకు ఈ సారి మల్కాజిగిరి లోక్ సభ నియోజకవర్గాన్ని కేటాయించాల్సిందిగా ఢిల్లీ పెద్దలకు చెప్పినట్లు తెలిసింది. మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి మహబూబ్‌నగర్ లోక్‌సభ సీటును ఆశిస్తుండగా ఇదే సీటు తనకు కావాలని డీకే అరుణ కూడా కోరుతున్నట్లు తెలిసింది. భువనగిరి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తామంటూ బూర నర్సయ్య గౌడ్, శ్రీరామ్ వెదిరే, దామోదర్ రెడ్డి అధిష్ఠానాన్ని కోరినట్లు సమాచారం. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ సిటింగ్ ఎంపీలైన బండి సంజయ్, సోయం బాపూరావు, ధర్మపురి అర్వింద్ మరోసారి అదే స్థానాలనుంచి బరిలో దిగేందుకు సన్నద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ సారి కనీసం పది సీట్లు గెలిచేందుకు లక్ష్యంగా పెట్టుకోవల్సిందిగా బీజేపీ నాయకత్వం నేతలను కోరినట్లు తెలిసింది

అయోధ్య వివాదానికి కాంగ్రెస్సే కారణం

» రాష్ట్రంలో బీఆర్‌ఎస్ కథ ఇక క్లోజ్: అర్వింద్

నిజామాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : అయోధ్య వివాదానికి కాంగ్రెస్ పార్టీయే కారణమని నిజామాబాద్ ఎంపీ అరవింద్ ఆరోపించారు. గురువారం నిజామాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ జై శ్రీరాం అంటే.. తాము వద్దన్నామా!? అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో 60 ఏళ్లు ఉన్నా.. రామ మందిర కట్టడం గురించి పట్టించుకోలేదని విమర్శించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దేవాలయాలకు రక్షణ ఉందని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత దేశంలో రామరాజ్యం వస్తుందన్నారు. హిందువులంతా ఐక్యం కావాలని ఆయన సూచించారు. బాబ్రీ మసీద్ స్థలంలో ఆసుపత్రి కట్టాలని సెక్యులర్ పార్టీల నేతలు డిమాండ్ చేయాలని సవాలు విసిరారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ కథ ఇక క్లోజ్ అని పేర్కొన్నారు. కవిత విషయంలో ఈడీ తన పని తాను నిర్వర్తిస్తుందని చెప్పారు.

దేవుడి అక్షింతలపై రాజకీయాలా?:బండి

దేవుడి అక్షింతలనూ కొందరు కాంగ్రెస్ నాయకులు రాజకీయం చేస్తున్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, బండి సంజయ్ విమర్శించారు. గురువారం ఆయన కరీంనగర్‌లోని పద్మనగర్‌లో శివాలయాన్ని శుద్ధిచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేషన్ బియ్యం తీసుకొచ్చి అయోధ్య అక్షింతలు అంటున్నారని కొందరు కాంగ్రెస్ నాయకులు ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు.దేవుడి అక్షింతలపై రాజకీయం చేయడం తగదని పేర్కొన్నారు.





ఎన్టీఆర్ ఘాట్‌లో నివాళులర్పిస్తున్న బాలకృష్ణ, రామకృష్ణ తదితరులు, ఎన్టీఆర్ భవన్‌లో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన నారా భువనేశ్వరి

ప్రజల మనిషి.. ఎన్టీఆర్!

» వర్ధంతి సందర్భంగా టీడీపీ వ్యవస్థాపకుడికి ఘన నివాళులు
» మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని ఇచ్చిన అన్న: బాలకృష్ణ
» ఎన్టీఆర్‌భవన్‌లో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన భువనేశ్వరి
» చర్చనీయాంశంగా జూనియర్ ఎన్టీఆర్ ఫ్లెక్సీల తొలగింపు

ఖైరతాబాద్/హైదరాబాద్/హైదరాబాద్ సిటీ/మొయినాబాద్ రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత మాజీ సీఎం ఎన్టీ రామారావు 28 వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ ఘాట్ వద్ద కుటుంబసభ్యులు, అభిమానులు ఘన నివాళులు అర్పించారు. ప్రజల మనిషి ఎన్టీఆర్ అని.. ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. వేకువ జామునే ఎన్టీఆర్ ఘాట్ వద్ద సోదరుడు కల్యాణ్‌రామ్‌తో కలసి జూనియర్ ఎన్టీఆర్ నివాళులర్పించారు. అనంతరం టీడీపీ చీఫ్ చంద్రబాబు సతీమణి భువనేశ్వరి, ఆమె సోదరులు బాలకృష్ణ, రామకృష్ణ తదితరులు కుటుంబ సభ్యులతో కలసి వచ్చి నివాళులర్పించారు. ఎన్టీఆర్ కొత్తతరం యువతకు మార్గదర్శకుడని, ఆయన జీవన విధానం ఒక భగవద్గీతలా సాగిందని బాలకృష్ణ అన్నారు. ఎన్టీఆర్ అంటేనే నవరసాలకు అలంకారమని కొనియాడారు. పేదల ఆకలి తీర్చిన నాన్నగా, భవిష్యత్తును తీర్చిదిద్దిన నేతగా, మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని ఇచ్చిన అన్నగా ఖ్యాతి గాంచారన్నారు. తెలుగుజాతి ఎన్నటికీ మరచిపోలేని మహానాయకుడు ఎన్టీఆర్ అని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. ఎన్టీఆర్ జయంతి, వర్ధంతులను ప్రభుత్వమే నిర్వహించాలని సూచించారు. తెలంగాణలో మాదిగలను మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని విధాలుగా మోసం చేశారని దుయ్యబట్టారు. తెలంగాణకు తొలి సీఎం దళితుడేనని చెప్పి.. తానే పీఠమెక్కి దళిత సామాజిక వర్గానికి అన్యాయం చేశారని మండిపడ్డారు. సినీ, రాజకీయ రంగాల్లో ఎన్టీఆర్ చేసిన సేవలకు గానూ ఆయనకు భారతరత్న ప్రకటించాలని సినీ డైరెక్టర్ వైవీఎస్ చౌదరి అన్నారు. కాగా, ఎన్టీఆర్ అంటేనే గుర్తుకు వచ్చేది క్రమశిక్షణ.. ఆయన ప్రజల మనిషి అని ఎన్టీఆర్ ట్రస్టు ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా మెడికల్ క్యాంపులు, రక్తదానశిబిరాలు, ఉచిత విద్య, వైద్యంతో పాటు అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ఎన్టీఆర్‌భవన్‌లో ఏర్పాటు చేసిన 'లెజెండరీ బ్లడ్ డొనేషన్ డ్రైవ్' కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు, జాతీయ అధికార ప్రతినిధులు నన్నూరి నర్సిరెడ్డి, జ్యోత్స్న, మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన పాల్గొన్నారు. ఇటు బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ఆవరణలో ఎన్టీఆర్‌కు నివాళులు అర్పించారు. ఆస్పత్రి ట్రస్టు బోర్డు సభ్యులతో నారా బ్రాహ్మణి ఆస్పత్రిలోని ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. కేన్సర్‌పై పోరాడుతున్న చిన్నారులకు బ్రాహ్మణి బహుమతులు, పండ్లు పంపిణీ చేశారు. ఎన్టీ రామారావు మహోన్నత వ్యక్తి అని ఎన్టీఆర్ విద్యాసంస్థల డీన్ రామారావు అన్నారు. మొయినాబాద్ మండలంలోని ఎన్టీఆర్ విద్యాసంస్థల ప్రధాన కేంద్రంలో ఆయన ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జూనియర్ ఎన్టీఆర్ ఫ్లెక్సీల తొలగింపు..

ఎన్టీఆర్ ఘాట్ వద్ద జూనియర్ ఎన్టీఆర్ ఫ్లెక్సీలను బాలకృష్ణ అభిమానులు తొలగించడం చర్చనీయాంశంగా మారింది. జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్ కలసి నివాళులర్పించి వెళ్లాక బాలకృష్ణ ఎన్టీఆర్ ఘాట్‌కు వచ్చారు. అక్కడ సీనియర్ ఎన్టీఆర్, జూనియర్ ఎన్టీఆర్, హరికృష్ణ, కల్యాణ్‌రామ్‌లతో ఉన్న ఫ్లెక్సీలను చూసి.. వెంటనే తొలగించాలని ఆయన ఆదేశించినట్టు సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. అయితే వర్ధంతి రోజున ఎటువంటి ఫ్లెక్సీలను ఏర్పాటు చేయొద్దనే.. వాటిని తొలగించినట్లు తెలిసింది.

రాష్ట్ర బీజేపీలో భారీ ప్రక్షాళన

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీజేపీలో సంస్థాగతంగా భారీ ప్రక్షాళన జరిగింది. పార్లమెంటు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అడుగుల వేస్తున్న కమల దళం.. అందుకు అనుగుణంగా మార్పులకు శ్రీకారం చుట్టింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో పలువురు జిల్లా పార్టీ అధ్యక్షులు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులను మార్చబోతున్నారంటూ కొద్దిరోజులుగా జరుగుతున్న ప్రచారానికి తెరపడింది. సంస్థాగతంగా పార్టీ దాదాపు మూడో వంతు జిల్లాల అధ్యక్షులను మార్చింది. రాష్ట్ర వ్యాప్తంగా 12 జిల్లాల అధ్యక్షులను, 5 మోర్చాల అధ్యక్షులను మార్చింది. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు సహకరించలేదని ఆరోపణలు వచ్చినవారితో పాటు, సుదీర్ఘకాలం పదవిలో కొనసాగిన వారి స్థానంలో కొత్త వారిని నియమించారు. మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట, నిజామాబాద్, పెద్దపల్లి, నల్లగొండ, సంగారెడ్డి, వరంగల్, ములుగు, సిద్దిపేట, వికారాబాద్, యాదాద్రి- భువనగిరి జిల్లాలకు కొత్త అధ్యక్షులను నియమించారు. పార్టీ సంస్థాగతంగా 38 జిల్లాలను ఏర్పాటు చేసింది. ఇందులో 12 జిల్లాలకు కొత్త అధ్యక్షులను నియమించగా, ఆదిలాబాద్, మహబూబాబాద్, భూపాలపల్లి జిల్లాలను పెండింగ్‌లో ఉంచారు. ఈ జిల్లాలకు కూడా కొత్త అధ్యక్షులను నియమించనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి.

కొత్త అధ్యక్షులు వీరే..

మహబూబ్‌నగర్-పి. శ్రీనివాసరెడ్డి; వనపర్తి-డి. నారాయణ; నారాయణపేట-ఎం. జలంధర్‌రెడ్డి; నిజామాబాద్- దినేశ్‌కులాచారి; పెద్దపల్లి-చందుపట్ల సునీల్ రెడ్డి; నల్లగొండ-డాక్టర్ వర్షిత్‌రెడ్డి; సంగారెడ్డి- గోదావరి; వరంగల్-గంటా రవి; ములుగు-బలరాం; సిద్దిపేట-జి. మోహన్‌రెడ్డి; వికారాబాద్- కె. మాధవరెడ్డి; యాదాద్రి భువనగిరి-పి. భాస్కర్. ఎస్టీ మోర్చా- డాక్టర్ జె.గోపి(కళ్యాణ్ నాయక్).. ఎస్సీ మోర్చా- కొండేటి శ్రీధర్.. యువ మోర్చా-సెవెళ్ల మహేందర్.. ఓబీసీ మోర్చా- ఆనంద్‌గౌడ్.. మహిళా మోర్చా- డాక్టర్ శిల్ప.


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

రాష్ట్రంలో ఎరువుల కొరత లేదు

- గతేడాది కంటే 22% అధికంగా నిల్వలు
- రుణ బకాయిలను చెల్లించాలి: తుమ్మల నాగేశ్వర్‌రావు

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రైతుల అవసరాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో ఎరువులు అందుబాటులో ఉంచాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆదేశించారు. సచివాలయంలో గురువారం వ్యవసాయ, మార్క్‌ఫెడ్ అధికారులతోపాటు ఎరువుల కంపెనీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ... నోడల్ ఏజెన్సీ మార్క్‌ఫెడ్‌తోపాటు ఎరువుల కంపెనీలతో చర్చించి గ్రామస్థాయి వరకు చేర్చే ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. మార్క్‌ఫెడ్, వ్యవసాయశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. లారీల సమ్మె కారణంగా నిర్మల్ జిల్లాలో ఎరువుల సరఫరాలో సమస్య ఏర్పడిందని, జిల్లా అధికారులు జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు గ్రామస్థాయిలో ఎరువులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఎరువుల కొరతలేదని, గత యాసంగి సీజన్‌లో జనవరి 18 తేదీ నాటికి 7.02 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వలు ఉంటే... ఈ యాసంగి సీజన్‌లో 8.59 లక్షల టన్నుల ఎరువులు నిల్వ ఉంచినట్లు తెలిపారు. డీసీసీబీ, పీఏసీఎస్‌లలో ఉన్న పాత రుణ బకాయిలపై మంత్రి సమీక్షించారు. మొండి బకాయిలు, నాన్ అగ్రికల్చర్ రుణాలను తీర్చనివారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిజామాబాద్ జిల్లా రైతులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు... నిబంధనలకు విరుద్ధంగా తీసుకున్న రుణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని టెస్కాబ్ ఎండీ నేతి మురళీధర్‌ను ఆదేశించారు. వారం రోజుల్లో రుణాలు తీర్చనివారిపై, రికవరీ చేయని అధికారులపై చర్యలు తీసుకుంటామని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హెచ్చరించారు.

మళ్లీ కనెక్టవుతున్నందుకు సంతోషంగా ఉంది

- గవర్నర్ తమిళిసై

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అధికారిక ఎక్స్(ట్విట్టర్) ఖాతా పునరుద్ధరించారు. కొద్ది రోజుల క్రితం తమిళిసై ఎక్స్ ఖాతా హ్యాకింగ్ అయిన విషయం తెలిసిందే. ఎక్స్ ఖాతా హ్యాకింగ్‌పై రాజ్‌భవన్ వర్గాలు సైబర్ క్రైం పోలీస్‌లకు ఫిర్యాదు చేశాయి. తాజాగా ఎక్స్ ఖాతా పునరుద్ధరణ కావడంతో "ట్విట్టర్ ద్వారా మీ అందరితో మళ్లీ కనెక్ట్ అవుతున్నందుకు సంతోషంగా ఉంది" అని తమిళిసై ఆసక్తికర పోస్టింగ్ చేశారు. అలాగే కొద్ది రోజుల క్రితం అయోధ్య రామమందిరం సందర్శించినప్పటి ఫొటోల్ని పోస్ట్ చేశారు.

సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు విడుదల చేస్తాం

- పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క

ములుగు, జనవరి 18: రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సర్పంచ్‌ల బిల్లులను త్వరలోనే విడుదల చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క తెలిపారు. ములుగు గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో గురువారం సీతక్కను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం రూ.1,200 కోట్ల గ్రామ పంచాయతీ నిధులను పక్కదారి పట్టించిందని ఆరోపించారు. ఈ విషయంపై అసెంబ్లీలో ప్రశ్నిస్తే తమ నోళ్లు నొక్కారని, పెండింగ్ బిల్లులను విడుదల చేస్తే పల్లెల్లో మరింత అభివృద్ధి జరిగి ఉండేదని చెప్పారు. పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం కూడా ముగింపు దశకు వచ్చిందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి బిల్లులు విడుదల చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

సర్పంచులపై కేటీఆర్ మొసలి కన్నీరు

- పదేళ్లు ఏం చేశారు: సర్పంచుల సంఘం

బర్కత్‌పుర, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సర్పంచుల గురించి మాట్లాడే నైతిక హక్కు మాజీ మంత్రి కేటీఆర్‌కు లేదని రాష్ట్ర పంచాయతీ సర్పంచుల సంఘం ఆరోపించింది. పదేళ్ల అధికారంలో ఉండి.. బిల్లులు రాక సర్పంచులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా పట్టించుకోని కేటీఆర్.. ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని ధ్వజమెత్తారు. సర్పంచులకు ఏం చేశారో కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర పంచాయతీ సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సౌదాని భూమన్న యాదవ్, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు జూలూరు ధనలక్ష్మి తదితరులు మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎన్ని నిధులు కేటాయించారో కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

నాణ్యమైన మందులనే కొనుగోలు చేయాలి

- టీఎస్ఎంఎస్ఐడీసీకి మంత్రి రాజనర్సింహ ఆదేశాలు

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అవసరమైన మందుల్లో నాణ్యమైనవాటినే కొనుగోలు చేయాలని 'తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(టీఎస్ఎంఎస్ఐడీసీ)' అధికారులను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహ ఆదేశించారు. టీఎస్ఎంఎస్ఐడీసీ చేపడుతున్న కార్యక్రమాలు, పనితీరుపై గురువారం సచివాలయంలో ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. టీఎస్ఎంఎస్ఐడీసీ ద్వారా నిర్మిస్తున్న వైద్య కళాశాలల భవనాలు, నర్సింగ్ కాలేజీల భవనాల పనులు, కళాశాలల సామర్థ్యం పెంపు, మౌలిక సదుపాయాల కల్పన, అధునాతన పరికరాలు, మందులు, ఎంసీహెచ్ కిట్స్ న్యూట్రిషన్ కిట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసే మందుల విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

సీఎంఆర్ ఇచ్చేందుకు 31వ తేదీ డెడ్‌లైన్

- రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గతేడాది వానాకాలం సీజన్‌కు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)కోటాను ఈనెల 31 వ తేదీకి పూర్తిచేయాలని పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ డెడ్‌లైన్ విధించారు. వివిధ జిల్లాల అడిషనల్ కలెక్టర్లు, డీఎస్‌వోలు, జిల్లా మేనేజర్లతో ఆయన గురువారం సమీక్ష నిర్వహించారు. ఇంకా 13 రోజుల సమయం ఉన్నదని, టార్గెట్‌ను పూర్తిచేయాలని సూచించారు. ఉద్దేశపూర్వకంగా ఎఫ్‌సీఐకి బియ్యం ఇవ్వకుండా డిఫాల్ట్ చేసుకుని 31 వ తేదీ తర్వాత గతంలో మాదిరిగా పాతపద్ధతిలో పౌరసరఫరాల సంస్థకు బియ్యం ఇస్తామంటే అంగీకరించబోమని స్పష్టం చేశారు. ప్రజాపంపిణీకి కార్పొరేషన్ దగ్గర అవసరమైన బియ్యం నిల్వలు ఉన్నాయని, ఆ పరిస్థితిలో ప్రతి బియ్యం గింజను కూడా ఎఫ్‌సీఐకి అప్పగించాల్సిందేనని అన్నారు. పాత పద్ధతులను పక్కన పెట్టాల్సిందేనని హెచ్చరించారు. కార్పొరేషన్ డంపింగ్ యార్డు కాదనే విషయాన్ని ప్రతిఒక్కరు గుర్తుంచుకోవాలన్నారు. డిఫాల్ట్ అయిన మిల్లర్లపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పూర్వ వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

- మంత్రి పొంగులేటికి ట్రెసా విజ్ఞప్తి

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పూర్వ వీఆర్‌ఏల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని గురువారం రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ట్రెసా విజ్ఞప్తి చేసింది. ఈమేరకు వినతిపత్రం అందజేసింది. 61 ఏళ్లు పైబడిన వీఆర్‌ఏల కుటుంబ సభ్యులకు వారసత్వ ఉద్యోగాలు, విద్యార్హతల్లో వ్యత్యాసాలకు సంబంధించిన వాటితోపాటు వివిధ శాఖలకు అలాట్‌మెంట్ జరిగి ఇంకా పోస్టింగ్ ఇవ్వని పూర్వ వీఆర్‌ఏలకు పోస్టింగ్‌లు ఇచ్చి న్యాయం చేయాలని కోరింది. ఈ సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలో అంశాలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని ట్రెసా తెలిపింది. మంత్రిని కలిసిన వారిలో ట్రెసా అధ్యక్షుడు వంగ రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.గౌతమ్‌కుమార్, రమన్ రెడ్డి తదితరులున్నారు.

దూరం... దూరంగానే!

- అన్నతో కలివిడిగా ఉండలేని షర్మిల
- మేనల్లుడి నిశ్చితార్థానికి జగన్, భారతి
- ఫొటో కోసం పదేపదే అన్న పిలుపు
- తల్లి పిలిచాకే ముందుకొచ్చిన షర్మిల
- వేదికపై నిమిషంలోపే జగన్ దంపతులు

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): 'యాంటి కబ్బా ఇప్పుడు ఆమె రావడం!'... అంటూ సోదరి షర్మిలను కలిసేందుకు ఇష్టపడని జగన్! 'అయితే, నా కుమారుడి పెళ్లి కార్డు గేటు దగ్గర సెక్యూరిటీకి ఇచ్చి పోతా' అని చెల్లి షర్మిల స్పందన! దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో చెల్లెలిని కలిసి, మేనల్లుడి వివాహ ఆహ్వాన పత్రికను జగన్ అందుకున్నారు. ఇది... మొన్నటి చిత్రం! ఇక... గురువారం హైదరాబాద్ శివారులోని ఓ రిసార్టులో జరిగిన నిశ్చితార్థ వేడుకలోనూ ఇద్దరి మధ్య విభేదాలు బయటపడ్డాయి. తన భార్య భారతితో కలిసి జగన్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అంతకుముందు తనకు ఎదురైన అనుభవం వల్ల కాబోలు... జగన్ వేదికపైన ఉన్న ఆ ఒక్క నిమిషం కూడా షర్మిల ఆయనతో కలివిడిగా ఉండలేకపోయారు. స్వయానా సోదరుడు, అందునా రాష్ట్ర ముఖ్యమంత్రి వస్తున్నప్పుడు రెండు అడుగులు ముందుకు వేసి, ఆహ్వానించి... కాబోయే కోడలిని పరిచయం చేయడం వంటివి జరగాలి. కానీ... జగన్ దంపతులు వస్తున్నా ఎక్కడున్న షర్మిల అక్కడే నిల్చున్నారు. జగనే ఆమె దగ్గరికి వచ్చి, అలా పలకరిస్తూ ముందుకెళ్లి... మేనల్లుడైన వరుడు రాజారెడ్డికి, వధువు ప్రియా అట్లూరికి పుష్పగుచ్ఛం ఇచ్చారు. ఆ తర్వాత అంతా కలిసి ఫొటో దిగుదామంటూ జగన్ పదేపదే షర్మిలను, బావ అనిల్‌నూ పిలిచారు. రెండుమూడుసార్లు చేతులు ఊపినా షర్మిల స్పందించలేదు. అనిల్ అలా రెండు అడుగులు ముందుకు వేసి... ఇలా వెనక్కి వచ్చారు. చివరికి... తల్లి విజయలక్ష్మి పిలవడంతో షర్మిల, అనిల్ వచ్చి ఫొటో కోసం నవ్వుతూ నిలబడ్డారు. మొత్తంగా నిమిషం కూడా జగన్ వేదికపై ఉండలేదు!


నిశ్చితార్థ వేడుకలో ఏపీ సీఎం జగన్ దంపతులు, దూరంగా షర్మిల దంపతులు

హాజరైన ప్రముఖులు

షర్మిల కుమారుడు రాజారెడ్డి-అట్లూరి ప్రియ నిశ్చితార్థ వేడుకకు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. కాబోయే వధూవరులకు ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ మంత్రులు రఘువీరా, జానారెడ్డి పాల్గొన్నారు

ఐటీఐల్లో ఉపాధి గ్యారెంటీ

(మొదటి పేజీ తరువాయి)

కల్పించేలా ఐటీఐల్లో సిలబస్‌ను సైతం మార్చనున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేసేందుకు టీసీఎస్ ప్రభుత్వ భాగస్వామ్యంతో ఈ కొత్త ప్రాజెక్టు చేపట్టనుంది. లాంగ్ టర్మ్, షార్ట్ టర్మ్ కోర్సులతో పాటు నైపుణ్యాల వృద్ధికి బ్రిడ్జి కోర్సులు నిర్వహిస్తారు. కొత్త కోర్సులు ప్రవేశపెడతారు. తెలంగాణలో టాటా కంపెనీ నిర్వహిస్తున్న ఇతర వ్యాపారాల గురించి టాటా గ్రూప్ ఛైర్మన్ ముఖ్యమంత్రితో మాట్లాడారు. హైదరాబాద్‌లో అతిపెద్ద ఐటీ కంపెనీగా, 80 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తున్న టీసీఎస్‌ను రాబోయే రోజుల్లో మరింత విస్తరిస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. తెలంగాణలో చేపట్టబోయే భవిష్యత్తు వ్యాపార ప్రణాళికలపై సీఎంతో చర్చించారు.

ట్రాన్సిట్ హబ్‌గా శంషాబాద్

టాటా గ్రూప్‌నకు చెందిన ఎయిర్ ఇండియా విస్తరణలోనూ హైదరాబాద్‌ను ట్రాన్సిట్ హబ్‌గా ఎంచుకుంటామని, హైదరాబాద్ నుంచి జాతీయ, అంతర్జాతీయ విమానాల కనెక్టివిటీని పెంచుతామని కంపెనీ తెలిపింది. తెలంగాణ అభివృద్ధికి టాటా గ్రూప్ కీలకమైన భాగస్వామ్యం అందిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశంసించారు. టాటా గ్రూప్ కొత్త ప్రాజెక్టులకు పూర్తి సహకారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రకటించారు. ప్రభుత్వ ఐటీఐల్లో అధునాతన నైపుణ్య కేంద్రాల ఏర్పాటుకు భాగస్వామ్యం పంచుకోవటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీలను నెలకొల్పేందుకు చొరవ చూపాలని సీఎం టాటా గ్రూప్‌ను ఆహ్వానించారు. తమ గ్రూప్ పెట్టుబడులకు తెలంగాణ వ్యూహాత్మకమైన కేంద్రంగా ఉందని, వీలైనంత మేరకు రాష్ట్రంలో తమ గ్రూప్ వ్యాపారాలను విస్తరిస్తామని టాటా సన్స్ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ అన్నారు. కొత్త ప్రభుత్వంతో కలిసి పని చేయాలనే ఆసక్తితో ఎదురు చూస్తున్నామని చెప్పారు.

హెల్త్ కేర్ డివైజెస్ తయారీ కేంద్రం

బ్రిటన్‌కు చెందిన ప్రముఖ వైద్య పరికరాల తయారీ సంస్థ సర్జికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ గ్రూప్ హోల్డింగ్స్(ఎస్ఐజీహెచ్) హైదరాబాద్‌లో తమ తయారీ కేంద్రాన్ని నెలకొల్పేందుకు ముందుకొచ్చింది. ఇప్పటివరకు దేశంలో తయారు చేయని పలు సర్జికల్ పరికరాలను ఇక్కడ తయారు చేస్తారు. రాబోయే రెండు మూడు సంవత్సరాల్లో రూ.231.5 కోట్ల పెట్టుబడులు పెడుతామని ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా విస్తరించే ప్రణాళికలో భాగంగా ఈ కంపెనీ భారతీయ మార్కెట్‌లోకి అడుగుపెడుతోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబుతో కంపెనీ ఎండీ గౌరీ శ్రీధర, డైరెక్టర్ అమర్ చీడిపోతు గురువారం సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ముఖ్యమంత్రి వారికి హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టు మొదటి దశలో జనరల్ సర్జికల్ పరికరాలు, మైక్రో సర్జరీకి ఉపయోగించే అధునాతన పరికరాలు తయారు చేస్తారు. ఆర్థోపెడిక్, చర్మ, నేత్ర సంబంధిత సున్నితమైన సర్జరీలకు అవసరమయ్యే యంత్రాలను ఈ సంస్థ తయారుచేస్తుంది. రెండో దశలో రోబోటిక్ వైద్య పరికరాలను తయారీ చేసేలా యూనిట్ విస్తరిస్తామని కంపెనీ తెలిపింది. ఈ నిర్ణయంతో హెల్త్‌కేర్ రంగంలో తెలంగాణ మరో ముందడుగు వేయనుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. పెట్టుబడులకు సిద్ధమైన ఎస్ఐజీహెచ్ కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని అన్నారు.


దావోస్ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్‌లో పెట్టుబడులకు క్యూ సెంట్రియో

ఐటీ డెవలప్‌మెంట్ సర్వీసెస్ అందించే క్యూ సెంట్రియో కంపెనీ తెలంగాణలో తమ కార్యకలాపాలను విస్తరించనుంది. దావోస్‌లో గురువారం ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో కంపెనీ ప్రతినిధి ఎలమర్తి సమావేశమయ్యారు. ఆయిల్ అండ్ గ్యాస్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ట్రావెల్ అండ్ హాస్పిటాలిటీ, ఆటోమోటివ్, అగ్రికల్చర్, ఇంజనీరింగ్ వంటి రంగాలలో తమ కంపెనీ అత్యాధునిక ఐటీ సేవలు అందిస్తోందని తెలిపారు. అమెరికా, ఆసియా పసిఫిక్ రీజియన్లో ఇప్పటికే కార్యకలాపాలను విస్తరించామన్నారు. ఏఐ, రోబోటిక్స్ ప్రాసెస్ ఆటోమేషన్, మెషిన్ లర్నింగ్, బ్లాక్ చైన్ సొల్యూషన్ వరకు వివిధ అధునాతన సాంకేతిక సేవలను అందిస్తామని, రాష్ట్రంలో వెయ్యి మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ప్రకటించారు. కంపెనీకి సహకరిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. గురువారం నాలుగో రోజు సమావేశాల్లో ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, పెట్టుబడుల ప్రోత్సాహక విభాగం ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యలే పెద్ద సమస్య

రైతులూ.. కంపెనీల్లా లాభాలు గడించాలి: రేవంత్

హైదరాబాద్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): "నేను రైతు బిడ్డను. మాది తెలంగాణలోని చిన్న గ్రామం. వ్యవసాయం మా సంస్కృతి. రైతుల సమస్యలు తెలుసు" అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగంగా 'ఫుడ్ సిస్టమ్స్-లోకల్ యాక్షన్స్' అనే అంశంపై గురువారం నిర్వహించిన చర్చాగోష్ఠిలో రేవంత్ మాట్లాడారు. రైతు ఆత్మహత్యలు భారతదేశంలో చాలా పెద్ద సవాల్ అన్నారు. "రైతులు తమ ఉత్పత్తులను అమ్ముకోలేరు. బ్యాంకుల నుంచి రుణాలు పొందలేరు. లాభాలను ఆర్జించలేరు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి దూరంగా ఉన్నారు" అంటూ ఇక్కడి పరిస్థితిని వివరించారు. రైతులకు సహకరించేందుకు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర అందిస్తోందని, రైతు భరోసా పేరుతో పెట్టుబడి సాయాన్ని అందిస్తోందని వివరించారు. తమది రైతు ప్రభుత్వమని, రైతులకు కనీస మద్దతు ధర కంటే ఆదాయం ఎక్కువ అందించడం ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. కార్పొరేట్ కంపెనీలకు పెట్టుబడులు తిరిగి రావడంతో పాటు లాభాలు ఆర్జిస్తున్నట్లే రైతులు కూడా లాభాలు గడించాలని రేవంత్ ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో 99 శాతం రైతుల ఆత్మహత్యలను నివారించవచ్చని చెప్పారు. ఇన్నాళ్లుగా రైతులు ప్రపంచానికి సహకరిస్తూ వచ్చారని, ఇప్పుడు ప్రపంచం వారికి సహకరించాల్సిన సమయం ఆసన్నమైందని వ్యాఖ్యానించారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు సహకరించాలని రేవంత్ పిలుపునిచ్చారు.

హైదరాబాద్‌లో సిస్ట్రా గ్రూప్ డిజిటల్ సెంటర్

హైదరాబాద్ కేంద్రంగా డిజిటల్ సెంటర్ ఏర్పాటుకు సిస్ట్రా గ్రూప్ సంసిద్ధత వ్యక్తం చేసింది. దావోస్ సమావేశాల్లో గురువారం సంస్థ సీఈవో పియర్ వెర్జాట్‌తో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సమావేశమయ్యారు. అనంతరం సంస్థ ప్రతినిధులు ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నారు. ఐటీ రంగంలో కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్)ను ఉపయోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోందని, విస్తృత డిజిటలైజేషన్‌కు సిస్ట్రా డిజిటల్ సెంటర్ (ఎస్‌డీసీ) ఉపయోగపడుతుందని మంత్రి పేర్కొన్నారు. తద్వారా 1000 మందికి పైగా యువతకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సాంకేతిక నిపుణులకు అత్యుత్తమ గమ్యస్థానాల్లో తెలంగాణ ఒకటని సిస్ట్రా సీఈవో పియర్ వెర్జాట్ కొనియాడారు.

అయోధ్య రామమందిరం పొలిటికల్ అజెండా

- ప్రారంభానికి అందుకే కాంగ్రెస్ దూరం
- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ

హైదరాబాద్, రాంగోపాల్‌పేట్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): దేశంలో సెక్యులర్ పార్టీ అవసరం ఉందని, అది కాంగ్రెస్‌తోనే సాధ్యమని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మునీ అన్నారు. అయోధ్య రామమందిరం పొలిటికల్ అజెండా అని, అందుకే కాంగ్రెస్ దూరంగా ఉందని తెలిపారు. గురువారం సికింద్రాబాద్‌లోని ఓ హోటల్‌లో జరిగిన క్రిస్టియన్ మైనారిటీల నాయకుల సమావేశంలో దీపాదాస్ మున్షీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అయోధ్య రామ మందిర విషయంలో ఎవరి విశ్వాసాలు వారికి ఉంటాయని, ఈ అంశాన్ని రాజకీయం చేయడం సరి కాదన్నారు. దేశం ప్రమాదంలో ఉందని, కాంగ్రెస్ పార్టీని కాపాడటం ద్వారా సెక్యులర్ శక్తుల బలంతో దేశాన్ని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. రామ మందిరం, మసీదు, చర్చ్‌తోపాటు ఇతర ప్రార్థనా కేంద్రాలకు వెళ్తాం కానీ రాజకీయాల కోసం వెళ్లమనే విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు. దేవుని పేరుతో రాజకీయాలు తగదన్నారు. ఇప్పటికే ప్రజలు రామ మందిరానికి వెళుతున్నారని, తామూ ఓ రోజు కచ్చితంగా అక్కడికి వెళతామన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతుగా నిలవాలని క్రిస్టియన్ నాయకులను కోరారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో 17 స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పని చేస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్రంలోని అన్ని పార్లమెంట్ నియోజకవర్గాల క్రిస్టియన్ నాయకులు, బిషప్స్, పాదర్స్, క్రిస్టియన్ ప్రముఖులు పాల్గొన్నారు. వారు కాంగ్రెస్‌కు సంఘీభావం ప్రకటించారు. పలువురు పాస్టర్లు, క్రిస్టియన్ నాయకులు మాట్లాడుతూ.. లోక్‌సభలో తమ గొంతు వినిపించేందుకు సీటు కావాలని, మైనారిటీ కోటాలో కాకుండా జనరల్‌కోటాలో టికెట్‌ను కేటాయించాలని కోరారు.

అయోధ్య ఆలయం పేరిట బీజేపీ రాజకీయం చేస్తోంది

- ఖమ్మంలో సోనియా పోటీ చేయకుంటే..

టికెట్ అడిగే హక్కు నాకే ఉంది: రేణుకాచౌదరి

ఖమ్మం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామ మందిరం పేరుతో బీజేపీ రాజకీయం చేస్తోందని, వచ్చే ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీమంత్రి రేణుకాచౌదరి ఆరోపించారు. గురువారం ఖమ్మం వచ్చిన ఆమె పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హిందుత్వనినాదాన్ని బీజేపీ స్వార్థానికి వాడుకుంటోందని, అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠను బీజేపీ లోక్‌సభ ఎన్నికలకు అనుకూలంగా మార్చుకుంటుందని విమర్శించారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీని ఖమ్మం నుంచి పోటీచేయాలని సీఎం రేవంత్‌తో పాటు తామంతా కోరామన్నారు. ఆమె విజయం కోసం పనిచేస్తామని, ఆమె పోటీకి నో చెబితే ఖమ్మంలో టికెట్ అడిగే హక్కు తనకే ఉంటుందని రేణుక స్పష్టంచేశారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఖమ్మం జిల్లా ఎన్టీఆర్ సర్కిల్‌లోని విగ్రహానికి ఆమె నివాళులర్పించారు. ఎన్టీఆర్‌ను తెలుగుజాతి శాశ్వతంగా గుర్తుంచుకుంటుందని అన్నారు.

ఆదర్శం.. మల్లికార్జున్‌రెడ్డి సాగు పథం

యువత, విద్యావంతులు.. వ్యవసాయం చేయడం శుభ పరిణామం

- కరీంనగర్ జిల్లా రైతుతో మాట్లాడిన మోదీ

చొప్పదండి, జనవరి 18: విద్యావంతులు, యువత వ్యవసాయం చేయడం శుభ పరిణామమని ప్రధాని మోదీ అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమంలో భాగంగా గురువారం కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం పెద్దకుర్మపల్లికి చెందిన ఉత్తమ రైతు మావురం మల్లికార్జున్ రెడ్డితో ప్రధాని ఢిల్లీ నుంచి వర్చువల్‌గా మాట్లాడారు. ఉన్నత విద్యను అభ్యసించి, కార్పొరేట్ సంస్థలో మంచి ఉద్యోగాన్ని వదులుకుని స్వగ్రామంలో వ్యవసాయం చేస్తున్న మల్లికార్జున్‌రెడ్డి అందరికీ ఆదర్శనీయుడని అన్నారు. ఆయన లాంటి విద్యావంతులు కేంద్ర ప్రభుత్వ పథకాలపై యువతకు అవగాహన కల్పించాలని సూచించారు. విశ్వవిద్యాలయాల్లో నిర్వహించే సెమినార్లలో పాల్గొని, సాగు అనుభవాలను వివరించాలని కోరారు. మల్లికార్జున్ రెడ్డి నిర్వహిస్తున్న సమీకృత వ్యవసాయం గురించి ప్రధాని అడిగి తెలుసుకున్నారు. పాడి పశువులు, చేపల పెంపకం ద్వారా అదనపు ఆదాయం పొందడాన్ని అభినందించారు. ప్రధాన మంత్రి యోజనలు అందాయా..? అని అడగగా.. కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రుణాలు పొందానని మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. రుణాలకు వడ్డీ ఎంత చెల్లించారని ప్రధాని ప్రశ్నించగా.. ఏడు శాతం చెల్లించినట్లు మల్లికార్జున్‌రెడ్డి చెప్పారు. అంతకన్నా తక్కువ వడ్డీకే రుణాలు అందుతాయని, దీనిపై బ్యాంకర్లను సంప్రదించాలని సూచించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జనవరి 26 వరకే కొనసాగుతుందని మొదట ప్రకటించినా,ప్రజల నుంచి వస్తున్న మంచి స్పందనతో ఈ కార్యక్రమాన్ని ఫిబ్రవరి వరకు కొనసాగించాలని అధికారులను మోదీ ఆదేశించారు.


ప్రధాని మోదీతో మాట్లాడుతున్న రైతు మల్లికార్జున్ రెడ్డి

మల్కాజిగిరి ఎంపీగా పోటీ చేస్తా: ఈటల

ఇల్లందకుంట: అధిష్ఠానం అవకాశం ఇస్తే మల్కాజిగిరి నుంచి ఎంపీగా పోటీ చేస్తానని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం లక్ష్మాజిపల్లెలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ప్రధాని మోదీ సందేశాన్ని స్థానికులతో కలిసి ఈటల టీవీలో వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కూల్చివేసే ప్రయత్నం చేయడం బీఆర్ఎస్‌కు మంచిది కాదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఏడాది దాటి ఉండదని మాట్లాడటం సరికాదని తెలిపారు.

28న అమిత్ షా రాక..

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్ షా ఈ నెల 28న రాష్ట్ర పర్యటనకు రానున్నారు. మూడు పార్లమెంటు క్లస్టర్లలో పార్టీ కార్యక్రమాలకు ఆయన హాజరవుతారు. కరీంనగర్, మహబూబ్‌నగర్, హైదరాబాద్ క్లస్టర్లలో ఈ సమావేశాలు జరుగుతాయి. కరీంనగర్ పార్లమెంటు క్లస్టర్‌లో కార్యకర్తలతో షా సమావేశమవుతారు. మహబూబ్‌నగర్ క్లస్టర్‌లో ఎన్నికల నిర్వహణ కమిటీలతో, హైదరాబాద్ క్లస్టర్‌లో మేధావులతో సమావేశమవుతారు.

ధరణితో తీసుకున్న భూములపై నివేదిక ఇవ్వండి

- ఆ పోర్టల్‌తో ప్రజలు, ప్రభుత్వ భూములు కొందరి చేతుల్లోకి
- వాటిని గుర్తించి తిరిగి తీసుకునే విధంగా చర్యలు చేపట్టండి
- రెవెన్యూ, వ్యవసాయ శాఖల బడ్జెట్ సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ధరణి కారణంగా ప్రజలు, ప్రభుత్వ భూములు కొంతమంది ఆధీనంలోకి వెళ్లాయని, వాటిని గుర్తించి తిరిగి తీసుకునే విధంగా చర్యలు చేపట్టాలని డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్తు శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క రెవెన్యూ శాఖ అధికారులను ఆదేశించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 'ధరణి'లో కాస్తు కాలమ్ తీసివేసి రైతుల హక్కులను కాలరాశారని.. ఇప్పుడు అలాంటి పరిస్థితి ఉండొద్దని సూచించారు. రెవెన్యూ, వ్యవసాయం, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖల బడ్జెట్ ప్రతిపాదనలపై గురువారం సచివాలయంలో భట్టి సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ 2014 వరకు అసైన్డ్ చేసిన, ఆ తర్వాత ప్రభుత్వం వెనక్కితీసుకున్న భూములు ఎన్ని? వాటిని ఏ అవసరాల కోసం వాడారు? మిగిలి ఉన్న భూమి ఎంత అన్న వివరాలతో సమగ్ర నివేదిక ఇవ్వాలని రెవెన్యూ శాఖను ఆదేశించారు. ప్రజల ఆస్తులు కొద్ది మంది చేతుల్లో ఉండటానికి వీల్లేదన్నారు. ప్రజలపై భారం మోపకుండా అన్ని శాఖల అధికారులు ప్రత్యామ్నాయ ఆదాయ వనరుల సమీకరణపై దృష్టిసారించాలని కోరారు. ఆస్తులు సృష్టించి, తద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రజలకు పంచాలన్నది ప్రభుత్వ ఉద్దేశమని, ఎంత కష్టమైనా కలిసి పనిచేసి ప్రజలకు మేలు చేద్దామని అన్నారు. ప్రజాస్వామిక, సంక్షేమ రాష్ట్రంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని దీనికి అనుగుణంగా అధికారులు పని చేయాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు లక్షన్నర ఇళ్ల నిర్మాణానికి మాత్రమే నిధులు ఇచ్చిందని, 2023-24లో తాత్కాలిక బ్రేకులు వేసిందని అధికారులు చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం చేసిన ప్రతిపాదనలను అధికారులు డిప్యూటీ సీఎంకు వివరించారు.

వ్యవసాయ శాఖ ప్రతిపాదనలపై సమీక్ష

వ్యవసాయం, మార్కెటింగ్, చేనేత-జౌళి, ఉద్యానవన శాఖల ప్రతిపాదనలపై ఆ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి భట్టి సమీక్ష నిర్వహించారు. ఆపద్బంధు, పిడుగుపాటు మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని గత ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. రైతు బీమా, పంటల బీమా, రైతు బంధు, ఆయిల్‌పామ్ సాగు, ధాన్యం కొనుగోలు, డ్రిప్ సాగుకు కేటాయించిన నిధుల ఖర్చులపై చర్చించారు. బడ్జెట్‌లో బీసీలు, కుల వృత్తిదారులకు రూ.20వేల కోట్లతో ప్యాకేజీ ప్రవేశపెడతామని తనను కలిసిన గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీకి భట్టి హామీ ఇచ్చారు. కాగా,19న పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమం, 20న రోడ్లు-భవనాలు, ఐటీ, 22న సాగునీటి పారుదల, 23న రవాణా, ఎక్సైజ్, పర్యాటకం, సాంస్కృతికం, 24న విద్య, కార్మిక ఉపాధి కల్పన, పట్టణాభివృద్ధి, విద్యుత్తు, 25న పశు సంవర్ధక, మత్స్య, మైనారిటీ కులాల అభివృద్ధి, గిరిజన సంక్షేమం, 27న హోం, సాధారణ పరిపాలన, న్యాయ, ఆర్థిక శాఖల ప్రతిపాదనలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమీక్షలు నిర్వహించనున్నారు.

కాళేశ్వరంపై రెండో రోజూ విజిలెన్స్ తనిఖీలు

మహదేవపూర్/మహదేవపూర్ రూరల్, జనవరి 18: కాళేశ్వరం ప్రాజెక్టుపై విజిలెన్స్ అధికారుల తనిఖీలు రెండో రోజైన గురువారం కూడా కొనసాగాయి. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ రాజీవ్ రతన్, ఎస్పీ బాలకోటి నేతృత్వంలోని తనిఖీ బృందం ప్రాజెక్టుకు ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీ, కన్నెపల్లి పంప్‌హౌస్‌తోపాటు అన్నారం బ్యారేజీ వద్ద క్షేత్రస్థాయిలో పర్యటించారు. వరదలకు ముందు, తర్వాత కన్నెపల్లి పంప్‌హౌస్ పరిస్థితి గురించి ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫోర్‌బే, డెలివరీ చానళ్లను పరిశీలించారు. అన్నారం బ్యారేజీని పరిశీలించిన అధికారులు ఇటీవల ఏర్పడిన బుంగల నివారణకు చేపట్టిన చర్యలపై ఆరా తీశారు. మేడిగడ్డ బ్యారేజీ బ్లాక్-7లో కుంగిన 20వ పిల్లరుతోపాటు మిగతా పిల్లర్లను కూడా పరిశీలించారు. వాటిని తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించారు. మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలు, కన్నెపల్లి పంప్‌హౌస్, గ్రావిటీ కెనాళ్ల వద్ద సుమారు 8 గంటలపాటు ఈ బృందం తనిఖీలు చేసింది. ఇదిలా ఉండగా విజిలెన్స్ అధికారుల పర్యటనకు ముందు కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి అధికారులతో సమీక్షించారు. అనంతరం అక్కడ అందుబాటులో లేకుండా వెళ్లిపోయారు. కాగా ఈ విజిలెన్స్ తనిఖీలు శుక్రవారం కూడా కొనసాగే అవకాశం ఉందని ఓ అధికారి తెలిపారు.

ఈడీ విచారణకు చెన్నూరు ఎమ్మెల్యే వివేక్

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ ఈడీ విచారణకు హాజరయ్యారు. మనీలాండరింగ్ కేసులో విచారణకు హాజరుకావాలని ఈడీ అధికారులు ఇచ్చిన నోటీసుల మేరకు గురువారం ఆయన బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు జరిగిన వ్యవహారంలో విశాఖ ఇండస్ట్రీస్, ఎంఎస్ విజిలెన్స్ సెక్యూరిటీస్ మధ్య కోట్ల రూపాయల లావాదేవీలకు సంబంధించి ఈడీ విచారణ కొనసాగుతోంది. విశాఖ ఇండస్ట్రీస్, విజిలెన్స్ సెక్యూరిటీస్ మధ్య రూ. 8 కోట్ల లావాదేవీలకు సంబంధించి గతంలో హైదరాబాద్ పోలీసులు నమోదు చేసిన కేసు ఆధారంగా ఈడీ విచారణ చేపట్టింది. దర్యాప్తులో భాగంగా గడ్డం వివేక్ గురువారం ఈడీ ఎదుట మరోసారి విచారణకు హాజరయ్యారు. గత నవంబరులో ఈడీ వివేక్ ఇల్లు, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించింది. డొల్ల కంపెనీల పేరుతో కోట్ల రూపాయల లావాదేవీలు జరిగినట్లు తనిఖీల్లో లభించిన పత్రాలు, డిజిటల్ ఆధారాల మేరకు ఈడీ గుర్తించింది. విశాఖ ఇండస్ట్రీస్, ఎంఎస్ విజిలెన్స్ మధ్య కోట్ల రూపాయల లావాదేవీలు జరిగినట్లు లెక్కల్లో చూపించినా... వారి మధ్య కేవలం లక్షల్లోనే నగదు లావాదేవీలు జరిగినట్లు సోదాల్లో లభించిన పత్రాల ఆధారంగా ఈడీ గుర్తించినట్లు సమాచారం. వివేక్‌కు సంబంధించిన సంస్థల్లో విదేశాల నుంచి లావాదేవీలు జరిగినట్లు ఈడీ అధికారులు కనుగొన్నట్లు తెలిసింది.

సుజనా చౌదరి విదేశీ పర్యటనకు అనుమతి

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విదేశాలకు వెళ్లేందుకు కేంద్ర మాజీ మంత్రి సుజనా చౌదరికి తెలంగాణ హైకోర్టు అనుమతి ఇచ్చింది. ఈనెల 20 నుంచి జూన్ 20 వరకు విదేశాల్లో పర్యటించేందుకు అంగీకారం తెలిపింది. సీబీఐ కేసులు నమోదైన నేపథ్యంలో తన విదేశీ పర్యటనకు అనుమతివ్వడంతోపాటు లుక్‌అవుట్ సర్క్యులర్ (ఎల్‌వోసీ)ని సస్పెండ్ చేయాలని కోరుతూ సుజనా చౌదరి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సూరేపల్లి నంద ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్‌పై ఉన్న ఆరోపణలకు సంబంధించి సీబీఐ ఇంకా ఎటువంటి ఛార్జిషీట్ దాఖలు చేయలేదని, ఆయనను ఇప్పటికీ నిందితుడిగా చేర్చలేదని ధర్మాసనం పేర్కొంది. అందువల్ల విదేశీ ప్రయాణానికి అనుమతి ఇచ్చింది. మొబైల్ నంబర్, ఈ-మెయిల్ సహా అన్ని వివరాలతో సీబీఐకి అండర్‌టేకింగ్ ఇవ్వాలని సూచించింది.

ఏపీలో 'కరోనా' జేఎన్ 1 సబ్ వేరియంట్ కేసులు

» అప్రమత్తంగా ఉండాలి: కేంద్రం హెచ్చరిక

న్యూఢిల్లీ, జనవరి 18 : కరోనా జేఎన్.1 సబ్-వేరియంట్ కేసులు దేశంలో పెరుగుతున్నాయి. అత్యధికంగా ఈ తరహా కేసులు కనిపిస్తున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ రెండో వరుసలో ఉంది. ఈ రకం వైరస్ వ్యాప్తిలో కర్ణాటక మొదటి స్థానంలో ఉంది. ఈ మేరకు 'ఇన్సాకోగ్' (సార్స్-కొవిడ్-2 జెనోమిక్స్ కన్సార్టియం) సంస్థ గురువారం గణాంకాలు విడుదల చేసింది. కర్ణాటకలో కరోనా జేఎన్. 1 సబ్-వేరియంట్ కేసులు 234 బయటపడగా, ఏపీలో 189 కేసులు గుర్తించారు. ఇక.. మహారాష్ట్ర 170, కేరళ 156, పశ్చిమ బెంగాల్ 96, గోవా 90, తమిళనాడు 88, గుజరాత్ 76 కేసులతో ఈ రెండు రాష్ట్రాల తర్వాతి వరుసలో ఉన్నాయి. రాజస్థాన్‌లో 37, తెలంగాణ 32, ఛత్తీస్‌గఢ్ 25, ఢిల్లీ 16, ఉత్తరప్రదేశ్ 7, హరియాణా ఐదు, ఒడిశా మూడు, ఉత్తరాఖండ్, నాగాలాండ్‌ల్లో చెరో ఒక్క కేసు నమోదయ్యాయి. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 1,226 కేసులు నమోదయ్యాయని ఈ సంస్థ తెలిపింది. నిరంతర అప్రమత్తతను పాటించాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను కేంద్రం హెచ్చరించింది.

రేపు సాగర్ గేట్ల మూసివేత

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ కుడి కాలువకు నీటిని విడుదలను ఈ నెల 20న కృష్ణా నది యాజమాన్య బోర్డు నిలిపేయనుంది. ఈనెల 8న ఎత్తిన సాగర్ గేట్లను శనివారం ఉదయం మూసివేయనున్నట్లు సమాచారం. ఆ సమయానికి 5 టీఎంసీల నీరు ఏపీకి చేరుకుంటుందని కేఆర్ఎంబీ అంచనా వేసింది.

ఆకాశంలో అద్భుతం..బోయింగ్ 777-9

» ఆధునిక సాంకేతికత.. అత్యంత విలాసం
» ఒకే సారి 426 మంది ప్రయాణించొచ్చు
» విమానం ధర రూ.3,325 కోట్ల పైమాటే
» వింగ్స్‌ఇండియా-2024లో ప్రత్యేక ఆకర్షణ



ఆకాశంలో అది ఓ అద్భుతం! 252 అడుగుల పొడవు.. 20 అడుగుల ఎత్తు.. శ్వేతవర్ణంలో ధీవిగా వెలిగిపోయే గగన విహంగం అది. ఇప్పటి వరకు అందుబాటులో ఉన్న రెండు ఇంజిన్ల విమానాల్లో ఇదే అతి పెద్దది. 426 మంది ప్రయాణికులు అత్యంత విలాసంగా ప్రయాణించేందుకు అనువుగా దీన్ని తయారు చేశారు. రెక్కలు ముడుచుకునే సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన తొలి విమానం కూడా ఇదే. హైదరాబాద్‌లో గురువారం ప్రారంభమైన వింగ్స్ ఇండియా-2024లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఈ విమానం పేరు బోయింగ్ 777-9. అనేక సాంకేతిక విశేషాలతోపాటు పది శాతం ఇంధనం ఆదా అయ్యేలా, పర్యావరణహితంగా దీన్ని రూపొందించారు. ఈ విమానంలో ఏ మాత్రం కుదుపులు లేకుండా ప్రయాణం చేయవచ్చని బోయింగ్ ప్రతినిధులు చెబుతున్నారు. అరుదైన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందిన ఈ గగన విహంగాన్ని సొంతం చేసుకునేందుకు ప్రపంచ దేశాలకు చెందిన ఎతిహాద్, సింగపూర్ ఎయిర్ లైన్స్, బ్రిటిష్ ఎయిర్‌వేస్, లుఫ్తాన్సా, ఎమిరేట్స్ వంటి ప్రముఖ ఎయిర్‌లైన్స్ సంస్థలు పోటీ పడుతున్నాయి. ఇప్పటికే 453 విమానాలను కొనుగోలు చేసేందుకు ఆయా సంస్థలు సంసిద్ధత వ్యక్తం చేశాయి. ఈ మోడల్‌కు చెందిన 10 విమానాలు కొనుగోలు చేసేందుకు ఎయిర్ ఇండియా సైతం గత ఏడాదే ఒప్పందం కుదుర్చుకుంది. దీని ధర 400 మిలియన్ డాలర్లు అంటే రూ.3,325కోట్లు ఉంటుందని అంచనా. వాస్తవానికి 2020 జనవరిలోనే మొదటి బోయింగ్ 777-9 విమానం తయారైనా కొవిడ్ కారణంగా ఆ తర్వాత ఉత్పత్తికి బ్రేక్ పడింది. ఈ మేరకు 2025 ప్రారంభంలో మొదటి విమానాన్ని విమానయాన సంస్థలకు అందిస్తామని బోయింగ్ ప్రతినిధులు పేర్కొంటున్నారు. ఈ లెక్కన చూస్తే ఎయిర్ ఇండియాకు ఈ తరహా విమానాలు అందడానికి ఐదేళ్లపైనే పడుతుందని అంచనా. విలాసవంత ప్రయాణం కోరుకునే వారి సంఖ్య క్రమంగా పెరిగిపోతున్న తరుణంలో బోయింగ్ 777-9 విమానాల డిమాండ్‌కు ఢోకా ఉండదని ఆ సంస్థ ప్రతినిధులు భావిస్తున్నారు. కాస్త ఖర్చు ఎక్కువైనా బోయింగ్ 777-9 వంటి విమానంలో ప్రయాణించే అవకాశం త్వరలోనే మనకూ దక్కే సూచనలు కనిపిస్తున్నాయి.

విమాన ప్రయాణికులు @30 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

సదుపాయాలు, కొత్త విమానాశ్రయాలతో యువతకు విస్తృత ఉద్యోగ అవకాశాలు దక్కుతాయని అన్నారు. పౌర విమానయాన శాఖ, ఫిక్కీ సంయుక్తంగా వింగ్స్ ఇండియా-2024 పేరిట నిర్వహిస్తున్న సివిల్ ఏవియేషన్ ఎయిర్ షోను బేగంపేట విమానాశ్రయంలో కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది 15.2 కోట్ల మంది విమానాల్లో ప్రయాణించారని, 2030 నాటికి విమాన ప్రయాణికుల రద్దీ 30 కోట్లకు చేరువ చేయాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు. విమానయాన రంగంలో 2047 నాటికి 20 ట్రిలియన్ డాలర్ల వృద్ధిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. దేశంలో ప్రస్తుతం 149 విమానాశ్రయాల సేవలు అందిస్తుండగా.. వచ్చే ఆరేళ్లలో వాటి సంఖ్యను 200కు పెంచబోతున్నామని చెప్పారు. గత పదేళ్లలో 76 విమానాశ్రయాలను కొత్తగా ఏర్పాటు చేయడమో, పునరుద్ధరణ చేయడమో జరిగిందన్నారు. త్వరలో రెండు కొత్త గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టులు రానున్నాయని చెప్పారు. భవిష్యత్‌లో దేశంలోని ప్రతి జిల్లాకు విమానాశ్రయం లేదా ఎయిర్‌స్ట్రిప్ ఉంటుందని తెలిపారు. ప్రపంచంలోనే అత్యధిక విమానాలను భారత్ కొనుగోలు చేస్తోందని, మన వద్ద 57 ఫ్లయింగ్ ట్రేడ్ ఆర్గనైజేషన్లు ఉన్నాయని గుర్తు చేశారు. అంతర్జాతీయ విమానయాన రంగంలో ఏడో అతి పెద్ద మార్కెట్‌గా భారత్ అవతరించిందన్నారు. రానున్న రోజుల్లో 10 వేల మంది మహిళలకు డ్రోన్ల వాడకంపై శిక్షణ ఇస్తామని, డ్రోన్ల కొనుగోలుపై 80% రాయితీ ఇస్తామని చెప్పారు. పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి వీకే సింగ్ మాట్లాడుతూ భారత్‌తో పాటు ప్రపంచ జీడీపీకి పౌర విమానయాన రంగ వృద్ధి దోహదపడుతుందన్నారు. రానున్న రోజుల్లో డ్రోన్లు ఈ రంగంలోకి ప్రవేశిస్తాయని చెప్పారు. ఫిక్కీ చైర్మన్ రెమీ మెయిలార్డ్ మాట్లాడుతూ ప్రపంచ పౌర విమానయాన రంగానికి భారత్ గ్రోత్ ఇంజిన్ అని అభివర్ణించారు. సాంకేతికత అభివృద్ధి, ఆవిష్కరణల్లో భారత్ ముందంజలో నిలవడం గర్వకారణమన్నారు. హైదరాబాద్ నుంచి అమెరికాకు నేరుగా విమాన సర్వీసులను నడపాలని కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్యను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. కనీసం వారానికి ఒక సర్వీస్‌ను నడిపిస్తామంటూ ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో వింగ్స్ ఇండియా-2024 కార్యక్రమం నిర్వహించే అవకాశం కల్పించినందుకు కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, ఫిక్కీకి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఏవియేషన్, ఏరోస్పేస్ రంగానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 3 గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాలు, 3 బ్రౌన్‌ఫీల్డ్ విమానాశ్రయాల పునరుద్ధరణకు కృషి చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో హెలీ టూరిజంను విస్తరిస్తున్నామని, పలు చోట్ల జాయ్ రైడ్లు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం భాగస్వామ్యంతో మెడిసిన్ ఫ్రమ్ స్కై ప్రాజెక్టును ప్రారంభించామని గుర్తు చేశారు. కాగా, 'అమృత్ కాలంలో భారత్‌ను ప్రపంచంతో అనుసంధానించడం' అనే ఇతివృత్తంతో ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వింగ్స్ ఇండియా, ఉడాన్ 5.3 నాలెడ్జ్ పేపర్‌ను జ్యోతిరాదిత్య విడుదల చేశారు. గురుగ్రామ్‌లో ఎయిర్‌బస్-ఎయిర్ ఇండియా సంయుక్తంగా విమాన శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు మంత్రి సమక్షంలో ఒప్పందం కుదుర్చుకున్నాయి.



వింగ్స్ ఇండియా కార్యక్రమంలో కేంద్ర మంత్రులు జ్యోతిరాదిత్య, వీకే సింగ్, మంత్రి కోమటిరెడ్డి

జీఎంఆర్ స్కూల్ ఆఫ్ ఏవియేషన్ ప్రారంభం

శంషాబాద్ రూరల్: జీఎంఆర్ ఏరోస్పేస్ ఇండస్ట్రియల్ పార్కులో ఏర్పాటు చేసిన జీఎంఆర్ స్కూల్ ఆఫ్ ఏవియేషన్‌ను కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ప్రారంభించారు. బేగంపేట విమానాశ్రయం నుంచి వర్చువల్‌గా ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీఎంఆర్ ప్రతినిధులు మాట్లాడుతూ ఈ విద్యాసంస్థకు 2021లో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి భూమి పూజ చేశారని తెలిపారు. ఈ విద్యా సంస్థలో టైప్ ట్రైనింగ్‌తో పాటు నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ ఏఎంఈ ప్రోగ్రామ్‌ను అందించనున్నట్లు పేర్కొన్నారు. దీనికి డీజీసీఏ, ఈఏఎస్ఏ సర్టిఫికెట్లు లభించినట్లు తెలిపారు. ఇది ప్రపంచవ్యాప్తంగా ఏవియేషన్ విద్యలో నాణ్యతను పెంచుతుందని జీఎంఆర్ ఏరోటెక్నిక్ ప్రెసిడెంట్ అశోక్ గోపీనాథ్ పేర్కొన్నారు. సమగ్రమైన, సమర్థవంతమైన విమానయాన పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేయాలనేది ఎయిర్‌బస్ ఆశయమని ఆ సంస్థ ఇండియా, దక్షిణాసియా ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్ మైలార్డ్ తెలిపారు.

డ్రైవర్ లేకుండా గాలిలో ఎగిరే డ్రోన్ కారు!

నూతన ఆవిష్కరణలతో ఆకట్టుకున్న స్టాల్స్.. అబ్బురపరిచిన జెఫ్రీస్, సారంగ్‌ల విన్యాసాలు

హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వింగ్స్ ఇండియా 2024- సివిల్ ఏవియేషన్ ఎయిర్ షో సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శకుల్లో ఆసక్తిని రేకెత్తించాయి. విమానయాన రంగంలో సేవలందించే సంస్థలు తమ నూతన ఆవిష్కరణలను ప్రదర్శించాయి. వాటిలో పైలెట్ అవసరం లేకుండా జీపీఎస్ సాయంతో ఇద్దరు ప్రయాణించే వీలున్న డ్రోన్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఇంకా విమాన విడిభాగాలు, విమాన రంగంలో సేవలు, పైలెట్ శిక్షణ సంస్థల స్టాల్స్ కూడా ఆకట్టుకున్నాయి. దాదాపుగా 130 స్టాల్స్‌లో సింహభాగం భారతీయ సంస్థలవే కావడం గమనార్హం. ప్రభుత్వ రంగ సంస్థ హిందూస్థాన్ ఏరోనాటిక్స్, విదేశీ సంస్థ బోయింగ్ తమ విమానాల మోడల్స్‌ను ప్రదర్శించాయి. షో మొదటి రోజు వ్యాపార వర్గాలు, ఏవియేషన్ రంగ నిపుణులతో పాటు ఏరోనాటికల్ ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు హాజరయ్యారు.

డ్రోన్ కారులో రివ్వున ఎగిరిపోవచ్చు! : నిత్యం ట్రాఫిక్ జాంలో ఇరుక్కుంటున్నప్పుడు గాలిలో ఎగిరే కారు ఉంటే బాగుంటుందని అనుకోని వారుండరు. ఇలా గాలిలో ఎగిరే వాహనాన్ని నియో ఏరియల్ అడ్వాన్స్‌డ్ సిస్టం (ఎన్‌ఏఏటీఎస్) రూపొందించింది. గ్రామాల నుంచి పట్టణాలకు సులభంగా ఎలాంటి అడ్డంకులు లేకుండా గాలిలో ప్రయాణించే టూ సీటర్ డ్రోన్ వెహికల్ (కాప్టర్)ను రూపొందించామని ఎన్‌ఏఏటీఎస్ ఎండీ అభిరామ్ చావా తెలిపారు. ఇద్దరు ప్రయాణించేందుకు వీలున్న పైలెట్ రహిత కాప్టర్‌లో 40 కిలోమీటర్లు ప్రయాణించవచ్చని చెప్పారు. గరిష్ఠ వేగం గంటకు 100 కిలోమీటర్లు. దీనికి ఉన్న 4 రోటర్ల వల్ల ప్రమాదం జరిగే అవకాశం లేదన్నారు. తాము రూపొందించిన మరో డ్రోన్ వాహనంలో గంటకు 400 కిలోమీటర్ల వేగంతో ఐదుగురు 1,500 కిలోమీటర్లు ప్రయాణించే అవకాశం ఉందన్నారు. ఈ డ్రోన్‌లో విమానం తరహా ఇంజన్‌తో పాటు, హెలికాప్టర్ తరహాలో రోటర్‌లు ఉంటాయని, హెలిపాడ్ స్థలం నుంచే ఇది టేకాఫ్, ల్యాండింగ్ చేసుకోవచ్చని తెలిపారు. జీపీఎస్ సాయంతో నడిచే ఈ డ్రోన్లలో అడ్డంకులను తప్పుకొని ప్రయాణించే సెన్సర్లు అమర్చామన్నారు. ప్రస్తుతం ప్రయోగాలు పూర్తయ్యాయని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చే విధివిధానాలకు తగినట్టు అందుబాటులోకి తెస్తామన్నారు.



అబ్బురపరిచిన ఏరోబాటిక్స్ : వింగ్స్ ఇండియా షోలో మార్క్ జెఫ్రీస్, సారంగ్ బృందాల ఏరోబాటిక్స్ అబ్బురపరిచాయి. బుల్లి విమానాలతో జెఫ్రీస్ బృందం, హెచ్‌ఏఎల్ హెలికాప్టర్లతో సారంగ్ బృందం విన్యాసాలను అద్భుతం అనని వారు లేరు. సింగిల్ సీట్ కలిగిన బుల్లి విమానాలతో నిటారుగా పైకి దూసుకుపోతూనే పల్టీలు కొడుతూ కిందికి రావడం, అంతే వేగంగా మళ్లీ పైకి లేచే తీరు సందర్శకులకు గగుర్పాటు కలిగించింది. నువ్వా నేనా అంటూ కవ్వించుకుంటున్న రీతిలో ఎదురెదురుగా వస్తూనే చటుక్కున తప్పుకునే తీరు నోరెళ్లబెట్టేలా చేస్తుంది. వీరికి పోటీగా సారంగ్ బృందం గ్రూప్ కెప్టెన్ ఎస్‌కె.మిశ్రా సారథ్యంలో హెలికాప్టర్లతో విన్యాసాలు ప్రదర్శించింది. ఇది పూర్తిగా స్వదేశీ అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్. చెన్నై, కేరళలో వరదల సందర్భంగా వీటి ద్వారానే సహాయ చర్యలు చేపట్టినట్టు భారత వైమానికదళ అధికారులు వెల్లడించారు. ఈ విన్యాసాల్లో వింగ్ కమాండర్ శ్రీధర్, స్క్వాడ్రాన్ లీడర్ అవినాష్, వింగ్ కమాండర్ టీవీఆర్‌సింగ్ పాల్గొన్నారు.

శక్తిమంతమైన ఎయిర్‌బస్ ఏ350 : ఎయిర్ బస్ ఏ 350, బోయింగ్ 777-9 విమానాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎయిర్ బస్ ఏ350లో శక్తిమంతమైన ఫ్యూయల్ ఎఫిషియంట్ రోల్స్ రాయిస్ ట్రెంట్ ఎక్స్‌డబ్ల్యూబీ ఇంజన్ ఉంది. దీంతో 18 వేల కిలోమీటర్లు నిరంతరాయంగా ప్రయాణం చేయవచ్చు. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియాకు నాన్‌స్టాప్ సర్వీసులు నడిపించవచ్చు. ఆకర్షణీయమైన రంగులు, పెద్ద క్యాబిన్, పెద్ద కిటికీలు, సౌకర్యవంతమైన సీటింగ్, మూడ్‌కు తగినట్టు మారే లైట్లు, అడ్వాన్స్‌డ్ ఎంటర్‌టైన్‌మెంట్ సిస్టం దీని ప్రత్యేకతలు. మూడు క్లాసులుంటే ఈ విమానంలో 316 మంది ప్రయాణం చేయవచ్చు. బిజినెస్ క్లాస్‌లో 28 ప్రైవేట్ సూట్‌లు ఉన్నాయి. క్యాబిన్లలోని సీట్లు బటన్ నొక్కగానే బెడ్‌గా మారతాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● శుక్రవారం 19 జనవరి 2024

నిట్ సూరత్‌కల్‌లో ఎంబీఏ



సూరత్‌కల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కర్ణాటక (నిట్ కే) ఆధ్వర్యంలోని స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది రెండేళ్ల వ్యవధిగల ఫుల్ టైమ్ ప్రోగ్రామ్. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. క్యాట్/మ్యాట్/గేట్ వ్యాలిడ్ స్కోర్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

సీట్లు: ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 80 సీట్లు ఉన్నాయి. వీటిలో జనరల్ అభ్యర్థులకు 32, ఎస్సీలకు 12, ఎస్టీలకు 6, ఓబీసీ అభ్యర్థులకు 22, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 8 సీట్లు ప్రత్యేకించారు. దివ్యాంగులకు 5 శాతం సీట్లు కేటాయించారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. గ్రేడింగ్ సిస్టంలో పది పాయింట్ల స్కేల్ మీద కనీసం 5.5 సీజీపీఏ ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు లేదా 5 సీజీపీఏ చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 సెప్టెంబరు 15 నాటికి డిగ్రీ సర్టిఫికెట్, మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. క్యాట్ 2023/మ్యాట్ (సెప్టెంబరు 2023/డిసెంబరు 2023)/గేట్ 2023/2024 స్కోర్ తప్పనిసరి.

ఎంపిక: అకడమిక్ ప్రతిభ, జాతీయ పరీక్ష స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూకు పిలుస్తారు. జాతీయ పరీక్ష స్కోర్‌కు 70 శాతం; జీడీ, ఇంటర్వ్యూ, అనుభవాలకు ఒక్కోదానికి 10 శాతం చొప్పున వెయిటేజీ ఇస్తూ అభ్యర్థుల తుది జాబితా రూపొందిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.600; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.150
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 3
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** ఏప్రిల్ 8
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** పదోతరగతి సర్టిఫికెట్; డిగ్రీ సర్టిఫికెట్, మార్కుల పత్రాలు; టీసీ, సీసీ; జాతీయ పరీక్షకు సంబంధించిన ఒరిజినల్ స్కోర్ కార్డ్; కులం, ఆదాయం, వైకల్యం, అనుభవం, స్పాన్సర్‌షిప్ ధ్రువీకరణ పత్రాలు; ఆధార్ కార్డ్; రెండు ఫొటోలు.
- **అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ:** ఏప్రిల్ 22 నుంచి 25 వరకు
- **దరఖాస్తు హార్డ్ కాపీ పంపాల్సిన చిరునామా:** అసిస్టెంట్ రిజిస్ట్రార్(అకడమిక్), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కర్ణాటక, సూరత్‌కల్, శ్రీనివాస్ నగర్, మంగళూరు - 575025
- **వెబ్‌సైట్:** www.nitk.ac.in

ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) ఆధ్వర్యంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ (ఐఐఆర్ఎస్) - 'రిమోట్ సెన్సింగ్ అండ్ జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్' విభాగంలో పీజీ, పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లను అందిస్తోంది. వివిధ స్పెషలైజేషన్‌లు అందుబాటులో ఉన్నాయి. నిబంధనల ప్రకారం ఒకే స్పెషలైజేషన్‌లో ఒక ప్రోగ్రామ్ నుంచి రెండోదానిలోకి మారే అవకాశం ఉంది. అకడమిక్ ప్రతిభ, ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. వర్కింగ్ ప్రొఫెషనల్స్, ఫ్రెష్ గ్రాడ్యుయేట్స్ దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అర్హులే. వీరు 'రిజల్ట్ అవైటెడ్' కేటగిరీ కింద అప్లయ్ చేసుకోవాలి. కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన వివిధ విభాగాలు, యూనివర్సిటీలు, ఫండెడ్ యూనివర్సిటీలు, అటానమస్ సంస్థలు స్పాన్సర్ చేసిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది. వీరు ఎంట్రెన్స్ టెస్ట్ రాయనవసరం లేదు. వీరిని నేరుగా ఇంటర్వ్యూకి అనుమతిస్తారు. వీరికి ట్రావెలింగ్ అలవెన్స్, డెయిలీ అలవెన్స్, కంటింజెంట్ గ్రాంట్, మెడికల్ అలవెన్స్ తదితరాలను స్పాన్సర్ సంస్థలు చెల్లిస్తాయి.

ఐఐఆర్ఎస్‌లో పీజీ, పీజీ డిప్లొమా



స్పెషలైజేషన్‌లు: అగ్రికల్చర్ అండ్ సాయిల్స్, ఫారెస్ట్ రిసోర్సెస్ అండ్ ఎకో సిస్టం అనాలిసిస్, జియోసైన్సెస్, మెరైన్ అండ్ అట్మాస్ఫిరిక్ సైన్సెస్, నేచురల్ హజార్డ్స్ అండ్ డిజాస్టర్ రిస్క్ మేనేజ్‌మెంట్, శాటిలైట్ ఇమేజ్ అనాలిసిస్ అండ్ ఫొటోగ్రామెట్రీ, స్పేషియల్ డేటా సైన్స్, అర్బన్ అండ్ రీజనల్ స్టడీస్, వాటర్ రిసోర్సెస్.

పీజీ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో మూడు మాడ్యూల్స్ ఉంటాయి. మొదటి మాడ్యూల్ అన్ని స్పెషలైజేషన్‌లకు కామన్‌గా ఉంటుంది. దీనిలో జియోస్పేషియల్ టెక్నాలజీస్, రిమోట్ సెన్సింగ్ అండ్ ఫొటోగ్రామెట్రీ, జీఐఎస్‌లకు సంబంధించిన ఫండమెంటల్స్, బేసిక్స్ బోధిస్తారు. రెండో మాడ్యూల్‌లో అభ్యర్థి ఎంచుకొన్న స్పెషలైజేషన్‌కు జియోస్పేషియల్ టెక్నాలజీ అప్లికేషన్ విధానాలు వివరిస్తారు. చివరి మాడ్యూల్‌లో పైలెట్ ప్రాజెక్ట్ ఉంటుంది.

సీట్లు: ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 30 సీట్లు ఉన్నాయి. స్పేషియల్ డేటా సైన్స్ స్పెషలైజేషన్‌లో ఆరు సీట్లు; మిగిలిన వాటిలో ఒక్కోదానిలో మూడు సీట్లు ఉన్నాయి.

కోర్సు ఫీజు: ప్రభుత్వం స్పాన్సర్ చేసిన అభ్యర్థులకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది. మిగిలిన అభ్యర్థులు రూ.72,000; విదేశీ అభ్యర్థులు 7,200 యూఎస్ డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది.

పీజీ: ఎంటెక్ ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి సెమిస్టర్ అన్ని స్పెషలైజేషన్‌లకు కామన్‌గా ఉంటుంది. ఇందులో రిమోట్ సెన్సింగ్, డిజిటల్ ఇమేజ్ ప్రాసెసింగ్, జీఐఎస్, ఫొటోగ్రామెట్రీ, కార్టోగ్రఫీ, జీఎన్ఎస్ఎస్ అంశాలకు సంబంధించిన ఫండమెంటల్స్ వివరిస్తారు. రెండో సెమిస్టర్‌లో స్పెషలైజేషన్‌కు సంబంధించిన కోర్ కోర్సులు, కామన్ కోర్సులు, కేస్ స్టడీస్ ఉంటాయి. చివరి రెండు సెమిస్టర్లలో ఎంచుకొన్న అంశంపై సెమినార్, మిడ్ టర్మ్ ప్రజంటేషన్, డిజర్టేషన్‌లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ ఎంటెక్ డిగ్రీని ప్రదానం చేస్తుంది. దీనికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది.

సీట్లు: ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 60 సీట్లు ఉన్నాయి. వీటిలో అయిదు సీట్లను ప్రభుత్వం స్పాన్సర్ చేసిన అభ్యర్థులకు కేటాయించారు.

కోర్సు ఫీజు: ప్రభుత్వం స్పాన్సర్ చేసిన అభ్యర్థులు యూనివర్సిటీ రిజిస్ట్రేషన్ కింద రూ.20,000 చెల్లిస్తే చాలు. మిగిలినవారు రూ.1,64,000 చెల్లించాల్సి ఉంటుంది. విదేశీ అభ్యర్థులు యూనివర్సిటీ రిజిస్ట్రేషన్ ఫీజుతోపాటు అదనంగా 14,400 యూఎస్ డాలర్లు చెల్లించాలి.


అర్హత వివరాలు: ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథ్స్, స్టాటిస్టిక్స్, బయాలజీ, కంప్యూటర్ సైన్స్‌లలో కనీసం రెండు ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థులు ఎంచుకొన్న స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత విభాగాల్లో బీఈ/బీటెక్/బీఎస్సీ/ఎంఈ/ఎంటెక్/ఎమ్మెస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. అభ్యర్థుల వయసు కోర్సు ప్రారంభం నాటికి 45 ఏళ్లు మించకూడదు. గేట్ అర్హత పొందిన అభ్యర్థులకు ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ఏఐసీటీఈ ఫెలోషిప్ లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- **ఒక కోర్సుకు దరఖాస్తు ఫీజు:** భారతీయులకు రూ.1000; విదేశీయులకు 100 యూఎస్ డాలర్లు
- **రెండు కోర్సులకు దరఖాస్తు ఫీజు:** భారతీయులకు రూ.1500; విదేశీయులకు 150 యూఎస్ డాలర్లు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** ఆగస్టు 1 నుంచి
- **వెబ్‌సైట్:** https://admissions.iirs.gov.in

ఢిల్లీ ఎయిమ్స్‌లో పీహెచ్‌డీ

న్యూఢిల్లీలోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)- పీహెచ్‌డీ 2024 జనవరి సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంట్రెన్స్ ఎగ్జామ్, డిపార్ట్‌మెంటల్ అసెస్‌మెంట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. గరిష్ఠంగా అయిదేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. మొత్తం 115 సీట్లు ఉన్నాయి. గవర్నమెంట్ ఫెలోషిప్ ఉన్న అభ్యర్థులకు 69 సీట్లు ప్రత్యేకించారు.



విభాగాలు-సీట్లు: అనాటమీ 7, బయోకెమిస్ట్రీ 6, బయోఫిజిక్స్ 6, బయోటెక్నాలజీ 6, కార్డియాక్ బయోకెమిస్ట్రీ 2, క్లినికల్ న్యూరోసైకాలజీ 3, కమ్యూనిటీ మెడిసిన్ 4, ఆప్తల్మాలజీ 2, డెర్మటాలజీ&వెనెరాలజీ 1, ఎమర్జెన్సీ మెడిసిన్ 1, ఫోరెన్సిక్ మెడిసిన్ 2, గ్యాస్ట్రోఎంటరాలజీ 1, హెమటాలజీ 1, ల్యాబొరేటరీ మెడిసిన్ 3, ల్యాబొరేటరీ అంకాలజీ 3, మెడికల్ అంకాలజీ 7, మైక్రోబయాలజీ 7, న్యూరాలజీ 3, ఆర్‌పీసీ 12, పీడియాట్రిక్స్ 2, పాథాలజీ 4, ఫార్మకాలజీ 6, ఫిజియాలజీ 9, ప్రివెంటివ్ అంకాలజీ 2, సైకియాట్రీ 3, ఎన్‌డీడీటీసీ 5, రీప్రొడక్టివ్ బయాలజీ 2, స్టెమ్ సెల్ 3, సర్జికల్ విభాగాలు 2.

అర్హత: విభాగాన్ని అనుసరించి నిర్దేశించిన స్పెషలైజేషన్‌లతో ఎమ్మెస్సీ/ఎంఈ/ఎంటెక్/ఎంబీబీఎస్/బీడీఎస్/బీఏఎంఎస్/బీహెచ్ఎంఎస్/ఎంఏ/ఎంఎస్‌డబ్ల్యూ/ఎంవీఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. డిస్టెన్స్ విధానంలో మాస్టర్స్ పూర్తిచేసినవారు దరఖాస్తుకు అనర్హులు. యూజీసీ నెట్ జేఆర్ఎఫ్/సీఎస్ఐఆర్ నెట్ జేఆర్ఎఫ్/ఐసీఎంఆర్ జేఆర్ఎఫ్/డీబీటీ జేఆర్ఎఫ్/ఎన్‌బీహెచ్ఎం స్క్రీనింగ్ టెస్ట్/ఇన్‌స్పయిర్ ఫెలోషిప్ అర్హత ఉన్న నాన్ మెడికల్ అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్ చూడవచ్చు.

ఎంట్రెన్స్ ఎగ్జామ్: దీనిని సీబీటీ మోడ్‌లో నిర్వహిస్తారు. ఇందులో రెండు స్టేజ్‌లు ఉంటాయి. అన్నీ ఆబ్జెక్టివ్ ప్రశ్నలే ఇస్తారు. మొదటి స్టేజ్‌లో ఇంగ్లీష్ ఆప్టిట్యూడ్, రీసెర్చ్ మెథడాలజీ, ల్యాబ్ టెక్నాలజీ తదితర అంశాల నుంచి 30 ప్రశ్నలు; రెండో స్టేజ్‌లో సంబంధిత సబ్జెక్ట్ నుంచి 40 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే మూడోవంతు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం గంటన్నర. ఈ పరీక్షలో అర్హత సాధించాలంటే కనీసం 35 శాతం మార్కులు రావాలి.

- ఎగ్జామ్‌లో అర్హత పొందినవారిని సీట్ల సంఖ్యకు మూడు రెట్లమందిని ఎంపిక చేసి స్టేజ్ 3 కింద డిపార్ట్‌మెంటల్ అసెస్‌మెంట్‌కు అనుమతిస్తారు. దీనికి 20 మార్కులు ఉంటాయి. ఫెలోషిప్ అర్హత/ప్రొఫెషనల్ డిగ్రీకి పది మార్కులు కేటాయించారు.
- మూడు స్టేజీల్లో కలిపి మొత్తమ్మీద కనీసం 50 శాతం మార్కులు వచ్చినవారికి మెరిట్ ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.2,000; ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1600
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 26
- **కరెక్షన్ విండో ఓపెన్:** జనవరి 31 నుంచి ఫిబ్రవరి 2 వరకు
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్:** ఫిబ్రవరి 9న
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ ఫలితాలు విడుదల:** ఫిబ్రవరి 19న
- **డిపార్ట్‌మెంటల్ అసెస్‌మెంట్:** మార్చి 1
- **తుది ఫలితాలు విడుదల:** మార్చి 11
- **ప్రోగ్రామ్‌లో జాయినింగ్ తేదీ:** మార్చి 30
- **వెబ్‌సైట్:** www.aiimsexams.ac.in


టీఎస్‌పీఎస్సీ ప్రత్యేకం: బయాలజీ

మానవ విసర్జక వ్యవస్థ

మూత్రం ఏర్పడే విధానం

మూత్రపిండంలో మూత్రం ఏర్పడే విధానాన్ని మూడు దశలుగా విభజించవచ్చు. అవి.. సూక్ష్మగాలనం, నాళికాయుత పునఃశోషణ, నాళికాస్రావం.

సూక్ష్మగాలనం: మొదటి దశలో రక్త నాళికాగుచ్ఛంలో ఉండే రక్తం వడపోతకు గురై బౌమన్స్ గుళికలోకి చేరుతుంది. ఈ విధానాన్నే సూక్ష్మగాలనం లేదా రక్తనాళికా గుచ్ఛగాలనం అంటారు. అభివాహి ధమనిక కలిగించే పీడనం వలన రక్తకేశ నాళికాగుచ్ఛంలోకి వడపోతకు గురైన రక్తం చేరుతుంది. గుచ్ఛగాలనం ద్వారా ఏర్పడిన ద్రవాన్ని గాలిత ద్రవం లేదా ప్రాథమిక మూత్రం అంటారు. ప్రాథమిక మూత్రంలో వ్యర్థ పదార్థాలు, పోషకపదార్థాలు, నీరు ఉంటాయి. ప్రాథమిక మూత్రం రసాయనికంగా రక్తంతో సమానం.



దీనిలో కణాలు ఉండవు. ఆరోగ్యవంతమైన మానవుడిలో నిమిషానికి దాదాపు 125 మి.లీ. ప్రాథమిక మూత్రం ఏర్పడుతుంది.

నాళికాయుత పునఃశోషణ: దీనినే వరణాత్మక పునఃశోషణ అంటారు. ఈ దశ సమీపస్థ సంవళిత నాళికకు, వ్యాసారెక్టాకు మధ్య జరుగుతుంది. సమీపస్థ సంవళిత నాళికకు మరోపేరు పూర్వ సంవళిత నాళిక. వ్యాసారెక్టా అంటే నెఫ్రాన్ నాళిక చుట్టూ విస్తరించి ఉండే వల లాంటి రక్తకేశ నాళికల సమూహం. దీనిని పరినాళికా రక్తకేశ నాళికలు అంటారు. ప్రాథమిక మూత్రం సమీపస్థ సంవళిత నాళాన్ని చేరినప్పుడు 75 శాతం నీరు పునఃశోషణం చెందుతుంది. ప్రాథమిక మూత్రంలో ఉపయోగ పదార్థాలైన గ్లూకోజ్, అమైనో ఆమ్లాలు, పొటాషియం, కాల్షియం, సోడియం క్లోరైడ్ మొదలైనవి సమీపస్థ సంవళిత నుంచి వ్యాసారెక్టాలోకి శోషింపబడతాయి.

నాళికా స్రావం: ఈ దశ వ్యాసారెక్టాకు, దూరాగ్ర సంవళిత నాళానికి మధ్య జరుగుతుంది. సమీప సంవళిత నాళంలో పునఃశోషణ తరవాత మూత్రం హెన్లీ శిక్యం ద్వారా దూరాగ్ర సంవళితనాళంలోకి చేరుతుంది. వ్యాసారెక్టా నుంచి దూరాగ్ర సంవళితనాళంలోకి ప్రవేశించిన పదార్థాలు యూరియా, యూరికామ్లం, క్రియాటిన్, క్రియాటినైన్, సోడియం, పొటాషియం, క్లోరైడ్, హైడ్రోజన్ అయాన్లు మూత్ర గాఢతను, pHను నియంత్రిస్తాయి. ఈ విధంగా అధిక గాఢత గల మూత్రం ఏర్పాటులో హెన్లీశిక్యం, సంగ్రహణ నాళాలు ప్రధాన భూమికను పోషిస్తాయి. హెన్లీశిక్యం ప్రాంతంలో ఉన్న మూత్రం నుంచి 10 శాతం నీరు ద్రవాభిసరణ ద్వారా దానిని ఆవరించి ఉన్న కణజాలంలోకి శోషింపబడుతుంది. సంగ్రహణనాళంలో వాసోప్రెస్సిన్ హార్మోన్ సహాయంతో నీటి పునఃశోషణ జరిగి మూత్రం అతి గాఢతను పొందుతుంది. గాఢతలో గరిష్ఠ స్థాయికి చేరిన ఈ ద్రవమే మూత్రం. రక్తం కంటే మూత్రం అధిక గాఢతలో ఉంటుంది.

మూత్ర పిండం మార్పిడి

దీర్ఘకాలికంగా కిడ్నీలు పనిచేయని వారికి మూత్రపిండ మార్పిడి ప్రక్రియను చేపడతారు. 1954లో చార్లెస్ హాఫ్‌నగెల్(అమెరికా) అనే వైద్యుడు మొట్ట మొదట మూత్రపిండ మార్పిడికి రూపకల్పన చేశాడు. మనదేశంలో 1971 డిసెంబరు 1 వేలూరు(తమిళనాడు)లోని క్రిస్టియన్ మెడికల్ కళాశాలలో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేశారు.

మూత్ర సంఘటన

ఆరోగ్యవంతమైన మానవుడు ప్రతిరోజూ 1 నుంచి 1.8 లీటర్ల మూత్రాన్ని విసర్జిస్తాడు. దీనితోపాటు 25 నుంచి 30 గ్రాముల యూరియా కూడా విసర్జితమవుతుంది. రక్తంలోని హిమోగ్లోబిన్ విచ్ఛిన్నమైనప్పుడు ఏర్పడే యూరోక్రోమ్ అనే పదార్థం కారణంగా మూత్రం పసుపు రంగులోకి మారుతుంది. యూరియా విచ్ఛిన్నం చెంది అమ్మోనియా ఏర్పడటం వలన మూత్రం మొదట ఆమ్లయుతంగా(pH=6.0) ఉన్నప్పటికీ క్రమంగా క్షారయుతంగా మారుతుంది. మూత్రంలో 96 శాతం నీరు, 2.5 శాతం కర్బన పదార్థాలు(ఆక్సలేట్స్, హార్మోన్స్, యూరియా, యూరికామ్లం, క్రియాటిన్, క్రియాటినైన్ నీటిలో కలిగే విటమిన్స్), 1.5% అకర్బన పదార్థాలు(అయోడిన్, మెగ్నీషియం, క్లోరైడ్, కాల్షియం, సోడియం, ఫాస్ఫేట్, సల్ఫేట్) మొదలైన పదార్థాలు ఉంటాయి. 24 గంటల మూత్ర పరీక్ష అంటే..ఒక వ్యక్తి నుంచి 24 గంటలలో సేకరించిన మొత్తం మూత్రంలో నుంచి 100-15 మి.లీ. మూత్రాన్ని నమూనాగా తీసుకొని పరీక్షిస్తారు. ప్రోటీన్లు అధికంగా తీసుకుంటే మూత్రంలో యూరియా అధికంగా, కార్బోహైడ్రేట్స్ అధికంగా తీసుకుంటే చక్కెరలు ఎక్కువగా ఉంటాయి.

కృత్రిమ మూత్రపిండం

డాక్టర్ విలియం కాఫ్‌ను డయాలసిస్ పితామహుడిగా పిలుస్తారు. మానవుడి మూత్ర పిండాలు పనిచేయని స్థితిలో రక్తాన్ని వడపోయడానికి తోడ్పడే యంత్రమే కృత్రిమ మూత్ర పిండం లేదా డయలైజర్. ఈ పద్ధతిని హీమోడయాలసిస్ అంటారు. ఈ ప్రక్రియలో రక్తాన్ని ధమని నుంచి తీసి సిర ద్వారా ఎక్కిస్తారు. దీనికి దాదాపు మూడు నుంచి ఆరు గంటల సమయం పడుతుంది. ఈ ప్రక్రియలోని డయలైజర్ పరికరంలో వడపోతకు అనుకూలంగా ఉండే సెల్లోఫేన్‌తో తయారైన గొట్టాలను వాడుతారు. హెపారిన్, ఆంటిహెపారిన్‌ను ఉపయోగిస్తారు. హెపారిన్ అనేది రక్తంలో యాంటికొయాగ్యులెంట్‌గా పనిచేస్తుంది. ఈ ప్రక్రియ యురేమియా వ్యాధిగ్రస్తులకు ఒక వరం లాంటిది. యూరేమియా అంటే మూత్ర పిండాలు సరిగా పనిచేయని వారి శరీరంలో నీరు, వ్యర్థ పదార్థాలు నిండిపోయే దశ. ఈఎస్ఆర్‌డి(ఎండ్ స్టేజ్ రెనాల్ డిసీజ్) అంటే మూత్రపిండాలు పనిచేయక పోవడమని అర్థం.



కె. నాగశేషులు
బయాలజీ ఫ్యాకల్టీ

లిటిల్స్



ఆత్మ సంతృప్తి

ఒక రాజ్యంలో ఓ అత్యంత తెలివైనవాడుండేవాడు. అతని పేరు సుబ్బన్న. తెలివైనవాడే కానీ తృప్తి, ఆనందం అనే మాట తెలీని వాడు. ఎవరిని చూసినా తానే వాడికంటే గొప్ప అనుకుండే నైజం. దీంతో సుబ్బన్న అహంభావి అనేవారు కొందరు. ఇవేమీ పట్టించుకునేవాడు కాదు సుబ్బన్న.

రాజ్యంలో ఓ గుడి కట్టారు. అది రాముల వారి ఆలయం. ఉత్సవాలు జరుగుతున్నాయి. ఉత్సవాలకు వెళ్లి ఆనందించాలని సుబ్బన్న అనుకున్నాడు. తన ఊరు దూరం అయినా కాలిబాటన, బండిలో ఇలా ఉత్సవ స్థలానికి చేరుకున్నాడు. మొదటి రోజు రాజుగారు వచ్చారు. అందరూ ఆసీనులై ఉండగా.. ఇద్దరు కళాకారులు వచ్చి పాటలు పాడారు. ఆ పాటలు విని తన్మయత్వం చెందాడు. తాను కూడా అలా పాడితే బావుండునని




అనుకున్నాడు. ఎంతో బాధపడ్డాడు. తానూ అలా గాయకుడిని అయితే బావుండును అనుకున్నాడు.


రెండో రోజు రాజుగారి ముందు కవులు వచ్చి పద్యాలు పాడారు. పండితులు మాట్లాడారు. వారిలా పద్యాలు రాయలేకపోతినే అనుకున్నాడు. కొన్ని పద్యాలు అర్థమై ఎంతో సంతోషపడ్డాడు. నేను కూడా పండితుడిని అయితే వీరి భాష వచ్చి ఉండేది కదా అని వగచాడు. రానే చివరి రోజు వచ్చింది. మూడో రోజు రామాలయం దగ్గర రామాయణం బొమ్మలు, ఎన్నో విశేషాలను కళాకారులు చిత్రించారు. కాన్వాసుల మీద రాళ్లమీద రామాయణగాథ వివరించబడింది. ఆ బొమ్మలు చూసి నేను కూడా ఇలా గీసి ఉంటే అందరి మెప్పు పొందేవాడిని కదా.. అనుకున్నాడు సుబ్బన్న.

బాధతో కోపంతో ఇంటికి పయనమయ్యాడు. మూడోరోజు రాత్రి ఓ ఆశ్రమంలో బస చేశాడు. అక్కడ ముగ్గురు కనపడ్డారు. ఒకడు గుడ్డివాడు, రెండోవాడు చెవిటి, మూడో వాడికి కళ్లు లేవు. అది చూసి సుబ్బన్న ఆశ్చర్యపోయాడు. 'వీళ్లు ఈ రాముడి గుడి ఉండే ఊరిలోనే ఉన్నారు. అయితే ఏ కళలనూ ఆస్వాదించలేకపోతున్నారే. వారి కంటే నేనే నయం కదా' అనుకున్నాడు. వెంటనే అతనికి ఆత్మసంతృప్తి కలిగింది. ఎంతో ఆనందపడ్డాడు.

దారి కనుక్కోండి



చుక్కలు కలపండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 207

	1		4	7				6
3			1					
	8				6	7		
	5					2		
	7	2				4	3	
		3					6	
		6	7				4	
					4			2
9				6	5		8	

సుడోకు - 206 సమాధానం

8	2	7	3	9	4	6	5	1
1	4	6	8	5	2	7	3	9
5	9	3	1	7	6	8	4	2
9	1	8	6	2	5	4	7	3
7	5	4	9	3	1	2	6	8
6	3	2	7	4	8	9	1	5
2	6	1	5	8	7	3	9	4
3	8	5	4	6	9	1	2	7
4	7	9	2	1	3	5	8	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.